సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 348

గురువారం 31-8-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'



**'మేధావి'కి ఘనస్వాగతం**

సొంతగడ్డకు చేరిన వరల్డ్ చెస్ టోర్నీ రన్నరప్ ప్రజ్ఞానంద - 12లో



**ఫోన్‌పే నుంచి 'స్టాక్ బ్రోకింగ్'**

షేర్ డాట్ మార్కెట్ పేరుతో ప్రత్యేక ప్లాట్‌ఫాం ప్రారంభం - 13లో



**బైడెన్‌కు మతి తప్పింది**

అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు మతి భ్రమించిందని.. దేశాన్ని మూడో ప్రపంచ యుద్ధంలోకి లాగుతున్నారని ట్రంప్ మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



**దేశమంతటా.. కర్ణాటక మోడల్**

కర్ణాటక ప్రజలకిచ్చిన కీలక హామీలను నెరవేర్చామని.. దేశమంతా కర్ణాటక మోడల్‌నే అమలు చేస్తామని రాహుల్‌గాంధీ చెప్పారు.

వివరాలు 6లో ▸



**13 వరకు జైల్లోనే ఇమ్రాన్‌ఖాన్**

అధికార రహస్య పత్రాల లీకేజీ కేసులో పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు సెప్టెంబర్ 13 వరకు ప్రత్యేక కోర్టు రిమాండ్ విధించింది.

వివరాలు 6లో ▸



**సూర్యుడి గుట్టు విప్పే ఆదిత్య-ఎల్1**

సౌరగోళంపై పరిశోధనలే లక్ష్యంగా ఆదిత్య-ఎల్1ను సెప్టెంబర్ 2న ప్రయోగించేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తోంది.

వివరాలు 6లో ▸

# జగనన్న రక్ష

## అక్కచెల్లెమ్మలకు సాధికారతను కానుకగా ఇస్తూ సీఎం జగన్ అడుగులు

## విద్య, వైద్యం, ఇళ్లు.. రాజకీయ, సామాజికంగా అండదండలు

- నాలుగేళ్లలో అక్క చెల్లెమ్మల ఖాతాలకు నేరుగా రూ.1.64 లక్షల కోట్లు బదిలీ
- నగదేతర బదిలీ పథకాలతో మరో రూ.85 వేల కోట్ల మేర ప్రయోజనం
- వైఎస్సార్ చేయూత, ఆసరాతో వ్యాపారాల్లో దక్షత చాటుతున్న మహిళలు.. సూపర్ బజార్లను మించిపోయి మహిళా మార్ట్‌లతో రూ.కోట్లలో టర్నోవర్
- పొదుపు సంఘాల అప్పుల్లో రూ.19,178.17 కోట్లు చెల్లించిన సీఎం వైఎస్ జగన్
- వైఎస్సార్ సున్నా వడ్డీతో దాదాపు రూ.ఐదు వేల కోట్లు చెల్లించి పొదుపు మహిళలకు ఆర్థిక ఆసరా
- 30,76,675 మంది అక్క చెల్లెమ్మల పేరిట రూ.75,670.05 కోట్ల విలువైన ఇళ్ల స్థలాలు



విశాఖపట్నంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి రాఖీ కడుతున్న విద్యార్థినులు

**సాక్షి, అమరావతి:** ఇల్లాలు బాగుంటేనే ఇల్లు బాగుంటుందనే దృఢ విశ్వాసంతో నాలుగేళ్లుగా మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం కల్పిస్తున్నారు. అక్కచెల్లెమ్మలు ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకునేలా తోడ్పాటునిస్తూ పథకాలను అమలు చేస్తున్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా ప్రతి కార్యక్రమంలోనూ మహిళలకే పెద్దపీట వేస్తూ వారికే నేరుగా ప్రయోజనాలను అందజేస్తున్నారు. విద్య, వైద్యం, ఇళ్లతోపాటు రాజకీయంగా, సామాజికంగా మహిళలకు పెద్దపీట వేశారు. పిల్లల చదువుల దగ్గర నుంచి పెళ్లిళ్ల వరకు ఒక అన్నగా, తమ్ముడిగా చేదోడు వాదోడుగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్నారు. నవరత్న పథకాల ద్వారా

మిగతా 2వ పేజీలో ▶

## ముమ్మాటికీ హత్యాయత్నమే

- వైఎస్ జగన్‌ను హతమార్చాలనే కుట్రతోనే నిందితుడు దాడి
- జగన్‌పై హత్యాయత్నంలో శ్రీనివాసరావు ఒక ఆయుధం మాత్రమే.. అప్పటి ప్రభుత్వ పెద్దల ప్రమేయం లేకుండా ఇది జరగదు
- అనేక అనుమానాలు వ్యక్తం చేస్తూ అప్పుడే వైఎస్ జగన్ ఎన్‌ఐఏకు వాంగ్మూలం
- జనుపల్లి శ్రీనివాసరావు హత్యాయత్నానికి పాల్పడినట్లు ఎన్‌ఐఏ, సిట్ నివేదికల్లో స్పష్టంగా ఉంది
- క్రియేటివ్ సెన్సేషన్ కోసమే కొత్త వ్యక్తుల పేర్లు తెరపైకి
- తానే జగన్‌పై దాడి చేసినట్లు శ్రీనివాసరావు ఓ టీవీ చానల్‌కు స్వచ్ఛందంగా తెలిపాడు
- ఆయన లాయర్ సమక్షంలోనే స్వచ్ఛందంగా చెప్పాడు
- ఇప్పుడు కేసు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు, రాజకీయ లబ్ధికోసం అసత్య ప్రచారం చేస్తున్నారు
- మీడియాతో ఎన్‌ఐఏ కోర్టులో సీఎం జగన్ తరపు న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లు

10లో

## నేటి నుంచే.. 'ఇండియా' మూడో భేటీ

### ముంబైలో రెండు రోజులు కీలక సమావేశం

సమన్వయ కమిటీ, లోగో ఆవిష్కరణకు అవకాశం!

కనీస ఉమ్మడి కార్యక్రమం రూపకల్పనకు కమిటీలు

కూటమిలోకి మరిన్ని ప్రాంతీయ పార్టీలు!

సమన్వయకర్త, చైర్‌పర్సన్ ఎంపికపైనా చర్చ

- జాతీయ స్థాయిలో అధికార బీజేపీకి ప్రత్యామ్నాయంగా పురుడు పోసుకున్న విపక్ష 'ఇండియా' కూటమి రెండు రోజుల కీలక సమావేశం మహారాష్ట్ర రాజధాని ముంబైలో గురువారం ప్రారంభం కానుంది. గ్రాండ్ హయత్ హోటల్‌లో జరిగే ఈ సమావేశానికి కాంగ్రెస్‌తో పాటు 27 పార్టీలకుపైగా హాజరు కానున్నట్టు చెబుతున్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమిని ఓడించడమే లక్ష్యంగా ఉమ్మడి ప్రచార వ్యూహానికి తుదిరూపు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా చేపట్టాల్సిన ఉమ్మడి కార్యక్రమాలు, సీట్ల పంపకం కోసం కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందించనున్నారు. కూటమి కన్వీనర్‌గా బిహార్ సీఎం నితీశ్ కుమార్ పేరు వినిపిస్తోంది. ముంబై భేటీ సందర్భంగా మరిన్ని ప్రాంతీయ పార్టీలు కూటమిలో చేరుతాయని నాయకులు చెబుతున్నారు. ఈ వేదిక నుంచి 'బీజేపీ చలే జావ్' (బీజేపీ వెళ్లిపో) అనే నినాదం ఇవ్వబోతున్నట్లు మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే చెప్పారు.



- వివరాలు 6లో

## న్యూస్‌రీల్

### అక్టోబర్ 14, 15 తేదీల్లో ఎస్‌ఐ రాత పరీక్ష



సివిల్ ఎస్‌ఐ, రిజర్వ్ ఎస్‌ఐ పోస్టులకు సంబంధించిన మెడికల్, ఫిజికల్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన వారికి అక్టోబర్ 14, 15 తేదీల్లో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు రాష్ట్ర పోలీస్ శాఖ తెలిపింది.

వివరాలు 10లో ▸

### వార్షిక కౌలుపై పిటిషన్ తిరస్కరణ



వార్షిక కౌలు చెల్లింపు వ్యవహారంపై అత్యవసర విచారణ జరపాలన్న రాజధాని రైతుల పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం తిరస్కరించింది. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోబోమని.. సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోవాలని స్పష్టం చేసింది.

వివరాలు 10లో ▸

## 15 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ల విధానం

- 1 నుంచి ప్రారంభం.. 15 నాటికి రాష్ట్రమంతా అమలు
- కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు
- భౌతిక దస్తావేజులు కనుమరుగవుతాయనేది అపోహే
- ఆన్‌లైన్‌లోనే డాక్యుమెంట్ తయారు చేసుకోవచ్చు
- ఆ తర్వాత స్లాట్ బుకింగ్.. అనంతరం రిజిస్ట్రేషన్
- ఆధార్ లింకింగ్‌తో తప్పుడు రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట
- రిజిస్ట్రేషన్ పూర్తవగానే ఆటోమ్యుటేషన్
- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, ఐజీ రామకృష్ణ వెల్లడి

10లో






## పొత్తులు లేకుండా పోరాడే ధైర్యముందా?

- చంద్రబాబుకు సజ్జల రామకృష్ణారెడ్డి సవాల్
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీని తిట్టిన నోటితోనే పొగడ్తలా?
- కాళ్లు పట్టుకోగలిగే నేర్పు చంద్రబాబుకే సొంతం
- ప్రభుత్వ వ్యతిరేక ఓటే లేదు.. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం

10లో



### ఏపీ విపత్తుల నిర్వహణ టెక్నాలజీ అత్యున్నతం

- మా రాష్ట్రంలోనూ అమలు చేస్తాం
- ఉత్తరప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రాజెక్ట్ ఎక్స్‌పర్ట్ చంద్రకాంత్
- తాడేపల్లిలో ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పనితీరు పరిశీలన

3లో

### విశాఖలో ఏపీటీపీసీ కేంద్రం



విశాఖపట్నం కేంద్రంగా ఎగుమతులు, వాణిజ్య కార్యకలాపాల ప్రోత్సాహంపై ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ దృష్టి సారించింది. ఎండాడ వద్ద ప్రాంతీయ కార్యాలయంతోపాటు భారీ వాణిజ్య సముదాయాన్ని నిర్మించబోతోంది. ఆసక్తి గల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది.

- వివరాలు 2లో

## పారదర్శకంగా నంది నాటక పురస్కారాలు



'రాష్ట్రంలో నంది నాటకోత్సవాల్లో విమర్శలకు తావులేకుండా ఉత్తమ కళాకారులను పారదర్శకంగా ఎంపిక చేస్తాం. ఇందుకోసం 12 మంది న్యాయ నిర్ణేతలను నియమించాం. సెప్టెంబర్ 19 నాటికి తుది కళా బృందాలను ప్రకటిస్తాం. రాష్ట్రంలోని కళాకారులందరికీ గుర్తింపు కార్డులు అందిస్తాం. ఏపీఎఫ్‌డీసీ వెబ్‌సైట్‌లో కళాకారుల వివరాలు పెడతాం. ఏజెంట్ల ప్రమేయం లేకుండా నిర్మాతలు, దర్శకులు తమకు అవసరమైన కళాకారులను ఎంపిక చేసుకోవచ్చు' అని రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి చెప్పారు.

- వివరాలు 3లో



## ఇదండీ సంగతి



# మదపుటేనుగు దాడిలో దంపతుల దుర్మరణం

## రెండు పాడి ఆవులను తొక్కేసిన వైనం.. మరొకరికి గాయాలు

- చిత్తూరు జిల్లా గుడిపాలలో బీభత్సం
- మదపుటేనుగును అడవిలోకి పంపేందుకు 'కుమ్కి' ఆపరేషన్
- మృతులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా



గుడిపాల పంట పొలాల్లో మదపుటేనుగు







ఘటనాస్థలంలో సెల్వి, వెంకటేశులు మృతదేహాలు గాయపడ్డ కార్తీక్


**చిత్తూరు అర్బన్/ గుడిపాల:** చిత్తూరు జిల్లా గుడిపాలలో ఓ మదపుటేనుగు సృష్టించిన బీభత్సంలో బుధవారం భార్యాభర్తలు మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళితే.. బసవాపల్లెకు చెందిన కార్తీక్ అనే వ్యక్తి తీవ్ర గాయాలవడంతో అతని పరిస్థితి విషమంగా ఉంది. ఆంధ్ర–తమిళనాడు రాష్ట్రాలకు చిత్తూరు జిల్లా సరిహద్దు యాదమరి మండలం సమీపంలోకి తమిళనాడు పరదరామి అడవుల నుంచి మంగళవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ఓ ఏనుగుల గుంపు వచ్చింది. ఏనుగుల గుంపు నుంచి ఓ పెద్ద ఏనుగు తప్పిపోయింది. ఇది బుధవారం ఉదయం 6.45 గంటల ప్రాంతంలో గుడిపాల మండలం సీకే పల్లెలోని పొలాల్లోకి వచ్చి అలసిపోయి కూర్చుంది. అక్కడ ఓ వ్యక్తి కర్రను ఏనుగుపైకి విసిరినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. దీంతో ఒక్కసారిగా ఆగ్రహానికి గురైన ఏనుగు పరుగులు పెడుతూ మనుషులపైకి ఎదురుతిరిగి తరిమింది.అక్కడే కార్తీక్ అనే యువకుడు పరుగెత్తుతుండగా అతన్ని ఏనుగు తన తొండంతో కొట్టడంతో యువకుడి తల, చేతికి బలంగా దెబ్బ తగలడంతో తమిళనాడులోని సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కార్తీక్‌పై దాడిచేసిన అనంతరం.. ఒంటరి మదపుటేనుగు మిట్టూరు వైపు వస్తూ అక్కడున్న పాడి ఆవును తొక్కి చంపేసింది. అటు నుంచి ముట్టుకూరుపల్లె పంట పొలాల్లో ఉన్న మరో ఆవు దూడను తొక్కి చంపేసి లక్ష్మీపురం వైపు పరుగులు తీసింది. అలాగే లక్ష్మీపురం వద్ద పంట పొలాల్లో రామాపురం గ్రామానికి చెందిన దంపతులు వెంకటేశులు (54), సెల్వి (47) టమాటా, బెండ సాగుకు పురుగుల మందు పిచికారీ చేసేందుకు వెళ్లారు. పొలంలో పిచికారీ చేస్తుండగా ఏనుగు వెనుక వైపు నుంచి వచ్చేసింది. ఊహించని పరిణామంతో ఏనుగును చూసి దంపతులు ఇరు వైపులా పరుగులు పెట్టారు. కానీ వాళ్లను వెంటాడి తొక్కిపడేసింది. సెల్వి వరిగడ్డి పశుగ్రాసంలో దాక్కున్నా ఆమెను తొండంతో కిందకులాగి కాళ్లతో తొక్కి చంపేసింది. ఈ ఘటనలో దంపతుల పేగులు సైతం బయటకు వచ్చేశాయి. కొద్దిసేపటి తరువాత బాంబులు పేల్చేవాళ్లను పిలిపించి, టపాకాయలు కాల్చి ఏనుగును కొద్ది దూరం తరిమి.. ఆపై మృతదేహాలను బయటకు తీసుకొచ్చారు. కాగా, అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇద్దరు చనిపోయారంటూ రామాపురం, లక్ష్మీపురం గ్రామస్తులు మృతదేహాలను చిత్తూరు–చెన్నై జాతీయ రహదారిపై ఉంచి ఆందోళనకు దిగారు. అటవీశాఖ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి, చిత్తూరు పశ్చిమ సీఐ రవిశంకర్‌రెడ్డి బాధితులకు నచ్చచెప్పినా వినలేదు. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఘటనా స్థలానికి వచ్చి, ఇది ప్రమాదవశాత్తు జరిగిందని, మృతులకు ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని వివరించారు. దీంతో పాటు తన సొంత నిధుల నుంచి చనిపోయిన ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున, రూ.2 లక్షలు ఆర్థిక సాయం ఇస్తున్నట్లు విజయానందరెడ్డి ప్రకటించారు. అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాట్లాడి మృతుల కుటుంబంలో ఒకరికి ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారు. శాంతించిన ఆందోళనకారులు, మృతదేహాలను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### 'కుమ్కి' ఏనుగులతో ఆపరేషన్..

మరోవైపు ఒంటరి మదపుటేనుగు గుడిపాల మండలం లక్ష్మీపురం పొలాల్లోనే ఉండిపోయింది. ఇది మళ్లీ తమిళనాడు అడవుల్లోకి వెళ్లాల్సి ఉంది. ఆగ్రహంతో ఉన్న ఒంటరి ఏనుగును వచ్చిన దారిలోనే తరమడానికి అటవీశాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం 'కుమ్కి' జాతికి చెందిన రెండు ఏనుగులను కుప్పం నుంచి చిత్తూరుకు తీసుకొచ్చారు. మావటి ద్వారా శిక్షణ పొందిన ఈ ఏనుగులు ఒంటరి ఏనుగును మచ్చిక చేసుకుని శాంతిపజేస్తాయి. ఒంటరి ఏనుగుకు తామున్నామనే నమ్మకం కల్పించి అడవుల్లోకి తీసుకెళతాయి. అనంతరం ఒంటరి ఏనుగును తమిళనాడు అడవుల్లోకి తీసుకెళ్లి వదిలిపెడతాయి. ఇక్కడ తప్పిపోయిన గుంపులో ఒంటరి ఏనుగు చేరే అవకాశం ఉందని చిత్తూరు డివిజన్ అటవీశాఖ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

# పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల్లో ఏపీ నం.1

## దేశంలో పీఎస్‌పీ సామర్థ్యం ఎక్కువగా ఉన్న రాష్ట్రం ఏపీనే



పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్

- దేశంలో 2030–31కి 18.8 గిగావాట్ల పీఎస్పీలు అవసరం
- పీఎస్పీలను ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- గతేడాదే ఏపీ పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ పాలసీని రూపొందించిన రాష్ట్రం
- రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో రాష్ట్రానికి వస్తున్న కంపెనీలు
- ఇప్పటికే 16,180 మెగావాట్ల సామర్థ్యం గల పీఎస్‌పీలు డెవలపర్లకు కేటాయింపు
- ఇతర రాష్ట్రాలకంటే మిన్నగా ఏపీలో పీఎస్పీల ఏర్పాటు
- 2,750 మె.వా సామర్థ్యం గల 3 ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం

**సాక్షి,అమరావతి:** విద్యుత్ రంగంలో సంస్కరణలు, వినూత్న సాంకేతికతలతో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్న ఆంధ్రప్రదేశ్ మరో ఘనత సాధించింది. భవిష్యత్‌లో రాష్ట్రానికి విద్యుత్ కొరత రాకుండా చేసేందుకు పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ ప్రాజెక్టు (పీఎస్‌పీ)ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టి అమలు చేయడమే కాకుండా దేశంలోనే పీఎస్పీ సామర్థ్యంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఏపీ తరువాతి స్థానాల్లో రాజస్థాన్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలున్నట్టు తెలిపింది.

### ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం

దేశం మొత్తం మీద 2030–31 నాటికి 18.8 గిగావాట్ల సామర్థ్యం ఉన్న పీఎస్‌పీల అవసరం ఉందని కేంద్ర ఇంధన శాఖ అంచనా వేసింది. రాష్ట్రంలో వేరియబుల్ రెన్యూవబుల్ ఎనర్జీ (వీఆర్‌ఈ)ని బ్యాలెన్స్ చేయడానికి, పీక్ అవర్ డిమాండ్‌ను చేరుకోవడానికి ప్రభుత్వం పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం ఏపీ పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ పాలసీ 2022ని రూపొందించింది.

రాష్ట్ర ప్రభుత్వ చర్యలు, ప్రోత్సాహంతో ఇతర రాష్ట్రాలకంటే మిన్నగా ఏపీలో పీఎస్‌పీల ఏర్పాటు జరుగుతోంది. ఇప్పటికే 32,400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పీఎస్‌పీల ఏర్పాటుకు 29 సైట్‌ల కోసం టెక్నో కమర్షియల్ ఫీజిబిలిటీ రిపోర్ట్ (టీసీఎఫ్‌ఆర్)లను సిద్ధం చేసింది. రాష్ట్రంలో మొత్తం 37 స్థానాల్లో 42,370 మెగావాట్ల సామర్థ్యం గల పీఎస్పీల నిర్మాణానికి స్థలాలను గుర్తించింది. మొత్తం 16,180 మెగావాట్ల సామర్థ్యం గల పీఎస్‌పీలు వివిధ డెవలపర్లకు కేటాయించింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఎగువ సీలేరులో 1,350 మెగావాట్ల సామర్థ్యంతో పీఎస్‌పీ నిర్మాణానికి కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) అనుమతి కూడా ఇచ్చింది. ప్రైవేటు రంగంలో ఉమ్మడి కర్నూలు జిల్లా పిన్నాపురంలో గ్రీన్ కో గ్రూప్ 1,680 మెగావాట్ల ప్రాజెక్టు నిర్మిస్తోంది. ఒకే చోట మూడు రకాల (జల, పవన, సౌర) విద్యుత్ ఉత్పత్తి చేసి, నిల్వ చేసే ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక శక్తి నిల్వ ప్రాజెక్టుల్లో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు ఇదే. తాజాగా రాష్ట్రంలో 1,950 వేల మెగావాట్ల సామర్థ్యం గల రెండు పీఎస్‌పీల స్థాపనకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌హెచ్‌పీసీతో ఏపీ జెన్‌కో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ రెండు సంస్థల సమాన భాగస్వామ్యంతో 2,750 మెగావాట్ల సామర్థ్యం గల మరో మూడు ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది.

### పీఎస్పీ అంటే ఇదీ..

పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ అనేది ఒక రకమైన జల విద్యుత్ శక్తి నిల్వ ప్రాజెక్టు. దీనిని వేర్వేరు ఎత్తులలో ఉన్న రెండు నీటి రిజర్వాయర్లపై నిర్మిస్తారు. ఈ ప్లాంట్లు సంప్రదాయ జల విద్యుత్ ప్లాంట్లలానే పనిచేస్తాయి. వీటికి అదనంగా అదే నీటిని మళ్లీ మళ్లీ ఉపయోగించుకునే సామర్థ్యం ఉంటుంది. అంతేకాదు పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లలో పగటిపూట చార్జింగ్ సౌర ఫలకల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. రాత్రి వేళ జలాశయం ద్వారా ఎగువ రిజర్వాయర్ నుంచి దిగువ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయడం వల్ల టర్బైన్ కిందకి కదిలి విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఒక సారి నిర్మించిన ప్రాజెక్టు ఎనభై ఏళ్ల వరకూ పనిచేస్తుంది. 1890 కాలంలో ఇటలీ, స్విట్జర్లాండ్‌లో మొదలైన పీఎస్పీ సాంకేతికత 1930లో యునైటెడ్ స్టేట్స్‌లో అడుగుపెట్టింది. ఇప్పుడిది ప్రపంచమంతా విస్తరించింది. తాజాగా మన దేశంలో పీఎస్పీల స్థాపనలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా అవతరించింది.

# పసిబిడ్డ ఉసురు తీసిన తండ్రి

**కమలాపురం:** పదేళ్ల కుమారుడి గొంతును కర్కశంగా కోసి ప్రాణాలు తీశాడో తండ్రి. వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలం అగస్తలింగాయపల్లెకు చెందిన వీరంరెడ్డి శివశంకర్‌రెడ్డికి 15 ఏళ్ల కిందట తిప్పలూరుకు చెందిన సుజాతతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు సోమేశ్వరరెడ్డి(10) మంగళవారం ఇంట్లోనే నిద్రపోయాడు. బుధవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా అతడి తండ్రి శివశంకర్‌రెడ్డి ఇంట్లో ఉన్న కత్తితో సోమేశ్వరరెడ్డి గొంతు కోసి పరారయ్యాడు. కుమారుడి అరుపులు విని నిద్రలేచిన తల్లి పెద్దగా కేకలు వేసింది. దీంతో గ్రామస్తులు వచ్చారు.. అయితే అప్పటికే బాలుడు మృతి చెందాడు. తన భర్త పిల్లలను బాగా చూసుకునే వాడని, ఇంత ఘాతుకానికి ఎందుకు పాల్పడ్డాడో అర్థంకావడం లేదంటూ రోదించింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. ఎస్ఐ వివరణ కోరగా భార్యపై అనుమానం పెంచుకునే ఈ దురాగతానికి పాల్పడి ఉంటాడని, భర్త కోసం గాలిస్తున్నట్టు చెప్పారు.

# బాబు అండ్‌కోకు చుక్కలు చూపిస్తాం..

## 1,067వ రోజు రిలే దీక్షలో బహుజన నేతల హెచ్చరిక

**తాడికొండ:** రాజధానిలో పేదల ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకున్న బాబు అండ్‌కో బినామీలకు, కులవాదులకు 2024 ఎన్నికల్లో చుక్కలు చూపిస్తామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,067వ రోజు కొనసాగుతున్న నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. సామాజిక న్యాయం పక్కన బెట్టి బాబు తన అనుయాయులకు దోచిపెట్టిన ఫలితంగానే నేడు రాజ్యాధికారానికి దూరమయ్యాడనే నిజం తెలుసుకోకుండా ఇంకా అడ్డదారుల్లోనే వెళుతూ తమకు అన్యాయం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. నాయకులు బొలిమేర శ్యామ్యూల్, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

### సోదరుడిగా అండగా ఉంటాను

#### మహిళలకు రాఖీ శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్



**సాక్షి, అమరావతి:** రాఖీ పౌర్ణమి సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మహిళా లోకానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి అక్కకు, ప్రతి చెల్లెమ్మకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు. వారు నాపై చూపుతున్న ప్రేమాభిమానాలకు సదా కృతజ్ఞుడిని అంటూ బుధవారం ట్వీట్ చేశారు. మహిళల సంక్షేమమే లక్ష్యంగా, వారి రక్షణే ధ్యేయంగా పాలన సాగిస్తున్నందుకు సంతోషిస్తున్నానన్నారు. ఒక అన్నగా, ఒక తమ్ముడిగా ఎప్పుడూ అండగా ఉంటానని మాట ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

### విశాఖలో ఏపీటీపీసీ కేంద్రం

**సాక్షి, అమరావతి:** విశాఖ కేంద్రంగా ఎగుమతులు, వాణిజ్య కార్యకలాపాల ప్రోత్సాహంపై ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీటీపీసీ) దృష్టిసారించింది. ఇందుకోసం ఇప్పటికే గాజువాకలోని ఏపీటీపీసీ కార్యాలయానికి అదనంగా ఎండాడ వద్ద ప్రాంతీయ కార్యాలయంతో పాటు భారీ వాణిజ్య సముదాయాన్ని నిర్మించనుంది. ఎండాడలోని 0.52 ఎకరాల విస్తీర్ణంలో జీ ప్లస్ 10 అంతస్తుల వాణిజ్య కార్యాలయాన్ని బీవోటీ విధానంలో నిర్మించాలని నిర్ణయించామని, ఇందుకోసం ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించినట్టు ఏపీటీపీసీ వీసీ ఎండీ పి.ప్రతాప్ 'సాక్షి'తో చెప్పారు. గడిచిన మూడేళ్లుగా కనీసం రూ.50 కోట్లపైన వ్యాపారం నిర్వహిస్తున్న సంస్థలు ఈ బిడ్‌లో పాల్గొనేందుకు అర్హులని, సెప్టెంబర్ 21లోగా బిడ్లు దాఖలు చేయాల్సిందిగా కోరారు.

### నైపుణ్య శిక్షణలో రాష్ట్రానికి జాతీయ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న దినేశ్‌కుమార్

**సాక్షి, అమరావతి:** వాటర్ మేనేజ్ మెంట్, ప్లంబింగ్ స్కిల్‌లో ఏకంగా 2,670 మందికి శిక్షణ ఇచ్చినందుకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) జాతీయస్థాయిలో గుర్తింపు సాధించింది. ఆగస్టు 25న ఢిల్లీలో వాటర్, ప్లంబ్ స్కిల్ కాన్‌క్లేవ్–2023 సందర్భంగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఈ అవార్డును ప్రకటించింది. అవార్డును కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్ ప్రిన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అతుల్ తివారీ చేతుల మీదుగా ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీ దినేశ్ కుమార్ స్వీకరించారు.

# జగనన్న రక్ష



సీఎం జగన్‌కు రాఖీ కడుతున్న మంత్రులు విడదల రజిని, తానేటి వనిత



▶ మొదటి పేజీ తరువాయి

లబ్ధి పొందిన మహిళలంతా సీఎం జగన్‌కు ఓ సోదరుడిలా, తోబుట్టువులా తమకు తోడుగా నిలిచారంటూ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియచేస్తున్నారు.

- కేవలం నాలుగేళ్ల రెండు నెలల వ్యవధిలోనే అక్క చెల్లెమ్మల ఖాతాలకు రూ.1.64 లక్షల కోట్లను ముఖ్యమంత్రి జగన్ పారదర్శకంగా నగదు బదిలీ చేశారు. ఇక నగదేతర బదిలీ పథకాల ద్వారా మరో రూ.85 వేల కోట్ల మేర వారికి ప్రయోజనం చేకూర్చారు. తద్వారా వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలతో అక్క చెల్లెమ్మలు వ్యాపారాల్లో రాణిస్తూ దూసుకుపోతున్నారు. సూపర్ బజార్లను తలదన్నేలా మహిళా మార్టులను నెలకొల్పి రూ.కోట్ల వ్యాపారాన్ని సమర్థంగా నిర్వహించే స్థాయికి చేరుకున్నారు.
- ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు వైఎస్సార్ ఆసరా ద్వారా పొదుపు సంఘాల అప్పుల్లో ఇప్పటికే రూ.19,178.17 కోట్లను చెల్లించి ముఖ్యమంత్రి జగన్ నిబద్ధత చాటుకున్నారు. డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చకుండా చంద్రబాబు మోసగించడంతో పొదుపు సంఘాలు ఆర్థికంగా చితికిపోవడమే కాకుండా అప్పుల ఊబిలో కూరుకుపోయిన విషయం తెలిసిందే. అంతేకాకుండా సకాలంలో రుణాలు చెల్లించే పొదుపు సంఘాలకు ఇచ్చే పావలా వడ్డీని కూడా చంద్రబాబు ఎగ్గొట్టారు. సీఎం జగన్ మాట ప్రకారం పొదుపు సంఘాలకు చేదోడు వాదోడుగా నిలుస్తూ వారి రుణాలను తీర్చడమే కాకుండా వైఎస్సార్ సున్నా వడ్డీతో దాదాపు రూ.ఐదు వేల కోట్ల మేర చెల్లించి ఆదుకున్నారు. ఆర్థికంగా ఊతమివ్వటమే కాకుండా అక్క చెల్లెమ్మలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారు.
- వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల సాయంతో రిటైల్ రంగంలో 38 మహిళా మార్ట్స్ ఏర్పాటు కాగా ఇప్పటివరకు రూ.37 కోట్ల మేర విక్రయాలు నమోదయ్యాయి. పొదుపు సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ అవకాశాలను కల్పిస్తోంది. రిటైల్, టెక్స్‌టైల్స్, పాడి, ఆహార ఉత్పత్తుల లాంటి వ్యాపారాల కోసం 16 లక్షల మంది మహిళలకు బ్యాంకుల ద్వారా రూ.5,585 కోట్ల మేర రుణాలను ప్రభుత్వం ఇప్పించి తోడ్పాటు అందించింది. అక్క చెల్లెమ్మలు వారి వ్యాపారాలను అభివృద్ధి చేసుకుని జీవనోపాధి మెరుగుపడేలా ఐటీసీ, హెచ్.యు.యల్, ప్రాక్టర్ అండ్ గ్యాంబల్, రిలయన్స్, అమూల్ లాంటి వ్యాపార దిగ్గజాలు, బ్యాంకులతో ఒప్పందాలు కుదిర్చి చక్కటి వ్యాపార మార్గాలను సీఎం జగన్ చూపించారు.
- మహిళా రాజకీయ సాధికారత దిశగా గట్టిగా కృషి చేస్తూ నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ పనుల్లో 50% అక్క చెల్లెమ్మలకే కేటాయిస్తూ సీఎం ఏకంగా చట్టాలను చేశారు. మంత్రివర్గంలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు.
- ప్రతి అక్క చెల్లెమ్మ తమకంటూ సొంత గూడు ఉండాలని కోరుకుంటుంది. రాష్ట్రంలో లక్షల మంది మహిళల సొంతింటి స్వప్నాన్ని నెరవేర్చే మహత్తర యజ్ఞానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో 30,76,675 మందికి రూ.75,670.05 కోట్ల విలువైన ఇళ్ల స్థలాలిచ్చారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో పేదలపై భారం పడకుండా కనీస మౌలిక సదుపాయాలను ప్రభుత్వమే ఉచితంగా కల్పిస్తోంది. ఒక్కో మహిళకు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన స్థిరాస్తిని ఓ సోదరుడిలా సీఎం జగన్ అందజేశారు.

### 2019 జూన్ - 2023 జూన్ వరకు మహిళలకు లబ్ధి ఇలా..

| పథకం పేరు | లబ్ధిదారుల సంఖ్య | లబ్ధి రూ.కోట్లలో |
|---|---|---|
| జగనన్న అమ్మ ఒడి | 44,48,865 | 26,067.28 |
| జగనన్న వసతి దీవెన | 25,17,245 | 4,275.76 |
| జగనన్న విద్యా దీవెన | 26,98,728 | 10,636.67 |
| వైఎస్సార్ రైతు భరోసా | 22,00,177 | 13,013.82 |
| వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు (రైతులు) | 7,38,760 | 183.46 |
| వైఎస్సార్ ఉచిత పంట బీమా | 8,21,348 | 1,170.31 |
| రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ | 5,68,367 | 491.36 |
| మత్స్యకార భరోసా | 4,868 | 10.76 |
| వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీలు) | 1,05,13,365 | 4,969.04 |
| వైఎస్సార్ పెన్షన్ కానుక | 42,28,118 | 49,845.29 |
| వైఎస్సార్ చేయూత | 26,39,703 | 14,129.12 |
| వైఎస్సార్ ఆసరా | 78,94,169 | 19,178.17 |
| వైఎస్సార్ బీమా | 68,172 | 1,026.66 |
| వైఎస్సార్ కాపు నేస్తం | 3,56,143 | 1,518.03 |
| వైఎస్సార్ నేతన్న నేస్తం | 33,689 | 225.95 |
| జగనన్న చేదోడు | 1,84,665 | 404.58 |
| వైఎస్సార్ లా నేస్తం | 2,081 | 14.95 |
| వైఎస్సార్ వాహన మిత్ర | 30,736 | 87.97 |
| వైఎస్సార్ ఆరోగ్య ఆసరా | 6,25,999 | 388.51 |
| ఎంఎస్‌ఎంఈ పునఃప్రారంభం | 14,174 | 1,272.72 |
| అర్చకులు, ఇమామ్, మౌజమ్, పాస్టర్ల ఒకసారి సాయం | 3,865 | 1.89 |
| వైఎస్సార్ ఈబీసీ నేస్తం | 4,39,068 | 1,257.04 |
| డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ | 10,41,191 | 3,361.30 |
| వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా | 35,931 | 267.20 |
| గృహాలు | 21,31,564 | 10,885.91 |
| జగనన్న తోడు (వడ్డీ) | 13,83,206 | 64.87 |
| నేరుగా నగదు బదిలీ మొత్తం | 4,56,24,187 | 1,64,748.60 |

### నగదేతర పథకాల ద్వారా అక్క చెల్లమ్మలకు ప్రయోజనం ఇలా

| | | |
|---|---|---|
| జగనన్న తోడు (రుణాలు) | 13,83,206 | 2,610.27 |
| జగనన్న గోరుముద్ద | 21,63,391 | 1,795.00 |
| వైఎస్సార్ సంపూర్ణ పోషణ | 15,35,390 | 2,992.08 |
| జగనన్న విద్యా కానుక | 25,12,423 | 1,784.26 |
| ఇంటి స్థలాలు | 30,76,018 | 75,670.05 |
| ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ | 3,48,554 | 460.85 |
| నగదేతర బదిలీ మొత్తం ప్రయోజనం | 1,10,18,982 | 85,312.51 |
| నగదు బదిలీ, నగదేతర బదిలీ మొత్తం | 5,66,43,179 | 2,50,061.11 |

### తమ్ముడికి పండుగ శుభాకాంక్షలు..

కూలి పనులకు వెళ్లే నా భర్తకు నెలనెలా పింఛన్ అందుతోంది. కాపు నేస్తం ద్వారా ఏటా రూ.15,000 చొప్పున సాయం అందిస్తూ ముఖ్యమంత్రి జగన్ సొంత తమ్ముడిలా ఆదుకుంటున్నారు. మా మనవళ్ల చదువుకు అమ్మ ఒడి ద్వారా డబ్బులు ఇస్తున్నారు. ఇంతకన్నా ఏం కావాలి? జగన్ తమ్ముడికి రాఖీ పండుగ శుభాకాంక్షలు.

– పసుపులేటి పార్వతి, రమణయ్యపేట, కాకినాడ రూరల్

### అన్నలా రూ.1,46,040 అందించారు..

సీఎం జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ఓ అన్నలా రాఖీ గిఫ్ట్‌గా నాకు రూ.1,46,040 మేర సాయం చేశారు. నాలుగున్నరేళ్లలో పలు పథకాలతో లబ్ధి చేకూరింది. వైఎస్సార్ ఆసరా మూడు విడతల్లో రూ.8,830 చొప్పున రూ.26,490 ఇచ్చారు. సున్నా వడ్డీ పథకంతో రూ.3,100 చొప్పున మూడు విడతల్లో రూ.9,300 అందించారు. వైఎస్సార్ చేయూత మూడు విడతల్లో రూ.18,750 చొప్పున మొత్తం రూ.56,250 ఇచ్చారు. వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 చొప్పున నాలుగు విడతల్లో రూ.54,000 వేలు అందుకున్నా. జగనన్నకు ప్రతీ అక్కచెల్లెమ్మల ఆశీస్సులు ఉంటాయి. మళ్లీ మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ రాఖీ శుభాకాంక్షలు.

– రొంగల రమణమ్మ, చోడవరం

# నేడు కౌలు రైతులకు 'వైఎస్సార్ రైతు భరోసా'

- 1,46,324 మంది అన్నదాతలకు రూ.109.74 కోట్ల పెట్టుబడి సాయం
- క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి జమ చేయనున్న సీఎం జగన్



**సాక్షి, అమరావతి:** దేశంలోనే తొలిసారిగా కౌలు రైతులతో పాటు దేవదాయ భూములను సాగు చేస్తున్న వాస్తవ సాగుదారులకు కూడా వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని వర్తింపచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం 2023–24 సీజన్‌కు సంబంధించి తొలి విడత పెట్టుబడి సాయాన్ని గురువారం అందించనుంది. పంట హక్కు సాగు పత్రాలు పొందిన వారిలో అర్హులైన 1,46,324 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలుదారులు, దేవదాయ భూములను సాగు చేస్తున్న రైతులకు ఒక్కొక్కరికి రూ.7,500 చొప్పున రూ.109.74 కోట్లు సాయం పంపిణీ చేయనున్నారు. నేడు ఉదయం 10 గంటలకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతుల ఖాతాలకు నేరుగా సాయాన్ని జమ చేయనున్నారు.

### ఏటా మూడు దఫాల్లో..

రాష్ట్రంలో భూ యజమానులకు వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందిస్తున్న విషయం తెలిసిందే. మే నెలలో రూ.7,500, అక్టోబర్‌లో రూ.4 వేలు, జనవరిలో రూ.2 వేలు చొప్పున మూడు విడతల్లో ఈ సాయాన్ని జమ చేస్తోంది. అదేవిధంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతుల కుటుంబాలతో పాటు దేవదాయ, అటవీ భూమి సాగుదారులకు కూడా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే అందచేస్తోంది. ఐదో ఏడాది తొలి విడతగా తాజాగా అందచేస్తున్న సాయంతో కూడా కలిపితే ఇప్పటివరకు 5,38,227 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలుదారులు, 3,99,321 మంది అటవీ భూమి సాగుదారులకు (ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాదారులు) మొత్తం రూ.1,122.85 కోట్ల పెట్టుబడి సాయం అందించినట్లు కానుంది. ఇక మొత్తంగా అందరికీ కలిపి ఇప్పటి వరకు పథకం ద్వారా 52.57 లక్షల రైతు కుటుంబాలకు రూ.31,005.04 కోట్ల మేర పెట్టుబడి సాయాన్ని అందించినట్లవుతోంది.

## క్లుప్తంగా...

### ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ ఉద్యోగుల రక్తదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న గౌతమ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్ 14వ వర్ధంతి సందర్భంగా తలసేమియా బాధిత చిన్నారుల కోసం విజయవాడలోని ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ ప్రధాన కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రక్తదాతలను అభినందించారు. సెప్టెంబర్ 3న విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్‌లో ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు.

### కళాకారులకు గుర్తింపు కార్డులు

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**


సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేసి, తగిన విధంగా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ఎక్స్‌అఫిషియో సెక్రటరీ (ఐఅండ్‌పీఆర్) తుమ్మల విజయ్ కుమార్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కళాకారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి సమగ్ర వివరాలతో ప్రత్యేక డేటా బ్యాంకు తయారు చేయనున్నారు. తద్వారా సినీ, టీవీ, ఇతర వినోద రంగాల్లోని స్థానిక కళాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కళాకారులు జీవనోపాధి పొందేలా డేటాను ఏపీఎఫ్‌డీసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు.

### ఈహెచ్‌ఎస్ లబ్ధిదారుల కోసం క్రానిక్ ఓపీ సేవలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల వైద్య సేవల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అన్ని జిల్లాల్లోని బోధనాస్పత్రులు, బోధనాస్పత్రులు లేని చోట జిల్లా ఆస్పత్రుల్లో ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్(ఈహెచ్‌ఎస్) కింద దీర్ఘకాలిక వ్యాధులకు (క్రానిక్ డిసీజెస్) చికిత్సలను అందుబాటులోకి తీసుకువచ్చింది. అదే విధంగా 54 ఏరియా ఆస్పత్రుల్లో సాధారణ అవుట్‌పేషెంట్ (ఓపీ) సేవలను ప్రారంభించింది. ఆయా ఆస్పత్రుల్లో ఈహెచ్‌ఎస్ లబ్ధిదారుల కోసం ప్రత్యేకంగా ఓపీ సేవలు అందిస్తున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాల్లోని బోధన/జిల్లా ఆస్పత్రుల్లో మాత్రమే క్రానిక్ డిసీజెస్ ఓపీ సేవలు అందించేవారు. కాగా, ఈ ఏడాది మార్చి నెలలో ఉద్యోగ సంఘాలతో సీఎస్ నిర్వహించిన సమావేశంలో సంఘాల ప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. జిల్లా, బోధనాస్పత్రుల్లో 25 రకాల క్రానిక్ డిసీజెస్‌కు ప్రత్యేక ఓపీ, ఏరియా ఆస్పత్రుల్లో సాధారణ ఓపీ సేవలతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 21.44 లక్షల మంది ఈహెచ్‌ఎస్ లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఈహెచ్‌ఎస్ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ టీఎస్ఆర్ మూర్తి తెలిపారు.

### పోలీసులు కాలు విరగ్గొట్టారు

**ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్**



సీతమ్మధార (విశాఖ ఉత్తర): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తాను చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను మూడో పట్టణ సీఐ, మరో 20 మంది పోలీసులు భగ్నం చేసి.. తన కాలు విరగ్గొట్టారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. బుధవారం విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. దీక్ష చేస్తుండగా వైద్యులు పరీక్షలు జరిపి ఆరోగ్యం బాగానే ఉందని చెప్పారన్నారు. దీక్ష భగ్నం చేసి ఆస్పత్రిలో తనకు సైనేడ్, మత్తు మందు ఇవ్వాలని చూశారని ఆరోపించారు. అదానీ నేరుగా సీఎం జగన్‌కు ఫోన్ చేసి దీక్ష భగ్నం చేయించారనే అనుమానాలున్నాయన్నారు. 'నన్ను ఎన్‌కౌంటర్ చేయిస్తారట. నన్ను ఎత్తుకెళ్లడానికి హక్కు ఎక్కడుంది. నాపై దాడికి పాల్పడ్డ సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేయాలి. లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి' అని హెచ్చరించారు.

**ప్యాకేజీలకు ఆశపడొద్దు పవన్**

ప్రజా శాంతి పార్టీ తరఫున పవన్‌కళ్యాణ్‌కు సీఎం పదవిని ఆఫర్ చేస్తున్నానని కేఏ పాల్ అన్నారు. తనతో కలిసి పవన్ పోటీ చేయాలని.. ప్యాకేజీలకు ఆశపడొద్దన్నారు.

# రాష్ట్రానికి రక్ష.. జగనన్న

వెల్దుర్తి(కర్నూలు): రాఖీ పండుగ సందర్భంగా కర్నూలు జిల్లా వెల్దుర్తి బాలికల హైస్కూల్ విద్యార్థినులు, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది, పొదుపు మహిళలంతా కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై తమకున్న అభిమానాన్ని వినూత్నంగా ప్రదర్శించారు. 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బాగుండాలి.. ఆయన పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉండాలి' అనే నినాదంతో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో స్థానిక బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో 'రాష్ట్రానికి రక్ష.. జగనన్న' కార్యక్రమం నిర్వహించారు. 920 మంది విద్యార్థినులు, పొదుపు మహిళలు కలిసి భారీ రాఖీ ఆకారంలో కూర్చొని సీఎం జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చంద్రావతి, పీడీ నిర్మలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సీఎం చిత్రపటానికి రాఖీ

జగదాంబ(విశాఖ దక్షిణ): విశాఖపట్నంలోని 39వ డివిజన్‌లో క్వీన్ మేరి స్కూల్ విద్యార్థినులు సీఎం జగన్ చిత్రపటానికి రాఖీ కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. 'సీఎం జగనే మా రక్ష' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# క్రీస్ట్ ద కింగ్‌లో రక్షాబంధన్

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ క్రీస్తురాజపురంలోని క్రీస్ట్ ద కింగ్ పాఠశాలలో బుధవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు రాఖీ ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు. -పవన్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

# పారదర్శకంగా నంది నాటక పురస్కారాలు

## ఏపీ నంది నాటకోత్సవాలకు 12 మందితో కమిటీ

- మొత్తం ఐదు విభాగాల్లో 118 దరఖాస్తులు
- 19 నాటికి తుది కళాబృందాల ఎంపిక
- సమయం లేనందునే టీవీ, సినిమా విభాగాల్లో నంది అవార్డులను ఇవ్వట్లేదు
- రాష్ట్రంలో కళాకారులు అందరికీ గుర్తింపు కార్డులు అందిస్తాం
- ఏపీ చలనచిత్ర, టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నంది నాటకోత్సవాల్లో విమర్శలకు తావులేకుండా ఉత్తమ కళాకారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామని రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి స్పష్టం చేశారు. విజయవాడలోని ఏపీ ఎఫ్‌డీసీ కార్యాలయంలో బుధవారం ఆయన జ్యూరీ సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం వెలగపూడిలోని సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఐదు నాటక విభాగాల్లోనూ సిఫారసులకు తావులేకుండా ప్రతిభ, సామర్థ్యం ఆధారంగానే నంది నాటక అవార్డులకు ఎంపిక చేస్తామన్నారు. విభాగాల వారీగా అత్యంత అనుభవం ఉన్న 12 మందిని న్యాయ నిర్ణేతలుగా నియమించినట్టు తెలిపారు. తుది ప్రదర్శనకు ఎంపికైన కళాబృందాలను సెప్టెంబర్ 19 నాటికి ప్రకటిస్తామన్నారు. సమయం లేనందునే సినిమా, టీవీ రంగాల్లో అవార్డుల ఎంపికలను చేపట్టడం లేదని వివరించారు.

### వెబ్‌సైట్‌లో కళాకారుల వివరాలు..

రాష్ట్రంలోని కళాకారులు అందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు సీఎం జగన్ ఆమోదం తెలిపారని పోసాని కృష్ణమురళి వెల్లడించారు. కళాకారుల సమగ్ర వివరాలను ఏపీఎఫ్‌డీసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. ఏజెంట్ల ప్రమేయం లేకుండా సినీ నిర్మాతలు, దర్శకులు తమకు అవసరమైన కళాకారులను నేరుగా ఎంపిక చేసుకోవచ్చని సూచించారు. ఫలితంగా సామాన్య కళాకారులకు ఆర్థిక దోపిడీ నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ఇప్పటివరకు జూనియర్ ఆర్టిస్టులు రోజంతా కష్టపడి సంపాదించిన డబ్బులో సగం కమిషన్ ఏజెంట్లు, జూనియర్ ఆర్టిస్టుల సప్లయిర్లకే పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

### న్యాయ నిర్ణేతలు వీరేం..

నాటక రంగ తెలుగు రచనల్లో ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ (చీరాల), ఆచార్య గుమ్మా సాంబశివ రావు (విజయవాడ), ఆచార్య ఎస్.వి.కృష్ణారావు (గుంటూరు), పద్యనాటక విభాగానికి కురుటి సత్యం నాయుడు (విశాఖపట్నం), ఎం.కుమార్ బాబు (తెనాలి), మెతుకపల్లి సూర్య నారాయణ యాదవ్ (ఏలూరు), సాంఘిక నాటకం, యువజన నాటికల విభాగాలకు ఆకుల మల్లేశ్వరరావు (తిరుపతి), పి.శివప్రసాద్ (విశాఖపట్నం), ఎస్.ఆర్.ఎస్. ప్రసాద్ (ప్రొద్దుటూరు), సాంఘిక, బాలల నాటికల విభాగాలకు డా.కె.జి.వేణు (విశాఖపట్నం), డా.దాసిరి నల్లన్న (తిరుపతి), పి.సుమ (ఒంగోలు)లను న్యాయ నిర్ణేతలుగా నియమించారు.

### మొత్తం 118 దరఖాస్తులు..

పద్య, సాంఘిక నాటకం, బాలల, యువజన నాటికలతో పాటు నాటక రంగ తెలుగు రచనల పేరుతో ఐదు విభాగాల్లో నంది నాటక పురస్కారాలను అందజేస్తున్నట్టు పోసాని కృష్ణమురళి తెలిపారు. కళాకారులు, రచయితల నుంచి మొత్తం 118 దరఖాస్తులు అందాయన్నారు. వీటిలో నాటక రంగ తెలుగు రచన విభాగంలో 3 ఎంట్రీలు రాగా ఒకదాన్ని ఎంపిక చేస్తామన్నారు. పద్య నాటకంలో 26కిగాను 10, సాంఘిక నాటకంలో 22కిగాను 6, యువజన నాటికలో 9కి గాను 5, సాంఘిక నాటికలో 49కి గాను 12, బాలల నాటిక విభాగంలో 9కి గాను 5 ఎంట్రీలను ఫైనల్ చేస్తామని తెలిపారు.

# ఏపీ విపత్తుల నిర్వహణ టెక్నాలజీ అత్యున్నతం

- మా రాష్ట్రంలోనూ అమలు చేస్తాం
- ఉత్తరప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రాజెక్ట్ ఎక్స్‌పర్ట్ చంద్రకాంత్



యూపీ అధికారులతో విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ అంబేడ్కర్

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ విధానాలు, పని తీరు బాగున్నాయని, సాంకేతికత అత్యున్నతంగా ఉందని, వాటిని తమ రాష్ట్రంలోనూ అమలు చేస్తామని ఉత్తరప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రాజెక్ట్ ఎక్స్‌పర్ట్ చంద్రకాంత్ చెప్పారు. యూపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఐటీ నిపుణుడు ప్రశాంత్ షాహి తదితరులతో కలిసి ఆయన తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. యూపీ విపత్తుల నిర్వహణ సంస్థను ఆధునికీకరిస్తున్న క్రమంలో దేశానికే రోల్ మోడల్‌గా ఉన్న ఏపీ విధానాలను అధ్యయనం చేసేందుకు ఈ బృందం రెండు రోజుల క్రితం ఇక్కడకు వచ్చింది. స్టేట్ ఎమర్జెన్సీ సెంటర్‌లోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సాంకేతికతను, దాన్ని వినియోగిస్తున్న తీరును నిశితంగా పరిశీలించింది. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వారికి స్టేట్ ఎమర్జెన్సీ సెంటర్‌లోని అన్ని విభాగాలను చూపించి, పని విధానాన్ని వివరించారు. రాష్ట్రంలో తుఫానులు, వరదలతోపాటు పిడుగుపాట్లు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల తమ ప్రభుత్వం విపత్తుల నిర్వహణ ప్రణాళికను పక్కాగా సిద్ధం చేసిందని తెలిపారు. తుపాను, వరద వచ్చే అవకాశం ఉందని తెలిసిన వెంటనే రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ, వార్డు సచివాలయ స్థాయి వరకు ఉన్న విపత్తుల నిర్వహణ బృందాలు క్షేత్ర స్థాయిలో పని ప్రారంభిస్తాయని వివరించారు. ఈ అప్రమత్తత వల్లే నాలుగేళ్లలో తుపానులు, వరదలొచ్చినా ప్రాణ నష్టాన్ని నివారించగలిగామన్నారు. వాతావరణ పరిశోధన విభాగాలు, వివిధ వాతావరణ మోడల్స్, కార్యాచరణ ప్రణాళికలు, కమ్యూనికేషన్ వ్యవస్థల గురించి అంబేడ్కర్ వారికి వివరించారు. కామన్ అలెర్ట్ ప్రొటోకాల్, ఏపీ అలెర్ట్ ద్వారా ప్రజల మొబైల్ ఫోన్లకు హెచ్చరిక మెసేజ్‌లు పంపేవిధానాన్ని వివరించారు. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతిన్నప్పుడు వినియోగించే శాటిలైట్ ఫోన్స్, శాటిలైట్ బేస్డ్ మొబైల్ డేటా వాయిస్ టెర్మినల్ తదితర పరికరాలను చూపారు. వెబ్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ గురించి వివరించారు. కార్యక్రమంలో విపత్తుల నిర్వహణ సంస్థ ఈడీ నాగరాజు, రిటైర్డ్ సైంటిస్ట్ అలీ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ట్యాబ్‌ల వినియోగంపై శాస్త్రీయ శిక్షణ



నెల్లూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఐటీ అధికారి

- రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, టీచర్లకు అవగాహన తరగతులు
- గూగుల్ అథెంటికేటర్ ద్వారా ట్యాబ్‌లకు రక్షణ చర్యలు
- యాప్స్ డౌన్‌లోడ్ చేస్తే హెచ్‌ఎంకు తెలిసేలా సాఫ్ట్‌వేర్
- 5,18,740 ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలిస్తున్న ఐటీ బృందం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల వినియోగంపై పాఠశాల విద్యాశాఖ దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని పాఠశాలలను విద్యాశాఖ ఐటీ బృందం స్వయంగా పరిశీలించి ట్యాబ్‌ల పనితీరును పరీక్షిస్తోంది. విద్యార్థులకు గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వం 5,18,740 ట్యాబ్‌లను బైజూస్ కంటెంట్‌తో పంపిణీ చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి 10 రోజుల పాటు అన్ని పాఠశాలల్లోనూ ఈ బృందం అన్ని ట్యాబ్‌లను పరిశీలిస్తోంది. ఇందుకోసం రాష్ట్ర ఐటీ నోడల్ ఆఫీసర్ సీహెచ్ రమేశ్ కుమార్ నేతృత్వంలో బృందం ఈ ప్రక్రియను ప్రారంభించింది. మండలానికి ఇద్దరు ఐటీ నేపథ్యం ఉన్న ఉపాధ్యాయుల చొప్పున 1,360 మందితో పాటు జిల్లా నోడల్ ఆఫీసర్లు కూడా ఇందులో పాలుపంచుకుంటున్నారు. తొలుత సాంకేతిక సమస్యలపై దృష్టిపెట్టనున్నారు. సమస్యలను పరిష్కరించడంతోపాటు వాటి వినియోగంపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి ట్యాబ్‌లో ఇచ్చిన కంటెంట్ తప్ప ఇంటర్‌నెట్ కంటెంట్‌ను అప్‌లోడ్ చేసేందుకు, డౌన్‌లోడ్ చేసేందుకు అవకాశం లేకుండా ట్యాబ్‌ల సాఫ్ట్‌వేర్ రూపొందించారు. సరైన అవగాహన లేక కొందరు విద్యార్థులు యాప్స్ డౌన్‌లోడ్ చేసేందుకు యత్నించడంతో అవి సాంకేతికంగా నిలిచిపోతున్నాయి. ఎక్కడ తప్పు జరిగిందీ విద్యార్థులు గుర్తించలేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిన్నింటికి పరిష్కారంగా విద్యాశాఖ ఐటీ బృందం ఇప్పుడు అన్ని ట్యాబ్‌ల్లోనూ గూగుల్ అథెంటికేటర్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌లోడ్ చేస్తోంది.

**డౌన్‌లోడ్‌కు యత్నిస్తే హెచ్‌ఎంకు మెసేజ్**

విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల్లో ఎలాంటి మార్పులు చేసినా వెంటనే ఉన్నత స్థాయిలోని వారికి ఓటీపీ మెసేజ్ వచ్చేలా ఐటీ బృందం చర్యలు తీసుకుంటోంది. అన్ని ట్యాబ్‌ల్లోనూ గూగుల్ అథెంటికేటర్‌ను ఇన్‌స్టాల్ చేయడం ద్వారా విద్యార్థి ట్యాబ్‌లో మార్పులు చేసేందుకు యత్నిస్తే వెంటనే సంబంధిత స్కూలు హెచ్‌ఎంకు, రాష్ట్ర స్థాయిలోని కమాండ్ కంట్రోల్ సిబ్బందికి, మండల స్థాయిలో ఐటీ సహాయకులుగా పనిచేసే ఉపాధ్యాయులకు సైతం సమాచారం వెళ్తుంది. దీంతో ఏ పాఠశాలలో ఏ విద్యార్థి తప్పుచేశారో సులభంగా తెలిసిపోతుంది. ప్రస్తుతం ఉన్న ట్యాబ్‌లను సరైన రీతిలో వినియోగించకపోవడమే తప్పు.. వాటిలో ఎలాంటి సాంకేతిక సమస్యలు లేవని స్టేట్ ఐటీ నోడల్ అధికారి రమేశ్ కుమార్ 'సాక్షి'కి తెలిపారు. ఇకపై ఆ చిన్న పొరపాట్లు కూడా జరగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు ట్యాబ్‌ల వినియోగంపై శాస్త్రీయ శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు.

# మాట ఇచ్చారు.. వెంటనే ఆదుకున్నారు



సీఎం జగన్‌ను కలిసి ఉద్యోగం ఇప్పించాలని కోరుతున్న కిడ్నీ బాధితురాలు



ఉద్యోగం కావాలని అడిగిన మూడు గంటల్లోనే ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్

కాకినాడ సిటీ: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఓ మహిళకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. కుటుంబ పోషణ నిమిత్తం ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని విన్నవించగా.. 3 గంటల్లోనే ఆమె చేతికి ఉద్యోగ నియామక పత్రం అందించారు. వివరాలు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తొత్తరమూడికి చెందిన గన్నవరపు ఝాన్సీరాణి కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు. భర్త కూలి పనితో వచ్చే అంతంత మాత్రం ఆదాయమే ఆ కుటుంబానికి ఆధారం. ఈ నేపథ్యంలో బుధవారం జగ్గంపేట మండలం ఇర్రిపాకకు వచ్చిన సీఎం జగన్‌ను ఝాన్సీరాణి కలిసింది. తన బాధను ముఖ్యమంత్రికి తెలియజేసింది. ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. ఆమె పరిస్థితి తెలుసుకున్న సీఎం జగన్.. అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. తప్పకుండా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. వెంటనే ఝాన్సీకి విద్యార్హతల ఆధారంగా ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కాకినాడ కలెక్టర్ కృతికా శుక్లాను ఆదేశించారు. సీఎం జగన్ కార్యక్రమం ముగిసిన వెంటనే కలెక్టర్ కృతికా శుక్లా తన క్యాంపు కార్యాలయానికి ఝాన్సీరాణిని తీసుకెళ్లారు. డిగ్రీ, డీఈడీతో పాటు పీజీ డిప్లొమో ఇన్ కంప్యూటర్ అప్లికేషన్(పీజీడీసీఏ) చదివినట్లు తెలుసుకున్న కలెక్టర్.. వికాస సంస్థ సమన్వయంతో రూ.14 వేల ప్రారంభ వేతనంతో ఇంటి నుంచే పని చేసేలా కోజెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగం కల్పించారు. వెంటనే నియామక పత్రాన్ని అందించారు. అలాగే ఆమెకు ఉచిత వైద్య పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సమన్వయకర్తను ఆదేశించారు. ఝాన్సీరాణి కుటుంబసభ్యులు స్పందిస్తూ.. అడిగిన వెంటనే స్పందించి తమ జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రపంచ పర్యాటకుల్ని ఆకర్షించేలా..!




పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో నిర్మాణం పూర్తయిన అంబేడ్కర్ విగ్రహం


సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడలోని స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతి వనం పనులు తుది దశకు చేరుకున్నాయి. నవంబర్ 26న స్మృతి వనం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ప్రపంచ పర్యాటకులను సైతం ఆకర్షించే వేదిక కానుంది. ఈ పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సూచనలు చేస్తున్నారు. ఇక్కడ నిర్మిస్తున్న 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహం సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలవనుంది. 18.18 ఎకరాల్లో రూ.400 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే పూర్తిస్థాయిలో విగ్రహ భాగాలు బిగించారు. సెంట్రింగ్ కర్రలు మాత్రమే తొలగించాల్సి ఉంది. అంబేడ్కర్ జ్ఞాపకాలను గుర్తు చేసుకునేందుకు వీలుగా డిజిటల్ మ్యూజియం, మినీ థియేటర్ నిర్మాణం పనులు పూర్తి కావచ్చాయి. ప్రహరీ, మరికొన్ని అదనపు పనుల కోసం అదనంగా రూ.106 కోట్లకు ప్రభుత్వం అనుమతిచ్చింది. లైటింగ్, గ్రానైట్, పాత్‌వే, వాటర్ ఫౌంటైన్, వెహికల్ పార్కింగ్, ఎలక్ట్రిసిటీ, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ, సుందరీకరణ తదితర పనులు వేగంగా సాగుతున్నాయి. రేయింబవళ్లు వందలాది కార్మికులు, భారీ యంత్రాలతో పనులు సాగేలా అధికారులు చూస్తున్నారు. మంత్రుల సబ్ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ నిర్మాణ పనులను పరిశీలిస్తోంది. మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి పనులను పర్యవేక్షిస్తున్నారు. రాత్రి సమయాల్లో సైతం పనులను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు, అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ పనుల వేగం పెంచుతున్నారు. నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షిస్తున్నారు.

### తుది దశకు పనులు



అంబేడ్కర్ స్మృతి వనం పనులు వేగంగా సాగుతున్నాయి. విగ్రహానికి సంబంధించిన డిజైన్లు, ఢిల్లీ నుంచి వచ్చిన స్మృతివనం నిర్మాణం డిజైన్స్ ఆధారంగా పొరపాట్లకు తావు లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాం. సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో జాప్యం లేకుండా చేస్తున్నారు. పనుల నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేస్తున్నారు. కారిడార్ మొత్తం గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ నిర్మాణం తుది దశకు చేరుకుంటున్నాయి. పార్కింగ్ ఏరియా ఏర్పాటు చేస్తున్నారు. ప్రాంగణంలో అందమైన మొక్కలతో ప్లాంటేషన్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మునిసిపల్ కమిషనర్, విజయవాడ



# వధూవరులకు సీఎం జగన్ ఆశీస్సులు

కాకినాడ జిల్లా ఇర్రిపాక గ్రామంలో బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, వేణి దంపతుల కుమార్తె వివాహం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హాజరై వధూవరులు పద్మశ్రీ అన్నపూర్ణ, సాయిఆదర్శ్‌కు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. - గోకవరం

# హైకోర్టు సీజేను కలిసిన సీఎం వైఎస్ జగన్

**సతీమణితో కలిసి మర్యాదపూర్వక భేటీ**

సాక్షి, అమరావతి: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బుధవారం సాయంత్రం ముఖ్యమంత్రి దంపతులు విజయవాడలోని ప్రధాన న్యాయమూర్తి నివాసానికి వెళ్లారు. సీఎం జగన్, ఆయన సతీమణి భారతిలను సీజే జస్టిస్ ఠాకూర్ దంపతులు పుష్పగుచ్ఛాలతో సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సీజేకు సీఎం పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. ఇటీవల సీజేగా జస్టిస్ ఠాకూర్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ముఖ్యమంత్రి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

# ఆప్కోలో నెలవారీ పొదుపు పథకం

**30 శాతం రాయితీపై వస్త్రాల విక్రయం**

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారుల సౌకర్యార్థం ఆప్కో షోరూంలలో నెలవారీ పొదుపు పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆప్కో మండల వాణిజ్య అధికారి ఎస్.రఘునంద తెలిపారు. వస్త్రాలపై 30 శాతం రాయితీ కల్పించామన్నారు. బుధవారం విజయవాడలోని ఏలూరు రోడ్డు రామమందిరం వీధి ఆప్కో షోరూంలో నెలవారీ పొదుపు పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేనేత వస్త్రాభిమానుల కోసం తమ షోరూంలలో నెలవారీ పొదుపు పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా నెలకు రూ.1,000 చొప్పున 11 నెలలు క్రమం తప్పకుండా వినియోగదారుడు చెల్లిస్తే 12వ నెల వాయిదా రూ.1,000 ఆప్కో చెల్లిస్తుందన్నారు. 12 నెలల వాయిదా పూర్తయిన వెంటనే వినియోగదారులు రూ.17,100 విలువ గల ఆప్కో వస్త్రాలను కొనుగోలు చేసే అవకాశం కల్పించామన్నారు. నెలవారీ పొదుపు పథకం ద్వారా వినియోగదారులకు రూ.5,100 లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రభుత్వఉద్యోగులకు క్రెడిట్, సేల్స్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన మంగళగిరి, బందరు, రాజమండ్రి, ఉప్పాడ, వెంకటగిరి, మాధవరం, చీరాలకు చెందిన చీరలు, దుప్పట్లు, టవల్స్, లుంగీలు 30 శాతం రాయితీపై అమ్మకాలకు సిద్ధంగా ఉంచామన్నారు.

# ముక్క చీరలు, ఒడి బియ్యం టెండర్ల వాయిదా

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దుర్గమ్మకు భక్తులు సమర్పించే ముక్క చీరలు పోగు చేసుకునే హక్కు కోసం, ఒడిబియ్యం విక్రయ టెండర్లు వాయిదా పడ్డాయి. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని మహా మండపం ఆరో అంతస్తులో బుధవారం టెండర్ల ప్రక్రియ జరిగింది. ఒడి బియ్యం కోసం రూ. 50,000 ప్రథమ ధరావత్తుగా చెల్లించిన నలుగురు వేలంలో పాల్గొన్నారు. కిలో ఒక్కటికి రూ.11.05 నుంచి దేవస్థానం పాటను ప్రారంభించింది. కిలోకు రూ.12 చెల్లించేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాగా, ఆలయ ఈవో భ్రమరాంబ అనుమతి కోసం అధికారులు యత్నించారు. ఈవో అందుబాటులో లేకపోవడం, దేవస్థానం భావించిన రేటు రాకపోవడంతో వేలాన్ని వాయిదా వేశారు. అమ్మవారికి సమర్పించే ముక్క చీరల కోసం నలుగురు వేలంకు వచ్చారు. రూ.2 లక్షల ప్రథమ ధరావత్తుగా వేలంలో పాల్గొనగా, దేవస్థానం రూ.35 లక్షలుగా పాటను నిర్ణయించింది. ముక్క చీరలు, ఎర్ర ముక్క చీరల సైజు విషయంలో వివాదంఏర్పడింది. దీనిపై కచ్చితమైన నిర్ణయాన్ని వెల్లడిస్తే పాటలో పాల్గొంటామని కాంట్రాక్టర్లు పేర్కొనడంతో దీన్ని వాయిదా వేశారు. ఏఈవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో అమృతరావు, ఇతర సిబ్బంది వేలాన్ని నిర్వహించారు. మళ్లీ వేలాన్ని ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తామని ఆలయ అధికారులు చెప్పారు.



ధనాన్ని కోల్పోతే చాలా కోల్పోయినట్టు;
స్నేహితుడిని కోల్పోతే చాలా ఎక్కువ కోల్పోయినట్టు;
కానీ ధైర్యాన్ని కోల్పోతే సర్వం కోల్పోయినట్టు!

– మిగెల్ సెర్వాంటీజ్



సాక్షి

గురువారం, 31 ఆగస్టు 2023

# ఆత్మహత్యలు కాదు... హత్యలే!

ఒకరూ, ఇద్దరూ కాదు... ఈ ఏడాది ఇప్పటి వరకు 24 మంది. అదీ మొన్న ఆదివారం ఒక్కరోజే నాలుగు గంటల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు. దేశంలోని అగ్రశ్రేణి ఇంజనీరింగ్, మెడికల్ విద్యాసంస్థల్లో ప్రవేశపరీక్షలకు కోచింగ్ ఇచ్చే కర్మాగారంగా పేరొందిన రాజస్థాన్‌లోని కోటాలో ఆత్మహత్యల మరణమృదంగం ఆగకుండా మోగుతోంది. గత ఏడాది ఇదే పట్నంలో 15 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటే, ఈ ఏడాది ఇప్పటికి ఎనిమిది నెలల్లోనే అంతకు మించి అమాయకులు బలవన్మరణానికి దిగారు. గత ఎనిమిదేళ్ళలో అత్యధిక ఆత్మహత్యల సంఖ్య ఇదే. సంక్షోభ తీవ్రతను ఇది ప్రతిబింబిస్తోంది. రెండు నెలల పాటు ఈ కోచింగ్ కేంద్రాల్లో పరీక్షలను నిలిపివేస్తూ స్థానిక పాలనా యంత్రాంగం ఆదేశాలు జారీ చేయాల్సి వచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఉన్నత చదువులు చదివి, జీవితంలో ఉజ్జ్వలంగా ఎదగాల్సిన భావి పౌరులు పరీక్షల అతి ఒత్తిడితో ఆయువు తీసుకుంటున్న విషాదం మరోసారి అందరినీ ఆత్మపరిశీలనకు పురిగొల్పుతోంది.

కోటాలో ఆత్మహత్యలు ఇవాళ కొత్త కావు. కోచింగ్‌లతో పాటు ఒత్తిడి తట్టుకోలేని విద్యార్థుల బలవన్మరణాలకూ ఈ పట్నం కొన్నేళ్ళుగా పేరుబడింది. అక్కడన్నీ వారాంతపు సెలవైనా లేకుండా రోజుకు 14 నుంచి 18 గంటల పాటు పిండి రుబ్బినట్టు పాఠాలు రుబ్బించే విద్యార్థి కర్మాగారాలే! వాటిలో పిల్లలు అనుభవించే మానసిక చిత్రవధ వర్ణనాతీతం. కఠినమైన పాఠ్యప్రణాళికను పూర్తి చేయాలనే ఒత్తిడి, నిద్ర లేని రాత్రులు, నిరంతరం అంచనా పరీక్షలు, ఎక్కడ లేని పోటీ, వైఫల్య భయం, వీటన్నిటికీ తోడు తల్లితండ్రులకూ – ఇంటికీ దూరంగా ఒంటరి జీవితం... ఇవన్నీ పసి మనసుల్ని ప్రాణాలు తీసుకొనేంతగా ప్రేరేపిస్తున్నాయి. పిల్లలపై మానసిక ఒత్తిడి, విద్యావిధానంలోని లోపాల గురించి దశాబ్దాలుగా చర్చ జరుగుతూనే ఉంది. కోటా మాత్రం అవేవీ పట్టకుండా ఏటేటా ఫలితాలందిస్తూనే ఉంది. వెరసి, ఇవాళ్టికీ ఈ కోచింగ్ కర్మాగారానికి తమ పిల్లలతో తల్లితండ్రులు పోటెత్తుతున్నారు. ఏటా 2.5 లక్షల మంది విద్యార్థులు వస్తుంటారు. అగ్రశ్రేణి టీచర్‌కు సంవత్సరానికి కోటి రూపాయల జీతమిచ్చే అక్కడ కోచింగ్ రూ. 5 వేల కోట్ల వార్షిక వ్యాపారం.

సమాజంలో యువతరం ఆకాంక్షలు నిరంతరం పెరుగుతున్నాయి. ఆర్థికవ్యవస్థలో అవకాశాలేమో అంతకంతకూ తగ్గుతున్నాయి. అదే ఇవాళ పెను ప్రజారోగ్య సమస్యగా తయారైంది. కోటాలోని పరిణామాలు అందుకు ప్రతీక. వికాసాన్ని కల్పించాల్సిన విద్యను వ్యాపారంగా మార్చడంతో తలెత్తిన సంక్షోభానికి పరాకాష్ఠ. ర్యాంకులే ధ్యేయంగా ప్రైవేట్ విద్యా వ్యాపారులు సృష్టించిన ఈ తరహా సంక్షోభం తెలుగు రాష్ట్రాల్లోనూ గతంలో మనం చూసినదే. దీనికి ఏ ఒక్కరో కాదు...అందరం బాధ్యులమే. సృజనాత్మక కళల పట్ల ఆసక్తి ఉంది మొర్రో అంటున్నా శాస్త్ర సాంకేతిక విద్య వైపు పిల్లల్ని నెట్టడం, తాము కాలేకపోయిన ఇంజనీరో – డాక్టరో తమ పిల్లలు కావాలనుకోవడం, తోటి వారితో పోలికల మూర్ఖత్వం... ఇవన్నీ మన తప్పిదాలే! కోటాలోనే కాదు, దేశవ్యాప్తంగా అన్నిచోట్లా పరిస్థితిదే! నేషనల్ క్రైమ్‌రికార్డ్స్ బ్యూరో 2021 నివేదిక ప్రకారం దేశంలో విద్యార్థుల ఆత్మ హత్యలు 4.5 శాతం పెరిగాయి. ఆ దుష్కీర్తిలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు ముందున్నాయి. అయిదేళ్ళుగా ఇవి పెరుగుతున్నాయనీ నివేదిక స్పష్టం చేసింది. ఇది తాజా ప్రమాద ఘంటిక.

కోటాలో ఎక్కువమంది విద్యార్థులు డిప్రెషన్‌తో బాధపడుతున్నారని 2018లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ నివేదిక వెల్లడించింది. తాజా సర్వే ప్రకారం అక్కడ ప్రతి 10 మందిలో నలుగురు మానసిక ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నవారే. కోచింగ్ సంస్థల్ని నియంత్రిస్తూ రాష్ట్ర సర్కార్ ఓ బిల్లును ప్రతిపాదించినా, ఇంకా అమలులోకి రాలేదు. వారానికో రోజు ఒక పూట చదువు, మరోపూట వినోదమనే పద్ధతి పాటించాలనీ, పక్షానికోసారి పిల్లల మానసిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలనీ రాజస్థాన్ ప్రభుత్వ తాజా ప్రతిపాదన. గదుల్లో సీలింగ్ ఫ్యాన్ల బదులు గోడలకు బిగించే ఫ్యాన్లు పెట్టాలని 2021లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ వారు చెప్పారట! ఈసారేమో స్ప్రింగులు, సెన్సార్‌తో కూడిన సీలింగ్ ఫ్యాన్లు పెడితే ఆత్మహత్యా యత్నం చేసినా సరే ఉరి బిగుసుకోదంటూ స్థానిక పాలనా యంత్రాంగం వింత ఆలోచన చేసింది. మేడపై నుంచి కిందకు దూకకుండా వలలు, జాలీలు కట్టడం లాంటి తెలివితేటలూ హాస్టళ్ళు చూపుతున్నాయి. ఇవేవీ సమస్యకు శాశ్వత పరిష్కారం కావు. పైగా తమపై నిత్యం నిఘా ఉందంటూ పిల్లల మనసుపై అదనపు ఒత్తిడి. నిజానికి సామాజిక, ఆర్థిక వాస్తవాలకు తగ్గట్టు పిల్లల్ని సిద్ధం చేస్తూ, అండగా నిలిచే విద్యావ్యవస్థ అవసరం. అసలు సమస్యను వదిలేసి తాత్కాలిక ఉపశమనాల్ని ఆశ్రయిస్తే ఉపయోగం లేదు.

పరీక్షల్లో తక్కువ మార్కులొచ్చాయనీ, నలుగురిలో తలెత్తుకోలేమనీ, ఇంట్లో బాధపడతారనీ... ఆయువు తీసుకోవాలనుకోవడం పిల్లల్లో మనం నూరిపోస్తున్న తప్పుడు విలువలకు తార్కాణం. పిల్లలు అన్నిటా అద్భుతంగా రాణించాలనే విజేత స్వభావపు వ్యసనం నుంచి మనం బయటపడాలి. పిల్లలు, తల్లితండ్రులు, అధ్యాపకులు, విద్యాసంస్థలు, విధాన నిర్ణేతలు – అందరూ కలసి ఇకనైనా సంక్షోభ పరిష్కారానికి అత్యవసర చర్యలు చేపట్టాలి. పసిపిల్లల ప్రాణాలు తీస్తున్న ఈ అగ్రశ్రేణి ప్రవేశపరీక్షల విధానంపై సమగ్ర దృష్టి సారించాలి. ఇరుకిరుకు గదుల్లో పిల్లల్ని కుక్కి, కోళ్ళఫారమ్‌లలో కోడిపిల్లల్లాగా పిల్లల్ని చదివించడం, పెంచడం ఏ సమాజానికీ ఆరోగ్యం కాదు. అందుకే ఇవి ఆత్మహత్యలు కాదు... సమాజం సామూహికంగా చేస్తున్న హత్యలు. ఈ జాతీయ సంక్షోభంపై ఇప్పటికైనా పాలకులు కళ్ళు తెరవకుంటే, ఆ పసిహృదయాల ఉసురు తగులుతుంది.

# అమెరికా తీరుపై చైనా గుర్రు

విశ్లేషణ



దొంతి నరసింహారెడ్డి

**ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనల నేపథ్యంలో అమెరికా తీరుపై చైనా ఆగస్ట్ 18న ఒక నివేదిక విడుదల చేసింది. బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను బలహీనపరిచే అమెరికా చర్యలపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచ వాణిజ్య సంస్థ వల్ల లబ్ధి పొందిన అమెరికా, తన దేశీయ సమస్యలకు (వాణిజ్య లోటు, నిరుద్యోగానికి) ప్రపంచ వాణిజ్యం కారణమంటూ, 2017 నుంచి కొత్త అప్పిలేట్ బాడీ సభ్యుల నియామకాలను నిలిపివేసింది. అయితే, అమెరికాను వేలెత్తి చూపుతున్న చైనా ఇతర దేశాల పట్ల తన చర్యల గురించి సమీక్షించలేదు. ఏమైనా, ప్రపంచ వాణిజ్య సంస్థ, దాని చుట్టూ ముసురుకుంటున్న సమస్యల మీద ఇటువంటి నివేదికను భారత ప్రభుత్వం కూడా రూపొందించి ప్రజలకు నివేదిస్తే బాగుంటుంది.**

1990 నుంచి భారత ప్రభుత్వాలు ఆర్థిక సరళీకరణ దిశగా అడుగులు వేస్తున్నాయి. 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటుతో పాటు రెండు ఒప్పందాల మీద దేశాలు సంతకాలు చేశాయి. అందులో వ్యవసాయం మీద చేసిన ఒప్పందం కీలకమైనది. ఆనాటి నుంచి కూడా భారతదేశం అనేక రంగాలను అంతర్జాతీయ వాణిజ్యంతో ముడిపెడుతూ వస్తున్నది. దానికి అనుగుణంగా అనేక రంగాలలో విధానాలు మార్పు చేశారు. ఈ మార్పుల వెనుక అమెరికా ఒత్తిడి ఉన్నది. అయితే, ఇటీవలి కాలంలో అనూహ్యంగా, ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రాభవం తగ్గుతూ వస్తున్నది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలకు, చర్చలకు ప్రాధాన్యత వచ్చింది. ఎందుకంటే, ప్రపంచ వాణిజ్య సంస్థ తన ప్రయోజనాలకు అనువుగా లేదని అమెరికా భావించింది.

ఈ నేపథ్యంలో ప్రపంచ వాణిజ్య సంస్థ (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ – డబ్ల్యూటీవో) నిబంధనల ప్రకారం అమెరికా తన బాధ్యతలను నెరవేరుస్తున్న తీరు పైన చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ మొన్న ఆగస్ట్ 18 నాడు ఒక నివేదికను విడుదల చేసింది. ఈ 65 పేజీల నివేదికలో దాదాపు 210 డాక్యుమెంట్లను ఉటంకిస్తూ, బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను బలహీనపరిచే అమెరికా విధాన చర్యలపై ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా ఏకపక్ష వాణిజ్య బెదిరింపులను, పారిశ్రామిక విధానాలలో ద్వంద్వ ప్రమాణాలను, ప్రపంచ పారిశ్రామిక, సరఫరా గొలుసులకు విఘాతం కలిగించే అంశాలను ప్రస్తావించింది.

వివాద పరిష్కార సంస్థ తీర్పులు, సిఫార్సులను ఇష్టానుసారం అమలు చేయడం ద్వార డబ్ల్యూటీవో వివాద పరిష్కార యంత్రాంగాన్ని అమెరికా బలహీనపరిచిందని ఈ నివేదిక ఎత్తిచూపింది. 157 వాణిజ్య వివాదాలలో అమెరికా ప్రతివాదిగా ఉందనీ, మొత్తం వాణిజ్య వివాదాలలో ఇది సుమారు 20 శాతం అనీ నివేదిక తెలిపింది. సంస్థాగత సమస్యల కారణంగా 2017 నుంచి కొత్త అప్పిలేట్ బాడీ సభ్యుల నియామకాలను అమెరికా నిలిపివేసిందనీ, ఈ చర్య వల్ల అప్పిలేట్ బాడీ 'నిరర్థక' పరిస్థితికి చేరుకున్నదనీ పేర్కొంది.

పారిశ్రామిక విధానాలకు సంబంధించి అమెరికా ఇతర సభ్యదేశాల మధ్య వేర్వేరు ప్రమాణాలను వర్తింపజేసిందని నివేదిక తెలిపింది. అధిక సుంకాలు విధించడం లేదా వాణిజ్య-నియంత్రణ చర్యలు తీసుకోవడం, దేశీయ పరిశ్రమలకు మద్దతు ఇవ్వడానికి భారీ సబ్సిడీలను అందించడం, పారిశ్రామిక మరియు సరఫరా గొలుసులను విచ్ఛిన్నం చేయడం వంటి వివిధ రక్షణాత్మక పద్ధతులను అమెరికా అవలంబించిందని ఆరోపించింది.

డబ్ల్యూటీవో నిర్దేశిస్తున్న వాణిజ్యం వల్ల ప్రధానంగా అమెరికా లబ్ధి పొందింది. అయితే పటిష్ఠమైన అంతర్గత ప్రయోజన పంపిణీ వ్యవస్థ లేకపోవడం వలన, దేశ ఆదాయం, ఉపాధిని సక్రమంగా నిర్వహించడంలో వైఫల్యం వల్ల అమెరికాలో వివిధ వర్గాల మధ్య




అసమానతలు పెరిగిపోయాయని చైనా నివేదిక అంటున్నది. ఒక దేశంగా తక్కువ పొదుపు, అధిక వినియోగం, అధిక రుణం ఉన్న పరిస్థితులలో, అమెరికాలో పొదుపు నిలువలు లేకపోవడం వలన ఆర్థికాభివృద్ధికి కరెంట్ ఖాతా లోటులు, వాణిజ్య లోటులపై ఆధారపడవలసి వస్తున్నది. అమెరికా ప్రభుత్వం తన దేశీయ సామాజిక సమస్యలను (వాణిజ్య లోటు, నిరుద్యోగానికి) ప్రపంచ వాణిజ్యం కారణమంటున్నది. దేశీయ విధాన వైఫల్యాలకు ప్రపంచీకరణను, ప్రపంచ వాణిజ్య సంస్థను కారణాలుగా చూపెడుతున్నది. అమెరికా ద్వంద్వ వైఖరిని చైనా నివేదిక ఎత్తి చూపెడుతున్నది. ఒకప్పుడు ఆ దేశానికి ప్రయోజనకారిగా ఉన్న కారణాలు ఈ రోజు కంటగింపుగా మారినాయి. ఇంకొకవైపు, భారత్, మెక్సికో తది తర దేశాల మీద తన ఉత్పత్తులను రుద్దే ప్రయత్నం చేస్తున్నది. దీనికి ద్వైపాక్షిక, బహుళ పక్ష ఒప్పందాలను ఆయుధంగా వాడుతున్నది.

ప్రపంచ వాణిజ్య సంస్థలో వివాద పరిష్కార వేదిక, ఈ వేదిక పనికి ఆమోదించిన పద్ధతి కీలకం. దీని సిఫార్సులు, తీర్పులు వాణిజ్యం సమతుల్యంగా, వివాదరహితంగా కొనసాగడానికి ఉపయోగపడుతున్నాయి. అన్ని తీర్పులు ఆమోదయోగ్యం కాకపోయినా, ఒక ప్రజాస్వామ్య బద్ధ వేదిక ఉండడం ముదావహం. అయితే, 2017 నుంచి అప్పిలేట్ బాడీ నిబంధనల ప్రకారం, సభ్యుల గడువు ముగిసింది. ఖాళీలు ఏర్పడ్డాయి. అనూహ్యంగా, సంస్థాగత సమస్యలను ప్రస్తావిస్తూ అమెరికా కొత్త సభ్యుల నియామకాల ప్రక్రియను నిలిపివేసింది. ప్రపంచ వాణిజ్య సంస్థలో నిర్ణయాలు ఏకాభిప్రాయం ద్వారానే ఉంటాయి. అమెరికా మొండి వైఖరితో కొత్త అప్పిలేట్ బాడీ ఏర్పడక వివాద పరిష్కార యంత్రాంగం పని చేయలేని పరిస్థితికి చేరుకున్నది. కొత్త సభ్యులతో వివాద పరిష్కార సంస్థ (డిస్ప్యూట్ సెటిల్‌మెంట్ బాడీ) ఏర్పాటుకు ఇతర దేశాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను డిసెంబర్ 2022 నాటికి అమెరికా దాదాపు 60 సార్లు తిరస్కరించింది. డబ్ల్యూటీవో సభ్యదేశాలలో భారత్ సహా అత్యధికం దీనిని త్వరగా పునఃప్రారంభించడాన్ని సమర్థిస్తున్నాయి.

ప్రపంచ వాణిజ్య సంస్థ తన సభ్యులు, ఇతరులపై అనుమతి లేని ఏకపక్ష చర్యలు తీసుకోవడాన్ని నిషేధిస్తుంది. కానీ, అమెరికాకు జాతీయ భద్రత, మానవ హక్కులు, బలవంతపు సాంకేతిక బదిలీ పేరుతో ఇతర సభ్యులపై ఏకపక్ష చర్యలు ప్రకటించిన సుదీర్ఘ చరిత్ర దానికి ఉంది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో, సాంకేతిక పరిజ్ఞానంలో తనకున్న ఆధిపత్య జ్ఞానాన్ని ఉపయోగించి, తన దౌత్య విధానాలు మరియు చట్టవిరుద్ధమైన డిమాండ్లను ఇతర దేశాలు, ప్రాంతీయ వాణిజ్య సమూహాలు, సంస్థల మీద కూడా రుద్దింది. ఈ పద్ధతులు అంతర్జాతీయ వాణిజ్యంపై దుష్ప్రభావాన్ని చూపెడుతున్నాయి.

ఈ నివేదికలో చైనా 4 చోట్ల భారత్ ప్రస్తావన తీసుకువచ్చింది. 1997లో అమెరికాలో ఒక వ్యవసాయ సంస్థ బాస్మతి బియ్యాన్ని అమెరికన్ లాంగ్ ఇండికా బియ్యంతో సంకరించిన తరువాత 20 పేటెంట్ల కోసం మేధా హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నది. ఇది భారతదేశం నుండి బాస్మతి బియ్యం ఎగుమతిని తీవ్రంగా పరిమితం చేసిందని వ్యాఖ్యానించింది. ఫిబ్రవరిలో 2019లో చైనా, భారత్, దక్షిణాఫ్రికా, వెనిజులా, లావోస్ పీడీఆర్, బొలీవియా, కెన్యా, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, పాకిస్తాన్, క్యూబా సంయుక్తంగా ప్రపంచ వాణిజ్య సంస్థకు ఒక విశ్లేషణాత్మక పత్రం సమర్పించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల పట్ల ఉండే వివక్షను ఎండగడుతూ, ఆయా దేశాలకు ఉన్న ప్రత్యేక పరిస్థితుల పరిరక్షణకు హక్కులను కల్పించాల్సిన అవసరాన్ని ఈ పత్రం ద్వారా కోరాయి. అదే సంవత్సరం (2019) అక్టోబర్ నెలలో, 53 సభ్యదేశాలు (చైనా, భారత్, పాకిస్తాన్, ఆఫ్రికన్ గ్రూప్ సహా) సంయుక్తంగా ఒక పత్రం సమర్పించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రత్యేక, భిన్నమైన వాణిజ్య నిబంధనలను రూపొందించడం తమ హక్కుగా ఈ పత్రంలో వర్ణించారు.

ఈ నివేదిక ద్వారా డబ్ల్యూటీవో సభ్యత్వ దేశాలతో కలిసి పని చేస్తామని చైనా హామీ ఇచ్చింది. చైనా ఇస్తున్న ఈ హామీలు ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకృత విధానాలను వ్యతిరేకించేవారికి ఆశ్చర్యం కలిగించవచ్చు. కమ్యూనిస్ట్ దేశంగా ముద్ర పడిన చైనా సరళీకృత ఆర్థిక విధానాలకు, ప్రపంచీకరణకు, ప్రైవేటీకరణకు ఆలవాలమైన ప్రపంచ వాణిజ్య సంస్థ కొనసాగింపునకు ఈ విధంగా ఊతం ఇవ్వడం ఆశ్చర్యం కలిగించకమానదు. అయితే, అమెరికాను వేలెత్తి చూపుతున్న చైనా ఇతర దేశాల పట్ల తన చర్యల గురించి సమీక్షించలేదు. కనీసం ప్రస్తావించలేదు. ఏది ఏమైనా, ప్రపంచ వాణిజ్య సంస్థ, దాని చుట్టూ ముసురుకుంటున్న సమస్యల మీద ఇటువంటి సవివరమైన నివేదికను భారత ప్రభుత్వం కూడా తయారు చేసి, ప్రత్యేకంగా అమెరికా, చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్ళ గురించి ప్రజలకు, పార్లమెంటుకు నివేదిస్తే బాగుంటుంది.

వ్యాసకర్త విధాన విశ్లేషకులు । 90102 05742

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### ఒక ఆశ



ఇప్పుడే నూహ్ నుంచి తిరిగివచ్చాను. కౌమార బాలురు సహా వందలకొద్దీ ముస్లిం యువకులను పోలీసులు రౌండప్ చేస్తుండటంతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. మరో పక్క మూడు మూకదాడుల ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. అదే సమయంలో ఆశ కూడా కలుగుతోంది. ముస్లింలకు హిందువులు బాసటగా ఉండడమే కాకుండా, చాలా పంచాయతీలు ద్వేషాన్ని వ్యతిరేకిస్తూ, సౌభ్రాతృత్వానికి పిలుపునిస్తున్నాయి.

– హర్ష్ మందర్, యాక్టివిస్ట్

### శుభాకాంక్షలు



ప్రియమైన భారత స్నేహితులకు, రక్షా బంధన్ శుభాకాంక్షలు. అలాగే హ్యాపీ ఓనమ్!

– నవూఫ్ అల్మార్వాయి, సౌదీ యోగాచార్య

### అంతేనా?



ఒకవేళ ఎల్పీజీ సిలిండర్ ధరలు తగ్గించడం బహుమతి అయితే, ధర పెంచడం బలవంతంగా దోచుకోవడం అనేకదా!

– సంజయ్ ఝా, రచయిత

### మంచి యువకుడు



నీరజ్ చోప్రా (జావెలిన్ త్రో ఛాంపియన్) గురించి ఎంత చదువుతుంటే, అంత ఎక్కువగా ఈ అద్భుతమైన యువకుడి మీద గౌరవం పెరుగుతోంది.

– రీతూపర్ణా ఛటర్జీ, సంపాదకురాలు

### మంగోలియా ప్రయాణం



మంగోలియాలోని మన సోదరులు, సోదరీమణులను కలిసేందుకు నేను రేపు మధ్యాహ్నం ఆసియా ఖండానికి బయలుదేరుతాను. మీ ప్రార్థనలతో నా యాత్రను అనుసరించమని మిమ్మల్ని కోరుతున్నాను.

– పోప్ ఫ్రాన్సిస్, క్రైస్తవ మత గురువు

# క్రమం తప్పిన వారిపై కరవాలం

భారతోన్నత న్యాయస్థానం లింగవివక్ష కట్టడికి 'కరదీపిక' (కంబాటింగ్ జండర్ స్టీరియోటైప్స్)ను జారీచేసింది. ఇది మహిళా సంఘాల సామాజిక, న్యాయ పోరాటాల; ప్రధాన న్యాయమూర్తి ధనంజయ యశ్వంత్ చంద్రచూడ్ చొరవల ఫలితం. న్యాయపర నిర్ణయాలు, రచనల్లో అపాయకర మహిళా వివక్షను నివారించే సూచిక ఈ కరదీపిక. కొందరి పట్ల, కొన్నిటి గురించి ప్రజల్లో పేరుకుపోయిన తప్పుడు భావజాలానికి ప్రతిరూపం కొన్ని మూసపోత పదాలు.

'న్యాయమూర్తులుగా మనం చేసిన ప్రమాణం భయం, పక్షపాతం, అభిమాన దురభిమానాలు లేకుండా విధులను నిర్వహించాలని ఆదేశిస్తోంది. మన ముందున్న కేసులలో భౌతిక దృక్పథంతో రాజ్యాంగాన్ని అన్వయించాలి. అక్రమ ప్రయత్నాలను తిరస్కరించాలి. మన భావాలను పక్కనపెట్టాలి. సంజాత లింగ వివక్షతలు, స్త్రీ వ్యతిరేక భాష మన విధుల విరోధాలు. రాజ్యాంగ అనుసంధానాన్ని స్త్రీకి హానికరంగా వక్రీకరిస్తాయి. పితృస్వామ్య భావాలతో సామాజిక, మానవత్వ విలువలు, సమానత్వ హక్కులు దెబ్బతింటాయి. లింగవివక్ష గుర్తించడంలో, ప్రత్యామ్నాయ పదా లను అందించడంలో, శాసన వివేక కల్పనలో న్యాయసమూహానికి ఈ కరదీపిక దోహదపడుతుంది అని చంద్రచూడ్ ముందుమాటలో ముచ్చటించారు.




లైంగికతత్వ వివక్షతల మూస వాదాలు మూడు రకాలు. అవి 1. స్త్రీల స్వాభావిక లక్షణాలు: స్త్రీపురుషులకు విభిన్న లక్షణాలుంటాయని నమ్ముతారు. ఈ ఊహలను భావోద్వేగ, భౌతిక, మేధోవికాస సామర్థ్యాలకు విస్తరిస్తారు. 2. స్త్రీల లైంగికతత్వ పాత్రలు: సమాజం స్త్రీపురుషులకు లింగాధారంగా నిర్దిష్ట చర్యలను, పాత్ర పోషణలను ఆపాదిస్తుంది. ఇవి సామాజిక నిర్మాణ అవగాహనల ఉత్పత్తులు. మగాళ్ళు ఉద్యోగాలకు, మహిళలు గృహ నిర్వహణకు యుక్తులని ప్రచారం చేశారు. శాస్త్రసాంకేతిక వృత్తుల్లో, సామాజిక నిర్మాణంలో ఆరితేరిన స్త్రీలు కూడా ఇంట్లో స్త్రీ పాత్ర పోషించాల్సిందే. ఈ లైంగికత్వ పాత్రల నుండి ఏ మాత్రం వైదొలగినా సామాజిక కళంకానికి దారి తీస్తుంది.అంకిత అర్ధాంగిగా మొగుని కంటే ముందు మేల్కొని అతని అవసరాలను తీర్చాలని, విధేయ భార్యగా అతను కోరినట్లు బట్టలు ధరించాలని వివరిస్తూనే ఆ పనులు చేయనంత మాత్రాన భర్త భార్యను కొట్టరాదని ఒక హైకోర్టు తీర్పిచ్చింది. వివక్షలతో వివరణ, 'అంకిత', 'విధేయ' వంటి పదాలు మూస ధోరణులను బలపరుస్తాయి. స్త్రీల సామాజిక అంచనాలు, మాధ్యమాల్లో ఆడపనుల నిర్వచనం, బయట పనులకు పోతే మహిళలు కళంకితులవుతారన్న దుష్టచింతన స్త్రీలను ఇళ్లలోనే బంధించాలన్న మగబుద్ధులకు మూలాలు. 3. లింగ, లైంగికత్వ, లైంగిక హింసలు: స్త్రీల మాటలు, బట్టలు, వృత్తుల ఆధారంగా వారి ప్రవర్తన, గుణాలను అంచనా కడతారు. ఈ ఊహల ఆధారంగానే న్యాయస్థానాల్లో స్త్రీల సాక్ష్యాల, చర్యల మూల్యాంకనం చేస్తారు. ఈ దురవగాహనలు అత్యాచారాల్లో, లైంగిక హింసల్లో, హత్యల్లో స్త్రీల ప్రాముఖ్యాన్ని తగ్గిస్తాయి. వారిని అన్యాయానికి గురిచేస్తాయి. ఒక సుప్రీంకోర్టు-తీర్పు ప్రకారం వివాహిత వ్యక్తికి అవివాహితతో లైంగిక సంబంధం తప్పు కాదు. అతను మరొకరి భార్యతో వివాహేతర చర్యకు పూను కోవడం తప్పు. భార్య భర్త సొత్తు. పర సొత్తుతో దుష్ప్రవర్తన శిక్షార్హ నేరం. పితృస్వామ్య భావాలతో సమాజం లైంగిక చర్యల్లో స్త్రీపురుషులకు వేరువేరు ప్రమాణాలను నిర్ణయించింది. అత్యాచారాలలో స్త్రీ శీలం చెడుతుంది. మగ మానం మలినమవదు.


అత్యాచార ధృవీకరణలో రెండు వేళ్ళ పరీక్ష నేరపక్షపాత అవకాశం, అశాస్త్రీయం, అమానవీయం. అత్యాచార బాధితురాలి సాక్ష్యాన్ని నమ్మాలి. ఆమె వంటి మీద గాయాలు లేవు కాబట్టి ఆమె సంభోగానికి సమ్మతించిందని వాదించరాదు.

ఈ కరదీపికలో ఆడువారిని అవమానించే పదాలకు, పదబంధాలకు ప్రత్యామ్నాయాలను సూచించారు. రాజ్యాంగ అధికరణ 141 ప్రకారం అవి అన్ని శ్రేణుల కింది కోర్టులకు శిరోధార్యాలు. ఆచరణాదేశాలు. అభిజాత్య మగమనస్సును మార్చుకోలేని ప్రపంచవ్యాపిత పురుష 'ప్రగతిశీలురకు', పత్రికలకు, ప్రజలకు, ప్రత్యేకించి (మన కేంద్ర) రాజకీయులకు ఈ కరదీపిక కఠిన హెచ్చరిక, క్రమం తప్పిన వారికి కఠోర కరవాలం.

– సంగిరెడ్డి హనుమంత రెడ్డి, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి । 94902 04545

# అర్థాన్ని మార్చివేస్తున్న పాదయాత్రలు

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

పాదయాత్రలకు ఓ అద్భుతమైన చరిత్ర ఉంది. ఇవి తమ స్వార్థం కోసం చేసేవి కావు. దేశం కోసం, ప్రజల కోసం చేసేవి.

ప్రజలను ప్రగతిపథంలో నడిపించడానికి ఏం చేయాలో తెలిపేవిగా, తెలుసుకునేవిగా పాదయాత్రలు ఉండాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల కష్టాలను తెలుసుకొని, హృదయాలకు హత్తుకొని చేసిన మొట్టమొదటి పాదయాత్ర వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిందే.

మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి అధికారం చేపట్టిన చంద్రబాబు దుష్టపాలనలో ప్రజలు నానా కష్టాలు అనుభవిస్తున్న కాలంలో పాదయాత్ర ప్రారంభించారు వైఎస్సార్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమ, కళింగాంధ్ర ప్రాంతాలలో పర్యటించి ప్రజలేం కోరుకుంటున్నారో తెలుసుకున్నారు. 'మీకు అండగా నేనుంటాన'ని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి అయ్యి అద్భుత పథకాలను ప్రవేశపెట్టి అన్ని ప్రాంతాల ప్రజల ఆత్మబంధువయ్యారు. ఆయన యాత్ర నేలవిడిచి సాము చేస్తున్న రాజకీయాల్నుండి రాష్ట్రాన్ని విముక్తం చేసి ప్రజాస్వామిక రాజకీయాలను పునరుద్ధరించింది. రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి వచ్చి 'ఆరోగ్యశ్రీ'తో లక్షలాది మంది పేదల ప్రాణాలను కాపాడారు. పావలా వడ్డీకి రుణాలు, వృద్ధాప్య పెన్షన్ పెంచడం, 'జలయజ్ఞా'న్ని నిర్వహించడం లాంటి అనేక పనుల ద్వారా ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. అయినా ఒక్కరోజు కూడా రాజశేఖర్‌రెడ్డి పాలన గురించి ఒక్క మంచి మాటా మాట్లాడలేదు బాబు.



వైఎస్సార్ అకాల మరణంతో ఆయన లేని లోటును తీర్చడానికి జగన్ మోహన్‌రెడ్డి పార్టీ పెట్టారు. ఇంతలో రాష్ట్రం విడిపోయింది. అనుభవజ్ఞుడని చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తే ఆయన ఏపీలోని మూడు ప్రాంతాల మధ్య సామాజిక ఆర్థిక అంతరాలను పెంచడానికి తెరలేపారు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ పాదయాత్ర ప్రారంభించారు. ఓ స్పష్టమైన రాజకీయ దృక్పథంతో ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోను తయారుచేసుకున్నారు. జగన్ నిజాయతీ, ఆచరణ యోగ్య మేనిఫెస్టో ఆంధ్ర ప్రజలకు నచ్చడంతో అత్యధిక సీట్లను ఆయన పార్టీకి ప్రజలు కట్టబెట్టారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యారు. 23 సీట్లతో అతికష్టంగా చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడయ్యారు. 'ఆరోగ్యశ్రీ'ని మరింత విస్తరించి, పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు జగన్. వ్యవసాయాన్ని మెరుగుపరిచి రైతులపాలిట ఆత్మబంధువయ్యారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని శరవేగంతో కొనసాగిస్తున్నారు. ప్రపంచస్థాయి పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి పెట్టుబడులు వెల్లువలై రావడానికి కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల దశను మార్చివేస్తున్నారు.


కాని చంద్రబాబునాయుడు, ఆయన మీడియా జగన్‌పై వ్యతిరేక ప్రచారం చేస్తూనే ఉంది. ఇపుడు ఏ రాజకీయ దృక్పథమూ, సేవాభావమూ లేకుండా సినిమా గ్లామర్‌తో గెలువగలనన్న నమ్మకంతో పవన్ కల్యాణ్ చంద్రబాబుకు తోడయ్యారు. ఇటీవలే బీజేపీలోకి వచ్చిన పురందేశ్వరి కూడా ఇదే బాట ఎంచుకున్నారు. రాజకీయాలన్నా, పాదయాత్రలన్నా అర్థం, అవగాహన కూడా లేని లోకేష్ రాజకీయ పాదయాత్ర ప్రారంభించారు. ఆయన ప్రచారంలోనూ, తిట్లపురాణమే.

14 ఏళ్ల పాలనలో చంద్రబాబు ఆంధ్రకు ఏం ఒరగబెట్టకున్నా నాలుగేళ్ళలో మౌలిక మార్పులు తీసుకొచ్చిన జగన్‌పై విమర్శలు చేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఎవరెన్ని యాత్రలు చేసినా, వ్యతిరేక ప్రచారం చేసినా వైస్ జగన్ ముఖ్యమంత్రిగా చేసిన, చేస్తున్న పనులు మరోసారి ఆయన గెలుపును ఎట్టి పరిస్థితిలోనూ ఆపలేవన్నది నగ్నసత్యం.

వ్యాసకర్త కథా రచయిత । 91829 18567

# అపురూప రక్ష

శ్రావణ పూర్ణిమ అందాల బంధాల పండగ. ఆడపడుచులు శ్రావణ పౌర్ణమినాడు పుట్టింటికి వెళ్ళి, సోదరుల చేతులకు రక్షా బంధనాలు కట్టే ఆనవాయితీని ఏర్పరచిన మహనీయులు కృతజ్ఞతకు ఎంతగానో పాత్రులు. సోదరి... సోదరుడికి రక్షాబంధనం కట్టడం ద్వారా గుర్తు చేసే సందేశం ఇది: 'సోదరా! నేనిక్కడున్నా, మరో ఇంటి ఇల్లాలిగా ఉన్నా, మనకు జన్మసిద్ధంగా ఉన్న మహత్తరమైన బంధాన్ని నేను మరవలేను. నువ్వూ మరవవద్దు. ఎక్కడున్నా నేను నీ సర్వతోముఖమైన సంక్షేమాన్ని కాంక్షిస్తూనే ఉంటాను. నాకు ఏ క్లిష్ట పరిస్థితి ఎదురైనా నీ ఆశీస్సులూ అండదండలూ ఉంటాయని ఆశిస్తూనే ఉంటాను' అని.



జ్యోతిర్మయం

ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు, మెట్టినిల్లు బాధ్యతలూ, సాంఘిక సంప్రదాయాలూ, కట్టుబాట్లూ, చట్టాలూ – అన్నీ మారిపోయాయి, ఇక ఈ కాలంలో ఇలాంటి సందర్భాలు అవసరమా అని ప్రశ్న వస్తే, మునుపటికంటే ఎక్కువ అవసరం అనే జవాబు చెప్పాలి.

కుటుంబాల పరిమాణాలు కుంచించుకు పోతున్న కాలం ఇది. మాటవరస బంధుమిత్రులు తప్ప, 'నా వారు' అనదగ్గ ఆత్మీయులు తగ్గిపోతున్న తరుణం ఇది.

జన్మగతమైన రక్త సంబంధాలు పొమ్మంటే పోతాయేమో గాని, రమ్మంటే వచ్చేవి మాత్రం కావు. భగవంతుడు తను అన్ని చోట్లా ఉండలేడు కనక అమ్మను సృష్టించాడంటారు. అలాగే అందరికీ కర్ణుడికిలా సహజ కవచ కుండలాలు ఇవ్వలేక, ఎందరో భాగ్యశాలులకు అనురాగమయమైన సోదర – సోదరీ బంధాలనే సాంఘిక రక్షా కవచాలను ఏర్పరిచి, కష్ట సుఖాలను పంచుకొమ్మన్నాడు. అవి సహజ సంబంధాలు కనక ఆరోగ్యకరమైనవి, బలమైనవి. అయితే అయాచితంగా లభించినవి కనక, ప్రమత్తతకూ ఉపేక్షకూ గురయ్యే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. 'ఊ' అంటే మనో భావాలు దెబ్బతిని, 'ఆ' అంటే అమూల్యమైన బంధాలు ఛిద్రమౌతున్న ఆధునిక కాలంలో రాఖీ పండగ లాంటి సంప్రదాయాలను ఎంత శ్రద్ధగా ఆచరించి రక్షించుకొంటే అంత మంచిది.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** పౌర్ణమి ఉ.8.04 వరకు, తదుపరి బహుళ పాడ్యమి తె.5.38 వరకు (తెల్లవారితే శుక్రవారం), **నక్షత్రం:** శతభిషం రా.8.23 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** రా.2.22 నుండి 3.51 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.55 నుండి 10.44 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.45 వరకు, **అమృతఘడియలు:** ప.1.41 నుండి 3.10 వరకు, శ్రావణ పౌర్ణమి, రాఖీ పండగ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.48, **సూర్యాస్తమయం:** 6.14.

# మరో 5 వైద్య కళాశాలల ప్రారంభానికి కసరత్తు

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలని ప్రభుత్వ నిర్ణయం
- సిద్ధమవుతున్న పాడేరు, పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లె కాలేజీలు
- వాటికి బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి కసరత్తు
- ఇప్పటికే పోస్టులు కూడా మంజూరు
- ఈ కాలేజీల ద్వారా మరో 750 ఎంబీబీఎస్ సీట్లు
- రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు నిర్మిస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం
- ఇప్పటికే 5 కాలేజీల్లో అడ్మిషన్లు


పులివెందులలో తుది మెరుగులు దిద్దుకుంటున్న బోధనాస్పత్రి ఓపీడీ బ్లాక్

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో వైద్య విద్య, వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. వచ్చే విద్యా సంవత్సరం (2024–25)లో మరో 5 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రారంభానికి సిద్ధమవుతోంది. వీటిలో బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి నిర్ణయించింది. ఈమేరకు కొత్త పోస్టులను కూడా మంజూరు చేసింది. రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఉండేలా ప్రభుత్వం రూ.8480 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ కళాశాలల ఏర్పాటు వేగంగా జరుగుతోంది. ఈ విద్యా సంవత్సరం నుంచి నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభిస్తున్నారు. ఆ కళాశాలల్లో అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాడేరు, పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లె కళాశాలలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు వైద్య, ఆరోగ్య శాఖ కసరత్తు ప్రారంభించింది.

### 3530 పోస్టుల సృష్టి

ఈ ఐదు కళాశాలలు ప్రారంభించడానికి వీలుగా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా కొత్త పోస్టులను ప్రభుత్వం ఇప్పటికే సృష్టించింది. ఒక్కో వైద్య కళాశాలకు 222, బోధనాస్పత్రికి 484 చొప్పున 3,530 పోస్టులను మంజూరు చేసింది. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, పాథాలజీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఎస్పీఎం, జనరల్ మెడిసిన్, గైనిక్, పీడియాట్రిక్స్ ఇలా వివిధ విభాగాల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు, నర్సింగ్, మెడికల్, నాన్‌మెడికల్, అడ్మినిస్ట్రేషన్ పోస్టులను మంజూరు చేసింది. వైద్య పోస్టుల భర్తీకి ఇప్పటికే మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ జారీ చేసి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపడుతోంది. ఈ ఐదు చోట్ల ఏపీవీవీపీ ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేస్తున్నారు.

### సమకూరనున్న మరో 750 ఎంబీబీఎస్ సీట్లు

17 కొత్త వైద్య కళాశాలల ద్వారా ఏకంగా 2550 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. వందేళ్ల చరిత్రలో ఎన్నడూ లేనట్టుగా ఈ విద్యా సంవత్సరంలో ఐదు కళాశాలలు ప్రారంభించడం ద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లు వచ్చాయి. వచ్చే ఏడాది ప్రారంభమయ్యే 5 కాలేజీల్లో ఒక్కో చోట 150 చొప్పున 750 సీట్లు వస్తాయి. మిగిలిన ఏడు కళాశాలలను 2025–26లో ప్రారంభించేలా ప్రణాళిక రచించారు.

### వేగంగా నిర్మాణాలు

ఐదు చోట్ల వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల నిర్మాణం వేగంగా సాగుతోంది. 2024–25 సంవత్సరానికి కొత్త వైద్య కళాశాలల అనుమతులకు ఎన్‌ఎంసీ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వం ఇప్పటికే పోస్టులు మంజూరు చేసింది. ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్ల నియామకం జరిగింది. ఇతర వైద్యులు, సిబ్బంది నియామకాలు వేగంగా పూర్తి చేసి ఐదు కళాశాలలు ప్రారంభించడానికి ఎల్‌వోపీ కోసం ఎన్‌ఎంసీకి దరఖాస్తు చేస్తాం. 2023–24 విద్యా సంవత్సరానికి 5 కళాశాలలకు అనుమతులు తెచ్చిన అనుభవం ఈ సారి సులువుగా పనులు పూర్తి చేయడానికి దోహద పడుతుంది.



– ఎం.టి. కృష్ణబాబు, వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

# విజయవంతంగా రోవర్ ఏడు రోజుల ప్రయాణం



- 250 మీటర్లు ప్రయాణం
- మరో వారం విధులు
- ఈ రోజులే కీలకమంటున్న శాస్త్రవేత్తలు
- ఆ తర్వాత చంద్రుడిపై చిమ్మచీకట్లు, భారీగా మంచు

**సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా):** భారత్ ఈ నెల 23న చంద్రుడి దక్షిణ ధృవంపై ల్యాండర్‌ను దించిన తొలి దేశంగా రికార్డులు సృష్టించింది. ల్యాండర్ దిగిన మరికొన్ని గంటలకే దాని నుంచి రోవర్ కూడా బయటకొచ్చి తన పనిని మొదలుపెట్టేసింది. మొత్తం 14 రోజులపాటు రోవర్ చంద్రుడిపై అన్వేషణలు కొనసాగించనుంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఏడు రోజులు పూర్తయ్యాయి. మరో ఏడు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో ఈ వారం రోజులు కీలకమని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తరువాత చంద్రుడిపై 14 రోజులపాటు చిమ్మ చీకట్లు ఆవరించడంతోపాటు భారీగా మంచు కురుస్తుందని పేర్కొంటున్నారు. దీంతో ల్యాండర్, రోవర్‌లు పనిచేస్తాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తదుపరి 14 రోజులు తర్వాత ల్యాండర్, రోవర్లు ఉన్న చోట మళ్లీ సూర్యకిరణాలు పడతాయి. వీటికి సోలార్ ప్యానెల్స్ రీస్టార్ట్ అయితే ల్యాండర్, రోవర్లు తిరిగి పనిచేస్తాయి. లేదంటే వాటి కాలపరిమితి తీరిపోయినట్టేనని చెబుతున్నారు. కాగా ఇప్పటివరకు తన ఏడు రోజుల ప్రయాణంలో రోవర్ సుమారు 250 మీటర్ల దూరం ప్రయాణం చేసినట్టు ఇస్రో వెల్లడించింది.

**విజయవంతంగా లిబ్స్..**

కాగా రోవర్‌లో అమర్చిన లేజర్ ఇండ్యూస్డ్ బ్రేక్‌డౌన్ స్పెక్ట్రోస్కోప్ (లిబ్స్) అనే పేలోడ్ విజయవంతంగా పనిచేయడం వల్ల చంద్రుడిలో దాగిన రహస్యాలను తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలోనే చంద్రుడి దక్షిణ ధృవంపై సల్ఫర్ ఉనికిని తొలిసారి కనుగొన్నారు. అలాగే అల్యూమినియం, కాల్షియం, ఐరన్, క్రోమియం, టైటానియం, మాంగనీస్, సిలికాన్‌తో పాటు ఆక్సిజన్ కూడా ఉన్నట్లుగా తేలింది. ప్రస్తుతం హైడ్రోజన్ కోసం మరింతగా రోవర్ పరిశోధనలు చేస్తోంది. అయితే లిబ్స్ అనే పేలోడ్ చంద్రుడి ఉపరితలంపై శక్తివంతమైన లేజర్‌ను షూట్ చేసినప్పుడు.. అందులో నుంచి వెలువడే కాంతి ఆధారంగా మూలకాలను గుర్తించి ఆ డేటాను ఇస్రో భూ నియంత్రిత కేంద్రానికి పంపుతోంది. ఈ సైంటిఫిక్ పేలోడ్‌ను బెంగళూరులోని లేబొరేటరీ ఫర్ ఎలక్ట్రో ఆప్టిక్స్ సిస్టం (లియోస్) అభివృద్ధి చేసింది.

**భారత్, చైనాకు చెందిన రెండు రోవర్లు**

మరోవైపు 2019 జనవరి 3న చంద్రుడి దక్షిణ ధృవం ప్రాంతంలో ఐట్కిన్ బేసిన్‌లో చైనాకు చెందిన వాంగ్–4 మిషన్ యూటూ 2 రోవర్ సైతం పరిశోధనలు చేస్తోంది. భారత్, చైనా రోవర్ల మధ్య దూరం 1,948 కిలోమీటర్లు ఉన్నట్టుగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చంద్రుడిపై ఒకేసారి రెండు రోవర్లు పనిచేయడం ఇదే మొదటిసారని పేర్కొంటున్నారు.

### నీలి రంగు నిండు జాబిలి!

ఆకాశంలో నిండు జాబిలి నీలి రంగులో కనువిందు చేసింది. బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో విజయవాడలో ఇలా అరుదైన బ్లూ మూన్ సాక్షాత్కరించింది. ఒకే నెలలో రెండోసారి వచ్చే పౌర్ణమి రోజున కనిపించే చంద్రుడిని బ్లూమూన్ అంటారు. ఆగస్టు ఒకటో తేదీన ఒకసారి, 30వ తేదీన రెండోసారి కనిపించింది. ఇలా ఒకే నెలలో రెండవసారి రోజూ కంటే పెద్దదిగా కనిపించడం విశేషం. ఈ సూపర్ బ్లూ మూన్ 2037 వరకు మళ్లీ కనిపించదని నిపుణులు చెబుతున్నారు.

– విశాల్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



# నడక మార్గంలో ఏం చర్యలు తీసుకుంటున్నారు?

- ఇనుప కంచె ఏర్పాటు సాధ్యమేనా!
- అటవీ శాఖ, టీటీడీలను ప్రశ్నించిన హైకోర్టు ధర్మాసనం
- చిన్నారి కుటుంబానికి పరిహారాన్ని రూ.30 లక్షలకు పెంచాలని ఆదేశం

**సాక్షి, అమరావతి:** తిరుమల నడక మార్గంలో వన్యప్రాణుల నుంచి భక్తులను రక్షించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని ఏపీ హైకోర్టు అటవీ శాఖ, టీటీడీ అధికారులను బుధవారం ఆదేశించింది. అలిపిరి నుంచి తిరుమల వరకు నడక మార్గం వెంట ఇనుప కంచె ఏర్పాటు విషయంలో సాధ్యాసాధ్యాలను కూడా తెలియజేయాలని కోరింది. వన్యప్రాణులు తిరిగే చోట మనమంతా తిరుగుతున్నామని, అందువల్ల వన్యప్రాణుల జీవనం, భక్తుల భద్రత మధ్య సమతుల్యత ఉండేలా చూడాలని హైకోర్టు స్పష్టం చేసింది. అలాగే వన్యప్రాణుల రాకపోకలకు వీలుగా తగిన రక్షిత మార్గాలను ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలించాలంది. ఇటీవల చిరుత పులి దాడిలో మరణించిన చిన్నారి కుటుంబానికి చెల్లించిన రూ.15 లక్షల పరిహారాన్ని రూ.30 లక్షలకు పెంచాలని టీటీడీకి స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, టీటీడీ ఈవో, ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్, చిత్తూరు జిల్లా అటవీ అధికారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 20వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వన్యప్రాణుల సంచారం భక్తులకు ప్రమాదంగా మారుతున్న నేపథ్యంలో అలిపిరి నుంచి తిరుమల వరకు నడక దారి వెంట ఇనుప కంచె ఏర్పాటు చేసేలా టీటీడీ అధికారులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ తిరుపతికి చెందిన బీజేపీ నేత గుడిపల్లి భానుప్రకాశ్‌రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున యలమంజుల బాలాజీ, అటవీ శాఖ తరఫున ఖాసిం సాహెబ్, టీటీడీ తరఫున అనూప్ వాదనలు వినిపించారు.

### దుర్గమ్మ సేవలో జస్టిస్ గోపాలకృష్ణారావు


జస్టిస్ గోపాల కృష్ణారావుకు అమ్మవారి ప్రసాదాలు అందచేస్తున్న అర్చకులు

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. జస్టిస్ గోపాలకృష్ణారావు దంపతులకు ఆలయాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించగా, ఆలయాధికారులు, అర్చకులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

### సిద్ధమైన యుద్ధనౌక



1న మహేంద్రగిరి యుద్ధనౌక ప్రారంభం

**సింథియా:** ముంబైలోని మజగాన్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ సారథ్యంలో ప్రాజెక్ట్ 17–ఏ ఫ్రిగేట్స్‌లో భాగంగా 7వ యుద్ధనౌక మహేంద్రగిరిని సెప్టెంబర్ 1వ తేదీన ప్రారంభించనున్నారు. అధునాతన ఆయుధాలు, సెన్సార్‌లు, ప్లాట్‌ఫామ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్‌తో సాంకేతికంగా అభివృద్ధి చెందిన యుద్ధనౌకగా రూపొందింది. పూర్తి స్వదేశీ రక్షణ సామర్థ్యంతో భవిష్యత్‌లో భారతదేశం గొప్ప నావికా వారసత్వానికి చిహ్నంగా నిలవనుందని తయారీదారులు అభివర్ణించారు. ప్రాజెక్ట్–17ఏ కింద మొత్తం 4 నౌకలు మజగాన్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ సారథ్యంలో నిర్మించగా.. మరో 3 నౌకలను జీఆర్‌ఎస్‌ఈ ద్వారా నిర్మిస్తున్నారు. ఆత్మనిర్భర్ భారత్ దృఢ నిబద్ధతకు అనుగుణంగా ఇండియన్ నేవీకి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరో ద్వారా షిప్ అంతర్గత నిర్మాణాలు రూపుదిద్దుకున్నాయి. దేశం గర్వించదగ్గ యుద్ధనౌకగా మహేంద్రగిరి రూపొందినట్టు ఇండియన్ నేవీ వర్గాలు తెలిపాయి. ఈ యుద్ధనౌకను ఉపరాష్ట్రపతి జయదీప్ ధన్కర్ భార్య సుదేశ్ ధన్కర్ చేతుల మీదుగా ప్రారంభిస్తారు.

# పొదుపు సంఘాల రుణాల వడ్డీ తగ్గింపునకు కెనరా బ్యాంకు ఒకే

- సీఎం జగన్ విజ్ఞప్తితో వడ్డీని తగ్గిస్తున్న బ్యాంకులు
- ఇంతకుముందే వడ్డీ తగ్గించిన ఎస్‌బీఐ

**సాక్షి, అమరావతి:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర బ్యాంకర్ల సమావేశంలో చేసిన విజ్ఞప్తి మేరకు రాష్ట్రంలో పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చే రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించేందుకు బ్యాంకులు ముందుకు వస్తున్నాయి. ఇప్పటికే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వడ్డీ తగ్గించగా, ఇప్పుడు కెనరా బ్యాంకు కూడా ఆమోదం తెలిపింది. పొదుపు సంఘాల రుణాలకు వడ్డీ తగ్గింపునకు ఆమోదం తెలిపే ఆదేశాలను కెనరా బ్యాంకు ప్రాంతీయ జనరల్ మేనేజర్ రవివర్మ బుధవారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో ఇంతియాజ్‌కు అందజేశారు. ఇటీవలే ఎస్‌బీఐ పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చే రుణాలపై వడ్డీని 12.15 శాతానికి బదులు 9.70 శాతం చేసింది. కెనారా బ్యాంకు కూడా 'ఎ' కేటగిరీలో ఉండే పొదుపు సంఘాలకు రూ. 5 లక్షల పైబడి రుణాలపై 9.70 శాతం వడ్డీనే వసూలు చేస్తామని తెలిపింది. దీంతో పాటు రుణాలపై ఎలాంటి అదనపు, ప్రాసెసింగ్, ఇన్‌స్పెక్షన్, యాన్యువల్ రివ్యూ లేదా రెన్యువల్ చార్జీలను పూర్తిగా మినహాయించింది. బుధవారం సెర్ప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెర్ప్ బ్యాంకు లింకేజీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.కేశవకుమార్, కెనరా బ్యాంకు డివిజనల్ మేనేజర్ ఐ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సీటీఈ డిప్యూటీ కార్యదర్శికి ఊరట

ఎన్‌బీడబ్ల్యూ రద్దు చేసిన ధర్మాసనం

**సాక్షి, అమరావతి:** జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) డిప్యూటీ కార్యదర్శికి హైకోర్టులో ఊరట లభించింది. కోర్టు ఆదేశాలున్నప్పటికీ విచారణకు గైర్హాజరైనందుకు డిప్యూటీ కార్యదర్శికి నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ధర్మాసనం బుధవారం రద్దు చేసింది. గుర్తింపు విషయంలో పిటిషనర్ కాలేజీ సమర్పించే అప్పీల్ పత్రాల ఆధారంగా తగిన నిర్ణయం తీసుకోవాలని డిప్యూటీ సెక్రటరీని ఆదేశించింది.తమ కాలేజీ గుర్తింపును రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలోని నెహ్రూ మెమోరియల్ ఎక్స్ సర్వీస్‌మెన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ పీడీ చంద్రశేఖర్ దాఖలు చేసిన వ్యాజ్యంలో తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని ఎన్‌సీటీఈ డిప్యూటీ కార్యదర్శిని హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశించారు. అయితే, ఆయన విచారణకు హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి ఎన్‌బీడబ్ల్యూ జారీ చేశారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆయన ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై సీజే ధర్మాసనం బుధవారం మధ్యాహ్నం లంచ్‌మోషన్ రూపంలో విచారించింది. కేంద్ర ప్రభుత్వం, డిప్యూటీ కార్యదర్శి తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) ఎస్.హరినాథ్, హేమంత్ కుమార్ వాదనలు వినిపిస్తూ, శాఖాపరమైన శిక్షణలో ఉన్నందున డిప్యూటీ కార్యదర్శి కోర్టు ముందు హాజరు కాలేకపోయారని తెలిపారు. కోర్టు ఆదేశాలను ధిక్కరించాలన్న ఉద్దేశం లేదన్నారు. వారి వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఎన్‌బీడబ్ల్యూ ఉత్తర్వులను రద్దు చేసింది.

# పవన్ ప్రసంగాలను ఈసీ పరిశీలించాలి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



**తాడేపల్లిగూడెం రూరల్:** జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ యువతను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం రాత్రి పశ్చిమ గోదావరిజిల్లా తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంట గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తీవ్రవాదాన్ని అలవాటు చేసుకోవాలంటూ ప్రజలను పవన్ రెచ్చగొడుతున్నారని, ఆయన ప్రసంగాలను ఎన్నికల కమిషన్ పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. పవన్ ప్రసంగాలను చూస్తూ యువత సంఘ విద్రోహ శక్తులుగా తయారవుతున్నారని, ఎక్కడ గొడవలు జరిగినా అక్కడ ఆ పార్టీ యువత ఉంటున్నారని విమర్శించారు.బాబు కోసం పవన్ తన సొంత సామాజిక వర్గాన్ని వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. కాపు ద్వేషి చంద్రబాబు అని విమర్శించారు. పవన్ ద్వారా కాపు ఓట్లను వేయించుకోవాలని చూస్తున్నాడన్నారు. పదవి, అధికారం లేకపోయినా రూ.కోట్లు సంపాదిస్తున్న పార్టీ ఏదైనా ఉందంటే అది జనసేన అని విమర్శించారు. యువగళం పాదయాత్ర చేపట్టిన నారా లోకేశ్ పిచ్చిమాలోకమని అన్నారు. నిలదీస్తున్న ప్రజల్ని తన బౌన్సర్లతో తన్నించేయాలని సూచిస్తున్నాడని.. ఇదేనా పాదయాత్రా? అని ప్రశ్నించారు.

# ఆడబిడ్డల జీవితాలు మార్చిన పార్టీ టీడీపీ

రక్షా బంధన్ వేడుకల్లో చంద్రబాబు



**సాక్షి, అమరావతి:** తాము అధికారంలో ఉన్నప్పుడు ఆడబిడ్డల జీవితాలను మార్చామని టీడీపీ అధ్యక్షుడు ఎన్.చంద్రబాబు నాయుడు తెలిపారు. అది తెలుగుదేశం ఘనతని చెప్పారు. రక్షా బంధన్ సందర్భంగా మంగళగిరి టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఆడబిడ్డలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది తమ పార్టీయేనని, దీనివల్లే మహిళలు ఎంతో లబ్ధి పొందారని చెప్పారు. రిజర్వేషన్ల వల్లే మహిళలు సంపాదిస్తున్నారని, వరకట్నం అనే సమస్య పోయిందన్నారు. రాజకీయాల్లో మహిళల పాత్ర ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడతామని తెలిపారు. మళ్లీ అధికారంలోకి వస్తే మహాశక్తి పథకంలో తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. భూమి, డబ్బు కాదు మనిషే ఆస్తిగా ఉండాలన్నదే తన ఆలోచనని తెలిపారు.

### ఆస్తుల నష్టాన్ని విధ్వంసకారుల నుంచి వసూలు చేయాలి

- ఆ మేరకు ప్రభుత్వాన్ని ఆదేశించండి
- హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో రాజకీయ పార్టీల ర్యాలీలు, సమావేశాల సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం జరిగితే, ఆ నష్టానికి విధ్వంసకారులను బాధ్యులుగా చేసి, వారి నుంచే వసూలు చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. రాజకీయ పార్టీల ర్యాలీలను కూడా నియంత్రించేలా పోలీసులను ఆదేశించాలని ఆ పిటిషన్‌లో కోరారు. వైఎస్సార్ కడప జిల్లా ఎర్రముక్కపల్లికి చెందిన న్యాయవాది బైరెడ్డి సాయి ఈశ్వర్‌రెడ్డి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వివేకానంద విరూపాక్ష వాదనలు వినిపిస్తూ.. రాజకీయ పార్టీల ర్యాలీలు, సమావేశాల సందర్భంగా విధ్వంసకారులు పెద్ద ఎత్తున ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తున్నారని, వాటిని పోలీసులు పట్టించుకోవడంలేదని చెప్పారు. ఆ నష్టాన్ని విధ్వంసకారుల నుంచి వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవడంలేదని తెలిపారు. ఈ నెల 4న చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో విధ్వంసం జరిగిందని, ప్రభుత్వ ఆస్తులకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, అనంతపురం రేంజ్ డీఐజీ, చిత్తూరు ఎస్పీలకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 11కి వాయిదా వేసింది.

### ఆ మాటల్ని ప్రజలు మర్చిపోలేదు చంద్రబాబూ!

మంత్రి మేరుగు నాగార్జున



**సాక్షి,అమరావతి:** ప్రత్యేక హోదా గురించి చంద్రబాబు ఎన్ని రకాలుగా అయినా మాట్లాడతారని, అప్పట్లో ప్రత్యేక హోదా సంజీవనా అని ప్రశ్నించిన చంద్రబాబు మాటలను మాటలు ప్రజలు మర్చిపోలేదని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. తాడేపల్లిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్యాకేజీ ఇస్తున్నారంటూ కేంద్ర పెద్దలను సన్మానించిన సంగతి కూడా అందరికీ గుర్తుందన్నారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని మళ్లీ మాటలు మారుస్తారు అంటూ దుయ్యబట్టారు. టీడీపీ ఎప్పుడో ఖాళీ అయిపోయిందని, ఆ పార్టీలోకి ఎవరు వెళతారని ప్రశ్నించారు. టీడీపీ మునిగిపోయే పడవ అని, ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేక పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు భవిష్యత్‌కే గ్యారెంటీ లేదని, ప్రజలకు ఆయనేం ష్యూరిటీ ఇస్తారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఎవరినైతే వెన్నుపోటు పొడుస్తారో, అతనికే పూలదండ వేస్తారన్నారు. ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ఢిల్లీ వెళ్లి ఎన్టీఆర్ నాణెం ఆవిష్కరణ సభలో పాల్గొనడాన్ని చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారన్నారు.

**లోకేశ్.. ఓ ఉత్తర కుమారుడే**

లోకేశ్‌ను చూస్తుంటే ఉత్తర కుమారుడే గుర్తుకు వస్తున్నారని మంత్రి నాగార్జున ఎద్దేవా చేశారు. ఆయన ఉత్తర కుమారుడి ప్రగల్భాలు పలకడం మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. తనకు అధికారమిస్తే ప్రస్తుత పథకాల కంటే ఎక్కువ ఇస్తానని చంద్రబాబు అంటున్నారని, మరి ఆ పథకాలకు డబ్బులు ఎక్కడ నుంచి తెస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు అన్నీ అబ్రకదబ్ర మాటలు చెబుతున్నారని, నేనే మీ నమ్మకం అంటున్నారని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లో బాబు వస్తే.. జాబు వస్తుందన్నారని, 600 వాగ్దానాలు చేసి.. వాటిని మేనిఫెస్టో నుంచి మాయం చేశారని గుర్తు చేశారు. 'ప్రజలు నిన్ను నమ్మం బాబూ అంటున్నారు. వచ్చే ఎన్నికల తర్వాత బాబు రాజకీయాల్లో కన్పించరు' అని స్పష్టం చేశారు.

# బాబు, నారాయణ పిటిషన్లపై ముగిసిన వాదనలు

- తీర్పు వాయిదా

**సాక్షి, అమరావతి:** రాజధాని అసైన్డ్ భూముల కొనుగోలు, బదలాయింపు వ్యవహారంలో సీఐడీ తమపై నమోదు చేసిన కేసులను కొట్టేయాలంటూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి పొంగూరు నారాయణ దాఖలు చేసిన పిటిషన్లపై వాదనలు ముగిశాయి. వాదనలు విన్న న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు. రాజధాని అసైన్డ్ భూముల వ్యవహారంలో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు ఆధారంగా చంద్రబాబు, నారాయణపై సీఐడీ అధికారులు 2021లో కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలంటూ బాబు, నారాయణ అదే ఏడాది హైకోర్టులో పిటిషన్లు వేసి స్టే ఉత్తర్వులు పొందారు. ఈ వ్యాజ్యాలు తాజాగా బుధవారం విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. సుప్రీం కోర్టు వెలువరించిన పలు తీర్పులను ఉదహరించారు. చంద్రబాబు, నారాయణ కలిసి ఏ విధంగా పేదలను మోసం చేశారు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పేదల నుంచి ఎలా అసైన్డ్ భూములను కాజేశారో క్షుణ్ణంగా వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

### ఆ సినిమా టీజర్ ఓ వర్గాన్ని కించపరిచేలా ఉంది

- తేల్చి చెప్పిన హైకోర్టు ధర్మాసనం



**సాక్షి, అమరావతి:** టైగర్ నాగేశ్వరరావు సినిమా టీజర్‌లో వాడిన భాష ఓ వర్గాన్ని కించపరిచేలా ఉందని హైకోర్టు వ్యాఖ్యానించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అనుమతి లేకుండా టీజర్ విడుదల చేయడంపై అభ్యంతరం తెలిపింది. తగిన అనుమతులు తీసుకోకుండా టీజర్ ఎలా విడుదల చేస్తారని ప్రశ్నించింది. ఇలాంటి టీజర్ల ద్వారా సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని నిలదీసింది. సమాజం పట్ల బాధ్యతగా ఉండాల్సిన అవసరం ఉందంది. ధనార్జనే ధ్యేయంగా సినిమాల నిర్మాణం ఉండకూడదంది. ఈ చిత్ర నిర్మాత అభిషేక్ అగర్వాల్‌కు నోటీసులు జారీ చేసింది. అలాగే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ చైర్‌పర్సన్‌ను ప్రతివాదిగా చేర్చాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. సినిమాపై అభ్యంతరాలన్నింటినీ సీబీఎఫ్‌సీ చైర్‌పర్సన్‌కు తెలియజేసుకునేందుకు పిటిషనర్‌కు అనుమతి ఇచ్చింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 27వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. టైగర్ నాగేశ్వరరావు సినిమా ఎరుకుల సామాజిక వర్గం మనోభావాలను దెబ్బతీసేలా ఉందని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ చుక్కా పాల్‌రాజ్ అనే వ్యక్తి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం మరోసారి విచారణ జరిపి టీజర్‌లోని భాషపై అభ్యంతరం వ్యక్తం చేసింది.

### సెప్టెంబర్ 30లోగా ఇంటర్ ప్రైవేట్ అభ్యర్థులు ఫీజు చెల్లించాలి

**సాక్షి, అమరావతి:** గత విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ తప్పిన, మధ్యలో చదువు మానేసిన విద్యార్థులు మరోసారి పరీక్షలు రాసేందుకు బోర్డు అవకాశం కల్పించింది. 2023–24 విద్యా సంవత్సరంలో వచ్చే మార్చిలో జరిగే పరీక్షలకు ఫీజు చెల్లించవచ్చని బోర్డు కార్యదర్శి సౌరభ్‌గౌర్ పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్ష ఫీజును సెప్టెంబర్ 30వ తేదీలోగా తమ కాలేజీల్లో చెల్లించవచ్చన్నారు. ఫీజును https://jnanabhumi.ap.gov.in/ పోర్టల్ కాలేజీ లాగిన్‌లో మాత్రమే చెల్లించాలి. సెప్టెంబర్ 1 నుంచి వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటాయి.

### లోకేశ్‌ను కలిసేందుకు రైతులు ససేమిరా



**జంగారెడ్డిగూడెం రూరల్/కామవరపుకోట:** ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలో బుధవారం నారా లోకేశ్ యువగళం పాదయాత్ర వెలవెలబోయింది. జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి నుంచి పుట్లగట్లగూడెం మీదుగా గురవాయిగూడెం వరకు యాత్ర సాగింది. పాదయాత్ర షెడ్యూల్‌లో పుట్లగట్లగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతులతో లోకేశ్ ముఖాముఖి ఏర్పాటు చేశారు. అయితే.. రైతుల వద్దకు లోకేశ్ రారని.. రైతులనే లోకేశ్ వద్దకు తీసుకు రావాలని చెప్పడంతో నాయకులు హైరానా పడ్డారు. లోకేశ్ వద్దకు రావాలని రైతులను బతిమాలుకోగా.. తాము రాబోమని రైతులు తెగేసి చెప్పారు. దీంతో టీడీపీ నేతలు తమ బంధువులను, పరిచయం ఉన్న వారిని తీసుకెళ్లి వాళ్లే రైతులని లోకేశ్‌కు చెప్పారు. వారితో ముక్తసరిగా మాట్లాడిన లోకేశ్ యాత్రను ముందుకు సాగించారు.

### టీడీపీ బెయిల్ పిటిషన్లపై కౌంటర్లు దాఖలు చేస్తాం

హైకోర్టుకు నివేదించిన అదనపు ఏజీ

**సాక్షి, అమరావతి:** చిత్తూరు జిల్లా పుంగనూరు, అన్నమయ్య జిల్లా అంగళ్లలో టీడీపీ నేతలు సాగించిన విధ్వంసంపై పోలీసులు నమోదు చేసిన వేర్వేరు కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ టీడీపీ సీనియర్ నేతలు, అమర్నాథ్‌రెడ్డి, శేషాచలపతి నాయుడు, మరికొందరు కార్యకర్తలు వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాల్లో కౌంటర్ దాఖలు చేస్తామని పోలీసుల తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇంతకుముందు జారీ చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ల ఉత్తర్వుల్లో తాము లేవనెత్తిన అంశాలు కోర్టులో రికార్డు కాలేదని, అందువల్ల ఈసారి పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేస్తామని ఆయన వివరించారు. న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

## క్లుప్తంగా...

### కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామికి అస్వస్థత



బెంగళూరు: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి(63) బుధవారం ఆస్పత్రిలో చేరారు. నీరసం, అసౌకర్యానికి గురైన ఆయన్ను కుటుంబసభ్యులు వెంటనే బెంగళూరులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఆయన్ను పరీక్షించిన వైద్యులు, వెంటనే చికిత్స ప్రారంభించారు. 'కుమారస్వామి ఆరోగ్యం నిలకడగా ఉంది. చికిత్సకు స్పందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం' అంటూ అపోలో ఆస్పత్రి హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. కుమారస్వామి మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవెగౌడ కొడుకు.

### ట్రక్కును ఢీకొన్న ఎస్‌యూవీ

**ఒకే కుటుంబంలోని ఏడుగురు మృతి**

సససరాం(బిహార్): బిహార్‌లోని రోహతస్ జిల్లా ససరాం వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు చనిపోయారు. ససరాం పట్టణంలోని శివసాగర్ వద్ద రెండో నంబర్ జాతీయ రహదారిపై బుధవారం వేకువజామున 4 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. కైమూర్ జిల్లాకు చెందిన ఓ కుటుంబం ఎస్‌యూవీలో జార్ఖండ్‌లోని రాజ్‌రప్ప ఆలయానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో ఆ వాహనం నిలిపి ఉన్న ట్రక్కును వేగంగా ఢీకొంది. ఘటనలో రాజ్‌మాతాదేవి(55)తోపాటు ఆమె కూతురు, అల్లుడు, మనవడు(8), మనవరాలు(9)తోపాటు ఒక బాలిక (15), మహిళ(22) చనిపోయారు.

### విష వాయువు పీల్చి.. అయిదుగురు కార్మికులు మృతి

మొరెనా: ఫ్యాక్టరీలోని ట్యాంక్ నుంచి వెలువడిన విష వాయువు పీల్చిన ముగ్గురు సోదరులు సహా మొత్తం అయిదుగురు ప్రాణాలు కోల్పోయారు. మధ్యప్రదేశ్‌లోని మొరెనా జిల్లాలో బుధవారం ఈ విషాదం చోటుచేసుకుంది. ధనేలలో ఉన్న సాక్షి ఫుడ్ ప్రొడక్ట్స్ ఫ్యాక్టరీలోని ట్యాంకు నుంచి ఉదయం 11 గంటల సమయంలో విష వాయువు లీకేజీ మొదలయింది. ట్యాంకు లీకేజీని పరిశీలిస్తుండగా మొదట ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. ఆ తర్వాత మరో ముగ్గురు అస్వస్థత పాలయ్యారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆ అయిదుగురూ చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు. మృతులంతా అక్కడికి సమీపంలోని టిక్టోలి గ్రామస్తులని చెప్పారు. ఘటన అనంతరం ఫ్యాక్టరీ నుంచి కార్మికులందరినీ ఇళ్లకు పంపించివేశారు.

# అంత ఈజీ కాదు..!

- 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే వర్సెస్ ఇండియా
- 2014, 2019లో విపక్షాల అనైక్యతతో లాభపడిన ఎన్డీయే
- ఈసారి బీజేపీని ఓడించడమే లక్ష్యంగా చేతులు కలిపిన విపక్షాలు
- కాంగ్రెస్ సొంతంగా ఓట్ల శాతాన్ని పెంచుకుంటే ఎన్డీయేకు కష్టాలే





**ఎస్.రాజమహేంద్రారెడ్డి**

వచ్చే ఏడాది నుంచి దేశాన్ని ఓ ఐదేళ్లపాటు ఎవరు పరిపాలించబోతున్నారు? ఇప్పటికిప్పుడైతే 'ఎన్డీయేనే.. ఇంకెవరు?' అనే సమాధానమే వస్తుంది. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే లేదా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ వరుసగా మూడోదఫా అధికార పీఠాన్ని దక్కించుకోవడం ఖాయమనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. ప్రతిపక్షాలన్నీ ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో జరిగిన 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే ఆడుతూ పాడుతూ అందలం ఎక్కింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇదే పునరావృతం అవుతుందా? అంటే అంత నమ్మకంగా చెప్పడానికి లేదు. బీజేపీని వ్యతిరేకించే ప్రతిపక్ష పార్టీలన్నీ కాంగ్రెస్ సారథ్యంలో 'ఇండియా' కూటమిగా జతకట్టడంతో రసవత్తరమైన పోరుకు తెరలేచింది. గట్టి పోటీనిచ్చి ఎన్డీయేకు, ముఖ్యంగా బీజేపీకి చుక్కలు చూపించాలని 'ఇండియా' కూటమిలోని పార్టీలన్నీ ఉవ్విళ్లూరుతున్నాయి. మొత్తం మీద ఎన్డీయేకు ఈసారి సునాయాసంగా నెగ్గడం సులభం కాకపోవచ్చు!

**2014 నుంచి మోదీ యుగం ఆరంభం**

ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ముంబైలో గురువారం నుంచి సమావేశమై తమ కార్యాచరణ ఖరారు చేసుకోనున్నాయి. రెండు రోజులపాటు జరిగే ఈ కీలక సమావేశంలో ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరనేది చూచాయగా తెలిసే అవకాశం ఉంది. భేషజాలకు పోకుండా కలిసికట్టుగా పోరాడితే తమ అవకాశాలు ఎలా ఉంటాయో కూడా కూటమిలోని పార్టీలన్నీ బేరీజు వేసుకోనున్నాయి. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో(2014, 2019) కూటమిలోని భాగస్వామ్య పార్టీలకు వచ్చిన మొత్తం ఓట్ల శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఎన్డీయే కూటమికి వచ్చిన ఓట్ల శాతానికి కొంచెం దగ్గర్లోనే ఉన్నట్టు కనిపిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే(38 పార్టీల కూటమి)కి 45 శాతం ఓట్లు వస్తే, ఇండియా కూటమి(26 పార్టీలు)కి 38 శాతం ఓట్లు లభించాయి. రెండు కూటముల మధ్య వ్యత్యాసం 7 శాతంగా కనిపిస్తోంది. రెండు కూటముల్లోని పార్టీలకు గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ నిర్ధారణకు రావొచ్చు. ప్రతిపక్షాలు కూటమిగా ఏర్పడి వచ్చే ఎన్నికల్లో పోటీ పడతాయి కాబట్టి ఓట్ల శాతంలో గణనీయమైన పెరుగుదల ఉంటుందనేది పరిశీలకుల అంచనా. ఎన్డీయే 2019 ఎన్నికల్లో 45 శాతం ఓట్లతో 341 సీట్లు గెల్చుకుంది. అంతకుముందు 2014లో ఎన్డీయే 39 శాతం ఓట్లతో 353 సీట్లు సాధించింది. 2014లో ఓట్ల శాతం తక్కువైనా ఎక్కువ సీట్లు గెల్చుకోవడం గమనార్హం. 1984 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఒక కూటమి ఇన్ని సీట్లు సాధించడం కూడా ఇదే మొదటిసారి. సరిగ్గా ఇక్కడే మోదీ యుగం ఆరంభమైంది. మోదీ యుగం ఆరంభం కాకముందు 2009లో ఎన్డీయే 27 శాతం ఓట్లతో కేవలం 148 సీట్లు గెల్చుకోగలిగింది. ప్రస్తుతం ఇండియా కూటమిగా ఏర్పడ్డ పార్టీలకు 2009 ఎన్నికలు ఒక రకంగా స్వర్ణయుగమని చెప్పొచ్చు. ఈ పార్టీలకు 2009లో 40 శాతం ఓట్లు రాగా, 347 సీట్లు దక్కాయి. అయితే, 2014 ఎన్నికల్లో ఈ కూటమి పార్టీల ఓట్ల శాతం 42 శాతానికి పెరిగినా 161 సీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2019 ఎన్నికలు వచ్చేసరికి ఇండియా కూటమి ఓట్ల శాతం(38 శాతం), సీట్ల సంఖ్య(158) గణనీయంగా పడిపోయాయి.

గత ఎన్నికల్లో రెండు కూటముల మధ్య ఓట్ల వ్యత్యాసాన్ని పరిగణనలోకి తీసుకుంటే పోటాపోటీగానే కనిపిస్తున్నప్పటికీ, గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో(2014, 2019) బీజేపీ ఆధిక్యం ప్రస్ఫుటంగా వెల్లడవుతుంది. ఎన్డీయేలోని మిగతా భాగస్వామ్య పక్షాలపై బీజేపీ లేదా నరేంద్ర మోదీ ఆధిపత్యాన్ని రుజువు చేస్తుంది. గత ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 37 శాతం ఓట్లు సాధించింది. ఇదే ఎన్నికల్లో ఇండియా కూటమి సాధించిన ఓట్ల శాతాన్ని బీజేపీ ఒక్కటే సాధించడం విశేషం.

**కాంగ్రెస్ నష్టం బీజేపీకి లాభం**

రెండు కూటముల్లో ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌ల రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. రానురాను కాంగ్రెస్ పరిస్థితి దిగజారుతుండగా, బీజేపీ ఆ మేరకు పుంజుకుంటోంది. ముక్కుసూటిగా చెప్పాలంటే కాంగ్రెస్ నష్టం బీజేపీకి లాభంగా మారుతోంది. గణాంకాలు పరిశీలిస్తే 1991 లోక్‌సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ సొంతంగా ఏనాడూ 30 శాతం ఓట్ల మార్కును అందుకోలేకపోయింది. బీజేపీకి 1991 ఎన్నికల్లో 20 శాతం ఓట్లు రావడం గమనార్హం. 1991, 2019 ఎన్నికల ఫలితాలను చూస్తే బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఓ సారూప్యత ఉంది. 1991లో కాంగ్రెస్‌కు 36 శాతం ఓట్లు, బీజేపీకి 20 శాతం ఓట్లు వచ్చాయి. 2019లో ఇది తిరగబడింది. 2019లో కాంగ్రెస్‌కు 20 శాతం, బీజేపీకి 37 శాతం ఓట్లు వచ్చాయి. ఇక్కడ ఆసక్తికరమైన అంశం ఏమిటంటే కాంగ్రెస్ కోల్పోయిన ఓట్లు బీజేపీ ఖాతాలో చేరడం. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లు 189 స్థానాల్లో ముఖాముఖి పోటీపడ్డాయి. ఇందులో బీజేపీ ఏకంగా 166 సీట్లు గెల్చుకుంది. అంటే నేరుగా కాంగ్రెస్‌తో తలపడ్డ స్థానాల్లో బీజేపీ 88 శాతం సీట్లు గెల్చుకుందన్నమాట. అయితే, కాంగ్రెసేతర పార్టీలతో నేరుగా తలపడ్డ స్థానాల్లో బీజేపీ 47 శాతం సీట్లు మాత్రమే గెల్చుకోగలిగింది. ఐదేళ్ల తర్వాత 2019లో బీజేపీ కాంగ్రెస్‌పైనా, కాంగ్రెసేతర పార్టీలపైనా తన గెలుపు శాతాన్ని పెంచుకుంది. బీజేపీతో నేరుగా తలపడిన ప్రతిసారీ కాంగ్రెస్ చతికిలపడుతోందని ఈ గణాంకాలు చెబుతున్నాయి. ఇండియా కూటమిలోని ఇతర పార్టీల మాదిరి కాంగ్రెస్ ఉనికి దేశవ్యాప్తంగా ఉంది. అయినప్పటికీ గత ఎన్నికల్లో కాంగ్రెస్ 20 శాతం ఓట్లతో 52 సీట్లు మాత్రమే గెల్చుకుంది. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమిని విజయపథాన నడిపించాలంటే కాంగ్రెస్ సొంతంగా తన ఓట్ల శాతాన్ని భారీగా పెంచుకోవాలి. అదే గనుక జరిగితే బీజేపీతో నేరుగా తలపడి దాదాపు 200 స్థానాల్లో తన ప్రభావాన్ని చూపించగలుగుతుంది. ఇది బీజేపీకి తీవ్ర నష్టం కలిగించవచ్చు.

**కొసమెరుపు**

ప్రస్తుతం ఎన్డీయే పరిస్థితి బ్రహ్మాండంగా ఎదురులేని విధంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ఏమాత్రం పుంజుకున్నా, కూటమిలోని ప్రాంతీయ పార్టీలు తమ తమ రాష్ట్రాల్లో పట్టు బిగించినా స్వల్ప ఓట్ల శాతం తేడా కూడా బీజేపీని నిలువరించే అవకాశం ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆకర్షణ శక్తి ఎన్డీయేకు బలమైతే, ఐకమత్యంతో పోరాడడమే ఇండియా కూటమికి లాభిస్తుంది. గెలుపోటములు దైవాధీనం కాదు.. ఓటరాధీనం!

# నేటి నుంచే... 'ఇండియా' మూడో భేటీ

## ముంబైలో రెండు రోజులు కీలక సమావేశం

- సమన్వయ కమిటీ, లోగో వెల్లడి!
- కనీస ఉమ్మడి కార్యక్రమం రూపకల్పనకు కమిటీలు
- కూటమిలోకి మరిన్ని పార్టీలు!
- సమన్వయకర్త, చైర్‌పర్సన్ ఎంపికపైనా చర్చ

ముంబై: జాతీయ స్థాయిలో అధికార బీజేపీకి ప్రత్యామ్నాయంగా పురుడు పోసుకున్న విపక్ష 'ఇండియా' కూటమి రెండు రోజుల కీలక సమావేశం మహారాష్ట్ర రాజధాని ముంబైలో గురువారం ప్రారంభం కానుంది. గ్రాండ్ హయత్ హోటల్‌లో జరిగే ఈ సమావేశానికి కాంగ్రెస్‌తో పాటు 27 పార్టీలకు పైగా హాజరు కానున్నట్టు చెబుతున్నారు. కూటమి లోగోను, సమన్వయ కమిటీని ప్రకటించనున్నారు. కూటమి పక్షాలు అంతర్గత విభేదాలను పరిష్కరించుకోవడంతోపాటు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమిని ఓడించడమే లక్ష్యంగా ఉమ్మడి ప్రచార వ్యూహానికి తుది రూపు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే కనీస ఉమ్మడి కార్యక్రమం ముసాయిదా తయారీకి కొన్ని కమిటీలను ప్రకటించే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా చేపట్టాల్సిన ఉమ్మడి కార్యక్రమాలు, సీట్ల పంపకం కోసం కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందించనున్నారు. భాగస్వామ్యపక్షాల మధ్య సమన్వయం కోసం దేశ రాజధాని ఢిల్లీలో ఒక సెక్రటేరియట్‌ను ఏర్పాటు చేసుకోనున్నారు. దీనిపై ముంబై భేటీలో ప్రకటన చేసే అవకాశం ఉంది. కూటమి సమన్వయకర్త, లేదా చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవడం గురించి కూడా చర్చ జరగనుంది. తిరోగమన విధానాలు అమలు చేస్తున్న అధికార ఎన్డీయేకు ప్రగతిశీల ప్రత్యామ్నాయాన్ని తెరపైకి తీసుకొస్తూ స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ముంబై భేటీలో ఖరారు చేయనున్నట్లు ఆర్జేడీ నేత మనోజ్ ఝా చెప్పారు.

**'బీజేపీ వెళ్లిపో' నినాదం**

ఇండియా కూటమిలో ప్రస్తుతం 26 పార్టీలు భాగస్వామిగా ఉన్నాయి. ముంబై భేటీ సందర్భంగా మరిన్ని ప్రాంతీయ పార్టీలు వచ్చి చేరనున్నట్లు కూటమి నాయకులు చెబుతున్నారు. ఇండియా తొలి రెండు సమావేశాలు పట్నా, బెంగళూరుల్లో జరిగిన విషయం తెలిసిందే. ముంబైలో గురువారం నుంచి జరుగనున్న మూడో భేటీకి హాజరయ్యేందుకు ఇప్పటికే వివిధ పార్టీల నాయకులు నగరానికి చేరుకున్నారు. ఈ భేటీ వేదిక నుంచి 'బీజేపీ చలేజావ్' (బీజేపీ వెళ్లిపో) అనే నినాదం ఇవ్వబోతున్నట్లు మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే చెప్పారు. ప్రధానమంత్రికి పదవికి అర్హులైన నాయకులు తమ కూటమిలో చాలామంది ఉన్నారని తెలిపారు. వారిలో శక్తి సామర్థ్యాలకు కొదవ లేదని అన్నారు. ఇండియా పక్షాల నడుమ 'కెమిస్ట్రీ' మెరుగుపడుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మిలింద్ దేవ్‌రా వ్యాఖ్యానించారు. తమ కూటమిలో సీట్ల పంపకం రాష్ట్రాల స్థాయిలోనే జరుగుతుందని వివరించారు.



**కన్వీనర్‌గా నితీశ్!**

ఇండియా కూటమికి ఎవరు సారథ్యం వహిస్తారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇండియా కన్వీనర్‌గా బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నాయకుడు నితీశ్ కుమార్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కూటమి ఏర్పాటు వెనుక తనకు వ్యక్తిగత అజెండా గానీ, ఆకాంక్షలు గానీ లేవని, కన్వీనర్ పోస్టుపై తనకు ఆసక్తి లేదని ఆయన ప్రకటించినప్పటికీ ఊహాగానాలు ఆగడం లేదు. ప్రధాని నరేంద్ర మోదీని ఢీకొట్టే నేత నితీశ్‌కుమార్ మాత్రమేనని అని చాలామంది అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీ పేరును మరికొందరు ప్రతిపాదిస్తున్నారు. ఆ పదవి పట్ల ఆమె విముఖత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. కన్వీనర్‌గా ఎవరుండాలో గురువారమే ఒక నిర్ణయానికి వచ్చే అవకాశముందని ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్ తెలిపారు.

### ఏ కూటమిలోనూ మేం చేరం

లక్నో: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)తో పొత్తు పెట్టుకోవాలని అన్ని పార్టీలు కోరుకుంటున్నాయని ఆ పార్టీ అధినేత్రి మాయావతి చెప్పారు. అయితే, అధికార బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ లేదా ప్రతిపక్ష పార్టీల ఇండియా కూటమిలో గానీ బీఎస్పీ చేరే ప్రశ్నే లేదని ఆమె స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతుందన్నారు. ఇండియా కూటమి నేతలు ముంబైలో సమావేశమవుతున్న వేళ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మాయావతి బుధవారం ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. అధికార ఎన్డీఏ, ప్రతిపక్ష ఇండియా కూటముల్లోని చాలా వరకు పార్టీలు పేదల వ్యతిరేక, కుల, మత పక్షపాత, ధనవంతులకు అనుకూల, పెట్టుబడిదారీ విధానాలను అనుసరించేవేనని ఆమె విమర్శించారు.

### 'ఇండియా' ప్రధానమంత్రి అభ్యర్థిగా కేజ్రీవాల్: ఆప్

న్యూఢిల్లీ: ప్రతిపక్ష 'ఇండియా' కూటమి తరఫున ప్రధానమంత్రి అభ్యర్థిగా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎంపిక చేయాలని ఆ పార్టీ నేతలు కోరారు. ఢిల్లీలో కేజ్రీవాల్ ఆధ్వర్యంలోని అమలు చేస్తున్న అభివృద్ధి మోడల్ మొత్తం దేశానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఆప్ ముఖ్య జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ బుధవారం మీడియాతో మాట్లాడారు. విపక్ష కూటమి నుంచి ప్రధాని అభ్యర్థిగా కేజ్రీవాల్‌ను ఎంపిక చేయాలని అన్నారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కేజ్రీవాల్ తరచుగా లేవనెత్తుతున్నారని, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ఆయన సీఎంగా ఉన్న ఢిల్లీలో అతి తక్కువ ద్రవ్యోల్బణం నమోదైందని గుర్తుచేశారు. ఢిల్లీలో కేజ్రీవాల్ నిర్దేశించిన అభివృద్ధి మోడల్‌తో ప్రజలు ఎంతగానో లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి అభ్యర్థి ఎంపికపై ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి, ఆప్ ఢిల్లీ కన్వీనర్ గోపాల్ రాయ్ స్పందించారు. కేజ్రీవాల్ ప్రధాని కావాలని తమ పార్టీలోని ప్రతి సభ్యుడూ కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. అయితే, ఈ అంశంపై ఇండియా కూటమి నేతలదే తుది నిర్ణయమని పేర్కొన్నారు. కూటమి నిర్ణయాన్ని తాము శిరసావహిస్తామని వెల్లడించారు. ఇండియా కూటమిలో కేజ్రీవాల్ కూడా సభ్యుడేనని, ప్రధానమంత్రి కావడానికి ఆయనకు అర్హతలు ఉన్నాయని చెప్పారు.



రక్షాబంధన్‌ను పురస్కరించుకుని బుధవారం తన నివాసానికి వచ్చిన పాఠశాల చిన్నారులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ప్రధానికి చిన్నారులు రాఖీలు కట్టారు. పాటలు పాడారు. చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1 వంటి వాటిపై ప్రధానితో మాట్లాడేందుకు వారు ఆసక్తి కనబరిచారు.

### వచ్చే ఎన్నికల్లో 'ఇండియా' బీజేపీని ఓడిస్తుంది: అఖిలేశ్

లక్నో: 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల కూటమి 'ఇండియా' అధికార బీజేపీని ఓడిస్తుందని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) చీఫ్ అఖిలేశ్ యాదవ్ చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు తమ పార్టీతోపాటు మిత్ర పక్షాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 'దేశం మార్పును కోరుకుంటోంది. 2024లో బీజేపీని ఇండియా ఓడించనుంది. సమాజ్‌వాదీ పార్టీ, మిత్రపక్షాలు ఎన్నికలు ముందొచ్చినా, తర్వాత వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాయి' అని మీడియాతో అన్నారు.

### ఎంపీ అధిర్ సస్పెన్షన్ రద్దు

**లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్**

న్యూఢిల్లీ: లోక్‌సభ నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి సస్పెన్షన్ రద్దయింది. ఆయన సస్పెన్షన్‌ను రద్దు చేయాలని సూచిస్తూ లోక్‌సభ సభా హక్కుల సంఘం బుధవారం ఏకగ్రీవంగా చేసిన తీర్మానం అందిన వెంటనే లోక్‌సభ సెక్రటేరియట్ ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆగస్టు 8వ తేదీ నుంచి సభా హక్కుల సంఘం నివేదిక పంపిన ఆగస్టు 30వ తేదీ వరకు అధిర్ సస్పెన్షన్ వర్తిస్తుందని వివరించింది. బీజేపీ ఎంపీ సునీల్‌కుమార్ సింగ్ నేతృత్వంలోని సభా హక్కుల సంఘం ఎదుట బుధవారం అధిర్ రంజన్ చౌదరి హాజరయ్యారు. లోక్‌సభలో తాను చేసిన వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తంచేశారు. ఇతరుల మనోభావాలను గాయపర్చాలన్న ఉద్దేశం తనకు ఎంతమాత్రం లేదని చెప్పారు. ఆయన వివరణ పట్ల సభా హక్కుల సంఘం సంతృప్తి చెందింది. అధిర్ సస్పెన్షన్ రద్దు కోరుతూ తమ తీర్మానాన్ని స్పీకర్‌కు పంపించింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రధాని మోదీపై చేసిన వ్యాఖ్యలకు అధిర్ సస్పెండైన విషయం తెలిసిందే.

### బైడెన్‌కు మతి తప్పింది: ట్రంప్

**అమెరికాను మూడో ప్రపంచ యుద్ధంలోకి లాగుతున్నారని విమర్శలు**



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు మతి భ్రమించిందని మాజీ అధ్యక్షుడు ట్రంప్ ఆరోపించారు. బైడెన్ తన అసమర్థ విధానాలతో దేశాన్ని మూడో ప్రపంచ యుద్ధంలోకి లాగుతున్నారని మండిపడ్డారు. బైడెన్‌ను ఆయన మందమతి, పిచ్చివాడు, అసమర్థుడంటూ తిట్టిపోశారు. సరిహద్దుల విషయంలో బైడెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. న్యాయశాఖ (డీవోజే), ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ)తోపాటు ఆయుధాలను సమకూర్చుకునే విషయంలోనూ బైడెన్ చర్యలు దేశ భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారాయి. మూడో ప్రపంచయుద్ధం వస్తే అందుకు ఆయన తప్ప మారే కారణమూ ఉండదు' అని పేర్కొన్నారు. ఈమేరకు ట్రంప్ ఒక వీడియో విడుదల చేశారు.

### కర్ణాటక మోడల్...ఇక దేశమంతటా!

**మైసూరు సభలో రాహుల్**



మైసూరు: ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల వేళ కర్ణాటక ప్రజలకిచ్చిన కీలక ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. ఇప్పుడిక దేశమంతటా కర్ణాటక మోడల్‌నే అమలు చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని 1.1 కోట్ల మహిళలకు నెలకు రూ.2,000 చొప్పున ఆర్థిక సాయం అందించే ఎన్నికల వాగ్దానమైన గృహ లక్ష్మి పథకం అమలుకు సిద్ధరామయ్య సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేతుల మీదుగా బుధవారం శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా మైసూరులో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రాహుల్ మాట్లాడారు. తామెప్పుడూ తప్పుడు వాగ్దానాలు చేయబోమని చెప్పారు. కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వం చేసిన, చేస్తున్న మంచి పనులను దేశమంతటా విస్తరించి చూపిస్తామన్నారు. ప్రభుత్వాలు పేదల కోసమే పాటుపడాలన్నది కాంగ్రెస్ విధానమని చెప్పారు. 'వేర్లు గట్టిగా ఉంటేనే చెట్టు దృఢంగా ఉంటుంది. కన్నడ మహిళలు వేర్ల వంటివారు. ఢిల్లీలో ఉన్న బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం మహిళలను నిర్లక్ష్యం చేస్తూ అపర కుబేరులను మాత్రమే నెత్తిన పెట్టుకుంటోంది' అని అన్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు సభలో పాల్గొన్నారు. గత మే లో హోరాహోరీగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీని ఓడించి కాంగ్రెస్ అధికారంలోకి రావడం తెలిసిందే. అందుకు దోహద పడ్డ ఐదు ప్రధాన వాగ్దానాల్లో గృహ లక్ష్మి పథకం ఒకటి.

**చైనా మ్యాప్ తీవ్రమైన అంశం**

న్యూఢిల్లీ: అరుణాచల్ ప్రదేశ్‌ను తమ అంతర్భాగంగా చూపుతూ చైనా తయారుచేసిన మ్యాప్ చాలా తీవ్రమైన అంశమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ తక్షణం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. 'నేను ఇప్పుడే లద్దాఖ్ నుంచి తిరిగి వచ్చాను. అక్కడ అంగుళం నేల కూడా అన్యాక్రాంతం కాలేదన్న మోదీ మాటలు పచ్చి అబద్ధాలు. చైనా మన భూమిని ఆక్రమించిందని లద్దాఖ్‌లో ప్రతి ఒక్కరికీ తెలుసు' అన్నారు.

# సూర్యుడి గుట్టు విప్పే ఆదిత్య-ఎల్1

## 2న 11.50 గంటలకు పీఎస్‌ఎల్‌వీ సీ57 ద్వారా ప్రయోగం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సౌరగోళంలో సౌరగాలులు, జ్వాలలు, రేణువుల తీరుతెన్నులపై పరిశోధనలే లక్ష్యంగా ఆదిత్య-ఎల్1 ఉపగ్రహ ప్రయోగాన్ని సెప్టెంబర్ 2న ప్రయోగించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. పీఎస్‌ఎల్‌వీ సీ57 రాకెట్ ద్వారా ఉదయం 11.50 గంటలకు ఈ ప్రయోగం జరగనుంది. షార్ కేంద్రంలోని రెండో ప్రయోగవేదికకు చెందిన వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్ అనుసంధానం పనులు పూర్తి చేసి ప్రయోగవేదికపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆదిత్య-ఎల్1 ప్రయోగం ద్వారా సూర్యునిపై దాగి వున్న రహస్యాలను శోధించనున్నారు. సౌర తుపాన్ సమయంలో వెలువడే రేణువుల వల్ల భూమిపై సమాచార వ్యవస్థకు అవరోధాలు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తల అంచనా.

**సౌర వాతావరణం ఎందుకు వేడిగా ఉంటుంది?**

- ఆదిత్య-ఎల్1లోని ఏడు పేలోడ్లలో 170 కేజీల బరువుండే విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్ (వెల్సి) అనే పేలోడ్‌తో సౌర వాతావరణం ఎందుకు వేడిగా ఉంటుంది? సూర్యుడిలో మార్పులు, అంతరిక్ష వాతావరణం, భూ వాతావరణాన్ని ఎలా ప్రభావితం చేస్తుందనే విషయాలపై ఇది పరిశోధనలు చేస్తుంది.
- సౌర అతినీలలోహిత ఇమేజింగ్ టెలిస్కోప్ (సూట్) అనే పేలోడ్ 35 కేజీల బరువు వుంటుంది. 200-400 ఎన్ఎం తరంగదైర్ఘ్యం పరిధి మధ్య సూర్యుడిని గమనిస్తుంది. ఇందులో 11 ఫిల్టర్లను ఉపయోగించడం ద్వారా సౌర వాతావరణంలో వివిధ పొరల పూర్తి డిస్క్ చిత్రాలను అందిస్తుంది.
- ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పెరిమెంట్ (యాస్‌పెక్స్) అనే పేలోడ్ సౌర గాలి వైవిధ్యం, లక్షణాలపై సమాచారాన్ని గ్రహించడంతోపాటు దాని వర్ణ పటం లక్షణాలను అధ్యయనం చేస్తుంది.
- ఆదిత్య ప్లాస్మా ఎనలైజర్ ప్యాకేజీ (పాపా) సౌరగాలి కూర్పు, దాని శక్తి పంపిణీని అర్థం చేసుకోవడానికి పరిశోధనలు చేస్తుంది.
- సోలార్ ఎనర్జీ ఎక్స్-రే స్పెక్ట్రోమీటరు (సోలెక్స్) సోలార్ కరోనా సమస్యాత్మకమైన కరోనల్ హీటింగ్ మెకానిజంను అధ్యయనం చేయడానికి, ఎక్స్-రే మంటలను పర్యవేక్షించడానికి పరిశోధనలు చేస్తుంది.
- హై ఎనర్జీ ఎల్1 ఆర్బిటింగ్ ఎక్స్-రే స్పెక్ట్రోమీటర్ (హెలియోస్) సౌర కరోనాలో డైనమిక్ ఈవెంట్‌లను గమనించడానికి, విస్ఫోటనం సంఘటనల సమయంలో సౌరశక్తి కణాలను వేగవంతం చేయడానికి ఉపయోగించే శక్తిని అంచనా వేస్తుంది.
- మ్యాగ్ అనే ఈ పేలోడ్‌ను ఉపగ్రహానికి ఆన్‌బోర్డు ఉపకరణంగా అమర్చి పంపుతున్నారు. ఉపగ్రహానికి సంబంధించి సమాచారాన్ని అందించనుంది.

**ఆదిత్య-ఎల్1లో పేలోడ్స్ ఇవే..**

సుమారుగా 1,475 కేజీలు బరువున్న ఆదిత్య-ఎల్1 ఉపగ్రహంలో ఏడు పేలోడ్స్ బరువు 244 కేజీలు. మిగతా 1,231 కేజీలు ద్రవ ఇంధనంతో నింపుతారు. ఉపగ్రహాన్ని భూ మధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తరువాత ఈ ఉపగ్రహాన్ని భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని లాంగ్రేజియన్ బిందువు-1 (ఎల్-1)లోకి చేరవేయడానికి 177 రోజులు పడుతుంది. ఆదిత్య ఎల్-1 ఉపగ్రహంలో సూర్యుడిపై అధ్యయనం చేయడానికి యాస్‌పెక్స్, సూట్, వెల్సి, హెలియోస్, పాపా, సోలెక్స్, మాగ్ అనే ఏడు ఉపకరణాలు (పేలోడ్స్) ఉంటాయి.

### ప్రజాసేవలో నిమగ్నమవుదాం

**సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక కార్యక్రమాలు**



సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని 'సేవా పఖ్వారా' పేరుతో దేశవ్యాప్తంగా 15 రోజులపాటు ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ కేంద్ర నాయకత్వం నిర్ణయించింది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ దాకా ప్రజాసేవా కార్యాక్రమాలు చేపట్టాలని అన్ని రాష్ట్రాల పార్టీల శాఖలను ఆదేశించింది. ఈ మేరకు బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శులతో నిర్వహించిన భేటీలో అధ్యక్షుడు జేపీ నడ్డా నిర్ణయం తీసుకున్నారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. సేవా కార్యక్రమాల్లో భాగంగా పార్టీ ఎంపీలు, ప్రజా ప్రతినిధులు, నేతలు రక్తదాన శిబిరాలు, స్వచ్ఛతా డ్రైవ్‌లు నిర్వహించాలని జేపీ నడ్డా బీజేపీ శ్రేణులను ఆదేశించారు. ఆయుష్మాన్ కార్డులు లేని వారికి వాటిని అందించడంలో సహకరించాలని చెప్పారు. ముఖ్యంగా ఈ ఏడాది ఎన్నికలు జరుగున్న తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో మోదీ జన్మదిన వేడుకలకు నిర్వహించాలని చెప్పారు. ప్రధానిగా తొమ్మిదేళ్ల వ్యవధిలో సాధించిన విజయాలు, ప్రజాహిత కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు

### వచ్చే 13 వరకు జైల్లోనే ఇమ్రాన్



ఇస్లామాబాద్: అధికార రహస్య పత్రాల లీకేజీ కేసులో పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌కు సెప్టెంబర్ 13వ తేదీ వరకు ప్రత్యేక కోర్టు రిమాండ్ విధించింది. తోషఖానా కేసులో ఇమ్రాన్‌కు దిగువ కోర్టు విధించిన మూడేళ్ల జైలుశిక్షను కొట్టివేస్తూ మంగళవారం ఇస్లామాబాద్ హైకోర్టు తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అయితే, రహస్య పత్రాల లీకేజీ కేసు విచారణలో ఉన్నందున ఆయనకు ఒక రోజు రిమాండ్ విధిస్తూ ప్రత్యేక కోర్టు జడ్జి ఆదేశాలిచ్చారు. భద్రతా కారణాల రీత్యా ఇమ్రాన్ విచారణను పంజాబ్ ప్రావిన్స్‌లోని అటోక్ జైలులోనే చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు జడ్జి అబువల్ హస్నత్ జుల్‌కర్‌నయిన్ బుధవారం జైలుకు చేరుకున్నారు. జైలు లోపలే కేసును విచారించి, ఇమ్రాన్ రిమాండ్‌ను వచ్చే 13 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారని జియో న్యూస్ తెలిపింది. దీంతో, ఆగస్టు 5 నుంచి ఉంటున్న అటోక్ జైలు నుంచి వెంటనే విడుదల కావాలన్న ఇమ్రాన్ ప్రయత్నాలపై నీళ్లు చల్లినట్లయిందని జియో న్యూస్ పేర్కొంది. విచారణ సమయంలో ఇమ్రాన్ తరఫు లాయర్ల బృందంలోని ముగ్గురికి మాత్రమే లోపలికి వెళ్లేందుకు అవకాశం కల్పించారని తెలిపింది. గత ఏడాది మార్చిలో పార్లమెంట్‌లో ఆయన ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కొద్ది రోజులు ముందు జరిగిన ర్యాలీలో ఇమ్రాన్ ఖాన్.. తనను గద్దె దించేందుకు విదేశీ శక్తి కుట్ర పన్నిందనేందుకు ఇదే సాక్ష్యమంటూ ఓ డాక్యుమెంట్‌ను తీసి బహిరంగంగా చూపించారు. అమెరికా విదేశాంగశాఖ అధికారులు అక్కడి పాక్ రాయబారితో భేటీ అయ్యారని, దానికి సంబంధించిన వివరాలున్న డాక్యుమెంట్లను చట్ట విరుద్ధంగా పొందిన ఇమ్రాన్ వాటిని బహిరంగ పరిచారని పాక్ అధికారులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఆయనపై అధికార రహస్యాల చట్టం కింద కేసు నమోదు చేశారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం : 31 : ఆగస్టు : 2023



## రక్షా బంధనం

అన్నా చెల్లి అనుబంధానికి చిహ్నమైన రక్షా బంధన్‌ను బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. బెంగళూరు విల్సన్ గార్డెన్‌లో అన్నలకు రాఖీ కడుతున్న బాలికలు

## న్యూస్‌రీల్

### కుమారస్వామికి తీవ్రజ్వరం

- ఆస్పత్రిలో చేరిన మాజీ సీఎం

శివాజీనగర: జేడీఎస్ నేత, మాజీ ముఖ్యమంత్రి హెచ్.డీ.కుమారస్వామి అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున అపోలో ఆసుపత్రిలో చేరారు. కుమారస్వామికి తీవ్ర జ్వరం వచ్చిన నేపథ్యంలో ఆయన బన్నేరుఘట్ట రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. దీంతో కోలారు జిల్లా శ్రీనివాసపురలో జరగాల్సిన పార్టీ సమావేశం రద్దయింది.

**నిలకడగా ఆరోగ్యం: బులెటిన్**

హెచ్‌డీ కుమారస్వామి ఆరోగ్యం స్థిరంగా ఉందని ఆసుపత్రి హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసింది. తెల్లవారుజామున 3.40 గంటల సమయంలో కుమారస్వామి తీవ్ర జ్వరంతో ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం చికిత్స జరుగుతోంది, ఆయన త్వరలోనే కోలుకోవాలని అందరూ ప్రార్థించాలని బులెటిన్‌లో తెలిపారు. కుమారస్వామి ఇటీవలే కంబోడియా తదితర దేశాల్లో విహార యాత్రలు ముగించుకుని వచ్చారు.

### ప్రధాని కూడా గ్యారంటీల దారిలో: డీకే

శివాజీనగర: గ్యారంటీల వంటి పథకాల వల్ల దేశం అధ్వానస్థితికి చేరుకొంటుందని చెప్పిన ప్రధాని నరేంద్ర మోదీ దశలవారీగా తమ తరహాలోనే అనుసరిస్తున్నారని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. ప్రధాని వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.200 తగ్గించారు. మధ్యప్రదేశ్ ఎన్నికల సమయంలో రూ.1500 ఇస్తామని భరోసా ఇచ్చారు, ఇవన్నీ గ్యారంటీలే కదా అన్నారు. చివరకు కేంద్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి తలొగ్గి కాంగ్రెస్ తరహాలోనే పాలించటం ఆరంభించిందన్నారు. బీజేపీ విడుదల చేసిన చార్జ్‌షీట్లో ఉన్న ఆరోపణల్లో అన్నీ అవాస్తవాలన్నారు. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు డిమాండ్ చేశానని రుజువుచేస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటానని తాను సవాల్ చేశానన్నారు.

### గాయపడిన చీఫ్ ఇంజినీర్ మృతి

సాక్షి బెంగళూరు: బీబీఎంపీ క్వాలిటీ కంట్రోల్ రూమ్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో గాయపడిన క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ కన్నుమూశారు. ఈ నెల 11న బీబీఎంపీ క్వాలిటీ కంట్రోల్ గదిలో భారీ అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే.. ఈ ప్రమాదంలో పలువురు ఇంజినీర్లు, సిబ్బంది మొత్తం 9 మంది గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చీఫ్ ఇంజనీర్ శివకుమార్ (45) తీవ్రంగా గాయపడి జీవన్మరణ పోరాటం చేశారు. కాలిన గాయాల వల్ల అంతర్గత అవయవాలు పూర్తిగా దెబ్బతిన్నాయి, ఉత్తమ రీతిలో వైద్యమందించినా కోలుకోలేకపోయారు. మైసూరు జిల్లా నంజనగూడుకు చెందిన శివకుమార్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

### అటవీ అధికారిణి ఆత్మహత్య



అధికారిణి రశ్మీ (ఫైల్)

యశవంతపుర: కొడగు జిల్లా మడికెరి అటవీశాఖ వసతి గృహంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (డీఆర్‌ఎఫ్‌ఓ) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మండ్యకు చెందిన రశ్మీ (27) రెండేళ్ల నుంచి కొడగులో అటవీశాఖ రీసెర్చ్ విభాగంలో పనిచేస్తోంది. అక్కడే క్వార్టర్స్‌లో నివాసం ఉండేది. ఏం జరిగిందో కానీ బుధవారం తన గదిలో శవమై తేలింది. కారణాలు తెలియటం లేదు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### రాష్ట్రం దివాలా తీయలేదు

- 1.11 కోట్ల మందికి గృహలక్ష్మి: సీఎం

మైసూరు: ఎన్నికలకు ముందు ఇచ్చిన ఐదు గ్యారంటీల్లో నాలుగు అమలు చేశాం, ప్రతిపక్షాలు విమర్శించినట్లు రాష్ట్రం దివాలా తీయలేదని సీఎం సిద్ధరామయ్య అన్నారు. బుధవారం నగరంలోని మహారాజ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన గృహలక్ష్మి యోజన ప్రారంభోత్సవంలో సిద్ధరామయ్య ప్రసంగిస్తూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన 168 హామీల్లో 158 హామీలను అమలు చేసినట్లు చెప్పారు. కర్ణాటకలో 1.24 కోట్ల మంది గృహలక్ష్మి లబ్ధిదారులు ఉన్నారని, వారిలో 1.11 కోట్ల మంది రిజిస్టర్ చేసుకున్నారని, వారందరికీ రూ.2 వేలను బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. శక్తి యోజన ద్వారా ఇప్పటి వరకు 48.5 కోట్ల మంది మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారన్నారు. అన్నభాగ్య యోజన కింద ఉచిత బియ్యానికి బదులు డబ్బులు, గృహజ్యోతి యోజన కింద 1.56 లక్షల కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన ఐదో గ్యారంటీ యువ నిధి నిరుద్యోగ భృతి పథకాన్ని డిసెంబర్ లేదా జనవరిలో ప్రారంభిస్తామని చెప్పారు. ఈ ఐదు హామీ పథకాలకు మొత్తం రూ.56 వేల కోట్లు ఖర్చు అవుతుందన్నారు. అయినా కూడా సంక్షేమ కార్యక్రమాల అమలును ఆపబోమని చెప్పారు.

# డెడ్లీ బ్లాక్‌స్పాట్లు

సిలికాన్ సిటీలో రహదారి భద్రత నేతిబీరకాయలో నెయ్యిలా తయారైందనే విమర్శలున్నాయి. నగరంలోకి వెళ్లి తిరిగి క్షేమంగా ఇంటికి చేరుకోవడానికి నానాపాట్లు పడాల్సిందే. విపరీతమైన వాహన రద్దీ, గుంతల రోడ్లు, అర్థం కాని వన్ వేను దాటుకుని గమ్యం చేరడం పెద్ద సవాలు కిందే లెక్క. ఇక రోడ్డు నిర్మాణంలో లోపాల వల్ల తరచూ యాక్సిడెంట్లు జరిగే బ్లాక్‌స్పాట్లు నగరంలో 59 వరకూ ఉన్నట్లు లెక్కతేల్చారు. వాటిని ఎంత త్వరగా మరమ్మతులు చేస్తే ప్రమాదాలు అంత త్వరగా తగ్గే అవకాశముంది.

- రాజధానిలో 59 గుర్తింపు
- ఇక్కడే అధికంగా యాక్సిడెంట్లు
- ట్రాఫిక్ పోలీసులు సర్వే
- మరమ్మతుల కోసం నివేదిక

బనశంకరి: బెంగళూరులో 59 స్థలాలు రోడ్డు ప్రమాదాలకు కేంద్రాలుగా మారినట్లు నగర ట్రాఫిక్ పోలీసుల అధ్యయనంలో బహిర్గతమైంది. కేంద్ర జాతీయ రహదారులు, రవాణా శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా ట్రాఫిక్ పోలీసులు బ్లాక్‌స్పాట్‌ల సర్వే చేపట్టారు. గత మూడేళ్లలో అధిక ప్రమాదాలు సంభవించిన స్థలాల గురించి సమాచారం సేకరించారు. మైసూరు రోడ్డు బీజీఎస్ ఫ్లై ఓవర్, నైస్ రోడ్డు, కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయ రోడ్డు, రాజ్‌కుమార్ సమాధి రోడ్డు, హెబ్బాళు అండర్ పాస్, ఐటీపీఎల్ మెయిన్ రోడ్డు తో పాటు 59 స్థలాలు వాహనదారులు పాలిట యమలోకానికి దారులుగా మారినట్లు కనబడుతోంది. బ్లాక్ స్పాట్స్‌లో ఏయే లోపాలు సరిదిద్దాలి అనే దానిపట్ల చర్చించారు. ఈ బ్లాక్ స్పాట్స్ గురించి జాబితాను జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, బీబీఎంపీకి నివేదికలను అందజేశారు. రోడ్ల బాగుకు అనేక ప్రభుత్వ శాఖలు ఉమ్మడిగా పరిష్కార చర్యలు చేపట్టాల్సి ఉంటుందని నగర ట్రాఫిక్ విభాగ జాయింట్ పోలీస్ కమిషనర్ ఎంఎన్.అనుచేత్ తెలిపారు.

**యలహంకలో జాగ్రత్త**

బెంగళూరులో సంభవిస్తున్న ప్రమాదాల్లో కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయ రోడ్డుతో కూడిన యలహంక ప్రాంతంలో అధిక భాగం జరుగుతూ అనేకమంది దుర్మరణం చెందుతున్నారు. హైవే రోడ్డులో జాలీ రైడ్, అతివేగంతో వెళ్లడం వల్ల అనేకమంది విద్యార్థులు, యువత దుర్ఘటనల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఏడాది కాలంలోనే ఇక్కడ 30 మందికి పైగా విద్యార్థుల ఉసురు పోయింది. కామాక్షీపాళ్య, కెంగేరి ప్రాంతాలు రెండోస్థానంలో ఉన్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.



రద్దీ పెరిగి ప్రమాదాలూ అధికం. ఆర్‌వీ కాలేజ్ జంక్షన్‌లో ఇటీవల ఢీకొన్న కార్లు

**బెంగళూరులో రోడ్డు ప్రమాదాల గణాంకాలు**

| ఏడాది | ప్రమాదాలు | మృతులు |
|---|---|---|
| 2020 | 3,236 | 647 |
| 2021 | 3211 | 651 |
| 2022 | 3823 | 771 |
| 2023 | 2788 | 500 |



నగరంలో గోతులతో కూడిన రహదారులు. వీటి వల్ల ముప్పు మరింత అధికం

### బాబోయ్ ఆది, మంగళవారం

ఐటీ సిటీలో ఆదివారం, మంగళవారమే ఎక్కువ యాక్సిడెంట్లు సంభవిస్తున్నట్లు సర్వేలో వెల్లడైంది. అది కూడా మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల మధ్య జరుగుతున్నాయి. ఏటా వేలాదిమంది గాయాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. సోమవారం ఇది తక్కువగా ఉంది. ఈ ఏడాదిలో ఏడున్నర నెలల్లో 3 వేల రోడ్డు ప్రమాదాలు జరిగితే, 500 మంది ప్రాణాలు కోల్పోయారు.

### ప్రముఖ బ్లాక్ స్పాట్స్ ఇవే

మైసూరు రోడ్డు బీబీ జంక్షన్, కన్నమంగలపాళ్య రోడ్డు, సాదహళ్లి జంక్షన్, హుణసమారనహళ్లి రోడ్డు, వాయుసేన రోడ్డు, పాలనహళ్లి జంక్షన్, కెంపేగౌడ ఎయిర్‌పోర్టు రోడ్డు, బాణసవాడి రోడ్డు, నాయండహళ్లి జంక్షన్, టిన్ ఫ్యాక్టరీ రోడ్డు, రూపేన అగ్రహార, జక్కూరు పై వంతెన, గారేబావిపాళ్య రోడ్డు, ఎలక్ట్రానిక్ సిటీ ఫేజ్-1లో ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ఉండడం ఉత్తమం.



కెంపేగౌడ విమానాశ్రయానికి వెళ్లే రోడ్డులో అధిక ప్రమాదాలు జరుగుతున్నాయి

### పెరిగిపోతోన్న వాహన రద్దీ

నగరంలో ప్రతి నిత్యం రెండువేల కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తుంటే రద్దీ పెరిగిపోతోంది. బెంగళూరు నగరం నలుదిక్కుల్లో రోజుకు కనీసం రెండు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అశాస్త్రీయమైన రోడ్డు హంప్స్, గుంతలమయంగా మారినరోడ్లు, వాహనదారుల అజాగ్రత్త, అతి వేగం కూడా కారణమౌతున్నాయి. మలుపులు ఇరుకుగా ఉండడం, అవసరం లేకపోయిన చోట్ల స్పీడ్ బ్రేకర్ల వల్ల వాహనాలు ఢీకొంటున్నాయి.

## జనావాసాల మధ్య టపాసుల గోదాము!



ఘటనాస్థలిలో మంత్రి శివానంద పాటిల్



ఘోరానికి కారణమైన గిడ్డంగి ఇదే

- హావేరి విస్ఫోటంలో అంతటా నిర్లక్ష్యం
- నలుగురు మృతుల కుటుంబాలకు పరిహారం

బనశంకరి: హావేరి ఆలదకట్టి గ్రామంలో టపాసుల గోదాములో మంగళవారం చోటుచేసుకున్న పేలుడులో నలుగురు సజీవ దహనం కాగా, సీఎం సిద్దరామయ్య మృతుల కుటుంబాలకు తలా రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. పోలీసులు మంటలను ఆర్పి పరిశీలించగా ద్యామప్ప ఓలేకార (45), రమేశ్‌బార్కి (23), శివలింగ అక్కి(25), జయణ్ణ అనే నలుగురు కూలీల మృతదేహాలు కనిపించాయి. వీరందరూ హవేరి తాలూకా కాటేనహళ్లి గ్రామానికి చెందినవారు. గాయపడిన షఫీ అహ్మద్, శేరుకట్టిమని అనే ఇద్దరిని ఆసుపత్రిలో చేర్చారు. ఇళ్ల మధ్య అనుమతి ఇవ్వడంతో పాటు, అక్రమంగా పెద్ద మొత్తంలో సరుకును నిల్వ చేయడం వల్ల ప్రమాద తీవ్రత పెరిగిందని తేలింది.

**విచారణ జరిపిస్తాం: మంత్రి**

బుధవారం ఘటనా స్థలాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శివానంద పాటిల్ పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ఈ దుర్ఘటనలో గాయపడిన వారి చికిత్స వ్యయం ప్రభుత్వమే భరిస్తుందని, మృతుల కుటుంబాలకు ఇప్పటికే ముఖ్యమంత్రి పరిహారం ప్రకటించారని తెలిపారు. గోదాములో 500 నుంచి 1000 కేజీల టపాసులు నిల్వ చేయొచ్చని, కానీ అంతకంటే పెద్ద మొత్తంలో ఉంచారన్నారు. గోదాములో సరైన సురక్షితా చర్యలు తీసుకోలేదని, జనవసతి ప్రదేశంలో టపాసుల గోదాముకు అధికారులు అనుమతి ఇచ్చారని వాపోయారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడతామని, ఇలాంటివి పునరావృతం కాకుండా కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

## విహారయాత్రకు వెళ్లిన రౌడీ హత్య




- నంజనగూడు వద్ద ఘటన

మైసూరు: రౌడీషీటర్‌ను కిడ్నాప్ చేసి దుండగులు హత్య చేసి మృతదేహాన్ని గోనె సంచిలో వేసి విసిరేశారు. ఈ ఘటన నంజనగూడులో జరిగింది. బెంగళూరుకు చెందిన రౌడీషీటర్ స్మైల్ నవీన్ (27) హతుడు. అతడు విహారం కోసం తన అనుచరులతో కలిసి మైసూరుకు వచ్చాడు. అయితే ఆగస్టు 27న కేఆర్ పోలీసు స్టేషన్ పరిధిలో కిడ్నాప్‌కు గురయ్యాడు. ఆ తర్వాత కిడ్నాపర్లు నవీన్‌ను హత్య చేసి శవాన్ని గోనె సంచిలో కట్టి నంజనగూడు గోళూరు సమీపంలో విసిరేశారు. దుర్వాసన వస్తుండడంతో స్థానిక ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు నంజనగూడు పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా సంచిలో శవం కనిపించింది. విచారణ చేపట్టి నిందితులను గుర్తించి ఆరు మందిని అదుపులోకి తీసుకున్నారు.

**పొలం వివాదం, అన్నా- వదిన హత్య**

పొలం వివాదం నేపథ్యంలో ఒక వ్యక్తి తన అన్న, వదినను హత్య చేశాడు. ఈ దారుణ మైసూరు జిల్లా ఘటన టీ.నరసీపుర తాలూకా నుగ్గనహళ్లి కొప్పలు గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన హనుమంతేగౌడ అనే వ్యక్తి తన అన్న శివలింగేగౌడ (60), వదిన భారతి (55)ని హత్య చేశాడు. హనుమంతేగౌడ 15 గుంటల పొలం విషయంలో తన అన్నతో గొడవ పడ్డాడు. కొడవలితో అన్న, వదినపై దాడి చేసి చంపేశాడు. బన్నూరు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఆ తర్వాత లొంగిపోయాడు. నిందితున్ని అరెస్టు చేసి పోలీసులు కేసు నమోదు చేశారు.

### శ్రీకంఠేశ్వరునికి కనకవర్షం

మైసూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన జిల్లాలోని నంజనగూడులోని శ్రీ కంఠేశ్వర దేవాలయం 34 హుండీల్లో మొత్తం రూ. 1.68 కోట్ల మేర నగదు, కానుకలు వచ్చాయి. మూడు నెలలకు గాను బుధవారం హుండీల లెక్కింపు నిర్వహించగా సుమారు 88 గ్రాముల బంగారు ఆభరణాలు, 4.45 కేజీల వెండి సామగ్రి లభ్యమయ్యాయి. అలాగే 67 దేశాలకు చెందిన నగదు కూడా ఉండడం గమనార్హం. కరోనా కాలం గడిచిపోయాక ఆలయానికి హుండీల ఆదాయం భారీగా పెరిగింది.

### నకిలీ జీఎస్టీ ముఠా అరెస్టు

బనశంకరి: జీఎస్టీ నకిలీ బిల్లులు తయారు చేస్తున్న ముఠాను వాణిజ్య పన్నుల అధికారులు ఛేదించారు. ఈ ముఠా కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు ఇతర వ్యక్తులను గుర్తించి రికార్డులను ఉపయోగించుకుని సుమారు 30కి పైగా ఉత్తుత్తి కంపెనీలను సృష్టించినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈ ముఠా సుమారు రూ.525 కోట్ల నకిలీ కార్యకలాపాలు నిర్వహించినట్లు చూపించి ప్రభుత్వానికి సుమారు రూ.90 కోట్ల పన్ను నష్టాన్ని కలిగించినట్లు సమాచారం. ఈ ముఠా సూత్రధారుడైన గురుప్రకాష్, మంజునాథ్‌ను బుధవారం అరెస్ట్ చేశారు.

# మైసూరులో అట్టహాసం

- గృహలక్ష్మి కోసం తరలివచ్చిన నారీమణులు

మైసూరు: రాచనగరి మైసూరు మహారాజ కాలేజీ మైదానంలో బుధవారం జరిగిన గృహలక్ష్మి యోజన ప్రారంభోత్సవం అట్టహాసంగా సాగింది. మైసూరు ప్యాలెస్ నమూనాతో వేదిక, వేలాదిగా మహిళల రాకతో సంభ్రమం నెలకొంది. ఉదయం 10 గంటలకు సభా వేదిక ముందు భాగంలో వేసిన లక్ష సీట్లు పూర్తిగా మహిళలతో నిండిపోయాయి. కూర్చొనేందుకు సీటు లేకపోగా వందలాది మంది మైదానం బయట రోడ్డుపై నిలబడాల్సి వచ్చింది. అన్ని జిల్లాల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు మహిళలను తరలించారు. ఇందుకోసం వందలాదిగా ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలను ఉపయోగించారు.

**పోలీసులతో మహిళల వాగ్వాదం**

అప్పటికీ బస్సుల్లో తరలివస్తున్న మహిళలను నిలువరించడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. మైదానానికి వచ్చే అన్ని గేట్లను పోలీసులు మూసేయడంతో మహిళలు బయటే ఉండిపోవాల్సి వచ్చింది. ఎందుకు పంపడం లేదని కొందరు మహిళలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సభావేదిక మొత్తం గులాబీ రంగులోకి మారిపోయింది. వేదిక మీద కుర్చీలు కూడా పింక్ కలర్‌లోనే ఉండేలా చూసుకున్నారు. ఐడీ, ట్యాగ్ కార్డులు, నీటి బాటిళ్లు కూడా పింక్ రంగులోనే ఉన్నాయి. మహిళా కార్యకర్తలు నాయకులకు సభాస్థలిలోనే రాఖీలు కట్టి రక్షాబంధన్ జరుపుకొన్నారు.



చిందులు వేస్తున్న మహిళా కార్యకర్తలు




సభా వేదిక ముందు జన సందోహం (ఇన్‌సెట్లో) గేటు బయట మహిళలను నిలిపివేసిన పోలీసులు



సభాస్థలికి తరలివస్తున్న వనితలు

## క్లుప్తంగా

### ఎడతెరిపి లేని వర్షం.. రహదారులు జలమయం



గంగావతిలో వర్షం కురుస్తున్న దృశ్యం

**గంగావతి:** నగరంలో బుధవారం మధ్యాహ్నం సుమారు గంటకు పైగా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఈ వర్షానికి రోడ్లలో వాహన రాకపోకలు కూడా నిలిచిపోయాయి. ఫుట్‌పాత్ వ్యాపారస్తుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలతో పోల్చితే ఇంత పెద్ద స్థాయిలో వర్షం కురవలేదని ప్రజలు చర్చించుకున్నారు.

### అంబులెన్స్‌లో ప్రసవం

**సాక్షి బళ్లారి:** పురిటి నొప్పులు అధికం కావడంతో ఓ గర్భిణి అంబులెన్స్‌లోనే ప్రసవించిన ఘటన బుధవారం గదగ్ జిల్లా బళగానూరు గ్రామ సమీపంలో జరిగింది. సలీమా మహబూబ్ సాబ్ అనే మహిళకు పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే నొప్పులు అధికమై అంబులెన్స్‌లోనే సుఖ ప్రసవమైంది. తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నారని అంబులెన్స్ హెల్త్ అసిస్టెంట్ తెలిపారు.

### ప్రజల సహకారంతోనే నేరాల కట్టడి సాధ్యం



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్ గోఖలె

**కంప్లి:** పోలీసులతో ప్రజలు మమేకమై సహకారం అందిస్తే నేరాల నియంత్రణ సాధ్యమని డీఎస్పీ ప్రసాద్ గోఖలే తెలిపారు. కంప్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన జన సంపర్క సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాత్రిళ్లు నిద్రపోయే సమయంలో వెండి, బంగారు ఆభరణాలను జాగ్రత్తగా భద్రపరచుకోవాలన్నారు. వీలైనంత వరకు భద్రంగా లాకర్లలో పెట్టుకోవాలన్నారు. కొత్త వ్యక్తులు తమ ప్రాంతాల్లో సంచరిస్తుంటే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పట్టణాలతో పాటు తాలూకాలోని గ్రామాల్లో తమ చుట్టూ జరిగే దాడులు, దోపిడీలు, ఘర్షణలు, దొంగతనాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్–112కు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ప్రముఖులు హేమయ్యస్వామి, బ్రహ్మయ్య, మైనుద్దీన్, ఏసీ దానప్ప తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు.

### బాలకార్మికులకు విముక్తి

**కంప్లి:** సిరుగుప్ప తాలూకా తెక్కలకోటె పట్టణంలోని దుకాణాలు, వర్క్‌షాపులు, కూరగాయల మార్కెట్లపై బాలకార్మిక నిర్మూలన శాఖ అధికారులు బుధవారం మూకుమ్మడిగా దాడులు ఇద్దరు బాలకార్మికులకు విముక్తి కల్పించారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వారిని హెచ్చరించి వారి నుంచి మళ్లీ పనిలో పెట్టుకోబోమని హామీ పత్రాలను రాయించుకున్నారు. కాగా పిల్లలకు బడిలో మధ్యాహ్న భోజన సదుపాయం కూడా ఉందని, పిల్లలను బడికి పంపి వారిని విద్యావంతులుగా చేయాలని వారి తల్లిదండ్రులకు సూచించారు.

### ధార్వాడ జిల్లా ఎస్పీగా గోపాల బ్యాకోడ్

**హుబ్లీ:** హుబ్లీ ధార్వాడ జంట నగరాల్లో డీసీపీగా పని చేసిన గోపాల బ్యాకోడ్‌ను ధార్వాడ జిల్లా ఎస్పీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను వెల్లడించింది. ఏడాదిన్నర నుంచి జంట నగరాల్లో ట్రాఫిక్ అండ్ క్రైం డీసీపీగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వం బెంగళూరుకు బదిలీ చేసింది. ధార్వాడ జిల్లా ఎస్పీగా ఉన్న లోకేష్ జగళూర్‌కర్‌ను ఇక్కడి నుంచి మైసూరులోని పోలీస్ అకాడమికి బదిలీ చేయగా ఆయన స్థానంలో గోపాల బ్యాకోడ్‌ను ప్రభుత్వం నియమించింది.

### ఎండిన మొక్కజొన్న.. దిక్కుతోచని స్థితిలో రైతన్న



ఎండిపోయిన మొక్కజొన్న పంట

**హొసపేటె:** వర్షాలు కురవకపోవడంతో చేతికి వచ్చిన మొక్కజొన్న తదితర పంటలు ఎండిపోతున్నాయి. కూడ్లిగి తాలూకా ఖానాహొసళ్లి వ్యాప్తిలో రైతులు వందలాది ఎకరాల్లో మొక్కజొన్న, వేరుశనగ, జొన్న, సూర్యకాంతి, పత్తి, రాగి తదితర పంటలు వేశారు. కానీ వర్షాలు సరిగా కురువక పంటలు ఎండిపోతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మరో వైపు కొందరు రైతులు ఎండిపోయిన మొక్కజొన్న పంటను తొలగించి పశువులకు మేతగా వాడుతున్నారు.

# టమాటా సాగు ఘనం.. ధర పతనం



మార్కెట్‌కు బాక్స్‌ల్లో తరలివచ్చిన టమాటా

- ధరలు పెరిగిన ఆశతో పంట సాగు చేసిన వైనం
- గత కొన్ని రోజులుగా ధర లేక రైతన్నల్లో నిరాశ

**సాక్షి బళ్లారి:** జూన్, జూలై నెలల్లో టమాటా ధరలు కిలో రూ.150 నుంచి రూ.200 వరకు పలకడంతో ఆ పంట సాగు చేసిన రైతులు లక్షలు, కోట్లు గడించారు. ఈనేపథ్యంలో సాగునీటి వసతి కలిగిన భూముల్లో రైతన్నలు టమాటా సాగుపై ఆసక్తి కనబరిచారు. చరిత్రల్లో ఎన్నడూ లేని విధంగా ఆపిల్ ధరను మించి టమాటా ధర పెరగడం ఓ వైపు చర్చనీయాంశమైంది. మరో వైపు జిల్లాలో టమాటా సాగుపై రైతులు దృష్టి సారించారు. జూన్ నెల ఆరంభం నుంచి టమాటా ధర క్రమేణా పెరగడంతో సాగు కూడా జిల్లాలో క్రమంగా పెరిగింది. జిల్లాలోని కురుగోడు, సండూరు, బళ్లారి, సిరుగుప్ప తాలూకాల్లో ప్రతి ఏటా 150 హెక్టార్లలో మాత్రమే టమాటా పండించేవారు. ఈఏడాది ధరలు పెరిగిన నేపథ్యంలో 750 ఎకరాలకు టమాటా సాగు పుంజుకుంది. అయితే గత 15 రోజుల నుంచి టమాటా కిలో ధర రూ.150 నుంచి క్రమేణా కిలో రూ.10లకు పడిపోవడంతో కొందరికీ మోదం, మరికొందరికీ ఖేదంగా మారింది. నగరంలోని ఏపీఎంసీ మార్కెట్లో టమాటా బాక్స్ ధర రూ.2 వేల నుంచి ప్రస్తుతం రూ.200లు కూడా పలకకపోవడంతో రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితులు కనబడటం లేదు.

**నర్సరీల్లో అమ్ముడుపోని నారు**

టమాటా సాగుతోపాటు జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ కూడా టమాటా నారును కూడా పెంచడానికి నర్సరీలు కూడా ఏర్పాటు చేసుకొన్నారు. అయితే ధరలు తగ్గిపోవడంతో నర్సరీల్లో టమాటా నారును కొనుగోలు చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో నర్సరీలు వేసుకొన్న రైతులు కూడా నష్టాలకు గురవుతున్నారు. లాటరీ తరహాలో రెండు నెలల పాటు ఊరించిన టమాటా ధరలు ప్రస్తుతం ధరలు తగ్గిపోవడంతో రైతులను ఉసూరుమనిపిస్తోంది. మరో రెండు నెలల పాటు కూడా ధరలు పెరిగే సూచనలు కనిపించడం లేదని వ్యాపారస్తులు పేర్కొంటున్న తరుణంలో రైతులు చేసేదేమీ లేక కన్నీరు పెడుతున్నారు. ధరలు పెరిగినప్పుడు గగ్గోలు పెట్టడంతో సబ్సిడీతో టమాటాను అందించాలని డిమాండ్ చేశారు. అదే ధరలు తగ్గితే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించడంపై దృష్టి సారించాలని రైతన్నలు కోరుతున్నారు.



నర్సరీల్లో పెంచుతున్న టమాటా నారు

# మహిళలకు గృహలక్ష్మి ఆసరా

- దేశం మెచ్చేలా కర్ణాటకలో పథకాల అమలు
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బి.నాగేంద్ర



బళ్లారిలో పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి తదితరులు



గంగావతిలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి



హొసపేటెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గవియప్ప



కంప్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

**బళ్లారి అర్బన్:** మహిళలకు గృహలక్ష్మి పథకం కింద ఇక నుంచి ప్రతి నెల అందించే రూ.2 వేలు వారికి ఆసరాగా నిలుస్తుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్ర పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన గృహలక్ష్మి పథకం అమలు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశం గర్వించేలా కర్ణాటక ప్రభుత్వం ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేసిందన్నారు. రాష్ట్రంలోని 1.28 కోట్ల మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసేందుకు మైసూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే.శివకుమార్‌ల చేతుల మీదుగా ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. బళ్లారి జిల్లాలో 2,67,000 కుటుంబాలకు మొత్తం రూ.50 కోట్లు నెల నెల వారి ఖాతాల్లోకి జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్ త్రివేణి, ఉపమేయర్ జానకీ, కార్పొరేటర్లు, అధికారులు పార్టీ నాయకులు, వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

**గృహలక్ష్మి పథకానికి శ్రీకారం**

**గంగావతి:** ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తాజా పథకాలను ప్రధానంగా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన వడ్డరహట్టి గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్డరహట్టి క్యాంప్‌లో గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. అర్హులైన మహిళలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీపీ అధ్యక్షురాలు మంజుల, టీపీ ఈఓ లక్ష్మీదేవి, తహసీల్దార్ మంజునాథ్ భోగావతి తదితర జీపీ అధికారులు, కేఆర్‌పీపీ మహిళా జిల్లాధ్యక్షురాలు రాజేశ్వరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**2.44 లక్షల మందికి గృహలక్ష్మి: ఎమ్మెల్యే గవియప్ప**

**హొసపేటె:** రాష్ట్రంలోని పేదలకు మేలు చేసేందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సాహసమైన నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప అన్నారు. ఆయన బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన గృహలక్ష్మి పథకం ప్రారంభోత్సవంలో మాట్లాడారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 2.44 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందన్నారు. జిల్లాధికారి దివాకర్, జెడ్పీ సీఈఓ సదాశివప్రభు, పోలీస్ అధికారి శ్రీ హరిబాబు, నగర సభ అధ్యక్షురాలు లత, మహిళా సంక్షేమ అధికారి శ్వేత పాల్గొన్నారు.

**ఇంటింటికీ గృహలక్ష్మిని అందిస్తాం**

**కంప్లి:** ఇచ్చిన మాట తప్పకుండా అమలు చేసిన ఘనత తమ కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. పట్టణంలోని మారుతీ నగర్ మున్సిపల్ సముదాయ భవనంలో గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించి తన క్షేత్రంలో ఇప్పటి వరకు 57 వేల మంది లబ్ధిదారులకు ఈ అవకాశం దక్కిందన్నారు. బీజేపీ కేవలం తప్పుడు హామీలతో ప్రజలను మభ్య పెట్టిందే తప్ప ఇలాంటి ప్రజలకు ఉపయోగకరమైన పథకాలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. క్షేత్ర ఎమ్మెల్యేగా రెండో సారి విజయం సాధించడంతో తనపై రెండింతల బాధ్యత పెరిగిందని ప్రతీది నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌసియా బేగం, సీడీపీఓ మోహన్‌కుమార్, టీపీ ఈఓ శివకుమార్, ముఖ్యాధికారి దురుగణ్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజలు, కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు.

**పథకాలు ప్రజల దరికి చేరాలి**

**రాయచూరు రూరల్:** గ్రామీణ ప్రజల దరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ సూచించారు. ఆయన బుధవారం తాలూకాలోని దేవసూగూరు అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసమే శక్తి, గృహలక్ష్మి పథకాలను అమలు చేసిందన్నారు. ఇకపై నెల నెలా రూ.2 వేలు మహిళల బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయన్నారు. జిల్లాలో 3,64,059 మంది మహిళలు ఈ పథకం కింద పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, జెడ్పీ సీఈఓ రాహుల్ పాండే తుకారాం, మహిళ శిశు సంక్షేమ శాఖాధికారి చేతన్ కుమార్‌లున్నారు.

# 3న టెట్‌కు అన్ని ఏర్పాట్లు

- పరీక్ష రాయనున్న 8767 మంది
- జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాధికారి దివాకర్

**హొసపేటె:** విజయనగర జిల్లాలో సెప్టెంబర్ 3న జరగనున్న కర్ణాటక ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ సూచించారు. ఆయన మంగళవారం సాయంత్రం తమ కార్యాలయ సభాంగణంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో పరీక్షకు కేటాయించిన ఇన్విజిలేటర్లు, పరీక్ష కేంద్రాల అధిపతులు, గదుల పర్యవేక్షకులకు తగిన సలహా సూచనలు అందించారు. పరీక్ష కేంద్రం, గదుల్లో సీసీ కెమెరాలు, తాగునీటి వ్యవస్థ, విద్యుత్ సరఫరాను పర్యవేక్షించాలని సూచించారు. సమావేశం ప్రారంభంలో పాఠశాల విద్యాశాఖ తరఫున అధికారులు పరీక్ష ఏర్పాట్ల గురించి వివరించారు. ఆ రోజున హొసపేటెలోని 16 పరీక్ష కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్ష జరుగుతుందని తెలిపారు. మొదటి సెషన్‌లో 12 పరీక్ష కేంద్రాల్లో 3651 మంది, రెండో సెషన్‌లో 16 కేంద్రాల్లో 5116 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# రాఘవేంద్రుల ఆరాధనోత్సవాలు షురూ

**రాయచూరు రూరల్:** మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్ర స్వాముల 352వ ఆరాధనోత్సవాలు, సప్తరాత్రి రథోత్సవాలను వైభవంగా మంత్రాలయ పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదంగల్ ప్రారంభించారు. మంగళవారం సాయంత్రం మఠం ప్రాంగణంలో ఆయన ప్రత్యేక పూజలను నెరవేర్చారు. ధ్వజారోహణం, అశ్వ, గోమాత, నవధాన్యాల పూజలు జరిపారు. బుధవారం మూలవిరాట్‌కు విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నవధాన్య పూజ చేస్తున్న సుబుదేంద్ర తీర్థులు

# రూ.3 వేల కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు



మాట్లాడుతున్న అధ్యక్షుడు అజయ్‌సింగ్

**రాయచూరు రూరల్:** కళ్యాణ కర్ణాటక గ్రామీణ అభివృద్ధి మండలి(కేకేఆర్‌డీబీ) పరిధిలో రూ.3 వేల కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించినట్లు మండలి అధ్యక్షుడు అజయ్‌సింగ్ వెల్లడించారు. బుధవారం కలబుర్గిలో ప్రభుత్వ అతిథి భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలి పరిధిలోని జిల్లాల్లో గ్రామీణ రోడ్లు, పాఠశాల భవనాలు, తాగు నీటి సరఫరా, నిర్వహణ, విద్యుత్ దీపాల అమరిక, ఇతర మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా వున్న 3,200 ఉపాధ్యాయ నియామకాలకు మండలి నుంచి గౌరవ వేతనంతో అతిథి ఉపాధ్యాయులను నియమిస్తామన్నారు. 9,249 పాఠశాలల్లో 5,348 పాఠశాలలు కారుతున్నాయన్నారు. 5,310 పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవన్నారు. 1,624 పాఠశాలలో తాగు నీటి సౌకర్యం లేదన్నారు. 5,673 పాఠశాలల్లో బెంచీలు లేవన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ సాధనకు అ క్షర పథకం ద్వారా ప్రత్యేక తరగతులు, బోధనా పద్ధతిలో మార్పులు చేస్తామన్నారు. తల్లిబిడ్డల ఆస్పత్రుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గుణాత్మక విద్యా బోధనకు మండలి నుంచి రూ.25 కోట్లు కేటాయించామన్నారు. ఈసందర్భంగా కలబుర్గి ఎమ్మెల్యే అల్లమప్రభు పాటిల్, మండలి కార్యదర్శి అనిరుధ్ శ్రవణ్‌లున్నారు.

## కోలారు వార్తలు...

# ఇచ్చిన హామీలు నిలుపుకొంటున్నాం



కోలారులో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంజునాథ్



కేజీఎఫ్‌లో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపా శశిధర్

**కోలారు:** ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను నిలుపుకుంటోందని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. బుధవారం నగరంలోని రామాంజనేయ కళ్యాణ మందిరంలో నిర్వహించిన గృహలక్ష్మి పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ మహిళలను ఆర్థికంగా సబలలను చేయాలనే ఉద్దేశంతో గృహలక్ష్మి పథకాన్ని తీసుకు వచ్చిందన్నారు. నిరుద్యోగ యవతకు భృతిని అందించే పథకాన్ని కూడా త్వరలో ప్రారంభిస్తారన్నారు. వచ్చే ఐదేళ్లలో ప్రజాఅభీష్టానికి అనుగుణంగా పాలించి ప్రజల విశ్వాసం పొందుతామన్నారు. జిల్లాధికారి అక్రంపాషా మాట్లాడుతూ జిల్లాలో ఇంతవరకు 2.71 లక్షల మంది మహిళలు గృహలక్ష్మి పథకం కింద పేర్లు నమోదు చేసుకున్నారన్నారు.

**గృహలక్ష్మితో మహిళా సబలీకరణ**

**శ్రీనివాసపురం:** మహిళల సబలీకరణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గృహలక్ష్మి పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాలూకా అధికారులు పథకాలను ప్రజలకు సక్రమంగా అందించాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దన్నారు. తహసీల్దార్ శిరీన్‌తాజ్ తదితరులు పాల్గొన్నారు.

**గృహలక్ష్మి పథకానికి శ్రీకారం**

**కేజీఎఫ్:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం ముఖ్యమంత్రి గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయడం ద్వారా మాట నిలుపు కున్నారని ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. బుధవారం నగరసభ సభాంగణంలో గృహజ్యోతి పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. లబ్ధిదారులకు బుధవారం నుంచి వారి ఖాతాల్లోకి రూ.2 వేలు జమ అవుతుందన్నారు. తాలూకాలో 41 వేల మంది మహిళల ఖాతాల్లోకి రూ.2 వేలు జమ అవుతుందన్నారు. వేల సంఖ్యలో మహిళలు నమోదు చేసుకోవడం వల్ల ఈ పథకం విజయవంతమైందన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి కృష్ణమూర్తి, తహసీల్దార్ నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని నిలుపుకుంటుంది**

**మాలూరు:** ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చి ప్రజల విశ్వాసాన్ని నిలుపుకుంటుందని ఎమ్మెల్యే కెవై నంజేగౌడ తెలిపారు. బుధవారం పురసభ కార్యాలయంలో నిర్వహించిన గృహలక్ష్మీ పథకం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఇప్పటికే నాల్గింటిని నెరవేర్చిందన్నారు. త్వరలో నిరుద్యోగ యువతకు భృతిని అందించే పథకాన్ని కూడా ప్రారంభిస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను ఎన్నటికీ మరువదని, వారి విశ్వాసాన్ని ఎల్లప్పుడూ పొందడానికి ప్రయత్నిస్తుందని తెలిపారు. గత ఎన్నికల్లో మహిళలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పట్టి అధికారంలోకి తీసుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయంతో పాటు, పురసభ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# వృద్ధుడి హత్య కేసులో నిందితుడి అరెస్టు

**కేజీఎఫ్:** వృద్ధుడి తలపై సిమెంట్ ఇటుకతో కొట్టి హత్య చేసిన ఘటనలో నిందితుడిని రాబర్ట్‌సన్ పేట పోలీసులు అరెస్టు చేశారు. హత్య కేసు దర్యాప్తునకు ఎస్పీ శాంతరాజు రాబర్ట్‌సన్‌పేట ఇన్‌స్పెక్టర్ కుమారస్వామితో కూడిన బృందాన్ని ఏర్పాటు చేశారు. తనిఖీ చేపట్టిన బృందం అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఆనంద్ అనే వ్యక్తిని అరెస్టు చేసి విచారణ జరుపగా తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. ఈనెల 16న దారిలో నడుచుకుని వెళుతున్న వృద్ధుడిని చిన్న కారణానికి తలపై సిమెంట్ ఇటుకతో మోది హత్య చేశాడు. పోలీసులు నిందితుడు ఆనంద్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

### ఇంజెక్షన్ వికటించి బాలుడు మృతి

**సాక్షి బళ్లారి:** ఇంజెక్షన్ వికటించి ఓ బాలుడు మృతి చెందిన ఘటన చిత్రదుర్గ జిల్లా హొళల్కెరె తాలూకా చిక్కజాజూరులో జరిగింది. బుధవారం గ్రామంలో చిరాగ్(7) అనే బాలుడు ప్రమాదవశాత్తు చేతికి గాయం కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. బాలుడికి ఇంజెక్షన్ ఇవ్వగా వాంతులు, విరోచనాల బారినపడి మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. దీంతో వైద్యుల తీరుపై స్థానికులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### డీసీసీ ఉపాధ్యక్షుడిగా వివేక్



**సాక్షి బళ్లారి:** జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పేరం వివేక్(విక్కీ) నియమితులయ్యారు. ఈమేరకు కేపీసీసీ అధ్యక్షుడు డీకే.శివకుమార్ ఆయన్ను జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఆదేశ పత్రాలను జారీ చేశారు. నగర కార్పొరేటర్‌గా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి డీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమించడంతో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈసందర్భంగా విక్కీ మాట్లాడుతూ తనపై పార్టీ నేతలు నమ్మకం ఉంచి డీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమించినందున జిల్లాలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

### రూ.3.95 లక్షల ఆభరణాల చోరీ

**హుబ్లీ:** ఇంటి తలుపులను పగలకొట్టి లోపలకు చొరబడిన దొంగలు ఇంట్లోని రూ.3.95 లక్షల విలువ చేసే ఆభరణాలు, వస్తువులను చోరీ చేసిన ఘటన మంగళవారం రాత్రి తాలూకాలోని హెబసూరులో జరిగింది. ఆ గ్రామానికి చెందిన కిరణ్ కొణ్ణూరు అనే వ్యక్తి ఇంటిలోకి ప్రవేశించిన దుండగులు బీరువాలో భద్రపరిచిన రూ.2 లక్షల విలువ చేసే బంగారు గొలుసు, రూ.50 వేల విలువ చేసే 10 గ్రాముల లాకెట్, ముత్యాలహారం, రూ.25 వేల విలువ చేసే ఉంగరం, రూ.50 వేల విలువ చేసే చెవికమ్మలు, రూ.45 వేల విలువ చేసే వాచీని చోరీ చేసుకొని పరారయ్యారు. ఘటనపై హుబ్లీ రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### నేడు నారాయణ గురూజీ జయంతి

**రాయచూరు రూరల్:** నగరంలో గురువారం బ్రహ్మశ్రీ నారాయణ గురూజీ జయంతిని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్య ఈడిగ సంఘం అధ్యక్షుడు రాఘవేంద్ర గౌడ వెల్లడించారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మధ్యాహ్నం మహిళా సమాజ్ నుంచి బ్రహ్మశ్రీ నారాయణ గురూజీ చిత్రపటాన్ని ఊరేగిస్తు కన్నడ భవనం వరకు ఊరేగింపు చేపడతారన్నారు. ఈసందర్భంగా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**కరువు జిల్లాలుగా ప్రకటించాలి**

రాయచూరు, యాదగిరిలను కరువు జిల్లాలుగా ప్రకటించాలని సుప్రీంకోర్టు న్యాయవాది పేర్కొన్నారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలు లేక ప్రజలు వలసలు వెళుతుంటే వ్యవసాయ, రెవిన్యూ శాఖాధికారులు సమీక్షలు జరపకుండా కాలయాపన చేసినందునే రాష్ట్ర ప్రభుత్వం కరువు జిల్లాలుగా ప్రకటించలేదన్నారు.

### ఉపలోకాయుక్త తనిఖీ



పరిశీలిస్తున్న ఉపలోకాయుక్త సూర్యనారాయణ

**శ్రీనివాసపురం:** పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను ఉపలోకాయుక్త సూర్యనారాయణ బుధవారం పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. మార్కుల జాబితా కోసం దరఖాస్తు చేసుకున్న పాత విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కళాశాలలో రికార్డులను పరిశీలించినట్లు ఉపలోకాయుక్త తెలిపారు. మార్కుల జాబితా, రెండోసారి టీసీలు తీసుకోవడానికి వచ్చే వారి నుంచి ఫీజులు వసూలు చేయడంలో లోపాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ ఫీజులు, విధి విధానాల గురించి బీఈఓ నుంచి సమాచారం సేకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ రాధామణి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

### తాగునీటి యూనిట్‌ను ప్రారంభించండి



నిరుపయోగంగా ఉన్న యూనిట్ ఇదే

**కోలారు:** నగరంలోని కనకనపాళ్యలో నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన రక్షిత తాగునీటి యూనిట్‌ను ప్రారంభించకపోవడం వల్ల నిరుపయోగంగా మిగిలి పోయిందని వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏళ్లు గడిచినా యూనిట్‌ను ఎందుకు ప్రారంభించలేదని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. లక్షలు ఖర్చు చేసి ప్రజలకు అనుకూలం చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసినా ప్రజలకు ఎంతమాత్రం ఉపయోగ పడడం లేదన్నారు. నగరసభ మాజీ సభ్యుడు సోమశేఖర్ అవధిలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌ను ఇంతవరకు ప్రారంభించలేదన్నారు. కనకనపాళ్యలో తాగునీటితో పాటు అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## క్లుప్తంగా

### దంపతుల ఆత్మహత్య



మృతులు సుధ, రాజేష్ (ఫైల్)

మండ్య: విషం సేవించి దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండ్య జిల్లా మళవళ్లి పట్టణంలో జరిగింది. ఎన్ఈఎస్ లేఔట్‌లో కేహెచ్ రాజేశ్(48), సుధ(38) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి సంతానం లేదు. రాజేశ్ పట్టణంలోని బంగారం విక్రయ దుకాణం నిర్వహిస్తున్నాడు. నష్టాలు రావడంతో దుకాణం మూసివేశాడు. ఇంటి తలుపులు మూసి ఉండడం, ఎవరూ బయటకు రాకపోవడంతో ఇరుగుపొరుగు వారు అనుమానంతో కిటికీలో నుంచి లోపలకు చూడగా దంపతులు విగతజీవులుగా కనిపించారు. మళవళ్లి పట్టణ పోలీసులు వచ్చి పరిశీలించగా విషం సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు తేలింది. అప్పుల బాధతో బలవన్మరణానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

### గూండా చట్టం కింద అరెస్ట్

శివాజీనగర: అశోకనగర పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ నమోదైన ఇర్ఫాన్‌ను గూండా చట్టం కింద సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. 2013నుంచి నేర కార్యకలాపాలు సాగిస్తున్న ఇర్ఫాన్‌పై మోసాలు, హత్యాయత్నం, దౌర్జన్యాలు తదితర నేరాలపై 15 కేసులు నమోదయ్యాయి. బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు 6 కేసుల్లో విచారణకు హాజరుకావడం లేదు. ఇతనిపై అరెస్ట్ వారెంట్‌లు పెండింగ్‌లో ఉండేవి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇర్ఫాన్‌ను అరెస్ట్ చేశారు.

### పొదుపు ఆర్థికాభివృద్ధికి బాట



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: మహిళా స్వసహాయ సంఘాలలో పొదుపు చేసి ఆర్థికంగా ఎదగాలని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా డైరెక్టర్ ప్రశాంత్ సూచించారు. జోడీబిసలహళ్లిలో బుధవారం జరిగిన సూర్యోదయ జ్ఞాన వికాస కేంద్రం వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సంస్థ అందించే రుణసదుపాయం, బీమా పథకాలను వివరించారు. అనంతరం రంగోలీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. వరమహాలక్ష్మి పూజలు నిర్వహించి మహిళలకు పసుపు, కుంకుమ,గాజులను వితరణ చేశారు.

### కార్మికుడి ఆత్మహత్య

మైసూరు: కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నంజనగూడు తాలూకా చామలాపురహుండీలో జరిగింది. తమిళనాడు తిరుపూరు నివాసి నవప్రసన్న(40) నంజనగూడులో నివాసం ఉంటూ రిషి కర్మాగారంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల కుటుంబ కలహాలతో మానసికంగా ఒత్తిడికి లోనయ్యాడు. ఈక్రమంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు నంజనగూడు పట్టణ పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

### క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి హామీ



సమస్యలపై ఎమ్మెల్యేతో చర్చిస్తున్న నాయకులు

కృష్ణరాజపురం: క్రైస్తవుల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మంజుల లింబావళి హామీనిచ్చినట్లు మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాజుపాల్ తెలిపారు. మహదేవపుర క్రిస్టియన్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మంజులను క్రైస్తవ బోధకులు, పెద్దలు భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. క్రైస్తవులకు మౌలిక సదుపాయాలు కల్పించడంపై ఎమ్మెల్యేతో వారు చర్చించారు. క్రైస్తవుల విజ్ఞప్తులపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

### కాంపౌండ్ కూలి కార్మికుడి మృతి

సాక్షి బెంగళూరు: కాంపౌండ్ కూలి కార్మికుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈఘటన మంగళూరు సమీపంలోని సూరత్కల్ వద్ద ఉన్న కృష్ణాపురలో జరిగింది. కృష్ణాపుర వద్ద కేఈబీ షరీఫ్ అనే వ్యక్తి మురుగునీటి కాలువ పనులు చేపట్టాడు. ఆ సమయంలో ప్రహరీ హఠాత్తుగా కూలిపోయింది. ప్రమాదంలో బజ్పే కరంబారు గ్రామ నివాసి హనీఫ్ (51) అనే కార్మికుడు అక్కడికక్కడే చనిపోగా మరొకరికి గాయాలయ్యాయి. సూరత్కల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

### పట్టపగలే ఇంట్లో చోరీ

పావగడ: పట్టణంలోని పతంజలి నగర మున్సిపల్ క్వార్టర్స్ లో బుధవారం పట్ట పగలే చోరీ జరిగింది. యజమాని మోహన్ ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. ఆ సమయంలో దొంగలు తాళం పగులగొట్టి లోపలకు చొరబడి బీరువాలో దాచిన సుమారు 12 గ్రాముల బంగారు సరం, 500 గ్రాముల వెండి, రూ.5 వేలు నగదును ఎత్తుకెళ్లారు. పోలీసులు తుమకూరు నుంచి జాగిలాలను తెప్పించి తనిఖీ నిర్వహించారు.

# గంధం చెట్ల దొంగలపై ఫైరింగ్

- ఒకరు మృతి, మరొకరు పరారీ
- బెంగళూరు బన్నేరుఘట్ట అడవిలో ఘటన

బనశంకరి: చందనం స్మగ్లర్లపై అటవీ సిబ్బంది కాల్పులు జరపడంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన బెంగళూరు శివార్లలోని బన్నేరుఘట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. కాల్పుల్లో మృతిచెందిన వ్యక్తిని మాలూరు తాలూకాకు చెందిన తిమ్మరాయప్ప (28) గా పోలీసులు గుర్తించారు. పరారీలో ఉన్న మరో వ్యక్తికోసం గాలింపు చేపట్టారు. వివరాలు... గత కొన్నిరోజులుగా బన్నేరుఘట్ట అటవీప్రాంతం కల్కెర వద్ద శ్రీగంధం చెట్లను నరికి ఎత్తుకెళుతున్నారు. ఈ నేపథ్యంలో బన్నేరుఘట్ట నేషనల్ పార్కు ప్రదేశంలో ఫారెస్ట్ గార్డు, ఇద్దరు వాచర్లు మంగళవారం రాత్రి గస్తీలో ఉన్నారు. బుధవారం వేకువజామున 2 గంటల సమయంలో గంధం చెట్లను చోరీ చేయాలి కొందరు దుండగులు చొరబడ్డారు. చెట్లను నరుకుతుండగా అటవీ సిబ్బంది శబ్దం వినబడింది. వెంటనే అక్కడికి వెళ్లిన ఫారెస్ట్‌గార్డులు చుట్టుముట్టి స్మగ్లర్లను లొంగిపోవాలని ఒక రౌండు గాల్లోకి కాల్పులు జరిపి హెచ్చరించారు. ఖాతరు చేయని స్మగ్లర్లు అటవీసిబ్బందిపై కొడవలితో దాడి చేయడానికి యత్నించగా ఫారెస్ట్ గార్డులు కాల్పులు జరపడంతో తిమ్మరాయప్ప అనే స్మగ్లర్ తూటాలు



గంధం దుంగలను కోసిన దృశ్యం, విచారణ చేస్తున్న పోలీసులు



ఏపుగా పెరిగిన గంధపు చెట్లు(ఫైల్)



తగిలి అక్కడికక్కడే చనిపోయాడు, ఈ ఘటనతో భయపడిపోయిన మరో స్మగ్లరు అక్కడ నుంచి పారిపోయాడు.

**కొడవళ్లు స్వాధీనం**

ఘటనాస్థలంలో రెండు కొడవళ్లను అటవీ సిబ్బంది స్వాధీనం చేసుకుని బన్నేరుఘట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఘటనాస్థలిని బెంగళూరు గ్రామాంతర ఎస్పీ మల్లికార్జున బాలదండి పరిశీలించి మీడియాతో మాట్లాడారు. మంగళవారం రాత్రి ఫారెస్ట్ వాచర్, గార్డులు నైట్ పెట్రోలింగ్ చేస్తుండగా చందనం చెట్లు కొట్టేస్తున్నట్లు తెలిసింది. వారిని అడ్డుకోవడానికి వెళ్లగా కొడవలితో దాడిచేసి పారిపోవడానికి ప్రయత్నించగా ఫారెస్ట్ గార్డ్ కాల్పులు జరపడంతో ఒక స్మగ్లర్ మరణించాడని తెలిపారు. ఘటనాస్థలానికి వేలిముద్రలు, ఫోరెన్సిక్ నిపుణులు చేరుకుని ఆధారాలు సేకరించారు.

**గంధానికి ఎంతో గిరాకీ**

శాండల్‌వుడ్‌కి మార్కెట్లో విపరీతమైన డిమాండు ఉంది. పరిమళం వెదజల్లుతూ అనేక ఉపయోగాలు ఉండే ఈ చెక్కల ధరలు ఎంతో ఎక్కువగా ఉండడంతో దొంగలు, స్మగ్లర్ల కన్ను పడింది. కేజీ గంధం చెక్కల రేటు రూ.12–15 వేల మధ్య ఉంది. బెంగళూరుతో పాటు చుట్టుపక్కల ఫాంహౌస్‌లు, సర్కారీ సంస్థలు, తోటలు, ఇళ్ల వద్ద, అలాగే అటవీ ప్రాంతాల్లో గంధం చెట్లు పెరుగుతుంటాయి. దొంగలు తరచూ వాటిని నరికి ఎత్తుకెళ్లే ఘటనలు జరుగుతున్నాయి.

## శివమొగ్గలో గృహలక్ష్మి పథకం

శివమొగ్గ: గ్యారంటీ పథకం కింద ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం చరిత్రాత్మకమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎస్.మధు బంగారప్ప అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన గృహలక్ష్మి పథకం ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. మహిళల సాధికారత కోసమే గృహలక్ష్మిని తీసుకొచ్చినట్లు తెలిపారు. రక్షాబంధన్ పర్వదినాన రాష్ట్ర ప్రభుత్వం ఒక సోదరుడి స్థానంలో ఉంటూ మహిళలకు రూ.2 వేల ఆర్థిక సాయాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు.

చిక్కబళ్లాపురం: జిల్లా కేంద్రంలోని హర్షోదయ కల్యాణ మంటపంలో గృహలక్ష్మి పథకాన్ని మంత్రి ఎంసీ సుధాకర్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2,51,530 మంది మహిళలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, జిల్లా కలెక్టర్ రవీంద్ర, ఎస్పీ నాగేశ్, కాంగ్రెస్ నేతలు యలువహళ్లి, రమేశ్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



గృహలక్ష్మి పథకం లబ్ధిదారురాలికి ధ్రువపత్రం అందజేస్తున్న మంత్రి ఎంసీ సుధాకర్

బనశంకరి: గృహలక్ష్మి పథకం పకడ్బందీగా అమలు చేయాలని బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్ అధికారులకు సూచించారు. టౌన్ హాల్‌లో బుధవారం గృహలక్ష్మి పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గృహలక్ష్మి పథకం విజయవంతం చేయడానికి నోడల్ అధికారులను నియమించామన్నారు. అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని తెలిపారు. బీడీఏ అధ్యక్షుడు రాకేశ్‌సింగ్, బీబీఎంపీ దక్షిణ వలయ కమిషనర్ జయరామ్ రాయపుర పాల్గొన్నారు.

## రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

- గుండెలవిసేలా రోదించిన భార్య
- అనంత రైల్వే స్టేషన్‌లో విషాదం

అనంతపురం సిటీ: కాసేపటికి ఇల్లు చేరుకుంటారనగా భార్య కళ్లెదుటే భర్త రైలు నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద ఘటన అనంతపురంలో జరిగింది. జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్ కథనం ప్రకారం... అనంతపురంలోని నీరుగంటి వీధికి చెందిన చింతమేకల సాయికిరణ్(24) భార్య దివ్యశ్రీతో కలిసి బెంగళూరులో నివాసముంటూ సాఫ్ట్‌వేర్ కోచింగ్ తీసుకుంటున్నాడు. భార్యతో కలసి మంగళవారం రాత్రి రైలులో అనంతపురం బయల్దేరారు. బుధవారం తెల్లవారుజామున సుమారు 4 గంటలకు రైలు అనంతపురం స్టేషన్ సమీపంలోకి చేరుకుంది. అంతలోనే సాయికిరణ్ కాలుజారి రైలు నుంచి పడిపోయాడు. చక్రాల కింద నలిగి మృతి చెందాడు. కళ్లెదుటే జరిగిన ఘోరాన్ని చూసి భార్య దివ్యశ్రీ స్పృహతప్పి పడిపోయింది. కాసేపయ్యాక తేరుకొని ఇక కుటుంబ సభ్యులకు తానేం సమాధానం చెప్పాలంటూ గుండెలవిసేలా రోదించింది. భర్తను కోల్పోయిన దివ్యశ్రీను చూసి దేవుడెంత అన్యాయం చేశాడంటూ సాటి ప్రయాణికులు వాపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, జరిగిన ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### బస్ నుంచి పడి కండక్టర్...

యశవంతపుర: బస్సునుంచి జారి పడి కండక్టర్ మృతి చెందిన ఘటన మంగళూరు నగరంలోని నంతూరు సర్కిల్‌లో బుధవారం జరిగింది. కండక్టర్ ఈరయ్య బుధవారం కేపీటీ నుంచి అగ్నేస్ వైపు వెళ్తున్న సిటీ బస్సులో విధులు నిర్వహిస్తూ డోర్ వద్ద మెట్లపై నిలబడ్డాడు. నంతూరు సర్కిల్ దాటిన తర్వాత జారి కిందపడ్డాడు. బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

### వేగవంతంగా మెట్రో పనులు

- రెండు స్టేషన్ల మధ్య సొరంగం పనులు పూర్తి

శివాజీనగర: లక్కసంద్ర మెట్రో స్టేషన్ నుంచి ల్యాంగ్ ఫోర్ట్‌టౌన్ స్టేషన్ వరకు చేపట్టిన సొరంగ మార్గం పనులు పూర్తయ్యాయి. సొరంగాన్ని తవ్వుతున్న 'వమిక' అనే టీబీఎం మిషన్ బుధవారం విజయవంతంగా బయటకు వచ్చింది. ఏప్రిల్ 21న లక్కసంద్ర స్టేషన్ నుంచి సొరంగ మార్గం పనులు ప్రారంభం కాగా సదరు టీబీఎం యంత్రం 721 మీటర్ల మార్గాన్ని పూర్తిచేసినట్లు బీఎంఆర్‌సీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇంతకు ముందు వమిక టీబీఎం సౌత్ ర్యాంప్, డైరీ సర్కిల్ మధ్యలో 613.2 మీటర్లు, డైరీ సర్కిల్–లక్కసంద్ర స్టేషన్‌ల మధ్య 743 మీటర్ల సొరంగం పనులు పూర్తిచేసినట్లు బీఎంఆర్‌సీఎల్ తెలిపింది. స్టేజ్–2, రీచ్–6లో మొత్తం 20.991 కిలోమీటర్ల సొరంగ మార్గం తవ్వాల్సి ఉండగా 17.62 కిలోమీటర్ల పనులు పూర్తయినట్లు ఆ సంస్థ తెలిపింది.

### నమ్మ మెట్రో రైలు అధిక ట్రిప్పులు

సాక్షి బెంగళూరు: బెంగళూరు నమ్మ మెట్రో సంస్థ గుడ్ న్యూస్ చెప్పింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సోమవారం నుంచి శుక్రవారం వరకు నాడప్రభు కెంపేగౌడ, మెజిస్టిక్ – ఎంజీ రోడ్డు మెట్రో స్టేషన్ల మధ్య అదనపు ట్రిప్పులను నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

### యువకులను కట్టేసి కొట్టిన గ్రామస్తులు



యువకులను స్తంభానికి కట్టేసి కొడుతున్న దృశ్యం

యశవంతపుర: దొంగలుగా భావించి ముగ్గురు యువకులను స్థానికులు చితకబాదారు. ఈ ఘటన బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా జోడకురళి గ్రామంలో జరిగింది. బుధవారం వేకువజామున ముగ్గురు యువకులు గ్రామంలోకి వచ్చారు. అనుమానాస్పదంగా తిరుగుతుండగా మహిళలు అడ్డుకున్నారు. అనంతరం గ్రామస్తులు వారిని కరెంట్ స్తంభానికి కట్టేసి కొట్టారు. తర్వాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి విచారణ చేపట్టగా సదరు యువకులు రాయభాగ తాలూకా కెంపట్టి గ్రామానికి చెందినవారుగా తేలింది. వారు ఎందుకోసం వచ్చారనే విషయంపై ఆరా తీస్తున్నారు.

## సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్య

- వ్యాపారంలో నష్టాలు, అద్దె ఇంటి గొడవ...

మైసూరు: ఇల్లు ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తూ అద్దెకున్న వారిపై యజమాని గొడవ చేశాడు. దీంతో విరక్తి చెందిన వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన టీ.నరసీపుర తాలూకా హెమ్మిగె గ్రామం వద్ద జరిగింది. కేపీ మంజునాథ్ అనే వ్యక్తి హెమ్మిగెలోనే హోటల్ నడిపేవాడు. నష్టాలు రావడంతో బెంగళూరుకు మకాం మార్చాడు. కొన్ని రోజుల తరువాత హెమ్మిగెలో ఉండే అద్దె ఇంటికి వచ్చాడు. ఇంటి యజమాని బంక్ కుమారప్ప, రాజేశ్‌లు ఇల్లును ఖాళీ చేయాలని మంజునాథ్‌తో గొడవపడ్డారు. దీంతో ఆవేదనకు గురైన మంజునాథ్ ఇంట్లో సెల్ఫీ వీడియోలో తాను చనిపోతున్నట్లు రికార్డు చేశాడు. ఆ తర్వాత ఆ మొబైల్‌ను ఇంట్లోనే వదిలేసి బయటకు వచ్చాడు. దగ్గరిలోని నీటి కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తలకాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

**బస్సు అడ్డగించిన ఇద్దరు అరెస్టు**

ఆర్టీసీ బస్సును అడ్డగించి గొడవకు దిగిన ఇద్దరిని హుల్లహళ్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన నంజనగూడు తాలూకా కురిహుండి గ్రామంలో జరిగింది. శ్రీనివాస్, కీర్తి అనే వ్యక్తులు బైక్‌లో వచ్చి హుల్లహళ్లి నుంచి ఆకళ గ్రామానికి వెళుతున్న బస్సును అడ్డగించారు. ఆ తర్వాత బస్సు డ్రైవర్, కండక్టర్‌ను దూషిస్తూ బెదిరించారు. బస్సు డ్రైవర్, కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఇద్దరినీ అరెస్టు చేశారు.

### లోకాయుక్తకు పట్టుబడిన హెడ్ కానిస్టేబుల్



హెడ్ కానిస్టేబుల్ లోకేష్ (తెల్ల చొక్కా ధరించిన వ్యక్తి)

దొడ్డబళ్లాపురం: లంచం తీసుకుంటూ హెడ్ కానిస్టేబుల్ లోకాయుక్త పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన బెంగళూరు గ్రామీణ జిల్లా అనేకల్ తాలూకా అత్తిబెలె పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రమేష్ అనే వ్యక్తిపై అత్తిబెలె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. చార్జ్‌షీట్ నుంచి పేరు తొలగించి బెయిల్ అర్జీకి సహకరించేందుకు బెంగళూరు గ్రామీణ జిల్లా సీఈఎన్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ లోకేశ్ రూ.50వేలు లంచం డిమాండు చేశాడు. దీంతో రమేశ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. రూ.25వేలు అడ్వాన్స్ తీసుకుంటుండగా లోకాయుక్త పోలీసులు దాడిచేసి లోకేష్‌ను అరెస్ట్ చేశారు.

### తహసీల్దార్ సస్పెండ్‌పై ధర్నా

హోసూరు: కల్లకురిచ్చి తహసీల్దార్‌ను సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ బుధవారం రెవెన్యూ ఉద్యోగులు హోసూరు తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రత్యేక తహసీల్దార్ ముత్తుపాండి అధ్యక్షతన ధర్నా చేశారు. సస్పెన్షన్ ఉత్తర్వులను కలెక్టర్ వాపస్ తీసుకొని వెంటనే బాధ్యతల స్వీకరణకు అనుమతించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతుందని నినాదాలు చేశారు.

## 5 గంటల ఆలస్యంగా ఇండిగో విమానం

- పడిగాపులు గాసిన ప్రయాణికులు

దొడ్డబళ్లాపురం: ఇండిగో విమానం 5గంటల ఆలస్యంగా రావడంతో సుమారు 100 మంది ప్రయాణికులు విమానాశ్రయంలో పడిగాపులు గాశారు. ఈ ఘటన మంగళవారం కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో జరిగింది. సాయంత్రం 4–05 గంటలకు ఇండిగో(6ఈ–6572)విమానం కోల్‌కతాకు బయల్దేరాల్సి ఉంది. దాదాపు 100 మంది ప్రయాణికులు గంటలకొద్దీ వేచి ఉన్నా విమానం రాలేదు. ఎట్టకేలకు రాత్రి 9–33 గంటలకు విమానం వచ్చి ప్రయాణికులను తీసుకెళ్లింది. ఇండిగో ఎయిర్‌లైన్స్ సిబ్బంది తమను కనీసం మాట్లాడించలేదని, భోజనం చేశారా, లేదా విచారించలేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**9గంటలపాటు మెడికల్ విద్యార్థి వేదన**

ఇదిలా ఉండగా తల్లి మరణ వార్త విని కోల్‌కతాకు వెళ్లేందుకు విమానాశ్రయానికి విచ్చేసిన మెడికల్ విద్యార్థి సంజా రహీం తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఇతను బెంగళూరులోని ఒక మెడికల్ కళాశాలలో 4 సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్నాడు. తల్లి మృతి చెందినట్లు తెలియడంతో మధ్యాహ్నం 12 గంటలకే విమానాశ్రయం చేరుకున్నాడు. విమానం ఆలస్యం కావడంతో తీవ్ర వేదనకు గురయ్యాడు.

### రోడ్డు ప్రమాదంలో తెగిన తల



ప్రమాదంలో శివయ్య తల, మొండెం వేరు పడిన దృశ్యం

చిలమత్తూరు: హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కోడూరు మన్రో తోపు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటకలోని పావగడ తాలూకా రాయలచెరువుకు చెందిన శివయ్య (29) అనే యువకుడు గోరంట్లలో తన బంధువుల గృహప్రవేశానికి స్కూటర్‌లో వెళ్లాడు. అక్కడి నుంచి మళ్లీ బెంగళూరుకు బయలుదేరాడు. హైవే పక్కన ఆగి ఉన్న లారీని వేగంగా వెళ్లి ఢీకొట్టడంతో అతని మొండెం నుంచి తల తెగి ఎగిరి పడి అక్కడికక్కడే చనిపోయాడు. మొండెం, తల వేరు కావడం చూసి స్థానికులు, వాహనదారులు అయ్యో అని చలించిపోయారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## యువ వైద్యుని దుర్మరణం

క్రిష్ణగిరి: బైక్‌ను లారీ ఢీకొని యువ వైద్యుడు మృతి చెందాడు. ఈ ఘటన క్రిష్ణగిరి వద్ద జరిగింది. వివరాల మేరకు మధురై పెరుమాళ్ నగర్‌కు చెందిన లోకస్ కొడుకు మనోజ్ (25) క్రిష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో ఎంబీబీఎస్ పూర్తి చేసి శిక్షణ పొందుతున్నాడు. మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంలో క్రిష్ణగిరి వైపు వెళుతుండగా లారీ ఢీకొనడంతో ప్రమాదం ఏర్పడింది. తీవ్ర గాయాలేర్పడిన మనోజ్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. క్రిష్ణగిరి తాలూకా పోలీసులు శవాన్ని ఆస్పత్రికి తరలించారు.



**ఓనం.. నేత్రపర్వం**

బనశంకరి: ఓనం పండుగను పురస్కరించుకుని బనశంకరీ రెండోస్టేజ్‌లోని పిడిలిటస్ కార్ప్ సంస్థ మహిళా సిబ్బంది బుధవారం సంప్రదాయక వస్త్రధారణతో వివిధ పూలతో ముగ్గువేస్తున్న దృశ్యం

## హోసూరు వార్తలు..

## హోసూరులో రోడ్ల విస్తరణ

హోసూరు: హోసూరు నియోజకవర్గంలో రహదార్ల శాఖ ద్వారా రూ. 186 కోట్ల ఖర్చుతో రోడ్ల అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ శరయు, ఎమ్మెల్యే వై. ప్రకాష్ ప్రారంభించారు. హోసూరు కార్పొరేషన్, తళి, డెంకణీకోట, కెలమంగలం, టీవీఎస్ ప్రాంత రోడ్లను నాలుగు లేన్ల రోడ్లుగా మార్చేందుకు రహదార్ల శాఖ నిధులు మంజూరు చేసింది. ఈ నిధిలతో ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి హోసూరులోని శిష్యా పాఠశాల వరకు రూ. 42 కోట్ల ఖర్చుతో, టీవీఎస్ కంపెనీ నుంచి మత్తిగిరి కూడలి రోడ్డు వరకు రూ. 78 కోట్ల ఖర్చుతో తదితర ప్రాంతాల్లో మొత్తం 186 కోట్ల ఖర్చుతో రోడ్లు నిర్మిస్తారు. మేయర్ సత్య, కమిషనర్ స్నేహ, సబ్‌కలెక్టర్ శరణ్య పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న కలెక్టర్ తదితరులు

## అన్నాడీఎంకేలోకి చేరికలు

హోసూరు: బీజేపీకి చెందిన మహిళా కార్యకర్తలు బుధవారం అన్నాడీఎంకేలో చేరారు. పట్టణంలోని పార్టీ ఆఫీసులో క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి పి.బాలక్రిష్ణారెడ్డి సమక్షంలో బీజేపీ హోసూరు యూనియన్ మహిళా విభాగ అధ్యక్షురాలు నేతృత్వంలో 50 మందికిపైగా పార్టీలో చేరారు. మాజీ మంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థిని ఎక్కువ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### వానరాయుని ఊరేగింపు



కెలమంగలం: క్రిష్ణగిరి జిల్లాలో ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో కరువు కాటేసిందని, వర్షాలు కురవాలని ప్రార్థిస్తూ డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని మారుపల్లి గ్రామంలో వానరాయుని ఊరేగింపు నిర్వహించారు. వానరాయుని బొమ్మను తయారు చేసి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహిస్తే వర్షాలు కురుస్తాయని ప్రజల ప్రగాఢ నమ్మకం. అందులో భాగంగా మంగళవారం రాత్రి మారుపల్లి గ్రామస్తులు బంకమట్టితో వానరాయుని బొమ్మను తయారు చేసి చుట్టుప్రక్కల గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. యువకులు, పిల్లలు పాల్గొన్నారు.

### భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య

హోసూరు: గొడవలు జరగడంతో భార్య కోపగించుకొని పుట్టింటికెళ్లిపోవడంతో భర్త ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన సిఫ్‌కాట్‌లో చోటుచేసుకొంది. వివరాలు.. వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని కే.ఏ.మోటూరు ప్రాంతానికి చెందిన బాబు (38) కుటుంబంతో కలిసి హోసూరు పారిశ్రామికవాడ మూకొండపల్లిలో నివాసముంటూ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. ఇతనికి తాగుడు అలవాటుండడంతో తరచూ భార్య వద్దని గొడవపడేది. మంగళవారం రాత్రి కూడా పోట్లాట జరిగి భార్య పుట్టింటికెళ్లిపోవడంతో విరక్తి చెందిన బాబు ఆత్మహత్య చేసుకొన్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

### ఫుట్‌పాత్ వ్యాపారులకు గుర్తింపు కార్డులు

హోసూరు: హోసూరులోని 45 వార్డులలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసే వ్యాపారులకు బుధవారం హోసూరు కార్పొరేషన్‌లో మేయర్ ఎస్.ఏ.సత్య, కమిషనర్ స్నేహ గుర్తింపు కార్డులను అందజేశారు. మేయర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 1,897 మందికి కార్డులందజేశామని, వారికి మొదటి విడతగా రూ. 10 వేలు వడ్డీ లేని రుణాలు లభిస్తాయని చెప్పారు. సక్రమంగా చెల్లిస్తే మరింత మొత్తం రుణం వస్తుందని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కల్పించక దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ మేయర్ ఆనందయ్య, మండల అధ్యక్షులు రవి, కార్పొరేషన్ అధికార్లు పాల్గొన్నారు.

### ఘనంగా సత్యసాయి గిరిప్రదక్షిణ



ప్రశాంతి నిలయం: పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం సత్యసాయి గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రశాంతి నిలయం గణేష్ గేట్ వద్ద సత్యసాయి దివ్యరథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి సత్యసాయిని కీర్తిస్తూ ముందుకు సాగారు. గోకులం గణేష్ సర్కిల్, చింతతోపు మీదుగా పుట్టపర్తిలో ప్రవేశించి గణేష్ గేట్ వద్ద మంగళహారతితో ముగిసింది. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

## క్లుప్తంగా...

### డిపార్టుమెంటల్ టెస్టు ఫీజుల్లో మార్పు

సాక్షి, అమరావతి: ఏపీపీఎస్సీ నిర్వహించే డిపార్టుమెంటల్ టెస్టు పరీక్షలకు సంబంధించిన కొన్ని ప్రక్రియల ఫీజులను సవరిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టల్, స్టేషనరీ తదితర చార్జీల పెరుగుదలతో ఈ నిర్ణయం తీసుకుంది. ఏపీపీఎస్సీ ప్రతిపాదనలను అనుసరించి ప్రభుత్వం ఈ ఫీజుల సవరణకు అనుమతి ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. డిపార్టుమెంటల్ టెస్టు, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టులకు సంబంధించి రీ కౌంటింగ్‌కు ఇప్పటివరకు రూ.50 మాత్రమే ఫీజు ఉంది. దాన్ని రూ.300గా సవరించారు. అలాగే మార్కుల మెమోకు ఫీజు రూ.25 కాగా దాన్ని రూ.200గా సవరించారు.

### అక్టోబర్ 14, 15 తేదీల్లో ఎస్‌ఐ రాత పరీక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్ర పోలీస్‌శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్స్ (సివిల్), రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల కోసం నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన 57,923 మంది అభ్యర్థుల్లో 56,130 మంది స్టేజ్–2 పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించినట్టు రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్ సింగ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరికి ఆగస్టు 25 నుంచి విశాఖ, ఏలూరు, గుంటూరు, కర్నూలులో మెడికల్, ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తున్నామని, ఇవి సెప్టెంబర్ 25 నాటికి పూర్తవుతాయని పేర్కొన్నారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారికి అక్టోబర్ 14, 15 తేదీల్లో రాత పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. రాత పరీక్షలో నాలుగు పేపర్లు (రెండు డిస్క్రిప్టివ్, మరో రెండు ఆబ్జెక్టివ్) ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

### ఏయూ పరిశోధక విద్యార్థిగా ఆర్టీసీ ఎండీ

ఏయూక్యాంపస్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్‌లో పరిశోధక విద్యార్థిగా చేరారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి నుంచి బుధవారం ఆయన ధ్రువపత్రం అందుకున్నారు. అనంతరం వీసీతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఏయూలో బీబీఏ, ఎంబీఏ చేస్తున్న విద్యార్థులకు ఆర్టీసీలో ఇంటర్న్‌షిప్ కల్పించాలని కోరారు. వర్సిటీ నుంచి త్వరలో లిఖితపూర్వకంగా ప్రతిపాదన పంపుతామన్నారు. ఏయూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అందించడానికి ఆర్టీసీ ఎండీ సంసిద్ధత వ్యక్తం చేశారు.

### లాజిస్టిక్స్‌పై 'ఐటీఐ'లలో ప్రత్యేక కోర్సు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో లాజిస్టిక్స్‌పై ప్రత్యేక శిక్షణ కోర్సులను ప్రవేశపెట్టినట్టు రాష్ట్ర ఉపాధి శిక్షణ శాఖ ప్రకటించింది. ఇందుకోసం లాజిస్టిక్స్ సెక్టార్ కౌన్సిల్‌తో ఒప్పందం చేసుకున్నట్టు తెలిపింది. బుధవారం విజయవాడలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యదర్శి సురేష్‌కుమార్, ఉపాధి కల్పన శిక్షణ శాఖ డైరెక్టర్ బి.నవ్య, లాజిస్టిక్స్ సెక్టార్ కౌన్సిల్ సీఈవో రవికాంత్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో లాజిస్టిక్ రంగంలో వేర్ హౌస్ అసోసియేట్ కోర్సు పేరిట 620 గంటల శిక్షణ కార్యక్రమం అందిస్తామని, ఈ శిక్షణ పూర్తయ్యాక ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి రిటైల్ సంస్థల్లో రెండు నెలల పాటు ఉద్యోగ శిక్షణ ఇవ్వనున్నట్టు నవ్య వెల్లడించారు. ఈ రెండు నెలల శిక్షణ సమయంలో రూ.13,500 స్టైపెండ్ ఇస్తామని వివరించారు.

### 'రాచపాళెం'కు జీవిత సాఫల్య పురస్కారం

సాక్షి, అమరావతి: 75 ఏళ్లు పైబడిన సాహితీ విమర్శకులకు ఇచ్చే విమలా స్మారక సాహిత్య జీవిత సాఫల్య పురస్కారం 2023కు సంబంధించి ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు విమలా శాంతి సాహిత్య, సాంఘిక సాంస్కృతిక సేవా సమితి చైర్మన్ డా.శాంతినారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

### భలే.. తెల్ల కొండచిలువ

- కర్ణాటకలో కార్వార వద్ద లభ్యం



యశవంతపుర: చాలా అరుదుగా కనిపించే తెలుపు రంగు కొండచిలువ కర్ణాటకలో ఉత్తర కన్నడ జిల్లా కారవార సమీపంలోని కుమటాలో కనిపించింది. ఇది దేశంలోనే అతి పెద్ద తెలుపు కొండచిలువగా చెబుతున్నారు. అటవీ ప్రాంతంలో ఉండే హెగడ గ్రామంలో దేవి నారాయణ ముక్రి అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం ఈ తెలుపు కొండచిలువ చొరబడింది. దీంతో ఇంట్లోనివారు కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. స్థానికంగా పాములు పట్టడంలో నిపుణుడైన స్నేక్‌బాయ్ పవన్ నాయక్ దానిని పట్టుకుని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

**అల్బినో రకం..**

జంతువుల నిపుణులు మాట్లాడుతూ.. జన్యు మార్పుల వల్ల కొన్ని జంతువులు తమ నిజమైన రంగును కోల్పోయి తెల్ల రంగులో ఉంటాయని, వీటిని అల్బినో అంటారని చెప్పారు. అల్బినో కొండచిలువల్లో పసుపుపచ్చ చారలు ఉంటాయి, కానీ ఈ కొండచిలువ పూర్తి తెల్లగా ఉండడం చాలా అరుదని చెప్పారు.

# ముమ్మాటికీ హత్యాయత్నమే

## వైఎస్ జగన్‌ను హతమార్చాలనే కుట్రతోనే నిందితుడు దాడి

- తొలి నుంచీ ఓ పత్రిక (ఈనాడు) ఈ కేసులో బాధితుడైన జగన్‌ను అవహేళన చేసేలా కథనాలు
- ఆయుధమైన కోడి కత్తి పేరుతో కేసు తీవ్రతను చిన్నదిగా చూపే యత్నం
- సీఎం జగన్ ఎక్కడా సాక్ష్యం చెప్పడానికి రానని అనలేదు
- ప్రజలకు అసౌకర్యం కలిగించకూడదన్నదే ఆయన ఉద్దేశం
- అడ్వొకేట్ కమిషన్ ద్వారా సాక్ష్యాన్ని నమోదు చేయాలని కోరారు
- ఎన్‌ఐఏ సమగ్రంగా దర్యాప్తు చేయలనేదే మా వాదన
- మీడియా సమావేశంలో ఎన్‌ఐఏ కోర్టులో సీఎం జగన్ తరఫున న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లు

సాక్షి, అమరావతి: 'విశాఖ ఎయిర్‌పోర్టులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగింది ముమ్మాటికీ హత్యాయత్నమే. ఆయన్ని హతమార్చాలనే కుట్రతోనే నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావు దాడికి పాల్పడినట్టు ఎన్‌ఐఏ నివేదిక ఇచ్చింది. చార్జిషీట్‌లోనూ ఇదే పేర్కొంది. అంతకు ముందు సిట్ కూడా ఇదే చెప్పింది' అని ఎన్‌ఐఏ కోర్టులో సీఎం జగన్ తరఫు న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లు స్పష్టంచేశారు. కానీ, ఓ వర్గం మీడియా క్రియేటివ్ సెన్సేషన్ కోసమే కొత్త వ్యక్తుల పేర్లు తెరపైకి తెస్తోందని, దర్యాప్తు అధికారుల నివేదికకు విరుద్ధంగా ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. వెంకటేశ్వర్లు బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ఆయన చెప్పిన విషయాలు ఆయన మాటల్లోనే..

### నిందితుడే స్వచ్ఛందంగా అంగీకరించాడు


నిందితుడు శ్రీనివాసరావు గతంలో బెయిల్‌పై విడుదలైన తర్వాత తన న్యాయవాదితో (ఇప్పుడున్న న్యాయవాదే) కలిసి ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఆయనపై తానే దాడి చేశానని స్వచ్ఛందంగా అంగీకరించాడు. ఇప్పుడు అదే న్యాయవాది మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు ఆయుధాన్ని సమకూర్చారంటూ కొత్త వాదన తెరపైకి తేవడం సిగ్గుచేటు. న్యాయ స్థానంలో దాఖలు చేసిన పత్రాల్లోని విషయాన్ని చూడాలి తప్ప, కోర్టులో జరగనివి, జరిగినవి చెప్పడం కచ్చితంగా కోర్టు ధిక్కరణే. దీనికి బాధ్యులు చర్యలు ఎదుర్కోక తప్పదు. సీఎం జగన్‌పై హత్యాయత్నంలో నిందితుడు శ్రీనివాసరావు ఒక ఆయుధం మాత్రమే. అప్పటి ప్రభుత్వంలోని పెద్దల హస్తం లేకుండా ఈ ఘటన జరగడానికి అవకాశం లేదనడానికి అనేక అనుమానాలు ఉన్నాయి. కేవలం దర్యాప్తును, కోర్టు విచారణను తప్పుదోవ పట్టించడానికి, రాజకీయ లబ్ధి కోసం వ్యాఖ్యలు చేయడం న్యాయం కాదు.

### కోడి కత్తి అంటూ కేసు తీవ్రతను తగ్గించి చూపే ప్రయత్నం

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో ప్రజల్ని తప్పుదారి పట్టించడమే లక్ష్యంగా ఓ పత్రిక (ఈనాడు) మొదటి నుంచీ వ్యవహరిస్తోంది. ఘటన జరిగిన వెంటనే అప్పటి డీజీపీ ఆర్పీ ఠాకూర్ హడావుడిగా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి నిందితుడు జె.శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ అభిమాని అని ప్రకటించారు. సానుభూతి కోసమే ఈ హత్యాయత్నానికి పాల్పడ్డారని బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న డీజీపీ ఏకపక్షంగా ప్రకటించారు. అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారు. ఓ వర్గం మీడియా సైతం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం జరిగిన (2018 అక్టోబరు 25) మర్నాటి నుంచే ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా కథనాలు ప్రచురించింది. నిందితుడు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడని, అతనికి ఎలాంటి నేర చరిత్ర లేదని ఏకపక్షంగా రాసేశారు. ఆ దాడిలో వైఎస్ జగన్‌కు తీవ్రమైన గాయం అయ్యింది. ఆ కత్తి మెడలో దిగి ఉంటే ప్రాణాలు పోయేవని వైద్యులు



విశాఖ, విజయవాడ ఎన్‌ఐఏ కోర్టులకు పరిధిని నిర్ణయిస్తూ కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్



up and as he was ready to move, accused Janipalli Srinivasa Rao @ Chanti (A-1) went close to him and said to him "Sir you will win 160 seats in AP Assembly election". After that, accused took out a knife from the right pocket of his trousers and attacked Shri Y.S. Jagan Mohan Reddy and attempted to stab him on his neck with a sharp knife with intention to kill him and in the process inflicted an injury on the upper left arm of Shri Y.S. Jagan Mohan Reddy.

17.10.2. During custodial interrogation from 12.01.2019 to 18.01.2019, accused disclosed in the presence of independent witnesses that to execute his plan, he decided to attack Shri Y.S. Jagan Mohan Reddy using a knife generally used in the local sport of cock fighting which he had picked up in January 2018 from a cock fight venue at some place near his village in which he was a spectator.

18. CHARGE

18.1 On 25.10.2018 at about 12.45PM, accused Janipalli Srinivasa Rao @ Chanti (A-1) was present in the Lounge (adjacent to Fusion Foods restaurant) of Visakhapatnam International Airport and as per his premeditated plan, he attempted to stab Shri Y.S. Jagan Mohan Reddy on his neck with a sharp knife, with intention to kill him and in turn injured the top [illegible] part of his left arm. Thus he committed an offence under sec 307 IPC. Further as accused Janipalli Srinivasa Rao @ Chanti (A-1) also unlawfully used a weapon and committed an act of violence at the Airport, as defined in [illegible]

వైఎస్ జగన్‌పై హత్యాయత్నాన్ని నిర్ధారిస్తూ ఎన్‌ఐఏ చార్జిషీట్



న్యాయవాది వెంకటేశ్వర్లు

నిర్ధారించారు. పోలీసులు న్యాయస్థానానికి సమర్పించిన నివేదికలో కూడా ఇదే విషయాన్ని చెప్పారు. కానీ, ఓ ప్రతిక (ఈనాడు) మాత్రం వక్రీకరిస్తూ కథనాలు ప్రచురిస్తోంది. బాధితుడైన వైఎస్ జగన్‌ను అవహేళన చేస్తోంది. బ్లేడ్‌లతోనే ఎన్నో హత్యలు చేస్తున్నారు. కోడి కత్తి చిన్నగా ఉన్నా అత్యంత పదునుగా ఉంటుంది. కానీ కేసు తీవ్రతను తగ్గించి చూపించేందుకు ప్రతిసారీ కోడి కత్తి అంటూ ఓ ఆయుధాన్ని కేసుగా చూపిస్తూ దుష్ప్రచారం చేస్తోంది.

### కేసులున్న వ్యక్తికి ఎయిర్‌పోర్టులో ఉద్యోగం ఎలా?

నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావు విశాఖ విమానాశ్రయం రెస్టారెంట్ ఫ్యూజన్ ఫుడ్స్‌లో ఉద్యోగంలో చేరడంతోనే ఈ కుట్రకు బీజం పడింది. వాస్తవానికి విమానాశ్రయంలో పనిచేసే వారికి ఎలాంటి నేర చరిత్ర ఉండకూడదు. ఆ విషయాన్ని నిర్ధారిస్తూ నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేస్తేనే ఉద్యోగంలో చేర్చుకోవాలి. శ్రీనివాసరావుకు ఎలాంటి నేర చరిత్ర లేదని ఎన్‌వోసీ ఎవరు ఇచ్చారన్నది కీలకంగా మారింది. శ్రీనివాసరావుపై 2017లో అప్పటి తూర్పు గోదావరి జిల్లా ముమ్మిడివరంలో ఓ కేసు నమోదైంది. పోలీసులు ఆయనపై ఎఫ్‌ఐఆర్‌తో పాటు చార్జిషీట్ కూడా దాఖలు చేశారు. అంటే అతనికి నేర చరిత్ర ఉన్నట్టే. పైగా, అతన్ని రెస్టారెంట్‌లో చేర్పించడానికి ఫ్యూజన్ ఫుడ్స్ యజమాని హర్షవర్ధన్ చౌదరి ఆత్రుత కనబరచడం గమనార్హం. శ్రీనివాసరావుపై విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ విమానాశ్రయ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి కేసులు లేవని ఆ పోలీస్ స్టేషన్ అధికారి ఎన్‌వోసీ ఇచ్చారు. ఇతర ప్రాంతాల్లో అతనిపై కేసులు ఉన్నాయో లేవో వారికి తెలియదని చెప్పినట్టే. కానీ హర్షవర్ధన్ చౌదరి మాత్రం శ్రీనివాసరావుపై ఎక్కడా ఎలాంటి నేర చరిత్ర లేదని తానే సొంతంగా నిర్ధారిస్తూ ఎన్‌వోసీ సమర్పించారు. ఏ ప్రాతిపదికన ఆయన అలా చెప్పారు? అంటే శ్రీనివాసరావు నేర చరిత్రను గోప్యంగా ఉంచుతూ డీజీసీఏను తప్పుదోవ పట్టిస్తూ మరీ ఎన్‌వోసీ ఇచ్చారు. ఇందులో కచ్చితంగా కుట్రకోణం ఉంది.

### కుట్రకోణం ఉంది.. అనుమానాలివే

తనపై హత్యాయత్నం వెనుక కుట్రకోణం ఉందని ఈ కేసులో బాధితుడైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన వాంగ్మూలంలో స్పష్టంగా పేర్కొన్నారు. అందుకు బలాన్ని చేకూరుస్తూ స్పష్టమైన అంశాలను ప్రస్తావించారు. నేర చరిత్ర ఉన్న నిందితుడు శ్రీనివాసరావును విమానాశ్రయంలోని ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంట్‌లో ఉద్యోగంలో చేర్పించడం, కట్టుదిట్టమైన భద్రత ఉండే విమానాశ్రయంలోకి నిందితుడు ఆయుధాన్ని అక్రమంగా తీసుకురావడం, ఆ రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్ చౌదరి టీడీపీ నేత కావడం మొదలైన అంశాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

### సాక్ష్యం చెప్పడానికి రానని సీఎం చెప్పలేదు

ఎన్‌ఐఏ దర్యాప్తు అనంతరం తొలి చార్జిషీట్ దాఖలు చేసేటప్పుడు వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో పెద్ద కుట్రకోణం దాగి ఉందని, తదుపరి దర్యాప్తు చేపడతామని పేర్కొంది. తొలుత 39 మంది సాక్షులను తూతూమంత్రంగానే విచారించి వదిలేసింది. 2019 జనవరి 23న చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత ఇప్పటివరకు ఒక్క సాక్షిని కూడా విచారించలేదు. ఒక్క డాక్యుమెంట్‌ను కూడా సేకరించలేదు. సిట్ అధికారులు ఇచ్చిన రికార్డులను మాత్రమే 2019 జూలై 23న కోర్టులో దాఖలు చేశారు. తాజాగా కొత్త అంశాలు వెలుగులోకి రాలేదని మాత్రమే కోర్టులో చెప్పింది. దర్యాప్తు అవసరం లేదని ఎక్కడా రాయలేదు. కానీ ఎల్లో మీడియా మాత్రం ఇకపై ఎన్‌ఐఏ విచారణ అవసరం లేదని చెప్పినట్టు రాస్తోంది. ఈ కేసులో సీఎం జగన్ సాక్ష్యం చెప్పడానికి కోర్టుకు రానని ఎక్కడా చెప్పలేదు. తన సాక్ష్యం రికార్డు ప్రక్రియలో ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని మాత్రమే చెప్పారు. అడ్వొకేట్ కమిషన్ ద్వారా సాక్షులను విచారించే అవకాశం ఉందని, దాని ప్రకారం తనను విచారించాలని అనుమతి కోరుతూ ఎన్‌ఐఏ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని కూడా వక్రీకరిస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసును ఎన్‌ఐఏ కోరిక మేరకే విశాఖపట్నం ఎన్‌ఐఏ న్యాయస్థానానికి బదిలీ చేశారు. దీనిపైనా ఎల్లో మీడియా అసత్య ప్రచారం చేస్తోంది. ఉత్తరాంధ్ర, ఉమ్మడి గోదావరి జిల్లాలు విశాఖ ఎన్‌ఐఏ న్యాయస్థానానికి, మిగిలిన జిల్లాల్లోని కేసుల విచారణ పరిధి విజయవాడ న్యాయస్థానానికి ఉంటుంది. దీనికి అనుగుణంగానే కేంద్ర ప్రభుత్వం సైతం జీవో ఇచ్చింది.

### కుట్ర కోణాన్ని, సూత్రధారులపై సమగ్ర దర్యాప్తు చేయాలి

హత్యాయత్నం వెనుక కుట్రను ఛేదించాలని, దాని వెనుక ఎవరున్నారన్నది తేల్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫున ఎన్‌ఐఏను, న్యాయస్థానాన్ని కోరుతూ పిటిషన్ దాఖలు చేశాం. ఎన్‌ఐఏ సమగ్రంగా దర్యాప్తు చేయాలనేదే మా వాదన. అందులో మేం చెప్పిన అంశాలివీ..

- ➤ విశాఖపట్నం విమానాశ్రయంలోని రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్ చౌదరికి, నిందితునికి ఉన్న సంబంధం ఏమిటి?
- ➤ నిందితుడు శ్రీనివాసరావుపై గతంలో కేసులు ఉన్నప్పటికీ, విమానాశ్రయంలోని రెస్టారెంట్‌లో ఉద్యోగిగా ఎలా చేర్చుకున్నారు? ఈ విషయాన్ని ఎన్‌ఐఏ చార్జిషీట్‌లో చెప్పిన విషయం వాస్తవమే కదా!
- ➤ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నం విమానాశ్రయం లాంజ్‌లో ఉన్నప్పుడు కాఫీ ఇచ్చేందుకు నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావునే ఎందుకు పంపించారు?
- ➤ హర్షవర్ధన్ చౌదరికి విశాఖపట్నం విమానాశ్రయంలో రెస్టారెంట్ కాంట్రాక్టు దక్కడం వెనుక ఎవరు కీలకంగా వ్యవహరించారు?
- ➤ హర్షవర్ధన్ చౌదరి, నారా లోకేశ్ మధ్య ఉన్న సంబంధం ఏమిటి?
- ➤ ఎన్‌ఐఏకి రికార్డు ఇవ్వొద్దని సిట్ దర్యాప్తు అధికారి శ్రీనివాసరావును అప్పటి డీజీపీ ఎందుకు ఆదేశించారు? కోర్టు చెప్పిన తర్వాత కూడా ఇవ్వడానికి ఎందుకు నిరాకరించారు?
- ➤ స్థానిక పోలీసులు బయోమెట్రిక్ హాజరు మిషన్‌ను సీజ్ చేసి వివరాలు సేకరించగా అందులో నిందితుడు శ్రీనివాసరావు పేరు నమోదు కాలేదు. హర్షవర్ధన్ కూడా పేరు ఎంట్రీ చేయలేదని చెప్పారు. కానీ, ఎన్‌ఐఏ దగ్గరికి వచ్చేసరికి బయోమెట్రిక్ హాజరులో నిందితుడు అక్కడే పని చేస్తున్నట్టు, దాడి జరిగిన రోజు కూడా అక్కడే ఉన్నట్టు చెప్పారు. ఇవి పరస్పర విరుద్ధ అంశాలు.
- ➤ అదే రోజు విమానాశ్రయం లాంజ్‌లో సీసీ కెమెరాలు ఎందుకు పని చేయలేదు?

# 15 నుంచి నూతన రిజిస్ట్రేషన్ల విధానం

- 1 నుంచి ప్రారంభం..
  15 నాటికి రాష్ట్రమంతా అమలు



సాక్షి, అమరావతి: సెప్టెంబర్ నుంచి రాష్ట్రంలో నూతన రిజిస్ట్రేషన్ల విధానాన్ని అమలు చేయనున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, ఐజీ వి.రామకృష్ణ తెలిపారు. 1వ తేదీ నుంచి ఈ విధానాన్ని ప్రారంభిస్తున్నామని.. 15 నాటికి దశల వారీగా రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తీసుకువస్తామన్నారు. దీనిపై ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రిజిస్ట్రేషన్ల శాఖలో ప్రస్తుతం వినియోగంలో ఉన్న కార్డ్ 1.0 (సీఏఆర్‌డీ–కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్) వెర్షన్‌ను 1999లో రూపొందించారని చెప్పారు. ప్రస్తుతం పెరిగిన ప్రజల అవసరాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ సేవలను వేగంగా, నాణ్యంగా, సురక్షితంగా పూర్తి చేయడానికి కార్డ్ 2.0 వెర్షన్‌ను రూపొందించి అమల్లోకి తీసుకొస్తున్నామన్నారు. కొత్త విధానంలో యజమానుల సంతకాలతో ఉండే భౌతిక దస్తావేజులు పూర్తిగా కనుమరుగవుతాయనేది కేవలం అపోహ మాత్రమేనని స్పష్టం చేశారు. కార్డ్ 2.0లో దస్తావేజులను ఆన్‌లైన్‌లో తయారుచేసుకుని, ఆన్‌లైన్‌లోనే స్లాట్ బుక్ చేసుకుని, ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసుకోవచ్చన్నారు. లేనిపక్షంలో తాము తయారు చేసుకున్న దస్తావేజు సాఫ్ట్ కాపీని అప్‌లోడ్ కూడా చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని వెల్లడించారు.

### 20 నిమిషాల్లోనే దస్తావేజుల జారీ..

ప్రస్తుత విధానంలో యజమానులు తాము తయారుచేసుకున్న దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందని రామకృష్ణ గుర్తు చేశారు. కొత్త విధానంలో ప్రజలకు సమయం ఆదా అవుతుందన్నారు. అంతేకాకుండా దస్తావేజులోని వివరాలు వారే నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దీనివల్ల దస్తావేజులు తప్పులు లేకుండా ఉంటాయని చెప్పారు. చెల్లించాల్సిన రిజిస్ట్రేషన్ చార్జీల వివరాలను వారే సొంతంగా లెక్కించుకోవచ్చని, ఆ చార్జీలను సులువుగా ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా చెల్లించవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ కోసం తమకు కుదిరే టైమ్ స్లాట్ బుక్ చేసుకొని కేవలం 20 నిమిషాల్లోనే సాఫీగా పని పూర్తిచేసుకోవచ్చని తెలిపారు. దస్తావేజుల స్కానింగ్ ప్రక్రియ కూడా ఉండదని.. రిజిస్ట్రేషన్ తర్వాత 20 నిమిషాల్లోనే దస్తావేజులు కూడా జారీ చేస్తారన్నారు. ఆధార్ లింక్ చేయడం వల్ల తప్పుడు వ్యక్తులు రిజిస్ట్రేషన్లు చేసుకునే ప్రమాదం కూడా ఉండదన్నారు. దస్తావేజుల తయారీదారులు, లేఖరులు, న్యాయ నిపుణులకు కొత్త విధానం వల్ల పని సులువు అవుతుందని వెల్లడించారు. వారి ఉపాధి పోతుందనేది అపోహ మాత్రమేనన్నారు. ఈ విధానంలో వినియోగదారులు.. మధ్యవర్తులపై ఆధారపడకుండా తమ రిజిస్ట్రేషన్‌ను తామే సులువుగా పూర్తిచేసుకోవచ్చన్నారు. ఎలాంటి డాక్యుమెంట్లను సబ్ రిజిస్ట్రార్ దగ్గరకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదని చెప్పారు.

### రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక వెంటనే ఆటోమ్యుటేషన్..

కొత్త విధానంలో వ్యవసాయ భూమికి సంబంధించిన విక్రయ రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక మళ్లీ వ్యక్తిగతంగా తహశీల్దార్ కార్యాలయాన్ని మ్యుటేషన్ కోసం సంప్రదించాల్సిన అవసరం ఉండదన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆటోమేటిక్ మ్యుటేషన్ జరిగేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని ఈ విధానాన్ని రూపొందించామని తెలిపారు. రిజిస్ట్రేషన్ల కోసం దస్తావేజులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా అధికారులకు సమర్పించే అవకాశం ఉంటుందన్నారు. ఏమైనా సందేహాలుంటే http://registration.ap.gov.inలో నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు.

### ఎంబీబీఎస్ అడ్మిషన్లలో అన్యాయాన్ని అరికట్టండి

- సజ్జలకు మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్, బీసీ సంక్షేమ సంఘం వినతి

గుంటూరు మెడికల్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయ ఎంబీబీఎస్ అడ్మిషన్లలో రిజర్వేషన్ వర్గాల అభ్యర్థులకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కోరారు. వారు బుధవారం సజ్జల నివాసంలో ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ జీవో నంబర్ 550, జీవో నంబర్ 111లననుసరించి ఓపెన్ కాంపిటీషన్ సీట్లను మొట్టమొదట భర్తీ చేయాలన్నారు. రెండో రౌండ్ నుంచి ఈ జీవోలను సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల తక్కువ మార్కులు వచ్చిన వారికి ఓపెన్ కాంపిటీషన్లో, ఎక్కువ మార్కులు వచ్చిన వారికి రిజర్వేషన్‌లో సీట్లు కేటాయిస్తున్నారన్నారు. ప్రస్తుతం జరగనున్న రెండో రౌండ్ మెడికల్ అడ్మిషన్స్‌లో అన్ని జీవోలనూ సక్రమంగా అమలు చేయాలన్నారు.

# పొత్తులు లేకుండా పోరాడే ధైర్యముందా?

- చంద్రబాబుకు సజ్జల సవాల్
- ప్రధాని మోదీని తిట్టిన నోటితోనే పొగడ్తలా?
- కాళ్లు పట్టుకోగలిగే నేర్పు చంద్రబాబుకే సొంతం
- ప్రభుత్వ వ్యతిరేక ఓటే లేదు.. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు పొత్తులు లేకుండా పోటీ చేయాలనే ఆలోచన చేసే ధైర్యం కూడా లేదని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు బీజేపీతో పొత్తు కోసం నడ్డాతో వంగివంగి నంగినంగిగా మాట్లాడారని చెప్పారు. 2019 ఎన్నికలకు ముందు ప్రధాని మోదీని నోటికొచ్చినట్లు దూషించిన నోటితోనే ఇప్పుడు పొగుడుతున్నారని గుర్తు చేశారు. ఎవరినైనా సరే తిట్టిన గంటలోనే కాళ్లు పట్టుకోగలిగే నేర్పు ఒక్క చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సజ్జల బుధవారం మీడియాతో మాట్లాడారు.

### ప్యాకేజీ చాలని.. సన్మానాలు నిర్వహించి

టీడీపీపై పూర్తిగా నమ్మకం కోల్పోయిన కార్యకర్తలను కాపాడుకోవడానికే చంద్రబాబు పొత్తుల కోసం పాకులాడుతున్నారు. పవన్ కళ్యాణ్‌తో కలసి పోటీ చేసేందుకు సిద్ధమైన చంద్రబాబు ఇప్పుడు బీజేపీతో పొత్తుల కోసం తహతహలాడుతున్నారు. కమీషన్ల దాహంతో పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకోవడం కోసం ప్రత్యేక హోదాను చంద్రబాబు 2016లో కేంద్రానికి తాకట్టు పెట్టారు. ప్రత్యేక హోదా కంటే ప్యాకేజీతోనే అధికంగా ప్రయోజనం చేకూరుతుందని చంద్రబాబు సంబరాలు చేసుకున్నారు. నాటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని కూడా ఆయన సన్మానించారు. ప్రత్యేక హోదా కోసమే ఎన్డీఏ నుంచి బయటకొచ్చామని, అంతకు మించి బీజేపీతో విభేదాలు లేవంటూ ఇప్పుడు పచ్చి అబద్ధాలు వల్లిస్తున్నారు.

### బఫూన్‌కు ఎక్కువ.. జోకర్‌కు తక్కువ..

రాష్ట్రంలో 175 స్థానాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులే లేని టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారంటూ చంద్రబాబు జోకులు వేస్తున్నారు. ఆయన వ్యవహార శైలి బఫూన్‌కు ఎక్కువ.. జోకర్‌కు తక్కువ. జనసేన, బీజేపీతో పొత్తు ఉండదని చంద్రబాబు ప్రకటిస్తే లోకేశ్ పాదయాత్రకు వస్తున్న అరకొర కార్యకర్తలు కూడా మొహం చాటేయడం ఖాయం.

### వ్యతిరేక ఓటు ఉంటే కదా ఏకం చేయడానికి?

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన సీఎం వైఎస్ జగన్ గత 50 నెలలుగా అందిస్తున్న సుపరిపాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. 2019 ఎన్నికల తర్వాత జరిగిన పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, తిరుపతి లోక్‌సభ.. బద్వేలు, ఆత్మకూరు శాసనసభ స్థానాల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రికార్డు స్థాయి విజయాలు సాధించడమే అందుకు నిదర్శనం. వైఎస్సార్‌సీపీకి 70 శాతం మంది ప్రజలు మద్దతు పలుకుతున్నారు. వ్యతిరేకంగా ఉన్నాయని ప్రతిపక్షాలు భావిస్తున్న 30 శాతం ఓట్లు ఏకమైనా ఒరిగేదేముంది?2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయభేరి మోగించడం ఖాయం. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన 600 హామీల్లో ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. ఆయన ఇప్పుడు ప్రకటించిన తొలి విడత మేనిఫెస్టో టీడీపీ నేతలకే గుర్తు లేదు. రాష్ట్రం అప్పుల పాలవుతోందని, శ్రీలంకలా మారుతోందని విమర్శలు చేసిన చంద్రబాబు తాను సీఎం జగన్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలను అమలు చేస్తానంటూ బుకాయిస్తున్నారు.

### ఎన్టీఆర్ ఆత్మకూ వెన్నుపోటు..

ఎన్టీఆర్ అగ్నిసాక్షిగా లక్ష్మీ పార్వతిని వివాహం చేసుకున్నారని, 1994 ఎన్నికల్లో వారిద్దరూ కలిసి ప్రచారం చేసి టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చారని, తద్వారా వారి వివాహాన్ని ప్రజలు హర్షించారని సజ్జల గుర్తు చేశారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని, టీడీపీని హస్తగతం చేసుకున్న చంద్రబాబుకు ఇప్పటికీ సొంత గుర్తింపు లేదన్నారు. అవసరమైనప్పుడల్లా ఎన్టీఆర్ బొమ్మను వాడుకుంటున్నారన్నారు. ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమానికి ఆయన భార్య లక్ష్మీపార్వతిని ఆహ్వానించకుండా ఎన్టీఆర్ ఆత్మకు మరోసారి వెన్నుపోటు పొడిచి క్షోభ పెట్టారని మండిపడ్డారు. బీజేపీలోకి చంద్రబాబు పంపిన ఏజెంట్లతోపాటు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి టీడీపీ ఏజెంట్‌లా పనిచేస్తున్నారని దుయ్యబట్టారు.

# వైఎస్సార్‌సీపీలోకి జనసేన నేత

రాజానగరం: తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం నుంచి గత సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున పోటీ చేసి, ఓటమి చెందిన రాయపురెడ్డి ప్రసాద్ (చిన్న) వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాక వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధికి సీఎం జగన్ ఇస్తున్న ప్రాధాన్యతకు ఆకర్షితుడనై పార్టీలో చేరినట్టు చిన్న తెలిపారు.



సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నేత రాయపురెడ్డి ప్రసాద్ (చిన్నా)


# వార్షిక కౌలుపై పిటిషన్ తిరస్కరణ

- సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోవాలని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: వార్షిక కౌలు చెల్లింపు వ్యవహారంపై అత్యవసర విచారణ జరపాలన్న రాజధాని రైతుల అభ్యర్థనను హైకోర్టు ధర్మాసనం తిరస్కరించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ధర్మాసనం ముందు రైతుల తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు బుధవారం ఈ అభ్యర్థన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వార్షిక కౌలు చెల్లించడంలేదని, దీనిపై తాము సింగిల్ జడ్జి ముందు పిటిషన్ దాఖలు చేశామని తెలిపారు. సింగిల్ జడ్జి ప్రభుత్వానికి, సీఆర్‌డీఏకు నోటీసులు మాత్రమే జారీ చేశారని చెప్పారు. ఈ నేపథ్యంలో తాము అప్పీల్ దాఖలు చేయాలని అనుకుంటున్నామని, దీనిపై



అత్యవసర విచారణ జరపాలని అభ్యర్థించారు. ఇందుకు ధర్మాసనం నిరాకరించింది. ఈ వ్యవహారాన్ని సింగిల్ జడ్జి ముందే తేల్చుకోవాలని స్పష్టం చేసింది. సింగిల్ జడ్జి నోటీసులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేసింది. సింగిల్ జడ్జి ఎలాంటి ఉత్తర్వులూ జారీ చేయనప్పుడు దేనిపై అప్పీల్ దాఖలు చేస్తారని ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో తాము ఏ విధంగానూ జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది.



# రాకింగ్ మామ







**ఈ** రోజు శ్రావణమాసం, పున్నమి రోజు. రక్షాబంధన్ వేడుక చేసుకుంటున్నాం. ఆడపడుచులు పుట్టింటికి వస్తారు. అన్నదమ్ముల శ్రేయస్సు కోరుతూ అక్కచెల్లెళ్లు భగవంతుడికి పూజ చేసి, తీపి వంటకాలను నివేదన చేస్తారు. పూజలో ఉంచిన రక్షాబంధనాన్ని అన్నదమ్ముల ముంజేతికి కట్టి 'ఇది నీకు రక్ష, నువ్వు నాకు రక్ష' అని మమతలు పూయిస్తారు. పురాణకాలంలో యమున తన సోదరుడు యముడికి రాఖీ కట్టింది. శ్రీకృష్ణుడికి వరుసకు చెల్లెలైన ద్రౌపది రాఖీ కట్టింది. చరిత్రకాలంలో రాణి కర్ణావతి చక్రవర్తి హుమయూన్‌కి రాఖీ పంపింది. ఈ కథనాలను చదువుకున్నాం. రాఖీ మీద వచ్చిన సినిమాలను చూశాం. సినిమాలో హీరోకి అక్క పాత్ర కట్టినంత అందమైన రాఖీని చూసినప్పుడు ఈ సారి రక్షాబంధన్‌కి తన తమ్ముడికి కూడా అలాంటి అందమైన రాఖీనే కట్టాలని ప్రతి అక్కా ఉవ్విళ్లూరుతుంది. అలా వచ్చినవే రకరకాల రాఖీలు. ముత్యాలను పోలిన తెల్లటి పూసలతో అల్లిన రాఖీలు, కెంపుల వంటి రాళ్ల పాదిగిన రాఖీలు, తెల్లటి రాళ్ల, పచ్చటి చమ్కీలతో మెరిసే రాఖీలు, రంగురంగు పూసల రాఖీలు, మువ్వల రాఖీలు రూపుదిద్దుకున్నాయి. ఎకో ఫ్రెండ్లీగా మట్టి రాఖీలు మణికట్టును ఆకట్టుకున్నాయి. బంగారు, వెండి రాఖీలు రాజ్యమేలాయి. ఈ ఏడాది మాత్రం రాఖీల్లో చందమామ హీరో అయ్యాడు. రాఖీల మీద రాకింగ్ చేస్తున్నాడు.

ఇక మేమైతే ఈ ఏడాది నీ రాఖీలతో పండుగ చేసుకుంటున్నాం. అమ్మాయిల చెవులు పట్టుకుని ఉయ్యాలలూగిన చాంద్‌బాలీలు ఇప్పుడు అబ్బాయిల మణికట్టు మీద మకుటాయమానంగా మెరుస్తున్నాయి. అర్ధవలయాకారంలో నువ్వు ముంజేతి మీద ఉంటే ప్రతి అబ్బాయీ 'మా అక్క కట్టింది చూడు' అని ప్రియురాలికి చూపించుకుంటూ తామే చందమామ అయినట్లు మురిసిపోతున్నారు... మెరిసిపోతున్నారు నీ మేనల్లుళ్లు.

చందమామ రావే... జాబిల్లి రావే...
అని పాలబువ్వ తిన్నన్ని రోజులూ పాడుతూనే ఉన్నాం. నీ పాట పాడుతూ, నువ్వు వస్తావని నమ్ముతూనే పెరిగాం. పెద్దయిన తర్వాత రావోయి చందమామా అని పిలిచాం. వస్తాడు నా రాజు ఈ రోజు అని దొంగచూపులు, బెంగచూపులు చూశాం. నెలవంక కోసం ఆకాశంలో వెతికాం. పున్నమి రోజు నీ వెన్నెల కోసం ఎదురుచూస్తుంటాం. మా చిన్నప్పుడు మా అమ్మ 'నిన్ను అంతగా పిలిచింది' ఎన్ని తరాలు పిలిచినా, ఎన్ని తరాల అమ్మలు పిలిచినా నువ్వు రాలేదు. అందుకే మేమే నీ దగ్గరకు వచ్చేశాం. అమ్మలందరికీ అమ్మ మా భూమాత. భూమి తల్లి తన ప్రతినిధిగా నీ దగ్గరకు విక్రమ్‌ని పంపించింది చూశావు కదా! అమ్మకు తమ్ముడంటే చాలా ఇష్టం మామా! రక్షా బంధన్ పండుగకు నీకు రాఖీ కట్టడానికే విక్రమ్‌ని పంపించింది చూడు!

మరి!!! రక్షాబంధన్ కట్టించుకున్న నువ్వు... అమ్మకు బహుమతి ఏమిస్తున్నావ్ చందమామా!

# శాక్సాఫోన్ సుబ్బలక్ష్మి



సుబ్బలక్ష్మి



**సుబ్బలక్ష్మి ఇంటి పేరు ఎవరికీ తెలియదు. ప్రపంచమంతా ఆమెను శాక్సాఫోన్ సుబ్బలక్ష్మి అనే పిలుస్తుంది. మగవారు మాత్రమే వాయించే ఈ వాయిద్యంలో సుబ్బలక్ష్మి స్త్రీగా ఉనికి సాధించింది. పట్టుచీర, వడ్డాణం ధరించి వేదిక మీద సంప్రదాయ ఆహార్యంలో ఈ ఆధునిక వాయిద్యం మీద వెస్ట్రన్, కర్నాటక్‌లో అద్భుత ప్రతిభ చూపుతుంది. డైరీలో ఒకరోజు కూడా ఖాళీ ఎరగని ఈ బెంగళూరు వాద్యకారిణి సక్సెస్ స్టోరీ.**

40 ఏళ్ల సుబ్బలక్ష్మి ప్రోగ్రామ్ ఏర్పాటు చేయాలంటే సంవత్సరం ముందు బుక్ చేసుకోవాలి. ఆమె డైరీలో ఒక్కరోజు కూడా ఖాళీ ఉండదు. ఇవాళ చెన్నై, రేపు బెంగళూరు, ఎల్లుండి దుబాయ్... ఆమె కచ్చేరీలు సాగిపోతూ ఉంటాయి. భర్త కిరణ్ కుమార్‌కు ఐ.టి. రంగంలో మంచి ఉద్యోగం. కానీ ఈమె కచ్చేరీల బిజీ చూసి ఉద్యోగం మానేసి సాయంగా ఉంటున్నాడు. బెంగళూరులో నివాసం ఉండే సుబ్బలక్ష్మి సొంతింట్లో ఉండేది తక్కువ. కచ్చేరీలకు తిరిగేది ఎక్కువ. కాని ఈ విజయం అంత సులువు కాదు సుమా.

**ఒక్కతే శిష్యురాలు**

సుబ్బలక్ష్మి పూర్తిపేరు ఎం.ఎస్.సుబ్బలక్ష్మి. అవును. మహా గాత్ర విద్వాంసులు ఎం.ఎస్.సుబ్బులక్ష్మిని జ్ఞప్తికి తెచ్చే పేరు. ఆ పేరు ప్రభావమో, ఇంట్లో సంగీతం ఉండటమో సుబ్బలక్ష్మికి కూడా సంగీతం మీద ఆసక్తి ఏర్పడింది. సుబ్బలక్ష్మి తాత మైసూర్ సంస్థానంలో ఆస్థాన సంగీత విద్వాంసుడుగా ఉండేవాడు. సుబ్బలక్ష్మి తండ్రి సాయినాథ్ మంగళూరులో మృదంగ విద్వాంసుడు. అతడు అనేకమంది సంగీతకారులకు కచ్చేరీల్లో వాద్య సహకారం అందించేవాడు. ఐదో ఏట నుంచే గాత్ర సంగీతం నేర్చుకుంటున్న సుబ్బలక్ష్మి ఒకసారి తండ్రితోపాటు కచ్చేరికి వెళ్లింది. అది శాక్సాఫోన్ విద్వాంసుడు కద్రి గోపాల్‌నాథ్ కచ్చేరి. అందులో గోపాల్‌నాథ్ అద్భుతంగా శాక్సాఫోన్ వాయిస్తుంటే సుబ్బలక్ష్మి మైమరిచిపోయింది. తాను కూడా శాక్సాఫోన్ నేర్చుకోవాలనుకుంది. అప్పుడు ఆమెకు 13 ఏళ్లు. ఆ రోజుల్లో ఆడపిల్లలు శాక్సాఫోన్‌ను అంతగా నేర్చుకునేవారు కాదు. గురువులు నేర్పించేవారు కూడా కాదు. అది పూర్తిగా మగవారి వాయిద్యం. కాని సుబ్బలక్ష్మి పట్టుబట్టింది. మొత్తం 16 మంది శిష్యులు ఆ సమయంలో కద్రి గోపాల్‌నాథ్ దగ్గర ఉంటే వారిలో ఒకే ఒక శిష్యురాలు సుబ్బలక్ష్మి.



**ఎన్నో వెక్కిరింతలు**

సాధనలో అబ్బాయిలు సుబ్బలక్ష్మిని అస్సలు సహించలేదు. 'నేను శాక్సా పట్టుకుని సాధన చేస్తుంటే వాళ్లు నవ్వుతుండేవారు. కుర్చీ కిర్రుకిర్రుమన్నట్టు ఉంది అనేవారు. గురువు గారి భార్య మా అమ్మకు స్నేహితురాలు. వీళ్లు నవ్వుతుంటే ఆమె బయటికొచ్చి చూసి- వాళ్లు నవ్వనీ ఏమైనా అననీ... నువ్వు మాత్రం ట్రై చేస్తూనే ఉండు. నీకు వస్తుంది అని ఎంకరేజ్ చేసింది. ఆమె ప్రోత్సాహం వల్ల ధైర్యం తెచ్చుకున్నాను. నేను శాక్సాఫోన్ నేర్చుకోవడంలో ప్రోత్సాహం కంటే అవమానమే ఎక్కువ. కచ్చేరీల్లో కావాలని నా టైము మధ్యాహ్నం ఇచ్చేవారు. ఆ సమయంలో ఆడియెన్స్ ఉండరు. మహా అయితే పది నిమిషాలు కేటాయించేవారు. మగవారు సాయంత్రం నిండు సభలో వాయించేవారు. వారికి గంట సమయం దొరికేది. నన్ను ప్రత్యేకంగా మహిళా శాక్సాఫోనిస్ట్ అని విడిగా చూసేవారు' అని తెలిపింది సుబ్బలక్ష్మి.

**గర్భం దాల్చాక కూడా**

సుబ్బలక్ష్మి శాక్సాఫోన్ వాయించడంలో ఒక వరుస ఉంటుంది. ఆమె మొదట కర్నాటక సంగీతం వాయించి ఆ తర్వాత ఫ్యూజన్‌లోకి వస్తుంది. వెస్ట్రన్‌ను, కర్నాటక్‌ను మిళితం చేసి కచ్చేరీల్లో ఒక ఊపు తెస్తుంది. అది జనానికి నచ్చుతుంది. ఇది కూడా కొంతమంది శాక్సాఫోన్ విద్వాంసులకు నచ్చదు. ఆమెను విమర్శిస్తుంటారు. 'నన్ను ఎన్నో విమర్శిస్తారు. కాని నేను భయపడలేదు. కచ్చేరీలు కొనసాగించాను. 7 కిలోల శాక్సాఫోన్‌ను రెండు గంటల పాటు పట్టుకుని కచ్చేరి చేయడం ఎంత కష్టమో ఆలోచించండి. ఆడది అలా చేయలేదు అనేవాళ్లకు సమాధానంగా నిలిచాను. నా ఊపిరితిత్తుల బలం నాకు సహకరించింది. పెళ్లయి గర్భం దాల్చాక నా శత్రువులు ఇక ఆమె కచ్చేరీలు చేయదు అనే ప్రచారం మొదలెట్టారు. డెలివరీ అయ్యాక కచ్చేరీలు సాధ్యం కాదని ఆర్గనైజర్స్‌ను భయపెట్టారు. దాంతో షోలు బుక్ చేసిన ఆర్గనైజర్స్ అడ్వాన్సులు వెనక్కు ఇమ్మని అడగడం మొదలెట్టారు. నేను పట్టుదలగా ఆ పుకార్లను తోసి పుచ్చాను. రేపు డెలివరీ అనగా ఇవాళ కూడా కచ్చేరీ చేశాను. నిండు గర్భవతిగా స్టేజ్ మీద శాక్సాఫోన్ వాయించింది నేనే అనుకుంటా. అలాగే డెలివరీ అయిన 15 రోజులకు మళ్లీ స్టేజ్ మీదకు వచ్చాను. ఈ రంగంలో నేనే మిటో నిరూపించుకోవాలనే నా పట్టుదలే నాకు బలాన్ని ఇచ్చింది' అంటుంది సుబ్బలక్ష్మి.

సుబ్బలక్ష్మి సోదరి లావణ్య కూడా శాక్సాఫోన్ విద్వాంసురాలిగా రాణిస్తోంది. వీరు విడివిడిగా కచ్చేరీలు చేసినా కలిసి చేసే కచ్చేరీలు కూడా వీనుల విందుగా ఉంటాయి.

డ్యాన్స్

# ఇండియన్ బ్యాలెరినా



ఇష్నా చౌదరి

అంతర్జాతీయ వేదికలపైన ప్రసిద్ధి గాంచిన బ్యాలె డ్యాన్స్‌లో హైదరాబాద్ వాసి13 ఏళ్ల ఇష్నా చౌదరి రాణించడమే కాదు ప్రతిష్ఠాత్మక కెనడా నేషనల్ బ్యాలె స్కూల్ (ఎబీఎస్)లో ప్రవేశానికి ఎంపికైంది. ప్రపంచంలోని టాప్ 10 బ్యాలే స్కూల్స్‌లో ఒకటైన ఎన్‌బీఎస్ అకడమిక్ కరిక్యులమ్‌లో ప్రవేశం పొందిన మొదటి భారతీయురాలుగా చరిత్ర సృష్టించింది ఇష్నా. 'వివిధ దేశాలలో ఉన్న నా ఫ్రెండ్స్ ఇండియన్ బ్యాలెరినా' అని పిలుస్తున్నారు బ్యాలె ఈజ్ బ్యూటిఫుల్ అంటూ తన ఆనందాన్ని తెలియజేస్తోంది.

**మూ**డేళ్ల వయసు నుంచే బ్యాలె పై మక్కువ పెంచుకున్న ఇష్నా ప్రముఖ టెలివిజన్ సిరీస్ ''ఏంజెలీనా బ్యాలేరినా' చూస్తూ తన ఆసక్తిని మరింత పెంచుకుంది. ఐదేళ్ల వయస్సులో ముంబైలో క్లాసికల్ బ్యాలెలో శిక్షణ ప్రారంభించింది. ఏడేళ్ల వయసులో ఇష్నా తల్లిదండ్రులు పూణేకు మారడంతో అక్కడే మూడేళ్లపాటు బ్యాలె ప్రాథమిక దశల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుంది. ఇందులో భాగంగానే లండన్‌లోని రాయల్ అకాడమీ ఆఫ్ డ్యాన్స్ గ్రేడెడ్ పరీక్షల్లో విజేతగా నిలిచి, ప్రత్యేకతను సంపాదించుకుంది.







**వదలని పట్టుదల**

కరోనా మహమ్మారి విజృంభించడంతో బ్యాలె స్టూడియోలు భౌతికంగా మూసేశారు. ''ప్రత్యామ్నాయంగా అంతర్జాతీయ శిక్షణ సంస్థలు అందించే ఆన్‌లైన్ క్లాస్‌ల పైన దృష్టి పెట్టాను. ఇందులో భాగంగా వాగనోవా బ్యాలె అకాడమీ ఆఫ్ రష్యా వంటి ప్రముఖ వేదికలు సమ్మర్ ఇంటెన్సివ్ శిక్షణ కోసం ఇష్నాను ఆడిషన్ చేశాయి. ఈ ఆడిషన్స్‌లో అంతర్జాతీయ విద్యార్థులతో కలిసి శిక్షణ పొందాను. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన వాగనోవాలోని బ్యాలేరినాలతో శిక్షణ పొంది, ప్రీ ప్రొఫెషనల్ బ్యాలె ప్రోగ్రామ్ కోసం ఆసియాలోని టాప్ బ్యాలె స్కూల్ అయిన మార్లుపి డాన్స్ అకాడమీ(ఇండోనేషియా)కి ఎంపికయ్యాను. కానీ ఇండోనేషియాకు మకాం మార్చడం కష్టం కాబట్టి మళ్లీ ఆన్‌లైన్ తరగతుల ద్వారానే ట్రైనింగ్ తీసుకున్నాను' అని వివరిస్తుంది ఇష్నా.

**అవార్డులు.. స్కాలర్‌షిప్‌లు**

బ్యాలెలో ఆసియాలోనే అత్యుత్తమ స్కూల్ అయినటువంటి మార్లుపి డ్యాన్స్ అకాడమీ (ఎమ్‌డీఏ) క్లాసికల్ బ్యాలెలో ప్రీ ప్రొఫెషనల్ శిక్షణను అందిస్తుంది. ఈ వేదికగా అంతర్జాతీయ స్థాయి డ్యాన్సర్లను తయారు చేసిన ప్రముఖ బ్యాలె శిక్షకురాలు మిస్ జోనాథ ఆధ్వర్యంలో ఇష్నా పదేళ్ల వయసున్నప్పటి నుంచే ఇంటర్నేషనల్ కాంపిటీషన్‌లో ఎన్నో అవార్డులను గెలుచుకుంది. సింగపూర్ యూత్ ఆర్ట్ ఫెస్టివల్లో క్లాసికల్ బ్యాలెలో వెండి, కాంస్య అవార్డులు, సింగపూర్ ఐబీజీపీఎస్‌లో పొటెన్షియల్ అవార్డు, జకార్తాలోని ఏషియన్ గ్రాండ్ ప్రిక్స్‌లో మెరిట్ అవార్డు, గ్రేట్ ఇండియా బ్యాలె పోటీలో గోల్డ్‌మెడల్ తదితర అవార్డులను ఇష్నా చౌదరి అందుకుంది. అంతేకాకుండా యూత్ అమెరికన్ గ్రాండ్ ప్రిక్స్ (వైఏజీపీ)లో సెమీఫైనల్‌కు కూడా అర్హత సాధించింది.

కెనాన్ డాన్స్ ఫెస్టివల్ సింగపూర్ ఫర్ సమ్మర్ ఇంటెన్సివ్ టు ఆసియా బ్యాలెట్ అకాడమీ (మలేషియా), నేషనల్ బ్యాలె అకాడమీ ఆఫ్ న్యూయార్క్ సమ్మర్ ఇంటెన్సివ్, జువాన్ పాయింట్ ప్రోగ్రామ్ న్యూజిలాండ్ వంటి వేదికల్లో స్కాలర్‌షిప్‌లను సైతం పొందింది. జువాన్ పాయింట్‌లో తన నైపుణ్యాల ఆధారంగా ఆమె స్కాలర్‌షిప్‌ను అడ్వాన్స్‌డ్ పాయింట్ ప్రోగ్రామ్‌కు పొడిగించడం విశేషం. ఎన్‌బీఎస్ కెనడా, ఏఅండ్‌ప్ బ్యాలె(చికాగో)లో శిక్షణ పొందేందుకు స్కాలర్‌షిప్ సాధించింది. అంతర్జాతీయ బ్యాలె వేర్ బ్రాండ్ 'బ్యాలె లైఫ్'కు ఇష్నా బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా వ్యవహరిస్తుంది.

**నిరంతర కృషి**

ఈ ఏడాది ప్రపంచంలోని టాప్ బ్యాలె అకాడమీలతో వ్యక్తిగతంగా శిక్షణ పొందాలనుకుంది ఇష్నా. ఇందులో భాగంగా బోస్టన్ బ్యాలె (బోస్టన్, ఎమ్‌ఏ), రష్యన్ మాస్టర్స్ బ్యాలె (అలికాంటే, స్పెయిన్), ప్రతిష్ఠాత్మక స్కూల్ ఆఫ్ అమెరికన్ బ్యాలె (ఎస్‌ఏబీ, న్యూయార్క్)లో 8 శాతంతో సమ్మర్ ఇంటెన్సివ్‌ల ఆడిషన్‌లో ఎంపికైంది. నిరంతర కృషితో తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న ఇష్నా., సమ్మర్ ఆఫ్ 2023ని కెనడా నేషనల్ బ్యాలెలో శిక్షణ పొందాలని నిర్ణయించుకుంది. ఇంటెన్సివ్‌లో తన ప్రదర్శన ఫలితంగా కెనడా ఎన్‌బీఎస్‌లో ప్రొఫెషనల్ బ్యాలె ప్రోగ్రామ్ కోసం ఆఫర్ అందుకుంది. 1959లో స్థాపించబడిన ఎన్‌బీఎస్ ., ఔత్సాహిక యువ నృత్యకారులు, ఉపాధ్యాయుల కోసం ప్రపంచంలోని అగ్రగామి శిక్షణా సంస్థలలో ఒకటి. ఈ వేదికగా శిక్షణ పొందుతున్న మొట్టమొదటి భారతీయ బాలేరినాగా ఇష్నా చౌదరి చరిత్ర సృష్టించింది.

– హనుమాద్రి శ్రీకాంత్



# సహానుభూతి కోరుకుంటున్నారా..?!



**కొందరు వ్యక్తులు వ్యక్తిగత ఒత్తిడి, చికాకులు, కోపం, నిరాశ ... వంటి భావోద్వేగాలను సోషల్‌మీడియా వేదికగా పంచుకుంటూ జనాల మద్దతు కోరుకుంటూ ఉంటారు. ఈ విధానం వల్ల లాభం కన్నా నష్టాలే ఎక్కువ ఉన్నాయి. మానసిక సమస్యలను మోసగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకోవచ్చు. దీనివల్ల కొత్త ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉంది. యువత, మహిళల్లో ఎక్కువగా ఉండే ఈ సమస్య గురించి, జాగ్రత్తల గురించి తప్పక తెలుసుకోవాల్సిందే!**

సైబర్ టాక్

సోషల్ మీడియాలో తమ భావోద్వేగాలు, ఆశనిరాశలు, ఆలోచనలు, ఆవేదనలు, వ్యక్తిగత అనుభవాలు, సమస్యలను విస్తృతంగా పంచుకునే వారి సంఖ్య ఇటీవల పెరిగింది. ఇతరుల సానుభూతిని కోరుకోవడానికి ఇలా చేస్తుంటారు. దీనికి కొందరు వ్యక్తులు తీర్పులు ఇస్తుంటారు లేదా తప్పుగా అర్థం చేసుకుంటారు.

**కలిగే నష్టాలు**

- సంఘర్షణ తీవ్రత పెరుగుతుంది
- అనవసరమైన వాటిపైన శ్రద్ధ
- నిరంతర సానుభూతి వచనాలను కోరుకుంటారు.
- మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది.

దీనికన్నా భావోద్వేగాలను అదుపు చేసుకోవడానికి నమ్మదగిన స్నేహితులు, కుటుంబ సభ్యులు లేదా మానసిక ఆరోగ్య నిపుణుల నుండి మద్దతు పొందడం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే, మీ భావోద్వేగాల పరిస్థితిని మోసగాళ్లు ఓ కంట గమనిస్తుంటారు. వాటిని ఆసరాగా చేసుకొని మోసగాళ్లు ఫ్రెండ్స్ జాబితాలో చేరి, అనుకూలంగా మాట్లాడుతూ చివరకు ఆర్థికపరమైన నేరాలకు పాల్పడవచ్చు.

**సానుభూతి కోరుకునేవారు..**

- ప్రజల దృష్టిని ఆకర్షించడానికి భావోద్వేగాలను వ్యక్తపరుస్తుంటారు. లైక్‌లు, కామెంట్స్, ఫాలోవర్స్ ద్వారా మనకున్న ప్రాముఖ్యతను చూసుకుంటారు కాబట్టి చాలామంది వ్యక్తులు తమ ఫాలోవర్ బేస్‌ను పెంచుకోవడానికి దృష్టిని ఆకర్షించడానికి సోషల్ మీడియాలోకి వస్తారు.
- తమ భావోద్వేగాలను సానుకూలంగా లేదా ప్రతికూలంగా ఎవ్వరికీ కనిపించకుండా వ్యక్తీకరించడానికి సోషల్ మీడియా మాత్రమే అనుకూలంగా భావిస్తారు.
- మంచి, చెడు ఏదైనా సోషల్ మీడియాలో ముందుగా విషయాలను పంచుకోవాలనే ఆత్రుత, మనల్ని ఇతరులు గమనిస్తున్నారా లేదా అనే నిరీక్షణ ఉంటుంది.
- సోషల్ మీడియాలో ఆలోచనలు, భావాలను పంచుకోవడం వల్ల స్నేహితులు, కుటుంబ సభ్యులు లేదా అపరిచితుల నుండి కూడా మద్దతు పొందవచ్చు.
- కొందరు వ్యక్తులు ఎవ్వరికీ తెలియకుండా అజ్ఞాతంగా ఉంటూ సోషల్ మీడియాలో చురుకుదనాన్ని ప్రదర్శిస్తుంటారు. ఎందుకంటే వారు తమ వ్యక్తీకరణను అనామకంగా చేస్తారు. ఇది భద్రతా భావాన్ని అందిస్తుంది, తక్షణ పరిణామాల భయం లేకుండా ఉండటమే దీనికి గల కారణం.
- మార్పు కోసం వాదించడానికి లేదా ప్రభుత్వాలు, కార్పొరేట్లు, రాజకీయ పార్టీలు తీసుకున్న ముఖ్యమైన విషయాలపై (అంటే విధానాలు లేదా నిర్ణయాలు) దృష్టిని ఆకర్షించడానికి ఇదొక మార్గం.
- ఒంటరితనం, సన్నిహిత సంబంధాలు లేకపోవటం లేదా ఎవరితోనైనా మాట్లాడటానికి ఇబ్బంది పడుతుంటే, సోషల్ మీడియా మాత్రమే వారి వ్యక్తీకరణ సాధనంగా పనిచేస్తుంది.
- సోషల్ మీడియాలో తమను తాము వ్యక్తీకరించడం, వారి భావాలను పంచుకోవడంలో ఉపశమనం పొందుతుంటారు.
- కష్టాలు, సవాళ్లను పంచుకోవడం ద్వారా వ్యక్తులు తమలాంటి సమస్యలను ఎదుర్కొంటున్న ఇతరులతో కనెక్ట్ అవ్వవచ్చు.
- కొందరితో వ్యక్తిగతంగా చెప్పలేని విషయాలు ఆన్‌లైన్‌లో పంచుకోవడం సుఖంగా ఉంటుంది.

**ఎలా ఉండాలి..**

- వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో విభిన్న రకాల వ్యూవర్స్ మీకు ఉండే అనుకూలమైన సోషల్ మీడియా సైట్‌ను ఎంచుకోవాలి. (ఉదాహరణకు.. వ్యక్తిగత వ్యక్తీకరణల కోసం Facebook, ప్రజల కోసం Twitter ఎంచుకోవచ్చు.
- సహాయం కోరుతున్నారా, నైపుణ్యాన్ని పంచుకుంటున్నారా లేదా మిమ్మల్ని మీరు వ్యక్తపరుచుకుంటున్నారా అనే దానిపైన స్పష్టత ఉండాలి.
- మీ ఉద్వేగాల పరిస్థితిని కంప్లైంట్‌గా కాకుండా మీరు ఎలా, ఎందుకు దేనిగురించి భావిస్తున్నారో వివరించడానికి ప్రయత్నించాలి. దీనివల్ల మీరు చెప్పాలనుకుంటున్న విషయాన్ని ఇతరులు అర్థం చేసుకునే వీలుంటుంది.
- మీ భావాలను వ్యక్తపరిచేటప్పుడు, సున్నితమైన లేదా విభజన సమస్యలను తెచ్చేటప్పుడు జాగ్రత్త వహించాలి. లేదంటే సంఘర్షణకు దారితీయవచ్చు.
- సోషల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్‌లు నిర్దిష్ట స్నేహితులు లేదా అనుచరులతో పోస్ట్‌లను పూర్తిగా పబ్లిక్ షేర్ చేయడానికి అనుమతిస్తాయి కాబట్టి గోప్యతా సెట్టింగ్‌లపై నియంత్రణ ఉండాలి.
- మీ గోప్యతకు భంగం కలిగించే మీ వివరాలను బహిర్గతం చేయకుండా ఉండాలి. (అనగా.. పేరు, చిరునామా, ప్లేస్, టెలిఫోన్ నంబర్, ఇ-మెయిల్, చిరునామా మొదలైన వ్యక్తిగత సమాచారం)
- ఫీడ్‌బ్యాక్ విషయంలో ఓపెన్‌గా ఉండాలి. గౌరవప్రదంగా ప్రవర్తించాలి. లేకపోతే ప్రతికూల చర్యలకు సిద్ధంగా ఉండాల్సి వస్తుంది.
- మీ విజయాలు, జీవిత అనుభవాలు లేదా సంతోషకరమైన క్షణాలను పంచుకోవడం ద్వారా ప్రోత్సాహకరమైన ఉనికిని పొందవచ్చు.
- మిమ్మల్ని మీరు వ్యక్తపరుచుకోవడం మీకు మంచి అనుభూతిని కలిగిస్తుందో లేదో, మీరు పోస్ట్ చేసిన దానితో సంతృప్తి చెందుతున్నారో లేదో ఒకటికి రెండుసార్లు సమీక్షించుకోవాలి.
- సోషల్ మీడియాలో మీ వ్యక్తీకరణను ఎలా తెలియజేస్తున్నారో స్నేహితుడితో, కుటుంబ సభ్యునితో, థెరపిస్ట్‌తో మాట్లాడటం మేలు చేస్తుంది. వాటిలోని మంచి చెడులను బేరీజు వేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.

**మీ వ్యక్తిగత ప్రతిష్ఠకు సమస్యలు ఎదురైతే రిపోర్ట్ చేయడానికి...**

**Facebook:** https://www.facebook.com/help/1753719584844061/?helpref=uf_share
**Instagram:**https://help.instagram.com/contact/ 383679321740945
**Twitter:** https://help.twitter.com/en/forms/safety-and-sensitive-content
**LinkedIn:** https://www.linkedin.com/help/linkedin/answer/a1378278/report-inappropriate-content-messages-or-safety-concerns?lang=en



ఇన్‌పుట్స్:
**అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్



## సీజీఎఫ్ ఉపాధ్యక్ష పదవి రేసులో ఉష

భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు, దిగ్గజ అథ్లెట్, పార్లమెంట్ సభ్యురాలు పీటీ ఉష మరో అడుగు ముందుకు వేయనుంది. నవంబర్‌లో సింగపూర్‌లో జరిగే కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్య (సీజీఎఫ్) ఎన్నికల్లో 59 ఏళ్ల ఉష ఉపాధ్యక్ష పదవి కోసం పోటీపడనుంది. మూడు ఉపాధ్యక్ష స్థానాల కోసం ఉషతోపాటు వ్యాజ్ గ్రాహమ్ (కుక్ ఐలాండ్స్), బ్యారీ హెండ్రిక్స్ (దక్షిణాఫ్రికా), సాండ్రా ఒస్బోమ్ (బార్బడోస్), రిచర్డ్ పవర్స్ (కెనడా), ఇయాన్ రీడ్ (స్కాట్లాండ్), డొనాల్డ్ రుకారె (ఉగాండా) బరిలో ఉన్నారు.

## గ్రాండ్‌మాస్టర్ల 'సెంచరీ' దాటుతాం: హంపి



ప్రపంచకప్ టోర్నీలో యువ గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, గుకేశ్, అర్జున్, నిహాల్ తదితరులు అద్భుత ప్రదర్శన చేశారని భారత స్టార్ కోనేరు హంపి కొనియాడింది. కోల్‌కతాలో నేడు మొదలయ్యే టాటా స్టీల్ చెస్ ఇండియా టోర్నీలో హంపి పోటీ పడనుంది. త్వరలోనే భారత్ నుంచి గ్రాండ్‌మాస్టర్ల సంఖ్య 100 దాటుతుందని హంపి విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ ఏడాది జూలైలో ఆదిత్య సామంత్ రూపంలో భారత్ నుంచి 83వ గ్రాండ్‌మాస్టర్ అవతరించాడు.

# 'మేధావి'కి ఘన స్వాగతం



- సొంతగడ్డకు చేరిన ప్రపంచకప్ చెస్ టోర్నీ రన్నరప్ ప్రజ్ఞానంద
- రూ. 30 లక్షలు నగదు పురస్కారం అందించిన తమిళనాడు ప్రభుత్వం

**చెన్నై:** ప్రపంచకప్ చెస్ టోర్నీలో అద్భుత ప్రదర్శనతో ఫైనల్ వరకు చేరిన భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద తన స్వస్థలం చెన్నై చేరుకున్నాడు. ప్రతిష్టాత్మక చదరంగ వేదికపై తనదైన ముద్ర వేసి తిరిగొచ్చిన ఈ 18 ఏళ్ల కుర్రాడిని సొంత నగరం ఆత్మీయంగా అక్కున చేర్చుకుంది. అతనికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఒకవైపు ఆత్మీయులు, సన్నిహితులు ఆనందంగా తమవాడికి వెల్‌కమ్ చెప్పగా, మరోవైపు తమిళనాడు ప్రభుత్వం అధికారికంగా స్వాగత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆ రాష్ట్ర సాంప్రదాయ నృత్యాలు కరగట్టం, ఒయిలట్టంలతో విమానాశ్రయం బయట కళాకారులు ప్రజ్ఞానందకు స్వాగతం పలికారు. పూలు, శాలువాలు, పుష్ప గుచ్ఛాలతో మిత్రులు, అభిమానులు ప్రజ్ఞను ముంచెత్తారు. 'నాకు లభించిన ఈ స్వాగతం పట్ల చాలా సంతోషంగా ఉన్నాను' అంటూ జాతీయ పతాకాన్ని చేతిలో ప్రదర్శిస్తూ ప్రజ్ఞానంద వ్యాఖ్యానించాడు. అతని తల్లి నాగలక్ష్మి కూడా తన ఆనందాన్ని దాచుకోలేకపోయింది. అనంతరం ప్రజ్ఞానంద, అతని తల్లిదండ్రులు నాగలక్ష్మి, రమేశ్ బాబులను తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజ్ఞానందకు జ్ఞాపికతోపాటు రూ. 30 లక్షలు నగదు పురస్కారం అందజేశారు. అజర్‌బైజాన్‌లోని బాకులో జరిగిన 'ఫిడే' వరల్డ్ కప్ ఫైనల్లో వరల్డ్ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ చేతిలో ఓడిన ప్రజ్ఞానంద రన్నరప్‌గా నిలిచాడు.


# పాక్ ఆడుతూ పాడుతూ...

**ఆసియా కప్ తొలి పోరులో భారీ విజయం**

- నేపాల్‌పై 238 పరుగులతో గెలుపు
- బాబర్, ఇఫ్తిఖార్ సెంచరీలు
- నేడు బంగ్లాదేశ్, శ్రీలంక మ్యాచ్



బాబర్



ఇఫ్తిఖార్

**ముల్తాన్:** సొంతగడ్డపై మొదలైన ఆసియా కప్ టోర్నీలో పాకిస్తాన్ క్రికెట్ జట్టు శుభారంభం చేసింది. 15 ఏళ్ల తర్వాత ఈ టోర్నమెంట్‌కు ఆతిథ్యమిస్తున్న పాక్ పసికూన నేపాల్‌పై సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ భారీ విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ 238 పరుగుల తేడాతో నేపాల్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాక్ ముందుగా 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 342 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ బాబర్ ఆజమ్ (131 బంతుల్లో 151; 14 ఫోర్లు, 4 సిక్స్‌లు) కెరీర్‌లో 19వ సెంచరీ సాధించగా, ఇఫ్తిఖార్ అహ్మద్ (71 బంతుల్లో 109 నాటౌట్; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు శతకంతో చెలరేగాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 21.5 ఓవర్లలోనే 214 పరుగులు జోడించారు. అనంతరం నేపాల్ 23.4 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలింది. సోంపాల్ కామి (28), ఆరిఫ్ షేక్ (26) మాత్రమే నాలుగో వికెట్‌కు 59 పరుగులు జత చేసి కొద్దిగా పోరాడే ప్రయత్నం చేశారు. పాక్ బౌలర్లలో షాదాబ్ ఖాన్ 4 వికెట్లు పడగొట్టాడు. నేడు పల్లెకెలెలో జరిగే పోరులో శ్రీలంకతో బంగ్లాదేశ్ తలపడుతుంది.

నాలుగు పరుగుల వ్యవధిలో పాక్ ఓపెనర్లు ఫఖర్ (14), ఇమామ్ (5) వికెట్లు కోల్పోయింది. అయితే బాబర్, రిజ్వాన్ (50 బంతుల్లో 44; 6 ఫోర్లు) మూడో వికెట్‌కు 86 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దారు. రిజ్వాన్, సల్మాన్ (5) కూడా తక్కువ వ్యవధిలోనే వెనుదిరిగారు. ఈ దశలో బాబర్, ఇఫ్తిఖార్ భారీ భాగస్వామ్యం జట్టును పటిష్ట స్థితికి చేర్చింది. 55 పరుగుల వద్ద కరణ్ ఖత్రి రిటర్న్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన బాబర్ 109 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. భారీ ఛేదనలో 14 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన తర్వాత నేపాల్ ఏమాత్రం కోలుకోలేకపోయింది. అనుభవలేమి కారణంగా ఆ జట్టు ప్రత్యర్థి బౌలింగ్ బృందాన్ని సమర్థంగా ఎదుర్కోవడంలో పూర్తిగా విఫలమైంది.

### స్కోరు వివరాలు

**పాకిస్తాన్ ఇన్నింగ్స్:** ఫఖర్ (సి) ఆసిఫ్ (బి) కరణ్ 14; ఇమామ్ ఉల్ హఖ్ (రనౌట్) 5; బాబర్ ఆజమ్ (సి) (సబ్) జోరా (బి) సోంపాల్ 151; రిజ్వాన్ (రనౌట్) 44; సల్మాన్ (సి) భుర్తేల్ (బి) లమిచానే 5; ఇఫ్తిఖార్ (నాటౌట్) 109; షాదాబ్ (బి) సోంపాల్ 4; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం** (50 ఓవర్లలో 6 వికెట్లకు) 342. **వికెట్ల పతనం:** 1-21, 2-25, 3-111, 4-124, 5-338, 6-342. **బౌలింగ్:** సోంపాల్ 10-1-85-2, కరణ్ 9-0-54-1, గుల్షన్ 4-0-35-0, లలిత్ 10-0-48-0, లమిచానే 10-0-69-1, దీపేంద్ర సింగ్ 6-0-40-0, కుశాల్ 1-0-10-0.

**నేపాల్ ఇన్నింగ్స్:** భుర్తేల్ (సి) రిజ్వాన్ (బి) షాహిన్ 8; ఆసిఫ్ (సి) ఇఫ్తికార్ (బి) నసీమ్ 5; రోహిత్ కుమార్ (ఎల్బీ) (బి) షాహిన్ 0; ఆరిఫ్ (బి) రవూఫ్ 26; సోంపాల్ (సి) రిజ్వాన్ (బి) రవూఫ్ 28; గుల్షన్ (సి) ఫఖర్ (బి) షాదాబ్ 13; దీపేంద్ర (బి) నవాజ్ 3; కుశాల్ (సి) ఇఫ్తికార్ (బి) షాదాబ్ 6; లమిచానే (బి) షాదాబ్ 0; కరణ్ (నాటౌట్) 7; లలిత్ (ఎల్బీ) (బి) షాదాబ్ 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం** (23.4 ఓవర్లలో ఆలౌట్) 104. **వికెట్ల పతనం:** 1-10, 2-10, 3-14, 4-73, 5-82, 6-90, 7-91, 8-91, 9-104, 10-104. **బౌలింగ్:** షాహిన్ అఫ్రిది 5-0-27-2, నసీమ్ 5-0-17-1, రవూఫ్ 5-1-16-2, షాబాద్ 6.4-0-27-4, నవాజ్ 2-0-13-1.

# శ్రీలంక గడ్డపై భారత జట్టు

**శనివారం పాకిస్తాన్‌తో తొలి పోరు**



ఇషాన్ కిషన్, శుబ్‌మన్ గిల్, సూర్యకుమార్, తిలక్ వర్మ

**కాండీ:** ఆసియా కప్‌లో పాల్గొనేందుకు భారత క్రికెట్ జట్టు బుధవారం శ్రీలంకకు చేరుకుంది. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో ఆరు రోజుల ప్రత్యేక శిక్షణ శిబిరం ముగిసిన తర్వాత టీమిండియా లంకకు బయల్దేరింది. నేరుగా విమానంలో కొలంబోలో దిగిన రోహిత్ శర్మ బృందం అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కాండీకి చేరుకుంది. గాయం నుంచి పూర్తిగా కోలుకోని బ్యాటర్ కేఎల్ రాహుల్ మినహా ఇతర జట్టు సభ్యులంతా ఒకేసారి లంక గడ్డపై అడుగు పెట్టారు. రాహుల్ టోర్నీలో తొలి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఆసియా కప్‌లో భాగంగా శనివారం పల్లెకెలె మైదానంలో జరిగే తమ తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో భారత్ తలపడుతుంది. గురువారం శ్రీలంకకు చేరుకునే పాకిస్తాన్ ఒకరోజు విశ్రాంతి అనంతరం మ్యాచ్ బరిలోకి దిగనుండగా... సోమవారం పల్లెకెలె మైదానంలోనే నేపాల్‌ను భారత్ ఎదుర్కొంటుంది.

# కోకో గాఫ్ అలవోకగా...

- మూడో రౌండ్‌లోకి అమెరికా టీనేజ్ స్టార్
- ఏడో సీడ్ గార్సియా, వీనస్ ఓటమి



కోకో గాఫ్

**న్యూయార్క్:** సొంతగడ్డపై అమెరికా టీనేజ్ స్టార్ కోకో గాఫ్ మెరిసింది. యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో 19 ఏళ్ల గాఫ్ 6-3, 6-2తో మిరా ఆంద్రీవా (రష్యా)పై గెలిచింది. 76 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో గాఫ్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. నెట్ వద్దకు 18 సార్లు దూసుకొచ్చి 15 సార్లు పాయింట్లు గెలిచింది. మరోవైపు ఏడో సీడ్ గార్సియా (ఫ్రాన్స్), 2000, 2001 చాంపియన్ వీనస్ విలియమ్స్ (అమెరికా), 12వ సీడ్ క్రిచికోవా (చెక్ రిపబ్లిక్) తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. గార్సియా 4-6, 1-6తో యఫాన్ వాంగ్ (చైనా) చేతిలో, వీనస్ 1-6, 1-6తో గ్రీట్ మినెన్ (బెల్జియం) చేతిలో, క్రిచికోవా 4-6, 6-7 (3/7)తో లూసియా బ్రోన్‌జెట్టి (ఇటలీ) చేతిలో ఓడిపోయారు. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్), ఆరో సీడ్ సినెర్ (ఇటలీ) రెండో రౌండ్‌లోకి చేరారు.

# మరో విజయంపై నీరజ్ దృష్టి

**నేడు డైమండ్ లీగ్ మీట్‌లో పోటీపడనున్న భారత స్టార్**



**జ్యూరిక్ (స్విట్జర్లాండ్):** ఈ ఏడాది బరిలోకి దిగిన ప్రతి టోర్నీలోనూ అగ్రస్థానంలో నిలిచిన ఒలింపిక్, ప్రపంచ చాంపియన్, భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మరో విజయంపై దృష్టి సారించాడు. ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్‌లో భాగంగా నేడు జ్యూరిక్‌లో జరిగే మీట్‌లో నీరజ్ పోటీపడనున్నాడు. ఈ సీజన్‌లో నీరజ్ రెండు డైమండ్ లీగ్ మీట్‌లలో (మే 5 దోహా; జూన్ 30 లుజానె) అగ్రస్థానంలో నిలిచాడు. అనంతరం ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించాడు. నేడు అర్ధరాత్రి 12 తర్వాత మొదలయ్యే జావెలిన్ త్రో ఈవెంట్‌లో నీరజ్‌తోపాటు జాకుబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్), ప్రపంచ మాజీ చాంపియన్ పీటర్స్ అండర్సన్ (గ్రెనెడా), వెబెర్ (జర్మనీ) తదితర స్టార్స్ పోటీపడనున్నారు.

**ప్రపంచ చాంపియన్‌షిప్ కోసం బిడ్..!**

2027 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఆతిథ్య హక్కుల కోసం భారత్ బిడ్ వేస్తుందని బుధవారం ఇక్కడి మీడియాతో నీరజ్ చోప్రా వ్యాఖ్యానించాడు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోద ముద్ర లభిస్తే భారత అథ్లెటిక్స్ సమాఖ్య చొరవ తీసుకుంటుంది. 2027 ప్రపంచ చాంపియన్‌షిప్ నిర్వహణ కోసం అక్టోబర్ 2లోపు బిడ్ దాఖలు చేయాలి. ఇప్పటికే 2027 ప్రపంచ చాంపియన్‌షిప్ ఆతిథ్యం కోసం బీజింగ్ తమ బిడ్ దాఖలు చేసింది.

## సినిమా

రాఖీ స్పెషల్

# సోదరుడికి ప్రేమతో...

అన్న గుండె ఆగిపోయిన క్షణాన చెల్లెలి గుండె ఆగిపోతుంది... అందుకే వెండితెరపై అన్నాచెల్లెలి అనుబంధం అనగానే వీరి 'రక్త సంబంధం' గుర్తుకు వస్తుంది. ఇంకా తెలుగు తెరపై అన్నా చెల్లెళ్ల అనుబంధంతో చాలా సినిమాలు వచ్చాయి.. ప్రేక్షకులను ఆకట్టుకున్న చిత్రాలు చాలానే ఉన్నాయి. ఈ రాఖీ పండగ సందర్భంగా ఓ పది సినిమాల గురించి చెప్పుకుందాం..
















హిట్లర్



అర్జున్






పుట్టింటికి రా చెల్లె







**రక్త సంబంధం (1962)**

ఎన్టీఆర్-సావిత్రి.. తెలుగు చిత్ర పరిశ్రమలో జంటగా ఎన్నో విజయాలను సొంతం చేసుకున్న 'హిట్ పెయిర్'. అలాంటి హిట్ జోడీని అన్నా-చెల్లెలిగా చూపించే సాహసం చేసి, 'రక్త సంబంధం' చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు వి. మధుసూదనరావు. ఈ అన్నాచెల్లెలి అనుబంధానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఎన్టీఆర్, కాంతారావు, సావిత్రి, దేవిక, సూర్యకాంతం ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'రక్త సంబంధం'. తమిళంలో ఘనవిజయం సాధించిన 'పాస మలర్' సినిమాకి రీమేక్‌గా 'రక్త సంబంధం' రూపొందింది. హీరో-హీరోయిన్లుగా అలరించిన ఎన్టీఆర్-సావిత్రిలు 'రక్త సంబంధం'లో అన్నా, చెల్లెలు పాత్రల్లో జీవించారు. ఈ సినిమా క్లైమాక్స్‌లో రాజు (ఎన్టీఆర్), రాధ (సావిత్రి) ఒకేసారి ప్రాణాలు వదలడం ప్రేక్షకుల చేత కన్నీళ్లు తెప్పిస్తుంది. మరణం కూడా విడదీయలేనంత అనుబంధం రాజు-రాధలది. అందుకే అన్నా చెల్లెళ్ల అనుబంధం అనగానే.. ముందుగా గుర్తుకు వచ్చేది 'రక్త సంబంధం' చిత్రమే.

**బంగారు గాజులు (1968)**

రాము (నాగేశ్వరరావు), రాధ (విజయనిర్మల) అన్నాచెల్లెళ్లు. చెల్లెలి చేతికి బంగారు గాజులు తొడగాలని రాము ఆశ పడతాడు. ఇందుకోసం డబ్బు కూడబెడుతుంటాడు. ఓ రైస్ మిల్లులో రాము డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. అయితే ఆ రైస్ మిల్లు యజమాని రావూజీ కన్ను రాధపై పడుతుంది. రాధను బలవంతం చేయబోతాడు రావూజీ. ఆ సమయంలో రాధ తప్పించుకుంటుంది. ఇదే సమయంలో రాము హంతకుడనే నిందను మోపి అతన్ని జైలుపాలు చేస్తాడు రావూజీ. చెల్లెలిని వెతుక్కునే క్రమంలో రాము హైదరాబాద్‌కి వచ్చి రాధను చూస్తాడు. కానీ రాధ గుర్తు పట్టదు. దీంతో రాము ఆశ్చర్యానికి గురవుతాడు. కానీ హైదరాబాద్‌లో కనిపించిన రాధను తన చెల్లెలిగానే భావిస్తాడు, ఏదో తెలియని ఆత్మీయతతో రామును కూడా రాధ అన్నయ్యలానే భావిస్తుంటుంది. అయితే ఇద్దరు రాధలు ఉన్నారని, ఈ ఇద్దరు కవలలని, అందుకే రాముని హైదరాబాద్‌లో ఉన్న రాధ గుర్తుపట్టలేక పోయిందన్నది ట్విస్ట్. ఈ ఇద్దరు చెల్లెళ్లకు బంగారు గాజులు తొడుగుతాడు రాము. నాగేశ్వరరావు, విజయనిర్మల ముఖ్య తారాగణంగా భారతి, పద్మనాభం, గీతాంజలి కీలక పాత్రల్లో నటించిన 'బంగారు గాజులు' సినిమాకు సీఎస్‌రావు దర్శకత్వం వహించారు.

**చెల్లెలి కాపురం (1971)**

రాము (శోభన్‌బాబు)కు చెల్లెలు (మణిమాల) అంటే చాలా ఇష్టం. చెల్లికి పెళ్లి చేయాలని డబ్బు సంపాదించడం కోసం పట్నంలో అడుగుపెట్టిన రాముకు అతని స్నేహితుడు శ్రీరామ్ (నాగభూషణం) తారసపడతాడు. స్వతహాగా రచయిత అయిన రాము తన రచనలతో డబ్బులు సంపాదించాలనుకుంటాడు. కానీ రాము ఆహార్యం చూసి, అతని రచనలను అచ్చు వేసేందుకు ప్రచురణ కర్తలెవరూ ముందుకు రారు. రాము విజ్ఞప్తి మేరకు అతని స్నేహితుడైన శ్రీరామ్.. రాము రచనలను తన రచనలుగా పబ్లిష్ చేయించుకుని, కీర్తి ప్రతిష్ఠలు సంపాదిస్తాడు. ఈ క్రమంలోనే రాము చెల్లిని శ్రీరామ్ వివాహం చేసుకుంటాడు. ఆ తర్వాత రాము చెల్లిని ఎలాంటి కష్టాలు పెట్టాడు? ఆ కష్టాల నుంచి ఆమెను రాము, అతన్ని ప్రేమించే రాధ (వాణీ శ్రీ) ఎలా కాపాడారు? శ్రీరామ్ తన తప్పు తాను తెలుసుకునేలా రాధ ఏం చేసింది? అన్నదే కథ. కె. విశ్వనాథ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది.

**పల్నాటి పౌరుషం (1994)**

రెండు కుటుంబాల మధ్య జరిగే కథతో రూపొందిన చిత్రం 'పల్నాటి పౌరుషం'. ముత్యాల సుబ్బయ్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కృష్ణంరాజు (భీమినేని బ్రహ్మన్న), రాధిక (సీత) అన్నా చెల్లెలి పాత్రల్లో నటించారు. తనకెంతో ఇష్టమైన చెల్లిని (సీత) వేరే ఊర్లోని రాజారావ్ (చరణ్‌రాజ్)కి ఇచ్చి వివాహం జరిపిస్తాడు బ్రహ్మన్న. అయితే రాజారావ్ బావమర్ది సూరిబాబు (సురేశ్)కి బ్రహ్మన్న అంటే ఇష్టం ఉండదు. దీంతో కుట్రలతో ఇరు కుటుంబాల్లో కలహాలు తీసుకొస్తాడు సూరిబాబు. ఆ కలహాలకి తన భర్తే కారకుడని తెలుసుకున్న సూరిబాబు భార్య ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమె మృతికి బావ బ్రహ్మన్నే కారణమని భావించి, అన్నని కలవొద్దని తన భార్య సీతకు ఆంక్ష విధిస్తాడు రాజారావ్. ఆ తర్వాత బ్రహ్మన్న, సీతలకు నిజం ఎలా తెలుస్తుంది? ఈ కుటుంబాలను కలపడంలో తర్వాతి తరం పాత్ర ఎంత... అన్నదే 'పల్నాటి పౌరుషం' కథాంశం. తమిళ హిట్ మూవీ 'కిళక్కు సీమయిలే'కు రీమేక్ ఇది.

**హిట్లర్ (1997)**

మాధవరావు అలియాస్ హిట్లర్ (చిరంజీవి)కు ఐదుగురు శారద (అశ్వని), అనుపమ (మోహిని), లక్ష్మి (పద్మశ్రీ), గాయత్రి (గాయత్రి), సరస్వతి (మీనాకుమారి) చెల్లెళ్లు. మాధవరావు చిన్నతనంలోనే తల్లి మరణించడం, తండ్రి జైలుపాలు కావడంతో ఐదుగురి చెల్లెళ్ల బాధ్యత అతనిపైనే పడుతుంది. చాలా కష్టపడి, వారిని పెంచి, పెద్ద చేస్తాడు మాధవరావు. తన రెండో చెల్లి మోహిని ప్రేమను మాధవరావు సరిగా అర్థం చేసుకోకపోవడం, మొదటి చెల్లి శారద కాపురంలోని ఇబ్బందులు, సవతి తల్లి ఇద్దరు కూతుళ్లను చేరదీయడం వంటి కారణాలతో మాధవరావుకు, అతని చెల్లెళ్లకు మధ్య మనస్పర్థలు వస్తాయి. మరి.. మాధవరావుకు, అతని చెల్లెళ్లకు మధ్య ఉన్న అభిప్రాయభేదాలను బాలు (మోహిని భర్త, మాధవరావు మామయ్య కొడుకు రాజేంద్రప్రసాద్) ఎలా పరిష్కరిస్తాడు? మాధవరావు, అతని చెల్లెళ్లు తిరిగి ఎలా కలుస్తారు? ఇందులో బుజ్జి (రంభ) పాత్ర ఏమిటన్నదే 'హిట్లర్' కథాంశం. సిద్దిఖీ దర్శకత్వంలో రూపొందిన మలయాళ హిట్ ఫిల్మ్ 'హిట్లర్'కు తెలుగు రీమేక్ 'హిట్లర్'లో చిరంజీవి హీరోగా నటించారు. ముత్యాల సుబ్బయ్య దర్శకత్వం వహించారు.

**శివరామరాజు (2002)**

పూసపాటి శివరామరాజు (జగపతిబాబు), రామరాజు (వెంకట్), రుద్రరాజు (శివాజీ) అన్నదమ్ములు. ఈ ముగ్గురి అన్నదమ్ములకు ఏకైక చెల్లెలు స్వాతి (మోనికా). అయితే శివరామరాజు కుటుంబంపై పగ తీర్చుకోవడం కోసం శత్రువర్గం నాటకం ఆడి స్వాతిని తమ ఇంటి కోడలుగా చేసుకుంటుంది. ఈ పెళ్లి తర్వాత శివరామరాజు, రామరాజు, రుద్రరాజు తమ ఆస్తిని కోల్పోయి పేదవాళ్లు అయిపోతారు. తనవల్ల పేదరికంలో జీవిస్తున్న అన్నలను చూసి స్వాతి కుమిలిపోతుంటుంది. స్వాతిని అత్తింటి వేధింపుల నుంచి శివరామరాజు ఎలా కాపాడాడన్నదే చిత్రకథ. అన్నా చెల్లెళ్ల సెంటిమెంట్ నేపథ్యంలో వి. సముద్ర ఈ సినిమాకి దర్శకత్వం వహించారు.

**అర్జున్ (2004)**

అర్జున్ (మహేశ్‌బాబు), మీనాక్షి (కీర్తి రెడ్డి) కవలలు. మీనాక్షి, ఉదయ్ (రాజా) ప్రేమించుకుంటారు. తనకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని మీనాక్షికి ఉదయ్ ఓ లేఖ రాస్తాడు. ఈ లేఖను అర్జున్‌కు చూపిస్తుంది మీనాక్షి. దీంతో ఉదయ్ తల్లిదండ్రులు బాలానాయర్ (ప్రకాష్‌రాజ్), ఆండాళ్ (సరిత) అతనికి చేయాలనుకున్న అమ్మాయితో కాకుండా, మీనాక్షితో వివాహం జరిగేలా చేస్తాడు అర్జున్. అంతా బాగానే ఉందనుకుంటున్న తరుణంలో బాలానాయర్, ఆండాళ్‌లు కలిసి మీనాక్షిని చంపి, ఉదయ్‌కు మరో అమ్మాయితో వివాహం చేయాలనుకుంటున్నారనే ఆలోచనలో ఉన్నట్లుగా అర్జున్‌కు తెలుస్తుంది. అప్పుడు మీనాక్షిని రక్షించేందుకు సోదరుడిగా అర్జున్ ఏం చేశాడు? మధుర మీనాక్షి అమ్మవారి సాక్షిగా మీనాక్షిని ఎలా కాపాడుకున్నాడు- అన్నదే అర్జున్ కథ. గుణశేఖర్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది.

**'పుట్టింటికి రా చెల్లి' (2004)**

చిన్నతనంలోనే శివన్న (అర్జున్) తల్లి కన్నుమూస్తుంది. దీంతో చెల్లెలు లక్ష్మి (మధుమిత) ఆలనాపాలన శివన్నపై పడుతుంది. సేద్యం చేస్తూ చెల్లిని చదివిస్తాడు శివన్న. తన చెల్లెలు ప్రేమించిన అజయ్ (శ్రీనాథ్)తోనే ఆమె వివాహం జరిపిస్తాడు. ఈ పెళ్లి ఇష్టం లేని అజయ్ కుటుంబ సభ్యులు లక్ష్మిని నిత్యం వేధిస్తుంటారు. అంతేకాదు.. ఎలాగైనా లక్ష్మి ఇంట్లో నుంచి వెళ్లిపోయేలా చేసేందుకు ఓ పెద్ద నింద వేస్తారు. అది నమ్మిన అజయ్ గర్భవతిగా ఉన్న లక్ష్మిని పట్టించుకోడు. పుట్టింటికి రమ్మని శివన్న వచ్చి లక్ష్మిని వేడుకుంటాడు. నిందతో రాను.. నిప్పులా వస్తానని అన్నకు చెబుతుంది లక్ష్మి. ఆ తర్వాత లక్ష్మిపై పడ్డ నిందని శివన్న ఎలా చెరిగిపోయేలా చేశాడు- అనే కథాంశంతో 'పుట్టింటికి రా చెల్లి' సినిమా రూపొందింది. అర్జున్, మీనా జంటగా కోడి రామకృష్ణ దర్శకత్వం వహించిన చిత్రమిది.

**రాఖీ (2006)**

అల్లారుముద్దుగా పెరిగిన తన చెల్లి చావుకి కారణమైన ఆమె అత్తింటి వారిపై ఓ అన్నగా, తోడ పుట్టకపోయినా.. సమాజంలోని కొందరు యువతులపై దౌర్జన్యం చేసినవారిపై రాఖీ బ్రదర్‌గా రామకృష్ణ ఎలా పగ తీర్చుకున్నాడు? అనే కథాంశంతో 'రాఖీ' సినిమా రూపొందింది. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఎన్టీఆర్ హీరోగా నటించారు. రామకృష్ణ అలియాస్ రాఖీ (ఎన్టీఆర్)కి చెల్లెలు గాయత్రి (మంజూష) అంటే అమితమైన ప్రేమ. ఐదు లక్షల కట్నం ఇచ్చి రవివర్మతో గాయత్రి వివాహం జరిపిస్తారు రాఖీ, కుటుంబ సభ్యులు. అయితే తన కొడుక్కి కోటి రూపాయల కట్నం వస్తుందని తెలుసుకొని మూడు నెలల గర్భవతి అయిన గాయత్రిని కిరోసిన్ పోసి చంపేస్తారు అత్తింటివారు. కానీ, వారు నిర్దోషులంటూ కోర్టులో కేసు కొట్టేస్తారు. దీంతో తన చెల్లిని చంపిన అత్తింటి వారందర్నీ కారుతో సహా పెట్రోల్ పోసి తగులబెడతాడు రాఖీ. తన చెల్లెలి కేసుకు వ్యతిరేకంగా వాదించిన లాయర్‌ని, దొంగ సాక్ష్యం ఇచ్చిన డాక్టర్‌ని, పోలీసు అధికారులని కూడా పెట్రోల్ పోసి తగులబెడతాడు. ఆ తర్వాత ఏ మహిళకు అన్యాయం జరిగినా అందుకు కారకులైన వారిని పెట్రోల్ పోసి తగులబెడుతుంటాడు. వరుస హత్యలు చేస్తున్న రాఖీని పోలీసులు పట్టుకున్నాక కోర్టు అతనికి శిక్ష విధించిందా? అన్నది ఈ చిత్ర కథాంశం.

**గోరింటాకు (2008)**

అశోక్ (రాజశేఖర్)కి చెల్లెలు లక్ష్మి (మీరా జాస్మిన్) అంటే పంచప్రాణాలు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో అన్నీ తానై చెల్లెల్ని పెంచి పెద్ద చేస్తాడు అశోక్. చెల్లికి పెళ్లి అయ్యేవరకు తాను కూడా చేసుకోకూడదనుకుంటాడు. చెల్లెలు ప్రేమించిన అబ్బాయి ఆకాశ్‌కి ఇచ్చి పెళ్లి చేస్తాడు. అయితే ఆకాశ్‌ని ఆస్తి కోసం అయినవాళ్లే మోసం చేసి, జైలుకి పంపిస్తారు. ఈ విషయాన్ని అన్నయ్యకి చెప్పి, సాయం అడుగుదామని ఇంటికి వచ్చిన లక్ష్మిని.. అశోక్ భార్య నందిని (ఆర్తి అగర్వాల్) అవమానించి పంపించేస్తుంది. భర్త జైలులో ఉండటం..అన్నయ్యను కలిసే అవకాశం లేకపోవడం.. పిల్లలు ఆకలితో అలమటిస్తుండడంతో.. ఏం చేయాలో పాలుపోని లక్ష్మి.. పిల్లలతో సహా బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంటుంది. విషయం తెలిసి లక్ష్మి భౌతిక కాయం వద్ద అశోక్ కన్నీరు మున్నీరుగా విలపిస్తూ.. అక్కడే ప్రాణాలు విడవడం ప్రేక్షకులతో కన్నీరు పెట్టిస్తుంది. కన్నడ హిట్ 'అన్న తంగి'కి రీమేక్‌గా వీఆర్ ప్రతాప్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. కాగా, 2008 నుంచి ఇప్పటివరకు అన్నాచెల్లెళ్ల అనుబంధం నేపథ్యంలో పలు చిత్రాలు వచ్చాయి. ఇటీవల 'భోళా శంకర్'లో చిరంజీవి, కీర్తీ సురేశ్, రెండేళ్ల క్రితం వచ్చిన 'పెద్దన్న'లో రజనీకాంత్, కీర్తీ సురేశ్ అన్నాచెల్లెళ్లుగా నటించిన విషయం తెలిసిందే.

సాక్షి బిజినెస్
గురువారం
31-8-2023

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 11 | 65,087 |
| నిఫ్టీ ▲ | 5 | 19,347 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

| విదేశీ సూచీలు (బుధ రాత్రి 11.30 గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 14,030 | ▲ | 86 |
| డోజోన్స్ | 34,910 | ▲ | 58 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,474 | ▲ | 9 |
| డాక్స్ | 15,892 | ▽ | 39 |
| షాంఘై | 3,137 | ▲ | 1 |
| నికాయ్ | 32,333 | ▲ | 106 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** (రూ.లలో) — ముంబై

| | | | |
|---|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 59,292 | ▲ | 423 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 59,055 | ▲ | 422 |
| వెండి (కేజీ) | 76,661 | ▲ | 880 |

**ఫారెక్స్ రేట్లు** (రూ.లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎన్‌కం | 81.91 | 83.58 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎన్‌కం | 102.83 | 106.21 |
| € | యూరో | ఎన్‌కం | 88.41 | 91.50 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎన్‌కం | 55.73 | 57.72 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎన్‌కం | 52.42 | 54.72 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎన్‌కం | 60.22 | 62.18 |
| SAR | సౌదీ రియాల్ | ఛానెళ్ | 21.11 | 22.73 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | ఛానెళ్ | 21.63 | 23.42 |
| ¥ | చైనా యువాన్ | ఛానెళ్ | 10.23 | 12.30 |

## చిన్న సంస్థలకు రుణాలపై పీఎన్‌బీ ఫోకస్..

**జీఎస్‌టీ ఇన్వాయిస్ ద్వారా లోన్లు**




న్యూఢిల్లీ: చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) రుణ లభ్యతను పెంచడంపై ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా జీఎస్‌టీ ఇన్వాయిస్‌ల ఆధారంగా కూడా రుణ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం జీఎస్‌టీ సహాయ్ పేరిట యాప్‌ను ప్రారంభించింది. మొత్తం రుణ లావాదేవీ అంతా డిజిటల్ విధానంలో, తక్కువ వ్యయాలతో, వేగవంతంగా, సులభతరంగా జరిగేందుకు ఈ యాప్ సహాయపడగలదని బ్యాంక్ ఎండీ అతుల్ కుమార్ గోయెల్ తెలిపారు. ఈ సర్వీస్ ద్వారా రుణం నేరుగా .. పీఎన్‌బీలోని రుణగ్రహీత కరెంటు అకౌంటులోకి జమవుతుందని ఆయన వివరించారు. జీఎస్‌టీ ఇన్వాయిస్‌ల ద్వారా ఎంఎస్ఎంఈలకు రుణ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిన తొలి ప్రభుత్వ రంగ బ్యాంక్ తమదేనని గోయెల్ చెప్పారు.

## ఐటీ హార్డ్‌వేర్ పీఎల్ఐ.. 32 దరఖాస్తులు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఐటీ హార్డ్‌వేర్ పీఎల్ఐ కింద మొత్తం 32 కంపెనీలు దరఖాస్తు చేసుకున్నట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. హెచ్‌పీ, డెల్, లెనోవో తదితర బహుళజాతి కంపెనీలు సైతం దరఖాస్తులు సమర్పించినట్లు మంత్రి చెప్పారు. ఈ పథకం కింద కేంద్రం ప్రోత్సాహకాల మద్దతుతో రూ.3.35 లక్షల కోట్ల అదనపు తయారీ దేశీయంగా నమోదవుతుందన్నారు. ''విశ్వసనీయ సప్లయ్ చైన్ భాగస్వామిగా, విలువను జోడించే భాగస్వామిగా భారత్ అవతరిస్తోంది. తయారీ, డిజైన్ కోసం కంపెనీలు భారత్‌కు వచ్చేందుకు సుముఖంగా ఉన్నాయి. ఇప్పటి వరకు ఐటీ హార్డ్‌వేర్ పీఎల్ఐ కింద 32 దరఖాస్తులు వచ్చాయి. ఈ స్పందన అంచనా వేసిన దాని కంటే ఎక్కువగా ఉంది''అని మంత్రి తెలిపారు.

## హైదరాబాద్‌లో పెరిగిన ఇళ్ల ధరలు

- జూన్ త్రైమాసికంలో 7 శాతం అధికం
- 43 పట్టణాల్లో ఇదే పరిస్థితి
- నేషనల్ హౌసింగ్ బ్యాంక్ డేటా వెల్లడి



న్యూఢిల్లీ: హైదరాబాద్ మార్కెట్లో ఇళ్ల ధరలు జూన్ త్రైమాసికంలో 6.9 శాతం పెరిగినట్టు నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) విడుదల చేసిన 'హౌసింగ్ ప్రైస్ ఇండెక్స్' డేటా తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా 43 పట్టణాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కరోనా ముందు నాటితో పోలిస్తే గృహ రుణాల రేట్లు ఇప్పటికీ తక్కువగానే ఉన్నాయని, దీంతో ఇళ్ల ధరల అందుబాటు ఆరోగ్యకర స్థాయిలో ఉన్నట్టు ఎన్‌హెచ్‌బీ నివేదిక తెలిపింది. అహ్మదాబాద్‌లో ఇళ్ల ధరలు 9.1 శాతం పెరగ్గా, బెంగళూరులో 8.9 శాతం, కోల్‌కతాలో 7.8 శాతం చొప్పున ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో ఎగిశాయి. చెన్నైలో 1.1 శాతం, ఢిల్లీలో 0.8 శాతం, ముంబైలో 2.9 శాతం, పుణేలో 6.1 శాతం చొప్పున ఇళ్ల ధరలు పెరిగాయి. ఎన్‌హెచ్‌బీ హౌసింగ్ ప్రైస్ ఇండెక్స్ 50 పట్టణాల్లోని ప్రాపర్టీల విలువల సమాచారాన్ని బ్యాంక్‌లు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల నుంచి తీసుకుని ప్రతి త్రైమాసికానికి నివేదిక విడుదల చేస్తుంటుంది. మొత్తం మీద 50 పట్టణాల్లో ఇళ్ల ధరలు జూన్ క్వార్టర్లో, క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 4.8 శాతం వృద్ధి చెందాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఇళ్ల రేట్ల పెరుగుదల 7 శాతంగా ఉండడం గమనార్హం. ఇక ఈ ఏడాది మార్చి త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు 50 పట్టణాల్లో ఇళ్ల ధరలు 0.7 శాతం పెరిగాయి. 2021 జూన్ నుంచి ప్రతీ త్రైమాసికంలోనూ ఇళ్ల ధరల సూచీ పెరుగుతూ వస్తోందని ఎన్‌హెచ్‌బీ నివేదిక వెల్లడించింది.

## ఫోన్‌పే నుంచి స్టాక్ బ్రోకింగ్ సర్వీసులు

**షేర్‌డాట్‌మార్కెట్ ప్లాట్‌ఫాం ఆవిష్కరణ**

బెంగళూరు: ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే తాజాగా స్టాక్ బ్రోకింగ్ విభాగంలోకి ప్రవేశించింది. షేర్‌డాట్‌మార్కెట్ పేరిట ప్రత్యేక ప్లాట్‌ఫాంను ప్రారంభించింది. బీఎస్‌ఈ ఎండీ సుందరరామన్ రామమూర్తి బుధవారం దీన్ని ఆవిష్కరించారు. ప్రాథమికంగా స్టాక్స్, ఈటీఎఫ్‌లతో ప్రారంభించి క్రమంగా ఫ్యూచర్స్, ఆప్షన్స్ తదితర సెగ్మెంట్స్‌ను కూడా ఇందులో అందుబాటులోకి తేనుంది. దీనికి ఉజ్వల్ జైన్ సీఈవోగా వ్యవహరిస్తారు. స్టాక్ బ్రోకింగ్ సెగ్మెంట్‌లోకి ఎంట్రీ ద్వారా తమ ఆర్థిక సేవల పోర్ట్‌ఫోలియో సంపూర్ణమైందని ఫోన్‌పే వ్యవస్థాపకుడు, సీఈవో సమీర్ నిగమ్ తెలిపారు. మరోవైపు, 2025 నాటికల్లా ఫోన్‌పే నిర్వహణ లాభాలను సాధించే అవకాశం ఉందని సమీర్ నిగమ్ తెలిపారు.

## ఆఖర్లో లాభాల స్వీకరణ

**మూడో రోజూ స్వల్ప లాభాలతో క్లోజ్**



ముంబై: ఆఖర్లో అమ్మకాలు తలెత్తడంతో బుధవారం స్టాక్ సూచీలు ఆరంభ లాభాలు కోల్పోయి స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఆగస్టు నెలవారీ ఎఫ్ అండ్‌ఓ డెరివేటివ్స్ ముగింపు, దేశీయ క్యూ1 జీడీపీ వృద్ధి డేటాతో సహా కీలక స్థూల ఆర్థిక గణాంకాల విడుదల(నేడు)కు ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆయిల్‌అండ్ గ్యాస్ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా ట్రేడింగ్‌లో 406 పాయింట్లు బలపడిన సెన్సెక్స్ చివరికి 11 పాయింట్ల లాభంతో 65,087 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 110 పాయింట్లు పెరిగిన నిఫ్టీ అయిదు పాయింట్ల లాభంతో 19,347 వద్ద స్థిరపడింది. మెటల్, ఐటీ, రియల్టీ, ఆటో, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు రాణించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

**మార్కెట్లో మరిన్ని సంగతులు**

- జియో ఫైనాన్షియల్ సర్వీసెస్(జేఎఫ్ఎస్) షేరు వరుసగా మూడో రోజూ అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. ఇటీవల ఆర్ఐఎల్ ఏజీఎం సమావేశంలో జేఎఫ్ఎస్ బీమా, మ్యూచువల్ ఫండ్స్ వ్యాపారాల్లోకి విస్తరిస్తుందని కంపెనీ అధినేత ముకేశ్ అంబానీ చేసిన ప్రకటన ఈ షేరు ర్యాలీకి దోహదపడుతున్నాయి. తాజాగా బుధవారం బీఎస్‌ఈలో 5% ఎగసి రూ.233 వద్ద అప్పర్ సర్క్యూట్ వద్ద లాకైంది.
- గోకుల్ దాస్ ఎక్స్‌పోర్ట్స్ షేరు ర్యాలీ రెండో రోజూ కొనసాగింది. బీఎస్‌ఈలో 19% ఎగసి రూ.874 వద్ద స్థిరపడింది. యూఏఈకి చెందిన దుస్తుల తయారీ కంపెనీ అట్రాకోను 55 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.455 కోట్లు)కు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకోవడం ఈ షేరు ర్యాలీకి కారణమవుతోంది.

# డీల్స్ @ రూ. 60,000 కోట్లు!

- ఆగస్టులో షేర్ల బ్లాక్ డీల్స్‌లో రికార్డ్
- కోఫోర్జ్‌లో రూ. 7,684 కోట్ల విలువైన వాటా సేల్
- అదానీ పవర్‌లో రూ. 7,412 కోట్ల షేర్ల విక్రయం



ముంబై: ఓ వైపు దేశీ స్టాక్ మార్కెట్లు ఈ నెల(ఆగస్ట్)లో ఆటుపోట్లు ఎదుర్కొంటున్నప్పటికీ మరోపక్క లిస్టెడ్ కార్పొరేట్ ప్రపంచంలో భారీస్థాయి విక్రయ లావాదేవీలు జోరుగా సాగుతున్నాయి. గత ఐదు నెలల తదుపరి ఆగస్ట్‌లో మార్కెట్లు కొంతమేర వెనకడుగు వేయగా.. షేర్ల అమ్మకపు డీల్స్ కొత్త రికార్డ్‌కు తెరతీశాయి. ఒక పరిశీలన ప్రకారం ఈ నెలలో 29 వరకూ మొత్తం రూ. 60,000 కోట్ల మేర భారీ బ్లాక్‌డీల్స్ జరిగాయి. క్యాలెండర్ ఏడాదిలోని ఏ నెలలోనైనా విలువరీత్యా ఇవి అత్యధికం కాగా.. రెండు భారీ డీల్స్ ఇందుకు దోహదపడ్డాయి. సాఫ్ట్‌వేర్ సేవల దేశీ కంపెనీ కోఫోర్జ్(గతంలో ఎన్ఐఐటీ టెక్నాలజీస్)లో రూ. 7,684 కోట్ల విలువైన ఈక్విటీని పీఈ దిగ్గజం బేరింగ్ అనుబంధ కంపెనీ హల్ట్ విక్రయించింది. ఇదేవిధంగా ప్రయివేట్ రంగ విద్యుత్ కంపెనీ అదానీ పవర్‌లో ప్రమోటర్ గ్రూప్ రూ. 7,412 కోట్ల విలువైన షేర్లను యూఎస్ దిగ్గజం జీక్యూజీ పార్ట్‌నర్స్‌కు విక్రయించింది. ఈ బాటలో ఇండిగో బ్రాండు విమానయాన సేవల కంపెనీ ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్‌లో సహవ్యవస్థాపకుడు రాకేష్ గంగ్వాల్ కుటుంబం 3 శాతం వాటాను రూ. 2,802 కోట్లకు విక్రయించింది. దేశీ డిజిటల్ పేమెంట్స్ కంపెనీ పేటీఎమ్‌లో చైనా దిగ్గజం అలీబాబా గ్రూప్ కంపెనీ యాంట్‌ఫిన్ రూ. 2,037 కోట్ల విలువైన వాటాను అమ్మివేయగా.. ఆన్‌లైన్ ఫుడ్ సర్వింగ్ ప్లాట్‌ఫామ్ జొమాటోలో పీఈ దిగ్గజం టైగర్ గ్లోబల్ 1.44 శాతం వాటాను రూ. 1,124 కోట్లకు విక్రయించింది.

**మార్కెట్ల వెనకడుగు..**

ఈ ఏడాది జూలై 20న దేశీ స్టాక్ మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ సరికొత్త గరిష్టం 67,500 పాయింట్లను అధిగమించింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం దాదాపు 20,000 పాయింట్ల స్థాయికి చేరింది. ఈ రికార్డ్ స్థాయిల నుంచి సెన్సెక్స్, నిఫ్టీ నిజానికి ఆగస్ట్‌లో 3 శాతం వెనకడుగు వేశాయి. ప్రస్తుతం సెన్సెక్స్ 65,100, నిఫ్టీ 19,350 వద్ద కదులుతున్నాయి. అయితే దేశీయంగా అదనపు లిక్విడిటీ, మిడ్, స్మాల్‌క్యాప్స్‌నకు విస్తరించిన యాక్టివిటీ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడుల జోరు వంటి అంశాలు.. ఈ నెలలో భారీ స్థాయి లావాదేవీలకు కారణమవుతున్నట్లు కార్పొరేట్ వర్గాలు పేర్కొంటున్నాయి. దీనికితోడు దేశ ఆర్థిక వ్యవస్థపై మధ్య, దీర్ఘకాలిక వృద్ధి అంచనాలు, స్టాక్ మార్కెట్ భవిష్యత్‌పై పెరుగుతున్న ఇన్వెస్టర్ల విశ్వాసం జత కలుస్తున్నట్లు తెలియజేశాయి.

**ఇతర స్టాక్స్‌లోనే..**

ప్రధానంగా ఇండెక్సేతర కంపెనీలలోనే ఇటీవల వాటాల విక్రయాలలో భారీ లావాదేవీలు నమోదైనట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో మొత్తం మార్కెట్లో జరుగుతున్న అంశాలను సెన్సెక్స్ లేదా నిఫ్టీ ప్రతిఫలించకపోవచ్చని తెలియజేశాయి. మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్‌లు), విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు), పీఈ సంస్థలు తదితర దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు స్వల్పకాలిక అంశాలను పరిగణనలోకి తీసుకోవని వివరించాయి. ఈ నెలలో మార్కెట్లు రికార్డ్ గరిష్టాల నుంచి కొంతమేర క్షీణించినప్పటికీ.. మిడ్, స్మాల్ క్యాప్స్ చరిత్రాత్మక గరిష్టాలకు చేరడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించాయి. కాగా.. ఈ ఏడాది ఇప్పటివరకూ ఎన్ఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్స్ 23% జంప్‌చేయగా.. నిఫ్టీ దాదాపు 7% ఎగసింది. ఇక జూన్‌లోనూ మొత్తం రూ. 50,000 కోట్ల విలువైన భారీ బ్లాక్ డీల్స్ నమోదుకావడం మార్కెట్ల లోతుకు నిదర్శనమని నిపుణులు విశ్లేషించారు.

## జొమాటోలో వాటా విక్రయం

**సాఫ్ట్‌బ్యాంక్ నుంచి 1.16% వాటా ఔట్**




న్యూఢిల్లీ: జపనీస్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్ తాజాగా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటోలో 1.16 శాతం వాటా విక్రయించింది. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 10 కోట్ల షేర్ల(1.16 శాతం వాటా)ను అమ్మివేసింది. అనుబంధ సంస్థ ఎస్‌వీఎఫ్ గ్రోత్(సింగపూర్) పీటీఈ షేరుకి రూ. 94.7 సగటు ధరలో రూ. 947 కోట్లకు విక్రయించింది. మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఏబీ సన్‌లైఫ్, యాక్సిస్, కొటక్ మహీంద్రాతోపాటు సొసైటీ జనరాలి, మోర్గాన్ స్టాన్లీ ఏషియా సింగపూర్, నోమురా సింగపూర్ తదితరాలు జొమాటో షేర్లను కొనుగోలు చేశాయి. ఈ లావాదేవీ తదుపరి జొమాటోలో సాఫ్ట్‌బ్యాంక్ వాటా 3.35% నుంచి 2.19 శాతానికి క్షీణించింది.

ఈ వార్తలతో జొమాటో షేరు 5.3 శాతం జంప్ చేసి రూ. 100 సమీపంలో ముగిసింది.

---

**భవిత**



## విద్య, ఉద్యోగ సమాచారం

### డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ, ఢిల్లీలో 30 పోస్టులు

న్యూఢిల్లీలోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ, వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 30
» పోస్టుల వివరాలు: మెడికల్ ఆఫీసర్–01, సెక్షన్ ఆఫీసర్–04, సెక్యూరిటీ ఆఫీసర్–01, స్టాఫ్ నర్స్–01, సీనియర్ అసిస్టెంట్(జనరల్, సెక్రటేరియల్ సర్వీస్ అండ్ ఐటీ)–12, సెక్యూరిటీ సూపర్‌వైజర్–02, స్పోర్ట్స్ కోచ్–02, స్టూడియో అసిస్టెంట్–01, అసిస్టెంట్(జనరల్)/అసిస్టెంట్ కమ్ కేర్‌టేకర్/డాక్యుమెంటేషన్ అసిస్టెంట్/అసిస్టెంట్(సెక్రటేరియల్ సర్వీసెస్)–06.
» అర్హత: సంబంధిత విభాగంలో 10+2, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, సీఏ, ఇంటర్ ఐసీడబ్ల్యూఏఐ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:08.09.2023
» వెబ్‌సైట్: https://aud.ac.in

### సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో నాన్ టీచింగ్ పోస్టులు

అనంతపురంలోని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీ డైరెక్ట్/డిప్యుటేషన్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 06
» పోస్టుల వివరాలు: రిజిస్ట్రార్–01, ఫైనాన్స్ ఆఫీసర్–01, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్–01, జూనియర్ ఇంజనీర్(సివిల్)–01, సెక్యూరిటీ అసిస్టెంట్–02.
» అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:09.09.2023
» దరఖాస్తు హార్డ్‌కాపీని పోస్టులో పంపేందుకు చివరితేది: 21.09.2023.
» వెబ్‌సైట్: https://cuap.ac.in

### సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో టీచింగ్ పోస్టులు

అనంతపురంలోని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీ.. డైరెక్ట్/డిప్యుటేషన్ ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 03
» పోస్టుల వివరాలు: ప్రొఫెసర్(ఎకనామిక్స్)–01, అసోసియేట్ ప్రొఫెసర్(సైకాలజీ/ఇంగ్లిష్)–02.
» అర్హత: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:09.09.2023
» దరఖాస్తు హార్డ్‌కాపీని పోస్టులో పంపేందుకు చివరితేది: 21.09.2023.
» వెబ్‌సైట్: https://cuap.ac.in

### ఎఫ్‌డీడీఐలో 62 పోస్టులు

ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 62
» పోస్టుల వివరాలు: డిప్యూటీ జనరల్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, చీఫ్ టెక్నాలజిస్ట్, సీనియర్ టెక్నాలజిస్ట్ తదితరాలు.
» విభాగాలు: కెమికల్ ల్యాబొరేటరీ, కెమిస్ట్రీ, గార్మెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ, లెదర్ గూడ్స్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్ /గ్రాడ్యుయేషన్/బీకామ్/బీఏ/బ్యాచిలర్స్ డిగ్రీ/డిప్లొమా/ఎంబీఏ పీజీడీఎం /మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 30 నుంచి 55 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.30,000 నుంచి రూ.1.5 లక్షలు చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: స్కిల్ టెస్ట్/రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఫ్యాకల్టీ హెచ్ఓ–హెచ్ఆర్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఫోర్త్ ఫ్లోర్, రూమ్ నెం.406, ఎఫ్‌డీడీఐ, నోయిడా, ఉత్తరప్రదేశ్–201301 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 05.09.2023.
» వెబ్‌సైట్: www.fddiindia.com

### ఎన్ఎస్‌సీఎల్, న్యూఢిల్లీలో 89 పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్, కార్పొరేట్ ఆఫీస్.. దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఎస్‌సీఎల్ రీజనల్/ఏరియా ఆఫీసుల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 89
» అర్హత: సంబంధిత విభాగంలో సీనియర్ సెకండరీ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:25.09.2023
» కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది: 10.10.2023
» వెబ్‌సైట్: https://www.indiaseeds.com

## టాప్ వర్సిటీల్లో పీహెచ్‌డీ

» ఎన్‌టీఏ పీహెచ్‌డీ ఎంట్రన్స్ నోటిఫికేషన్ విడుదల
» జేఎన్‌యూ, డీయూ, బీహెచ్‌యూ, బీబీఏయూలలో అడ్మిషన్స్
» పీజీ ఉత్తీర్ణతతో దరఖాస్తుకు అవకాశం

**ఒకే పరీక్షతో నాలుగు ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీల్లో.. పీహెచ్‌డీలో ప్రవేశం పొందొచ్చు! అందుకు అవకాశం కల్పిస్తోంది.. ఎన్‌టీఏ పీహెచ్‌డీ ఎంట్రన్స్ ఎగ్జామ్!! ఆర్ట్స్ నుంచి సైన్సెస్ వరకూ.. పలు విభాగాల్లో తమ అర్హతకు సరితూగే పేపర్లలో పరీక్షకు హాజరై.. ఆ స్కోర్‌తో పీహెచ్‌డీలో అడుగు పెట్టొచ్చు! నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించే.. ఎన్‌టీఏ పీహెచ్‌డీ ఎంట్రన్స్‌కు తాజాగా నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌టీఏ పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షకు అర్హతలు, విభాగాలు, పరీక్ష విధానం తదితర వివరాలు..**




పీహెచ్‌డీ ప్రవేశాల కోసం అభ్యర్థులు ప్రతి యూనివర్సిటీకి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి. దీనికి కొంత ఉపశమనం కలిగించేలా.. ఒకే ప్రవేశ పరీక్ష ద్వారా నాలుగు యూనివర్సిటీల్లో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తోంది.. ఎన్‌టీఏ పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్.

**నాలుగు యూనివర్సిటీలు**

ఎన్‌టీఏ పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్‌లో స్కోర్ ఆధారంగా దేశంలోని నాలుగు ప్రతిష్ఠాత్మక కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందొచ్చు. అవి.. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ), ఢిల్లీ యూనిర్సిటీ(డీయూ), బెనారస్ హిందూ యూనివర్సిటీ(బీహెచ్‌యూ), బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేడ్కర్ యూనివర్సిటీ.

**ఆరు విభాగాలు**

- ఈ నాలుగు యూనివర్సిటీల్లో అందుబాటులో ఉన్న పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ల మేరకు మొత్తం ఆరు విభాగాల్లో పలు సబ్జెక్టులలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. కామర్స్ అండ్ సైన్స్, ఆర్ట్ అండ్ కల్చర్, హ్యుమానిటీస్, లాంగ్వేజెస్, సైన్సెస్‌తోపాటు కామన్ సబ్జెక్ట్స్ విభాగం కూడా ఉంది.
- కామర్స్ అండ్ ఫైనాన్స్ విభాగంలో.. మూడు కోర్సులు; ఆర్ట్ అండ్ కల్చర్ విభాగంలో 8 కోర్సులు, హ్యుమానిటీస్ విభాగంలో 12 కోర్సులు, లాంగ్వేజెస్ విభాగంలో 19 కోర్సులు, సైన్సెస్ విభాగంలో 32 కోర్సులు, కామన్ సబ్జెక్ట్స్ విభాగంలో 24 కోర్సులు అందుబాటులో ఉంటాయి.

**పీజీతో దరఖాస్తు అవకాశం**

ఎన్‌టీఏ పీహెచ్‌డీ ఎంట్రన్స్‌కు పీజీ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం ఉంది. పీజీలో తాము చదివిన స్పెషలైజేషన్‌కు అనుగుణంగా ఎన్‌టీఏ పీహెచ్‌డీ ఎంట్రన్స్‌కు హాజరవ్వొచ్చు. పీజీ ఉత్తీర్ణత ఆధారంగానే పరీక్షకు అవకాశం ఉన్నప్పటికీ.. ఆయా యూనివర్సిటీలు పీహెచ్‌డీ ప్రవేశాలకు పేర్కొన్న అర్హత నిబంధనలను పరిశీలించి దరఖాస్తు చేసుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది. పీజీ స్థాయిలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన అమలవుతోంది. గరిష్టంగా మూడు సబ్జెక్ట్‌లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

**మలి దశలో ప్రవేశ ప్రక్రియ**

ఎన్‌టీఏ పీహెచ్‌డీ ఎంట్రన్స్‌లో స్కోర్ ఆధారంగా యూనివర్సిటీలు మలి దశలో ప్రత్యేక ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తాయి. అభ్యర్థులు ఆయా విశ్వవిద్యాలయాల నోటిఫికేషన్లకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తుతో పాటు ఎన్‌టీఏ పీహెచ్‌డీ ఎంట్రన్స్ స్కోర్‌ను కూడా తెలియజేయాలి. ఆ తర్వాత దరఖాస్తు చేసుకున్న సబ్జెక్ట్ విభాగాలు, అందుబాటులో ఉన్న సీట్లను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఇలా ఎంపికైన వారికి పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి ప్రవేశం ఖరారు చేస్తారు.

**ఈ ఏడాది ప్రవేశాలకు మాత్రమే**

ఎన్‌టీఏ పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్ స్కోర్‌ను ఆయా యూనివర్సిటీల్లో ఈ విద్యా సంవత్సరం(2023–24)లో ప్రవేశాలకు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. స్కోర్ కార్డ్ డౌన్ లోడ్ సదుపాయాన్ని 2024, జనవరి 31 వరకే అందుబాటులో ఉంచుతామని ఎన్‌టీఏ వర్గాలు స్పష్టం చేశాయి.

**రాత పరీక్ష.. రెండు విభాగాల్లో**

- ఎన్‌టీఏ పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్‌ను రెండు విభాగాల్లో 100 ప్రశ్నలతో నిర్వహిస్తారు. –మొదటి విభాగంలో రీసెర్చ్ మెథడాలజీ నుంచి 50 ప్రశ్నలు, రెండో విభాగంలో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు.
- ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు చొప్పున మొత్తం 400 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో నిర్వహిస్తారు.
- పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు.
- నెగెటివ్ మార్కుల నిబంధన అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

**ముఖ్య సమాచారం**

- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: సెప్టెంబర్ 8, 2023
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ: సెప్టెంబర్ 9–11 తేదీలు.
- పరీక్ష తేదీలు:నవంబర్‌లో నిర్వహించే అవకాశం.
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: కాకినాడ, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://phdentrance.samarth.ac.in

### మంచి స్కోర్‌కు మార్గాలు

**రీసెర్చ్ మెథడాలజీ**

అభ్యర్థులు తాము పరీక్షకు హాజరవుతున్న విభాగానికి సంబంధించి పరిశోధన, నిర్వచనం, ఆ విభాగంలో ఇప్పటికే పూర్తయిన రీసెర్చ్, పరిశోధనల ఆవశ్యకత, ప్రాబ్లమ్ ఫైండింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, డేటా కలెక్షన్, డేటా ప్రాసెసింగ్ అండ్ అనాలిసిస్, ఇన్ఫర్మేషన్ సోర్సెస్, రీసెర్చ్ ఎథిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ స్టాటిస్టిక్స్‌కు సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టాలి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తాజా పరిశోధనలు, వాటి ఫలితాలు, సంబంధిత శాస్త్రవేత్తల గురించి అవగాహన పెంచుకోవాలి.

**సబ్జెక్ట్ విభాగం**

సబ్జెక్ట్ విభాగానికి సంబంధించి అభ్యర్థులు పీజీ స్థాయిలో అకడమిక్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా రీసెర్చ్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. తమ సబ్జెక్ట్‌లకు సంబంధించి ప్రస్తుతం ఉన్న సమస్యలు, వాటి పరిష్కారం దిశగా ఉపయోగపడే పరిశోధనల పరంగా అవగాహన పెంచుకోవాలి. అభ్యసనం చేసేటప్పుడే రీసెర్చ్ ఓరియెంటేషన్ అలవర్చుకోవడం లాభిస్తుంది.

**ఫెలోషిప్**

ఎన్‌టీఏ పీహెచ్‌డీ ఎంట్రన్స్ ద్వారా ప్రవేశం ఖరారు చేసుకున్న వారికి.. నాన్–నెట్ ఫెలోషిప్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకం సైతం లభించే అవకాశం ఉంది. ఎంపికైన వారికి నెలకు రూ.8వేల ఫెలోషిప్ అందిస్తారు. దీంతోపాటు సైన్స్ విభాగాల అభ్యర్థులకు ఏడాదికి రూ.పది వేలు, నాన్–సైన్స్ అభ్యర్థులకు ఏడాదికి రూ.8వేలు చొప్పున కాంటింజెన్సీ గ్రాంట్ కూడా లభిస్తుంది.

**కెరీర్ అవకాశాలు**

పీహెచ్‌డీ పూర్తి చేయడం ద్వారా భవిష్యత్తులో ఎన్నో అవకాశాలను అందుకోవచ్చు. ముఖ్యంగా ఐఐసీటీ, సీఎస్ఐఆర్, ఐసీఏఆర్, ఎన్‌జీఐఆర్ఐ, ఇక్రిశాట్ తదితర సంస్థల్లో జూనియర్ సైంటిస్ట్‌లుగా అవకాశం లభిస్తుంది. బోధన రంగంలో పీహెచ్‌డీ ఫ్యాకల్టీగా కెరీర్ ప్రారంభించే వీలుంది. ప్రైవేటు సంస్థల ఆర్ అండ్ డీ విభాగాల్లో సైంటిస్ట్‌లుగా ప్రారంభంలోనే నెలకు రూ.2 లక్షల వేతనం అందుకోవచ్చు. పీహెచ్‌డీ పూర్తి చేసిన తర్వాత సొంత రీసెర్చ్ ప్రాజెక్ట్‌లను చేపట్టేందుకు సైతం అవకాశం లభిస్తుంది. ఇలాంటి అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్.. ఎక్స్‌ట్రా మ్యూరల్ రీసెర్చ్ ఫండింగ్, ఎర్లీ కెరీర్ రీసెర్చ్ అవార్డ్, నేషనల్ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ పేరుతో పలు పథకాలు అందుబాటులో ఉంచింది. ఏడాదికి రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు రీసెర్చ్ గ్రాంట్, నెలకు రూ.55 వేల ఫెలోషిప్, ఇతర రీసెర్చ్ ఖర్చుల కోసం ఓవర్ హెడ్స్ పేరుతో ఏడాదికి రూ.లక్ష మేర ఆర్థిక ప్రోత్సాహకాలు లభిస్తాయి.

# సుస్థిర వ్యవసాయంతోనే ఆహార భద్రత



## దేశంలో ఓ మోస్తరు సుస్థిర వ్యవసాయమే..

**ఏపీ సహా కేవలం 5 రాష్ట్రాల్లోనే సుస్థిర వ్యవసాయాభివృద్ధి**

**పంజాబ్, హరియాణ సామాజిక, ఆర్థిక రంగాల్లో ముందున్నా, వ్యవసాయ సుస్థిరతలో వెనుకంజలోనే..**

- 'సుస్థిరత'కు పెనుసవాలుగా రసాయన ఎరువులు నీరు, విద్యుత్ అధిక వినియోగం
- సుస్థిర వ్యవసాయం సాధించకపోతే ఆహార భద్రత కష్టమే అంటున్న ఐసీఏఆర్
- వ్యవసాయ రంగంలోని 51 సూచికల ఆధారంగా అధ్యయనం చేసిన ఐకార్ శాస్త్రవేత్తలు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్

రానున్న సంవత్సరాల్లో భారత్‌లో ఆహార సంక్షోభం తలెత్తనుందా? దేశ వ్యాప్తంగా సుస్థిర వ్యవసాయాభివృద్ధి సాధ్యం కావడం లేదా? కొన్ని రాష్ట్రాలు మాత్రమే ఈ సుస్థిర వ్యవసాయంలో ముందుకు వెళ్తున్నాయా? అలా వెళ్తున్న రాష్ట్రాలు ఆహార భద్రతకు భరోసా కల్పిస్తున్నాయా? సుస్థిర వ్యవసాయానికి మొత్తం 51 సూచికలను ప్రామాణికంగా తీసుకుని దేశ వ్యాప్తంగా జరిపిన అధ్యయనం తర్వాత సుస్థిర వ్యవసాయం సాధించలేని పక్షంలో ఆహార భద్రత కష్టమేనని అఖిల భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్–ఐకార్) అభిప్రాయపడుతోంది. 'కాంపోజిట్ ఇండెక్స్ ఆఫ్ అగ్రికల్చర్ సస్టైనబులిటీ'పేరిట దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోని వ్యవసాయ విధానాలను ఐకార్ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రేమ్‌చంద్, కిరణ్‌కుమార్‌లు పరిశీలించి నివేదిక సమర్పించారు. ఈ నేపథ్యంలో ఐకార్ ఈ అభిప్రాయానికి వచ్చింది. వ్యవసాయ విధానాల్లో స్పష్టమైన మార్పులు రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తోంది.

### వ్యవసాయ సుస్థిరతకు సవాళ్లు

'వ్యవసాయ రంగంలో రసాయన ఎరువుల వినియోగం పెరగడం, తీవ్ర వ్యవసాయ పద్ధతులను అవలంబించడం, భూసారం తగ్గిపోవడం వ్యవసాయ సుస్థిరతకు పెనుసవాలుగా మారుతోంది. 2030 నాటికి భారత దేశ జనాభా 150 కోట్లకు చేరుకుంటుంది. ఆ జనాభాకు ఆహార భద్రత కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయం రంగంపై ఉంది. కొన్ని రాష్ట్రాలు సామాజిక, ఆర్థిక రంగాల్లో మంచి ప్రతిభ కనపరుస్తున్నట్లు కనిపించినా.. వ్యవసాయ రంగానికి సంబంధించిన మొత్తం సుస్థిరత సూచిలకు వచ్చేసారికి వెనుకబడుతున్నాయి..'అని ఐసీఏఆర్ వెల్లడించింది. పంజాబ్, హరియాణ సామాజిక, ఆర్థిక రంగాల్లో ముందంజలో ఉన్నప్పటికీ.. వ్యవసాయ సుస్థిరత సూచిని పరిశీలించినప్పుడు వెనుకబడి ఉన్నట్లు తెలిపింది. భారత వ్యవసాయ రంగం సుస్థిరత కోణంలో ఉన్నత స్థానంలో లేదని ఓ మోస్తరు సుస్థిరతతోనే ఉన్నట్లు స్పష్టం చేసింది.

### సుస్థిర వ్యవసాయానికి 51 సూచికలు

సుస్థిర వ్యవసాయాభివృద్ధికి 51 సూచికలను ప్రామాణికంగా తీసుకున్నట్లు ఐకార్ వెల్లడించింది. సారవంతమైన నేలలు, నీటి వనరులు, జీవ వైవిధ్యం, సామాజిక, ఆర్థిక, పర్యావరణ సమతుల్యత తదితర సూచికలు ప్రధానమైనవిగా గుర్తించారు. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్, పంజాబ్, బిహార్, హరియాణతో పాటు వరి పండించే జార్ఖండ్ అస్సాం రాష్ట్రాలు ఎక్కువ ప్రమాదంలో ఉన్నట్లు ఐకార్ వివరించింది. ఇక్కడ వ్యవసాయ విధానాల్లో మార్పులు అత్యావశ్యమని హెచ్చరించింది. పంటల మార్పిడి, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి, పంట రుణాలు, నీటి వనరుల కల్పన తదితరాలతో సుస్థిర వ్యవసాయం సాధ్యమని పేర్కొంది. అధిక ఇన్‌పుట్ సబ్సిడీల నుంచి పద్ధతి ప్రకారం రైతులకు లబ్ధి చేకూరే విధానాలు రావాల్సి ఉందని తెలిపింది. భూములు సారవంతంగా లేని చోట రసాయన ఎరువుల వాడకం పెరుగుతోందని, దీనివల్ల భూమిలో ఆర్గానిక్ కార్బన్ తగ్గుదల చోటు చేసుకుంటోందని వివరించింది. మరోవైపు భూ గర్భ జలాల వినియోగం విపరీతంగా పెరుగుతోందని, ఇది సుస్థిర వ్యవసాయాన్ని ప్రమాదంలోకి నెట్టడమేనని వ్యాఖ్యానించింది.



### దేశంలో ఓ మాదిరి సుస్థిరతే..

సుస్థిర వ్యవసాయంలో 0 నుంచి 1ని ప్రామాణికంగా తీసుకుంటే భారతదేశంలో సరాసరిన 0.50 నమోదు అవుతోందని, ఇది ఓ మాదిరి సుస్థిరత మాత్రమేనని ఐసీఏఆర్ తేల్చింది. 0ను అధ్వాన్నంగా పేర్కొంటే , 1ని అత్యుత్తమంగా పేర్కొంది. హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరాఖండ్ కేరళలు జాతీయ సగటును మించి ఉన్నాయి. పంజాబ్, హరియాణా, రాజస్థాన్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌లు అధ్వానంగా ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో భూ గర్భ జలాల వినియోగం అధికంగా ఉందని, భూగర్భ జలాలు 40 సెంటీమీటర్ల మేరకు వేగంగా పడిపోయాయని ఐకార్ పేర్కొంది. ఇక పర్యావరణ సుస్థిరతలో కర్ణాటక, మహారాష్ట్ర, మిజోరం, ఉత్తరాఖండ్‌లు మెరుగైన పనితీరును కనపరుస్తున్నట్లు తెలిపింది. ఇందులో అస్సాం, మణిపూర్, జార్ఖండ్ పంజాబ్, తెలంగాణ అధ్వానంగా ఉన్నట్లు తమ పరిశోధనలో తేలిందని పేర్కొంది. ఈ రాష్ట్రాల్లో ఆర్గానిక్ వ్యవసాయం చాలా తక్కువగా పరిమాణంలో ఉందని, గ్రీన్‌హౌస్ గ్యాసెస్ ఎక్కువగా వ్యవసాయ రంగం నుంచే వెలువడుతున్నట్లు పేర్కొంది. సామాజిక, ఆర్థిక సుస్థిరత ప్రమాణాల్లో పంజాబ్, హరియాణా దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ముందువరుసలో ఉన్నట్లు తేల్చింది.

### ముందంజలో ఏపీ


'ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, మిజోరం, కేరళ, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లు మాత్రమే సుస్థిర వ్యవసాయాభివృద్ధి సాధిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనే రాజస్థాన్ సుస్థిర వ్యవసాయంలో చివరలో ఉంది. సుస్థిర వ్యవసాయానికి ప్రధాన సూచికలైన అతి తక్కువ నీరు, రసాయనాలు, ఎరువులు, విద్యుత్ వినియోగిస్తూ, భూసారం తగ్గకుండా పంటలు పండించే రైతాంగానికి ప్రభుత్వాలు సరైన సమయంలో జోక్యం చేసుకుని సాయం అందించాల్సిన అవసరం ఉంది. అప్పుడే భారత్‌లో ఆహార భద్రతకు ఇబ్బందులు ఏర్పడకుండా ఉంటాయి.' అని ఐకార్ నివేదిక తెలిపింది.

### వాణిజ్య పంటలున్నా ఏపీ భేష్



రామాంజనేయులు, సుస్థిర వ్యవసాయ నిపుణులు, హైదరాబాద్

సుస్థిర వ్యవసాయాభివృద్ధి సాధిస్తున్న ఐదారు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఉండటం అభినందనీయం. మిజోరం, కేరళ మధ్యప్రదేశ్ రాష్ట్రాలు కూడా ఉన్నా.. ఆ రాష్ట్రాల్లో వాణిజ్య పంటలు తక్కువగా ఉంటాయి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో వాణిజ్య పంటలు అధికంగా సాగు చేస్తున్నా.. రసాయన ఎరువులు, నీరు తక్కువ వినియోగం, భూసారాన్ని పెంపొందించేలా చేయడం ద్వారా సుస్థిర వ్యవసాయాన్ని సాధించింది. సుస్థిర వ్యవసాయం చేస్తున్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉంది. ఈ రైతులను ఆదుకుంటే దేశ ఆహార భద్రతకు వచ్చే ముప్పేమీ ఉండదు.




# అక్టోబర్ నుంచి బాలల అదాలత్‌లు

**ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు**



సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్ నుంచి బాలల అదాలత్‌లు నిర్వహించనున్నట్లు ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. మంగళగిరి కమిషన్ కార్యాలయంలో సభ్యులు జంగం రాజేంద్రప్రసాద్, గోండు సీతారాం, బత్తుల పద్మావతితో ఆయన సమావేశమయ్యారు. తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలో నిర్వహించడానికి అవసరమైన ప్రణాళికలు, సన్నాహాలపై వారు చర్చించారు. 18 సంవత్సరాల్లోపు బాలలు తమ హక్కులకు భంగం కలిగినప్పుడు, ఆయా ప్రాంతాల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. ఇలాంటి విషయాలు తమ దృష్టికి తీసుకురావడానికి ఈ అదాలత్‌లు సువర్ణావకాశమని వివరించారు.

# ఇచ్చట తుక్కు.. తుక్కు చేయబడును

**గుంటూరు మండలం బుడంపాడులో వెహికల్ స్క్రాప్ రీసైక్లింగ్ హబ్**

**15 ఏళ్లు దాటిన వాహనాలను స్క్రాప్‌కు పంపాల్సిందే**

**కేంద్ర ప్రభుత్వ నూతన మార్గదర్శకాలు**

**దక్షిణ భారతదేశంలో ఏర్పాటైన తొలి హబ్ ఇదే**

- వాహనాలు స్క్రాప్‌కు ఇచ్చిన వారికి 15 నుంచి 25 శాతం రాయితీ
- రిజిస్ట్రేషన్ కూడా ఉచితం



– సాక్షి ప్రతినిధి, గుంటూరు



గుంటూరులో ఏర్పాటు చేసిన రీసైక్లింగ్ హబ్



వాహనంలోని భాగాలను తుక్కు చేసే మెషిన్

అవును.. ఇక్కడ జీవిత కాలం ముగిసిన వాహనాలను తుక్కుగా మార్చేస్తారు. గతంలో కాలం చెల్లిన వాహనాలను గుంటూరు మాయాబజార్‌లోనో, ఆటోనగర్‌లోనో వ్యాపారులు ఇచ్చిన ధరకే అమ్ముకోవాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి మారనుంది. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్క్రాప్ రీసైక్లింగ్ హబ్‌కు శ్రీకారం చుట్టారు. గుంటూరు రూరల్ మండలం బుడంపాడు గ్రామంలో హిందుస్థాన్ రీసైక్లింగ్ హబ్ ఏర్పాటుకు లైసెన్స్ కేటాయించటంతో.. దీనిని నెలకొల్పేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు త్వరలో ప్రారంభానికి సన్నద్ధం అవుతోంది. గుంటూరు, ఒంగోలు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్లు, జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్లు పూర్తిస్థాయిలో పర్యవేక్షించిన తరువాతే ఈ సంస్థకు అన్ని అనుమతులు మంజూరు చేశారు. ఈ హబ్‌తోపాటు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో మరో హబ్ ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

### ఇదో అద్భుత నిర్ణయం



కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఓ అద్భుతం. ఇకపై ఎటువంటి వాహనాదారులు వాహనాలను స్క్రాప్‌కు పంపినా ఎటువంటి ఇబ్బందులు ఉండవు. కచ్చితమైన సర్టిఫికెట్ ద్వారా స్క్రాపింగ్ జరిగితే రాయితీలు పొందే అవకాశం ఉంది. హబ్ ఏర్పాటు వల్ల ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్లు 15 ఏళ్ల దాటిన వాహనాలు స్క్రాప్‌కు వేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

– షేక్ కరీం, డీటీసీ, గుంటూరు

### నిబంధనల ప్రకారమే



పూర్తిస్థాయిలో నిబంధనలకు అనుగుణంగా స్క్రాపింగ్ జరుగుతుంది. రిజిస్ట్రేషన్ ఉన్న వాహనాలను మాత్రమే తీసుకుంటారు. కొనుగోలు చేసి 15 ఏళ్ల దాటిన వాహనాలు, ప్రమాదాల్లో తీవ్రంగా దెబ్బతిన్న వాహనాలు, వాహనం వద్దనుకున్న వారికి స్క్రాప్ చేసి ధర నిర్ణయిస్తాం. ప్రభుత్వ వాహనాలతోపాటు ప్రైవేట్ వాహనాలు కూడా రీస్టైకింగ్‌కు రావచ్చు. ముందుగా దరఖాస్తు చేసుకుంటే సమయం కేటాయిస్తాం.

– ఎండీ జబీవుల్లా, లైసెన్స్‌దారు

### గతంలో ఏం జరిగేదంటే..

గతంలో గుంటూరు ఆటోనగర్, మాయాబజార్‌లలో మాత్రమే వాహనాలను స్క్రాప్‌కు విక్రయించేవారు. ఈ క్రమంలో పలు వాహనాల ఇంజిన్‌లు అమ్ముకోవటంతో పాటు చాసిస్ నంబర్లు ఇతర వాహనాలకు వినియోగించే ప్రక్రియ జరుగుతుండేది. దీనివల్ల ఏదైనా కొత్త నంబర్లు వేసిన వాహనాలకు ప్రమాదం జరిగినా.. వాటిని వేసుకు వచ్చి దొంగతనాలు జరిగినా ఆ వాహన యజమాని మెడకు చుట్టుకునేవి. ఇప్పుడు అటువంటి అక్రమాలకు చెక్ పెట్టే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వాహన యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### స్క్రాప్ హబ్ ఎందుకంటే..

పాత వాహనాలను స్వచ్ఛందంగా, అధికారికంగా తుక్కుగా మార్చుకునేందుకు అవకాశాన్ని కల్పిస్తూ 2021లో జీవో 653 (ఈ) ప్రకారం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు సైతం ఇచ్చింది. 15 సంవత్సరాలు దాటిన వాహనాలను, ప్రమాదాల్లో తీవ్రంగా దెబ్బతిన్న, మూలన పడేసిన వాహనాలతోపాటు ప్రభుత్వ, స్థానిక సంస్థల, కార్పొరేషన్ల వాహనాలు, ఆర్టీసీ బస్సులను సైతం 15 ఏళ్ల దాటిన తరువాత స్క్రాప్‌కు పంపాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. యజమానుల స్వచ్ఛంద ప్రాతిపదికన స్క్రాప్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వపరంగా హిందుస్థాన్ రీసైక్లింగ్ హబ్‌ను సుమారు రూ.2 కోట్లు వెచ్చించి మూడెకరాల్లో భారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నారు. ఎటువంటి సమస్యలు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. హబ్‌లోకి వాహనాన్ని పంపి స్క్రాప్ చేయిస్తే ప్రభుత్వం నుంచి స్క్రాప్ చేసినట్టుగా ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. మార్కెట్ ధర ప్రకారం ఇంజిన్, ఇతర సామగ్రి విలువ నిర్ణయిస్తారు. ఆ విలువను కొత్త వాహనం కొనుగోలు చేసే సమయంలో దానిపై 15 నుంచి 25 శాతం వరకూ రాయితీ ఇచ్చే అవకాశం కల్పించడంతో పాటు కొత్త వాహనానికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తారు. రిజిస్ట్రేషన్ అండ్ వెహికల్స్ స్క్రాపింగ్ ఫెసిలిటీ (ఆర్‌వీఎస్ఎఫ్) ద్వారా పూర్తి స్థాయిలో వాహన సమాచారాన్ని అందజేస్తారు. ఇప్పటికే భారీ స్థాయిలో దరఖాస్తులు వస్తున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు.



స్క్రాప్‌కు సిద్ధమవుతున్న కారు

# విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాలి

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్



ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులకు చెక్కును అందిస్తున్న సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆలోచనను పెంచి సమస్యలను శాస్త్రీయంగా పరిష్కరించేలా ప్రోత్సహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. విజయవాడలో 'రాష్ట్రస్థాయి స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ గ్రాండ్ ఫినాలే' బుధవారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలించారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాపరెడ్డి, యూనిసెఫ్ దక్షిణభారత ప్రతినిధి డాక్టర్ శేషగిరి మధుసూదన్, స్కూల్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ డైరెక్టర్ వంశీకృష్ణ, నోడల్ ఆఫీసర్ డాక్టర్ జి.భాగ్యశ్రీ పాల్గొన్నారు.


**రాష్ట్రస్థాయి పోటీలో విజేతలు వీరే..**

జిల్లాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన 27 బృందాలు రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనగా, మొదటి పది స్థానాలు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించిన జీవీఎంసీ ఉన్నత పాఠశాల (విశాఖపట్నం)కు రూ.లక్ష, ఏపీ మోడల్ స్కూల్ గొనెగండ్ల (కర్నూలు జిల్లా)కు రూ.75వేలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కలిదిండి (ఏలూరు జిల్లా)కు రూ.50 వేలు అందజేశారు. అలాగే నాలుగో బహుమతి రూ.30 వేలు జీటీఎస్ బాలుర ఉన్నత పాఠశాల, పెదబయలు (అల్లూరి సీతారామరాజు జిల్లా), ఐదో బహుమతి రూ.20 వేలు ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, నంద్యాల సొంతం చేసుకున్నాయి. మిగిలిన ఆరునుంచి 10 స్థానాల్లో నిలిచిన బృందాలకు రూ.10 వేల చొప్పున అందజేశారు.

# గిరిజన భూ వివాదాలకు సత్వర పరిష్కారం

**వివాద పరిష్కారానికి 6 నెలల గడువు**

- అప్పటికి పరిష్కారం కాకపోతే అప్పీల్‌కు రెండు నెలలు
- ఏళ్ల తరబడి పేరుకుపోయిన వివాదాలు
- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక చర్యలు



**ఎల్‌టీఆర్ ఆర్డర్ అమలు ఇలా**

- ప్రారంభం (1976) నుండి ఈ ఏడాది జూన్ వరకు 29,810 ఎల్‌టీఆర్ వివాదాలు(1,47,554 ఎకరాలు) గుర్తించారు.
- 12,678 కేసులు (56,882 ఎకరాలు) గిరిజనులకు అనుకూలంగా ఉత్తర్వులు అమలయ్యాయి.
- 11,754 కేసుల్లో 51,278 ఎకరాలను గిరిజనులకు స్వాధీనం చేశారు.
- 924 కేసుల్లో 5,604 ఎకరాలను అప్పగించాల్సి ఉంది. మరికొన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గిరిజన భూ వివాదాల సత్వర పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలోని గిరిజనులకు చెందిన షెడ్యూల్డ్ ఏరియా 'భూ బదలాయింపు నిబంధనలు (ఎల్‌టీఆర్) 1/70' ప్రకారం వారి హక్కులను కాపాడేలా పక్కా కార్యాచరణ చేపట్టింది. దాదాపు 1976 నుంచి పేరుకుపోయిన వేలాది ఎల్‌టీఆర్ కేసుల్లో వేగంగా విచారణ జరిపి సత్వర న్యాయం అందించే దిశగా ఆదేశాలిచ్చింది. దీంతో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందుకోసం అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చడంతోపాటు ఇటీవల ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసింది. తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలు సైతం జారీ చేసింది. పెండింగ్‌లో ఉన్న ఎల్‌టీఆర్ కేసులు విచారణ వేగవంతం చేయడం, పాత కేసుల్లోని భూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించడం , కొత్తగా నమోదైన కేసులను 6 నెలల గడువులోను, అప్పీల్‌కు వెళ్లిన కేసులు రెండు నెలల్లో పరిష్కరించాలని ఆదేశాలిచ్చింది. అప్పటికీ వివాదం కొలిక్కిరాకపోతే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, కమిషనర్ విచారణకు వెళుతుంది. కేసుల్లో గిరిజనులకు అనుకూలమైన ఉత్తర్వులను వేగంగా అమలులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొంది. గిరిజనులకు వ్యతిరేకంగా వచ్చిన వాటి వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేయడంతోపాటు ఆయా గ్రామ సచివాలయాల వద్ద ప్రదర్శించాల్సి ఉంటుంది. ఎల్‌టీఆర్ కేసుల పురోగతిపై ఎప్పటికప్పుడు ఐటీడీఏ పీవోలు, మైదాన ప్రాంత కలెక్టర్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది. వీటికి సంబంధించిన సమాచారాన్ని ప్రతి మూడు నెలలకు ఒకసారి నివేదిక పంపించాలి. ఎల్‌టీఆర్ కేసులు, హక్కులపై ఐటీడీఏల పరిధిలో వాల్ పోస్టర్లు, కరపత్రాల ద్వారా గిరిజనులకు పెద్దఎత్తున అవగాహన కల్పించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆదేశాలు ఇచ్చింది.

**గిరిజన భూములకు రక్ష 1/70 యాక్ట్**

5వ షెడ్యూల్ ప్రకారం గిరిజనులకు ప్రత్యేక హక్కులు కల్పించారు. భూములకు సంబంధించి 1/70 (1959 చట్ట సవరణ) సెక్షన్–3తో గిరిజనులకు భూములపై హక్కులున్నాయి. షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజనులకు చెందిన భూములు వారే అనుభవించాలి. గిరిజనులు నుంచి గిరిజనులు భూములు పొందచ్చు. గిరిజనుల నుంచి గిరిజనేతరులు కొనుగోలు చేయడం, ఆక్రమించడం వంటివి చెల్లవు. భూముల అన్యాక్రాంతాన్ని నిరోధించడమే దీని ఉద్దేశం. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతం (షెడ్యూల్డ్ ఏరియా) 37 మండలాల పరిధిలోని 3,512 గ్రామాల్లో నివసించే వారికి ఈ హక్కులు వర్తిస్తాయి. గిరిజనులకు చెందిన భూవివాదాల పరిష్కారం కోసం అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ఏలూరు జిల్లాలకు చెందిన రంపచోడవరం, పాడేరు, పార్వతీపురం, సీతంపేట, కోట రామచంద్రపురం, పోలవరం ఐటీడీఏల పరిధిలో ఐదు ప్రత్యేక ఎల్‌టీఆర్ కోర్టులను ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఆయా ప్రాంతాల్లో భూ వివాదాలను తొలుత డిప్యూటీ తహసిల్దార్ (డీటీ) గుర్తించి నోటీసులు జారీ చేస్తారు. తగిన సమాచారం సేకరించిన అనంతరం ఐటీడీఏల పరిధిలోని పాడేరు, రంపచోడవరం, ఎల్‌వీఎన్ పేట, కేఆర్ పురం, పోలవరం కోర్టుల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు విచారణ చేపడతారు. ఈ వివాదాల్లో తగిన పత్రాలు, ఆధారాలను సమర్పించడం ద్వారా భూమి ఎవరిదో నిరూపించుకోవాల్సి ఉంటుంది.



బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈవో ధర్మారెడ్డి

# 18 నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

**బుక్‌లెట్లను ఆవిష్కరించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి**

తిరుమల: శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి బుధవారం తిరుమల ఆలయం ఎదుట ఆవిష్కరించారు. అనంతరం భూమన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఏడాది అధికమాసం కారణంగా సెప్టెంబర్ 18 నుంచి 26 వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 15 నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని చెప్పారు. సెప్టెంబర్ 18న ధ్వజారోహణం సందర్భంగా సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. సామాన్య భక్తులకు సంతృప్తికరంగా వాహన సేవలతో పాటు మూలమూర్తి దర్శనం కల్పిస్తామని చెప్పారు. బ్రేక్ దర్శనాల కోసం సిఫారసు లేఖలు స్వీకరించబోమన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారని వివరించారు. సెప్టెంబరు 22న గరుడ సేవ, 23న స్వర్ణరథం, 25న రథోత్సవం, 26న చక్రస్నానం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు, శ్రీకృష్ణ శేషాచల దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.


**నేడు శ్రీ విఖనసాచార్యుల సన్నిధికి మలయప్పస్వామి**

గాయత్రి జపాన్ని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి గురువారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం ఉత్తర మాడ వీధిలోని శ్రీ విఖనసాచార్యుల సన్నిధికి వేంచేపు చేయనున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఆస్థానం నిర్వహించి నివేదన చేపడతారు. శ్రీవారి ఆలయంలో వైఖానస ఆగమం ప్రకారం నిత్య కైంకర్యాలు, సేవలు, ఉత్సవాలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో గురువారం జరగాల్సిన పౌర్ణమి గరుడ సేవను టీటీడీ రద్దు చేసింది. కాగా, డయల్ యువర్ ఈవో కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుంది. దీనిని శ్రీ వేంకటేశ్వర భక్తి చానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. భక్తులు 0877–2263261 నంబర్ ద్వారా టీటీడీ ఈవో ధర్మారెడ్డితో మాట్లాడి తమ సందేహాలు, సూచనలను తెలియజేయవచ్చు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

## క్లుప్తంగా

### ఎడతెరిపి లేని వర్షం.. రహదారులు జలమయం



గంగావతిలో వర్షం కురుస్తున్న దృశ్యం

గంగావతి: నగరంలో బుధవారం మధ్యాహ్నం సుమారు గంటకు పైగా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఈ వర్షానికి రోడ్లలో వాహన రాకపోకలు కూడా నిలిచిపోయాయి. ఫుట్‌పాత్ వ్యాపారస్తుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలతో పోల్చితే ఇంత పెద్ద స్థాయిలో వర్షం కురవలేదని ప్రజలు చర్చించుకున్నారు.

### అంబులెన్స్‌లో ప్రసవం

సాక్షి బళ్లారి: పురిటి నొప్పులు అధికం కావడంతో ఓ గర్భిణి అంబులెన్స్‌లోనే ప్రసవించిన ఘటన బుధవారం గదగ్ జిల్లా బళగానూరు గ్రామ సమీపంలో జరిగింది. సలీమా మహబూబ్ సాబ్ అనే మహిళకు పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే నొప్పులు అధికమై అంబులెన్స్‌లోనే సుఖ ప్రసవమైంది. తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నారని అంబులెన్స్ హెల్త్ అసిస్టెంట్ తెలిపారు.

### ప్రజల సహకారంతోనే నేరాల కట్టడి సాధ్యం



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్ గోఖలె

కంప్లి: పోలీసులతో ప్రజలు మమేకమై సహకారం అందిస్తే నేరాల నియంత్రణ సాధ్యమని డీఎస్పీ ప్రసాద్ గోఖలే తెలిపారు. కంప్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన జన సంపర్క సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాత్రిళ్లు నిద్రపోయే సమయంలో వెండి, బంగారు ఆభరణాలను జాగ్రత్తగా భద్రపరచుకోవాలన్నారు. వీలైనంత వరకు భద్రంగా లాకర్లలో పెట్టుకోవాలన్నారు. కొత్త వ్యక్తులు తమ ప్రాంతాల్లో సంచరిస్తుంటే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పట్టణాలతో పాటు తాలూకాలోని గ్రామాల్లో తమ చుట్టూ జరిగే దాడులు, దోపిడీలు, ఘర్షణలు, దొంగతనాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్–112కు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ప్రముఖులు హేమయ్యస్వామి, బ్రహ్మయ్య, మైనుద్దీన్, ఏసీ దానప్ప తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు.

### బాలకార్మికులకు విముక్తి

కంప్లి: సిరుగుప్ప తాలూకా తెక్కలకోటె పట్టణంలోని దుకాణాలు, వర్క్‌షాపులు, కూరగాయల మార్కెట్లపై బాలకార్మిక నిర్మూలన శాఖ అధికారులు బుధవారం మూకుమ్మడిగా దాడులు ఇద్దరు బాలకార్మికులకు విముక్తి కల్పించారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వారిని హెచ్చరించి వారి నుంచి మళ్లీ పనిలో పెట్టుకోబోమని హామీ పత్రాలను రాయించుకున్నారు. కాగా పిల్లలకు బడిలో మధ్యాహ్న భోజన సదుపాయం కూడా ఉందని, పిల్లలను బడికి పంపి వారిని విద్యావంతులుగా చేయాలని వారి తల్లిదండ్రులకు సూచించారు.

### ధార్వాడ జిల్లా ఎస్పీగా గోపాల బ్యాకోడ్

హుబ్లీ: హుబ్లీ ధార్వాడ జంట నగరాల్లో డీసీపీగా పని చేసిన గోపాల బ్యాకోడ్‌ను ధార్వాడ జిల్లా ఎస్పీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను వెల్లడించింది. ఏడాదిన్నర నుంచి జంట నగరాల్లో ట్రాఫిక్ అండ్ క్రైం డీసీపీగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వం బెంగళూరుకు బదిలీ చేసింది. ధార్వాడ జిల్లా ఎస్పీగా ఉన్న లోకేష్ జగళూర్‌కర్‌ను ఇక్కడి నుంచి మైసూరులోని పోలీస్ అకాడమికి బదిలీ చేయగా ఆయన స్థానంలో గోపాల బ్యాకోడ్‌ను ప్రభుత్వం నియమించింది.

### ఎండిన మొక్కజొన్న.. దిక్కుతోచని స్థితిలో రైతన్న




ఎండిపోయిన మొక్కజొన్న పంట

హొసపేటె: వర్షాలు కురవకపోవడంతో చేతికి వచ్చిన మొక్కజొన్న తదితర పంటలు ఎండిపోతున్నాయి. కూడ్లిగి తాలూకా ఖానాహొసళ్లి వ్యాప్తిలో రైతులు వందలాది ఎకరాల్లో మొక్కజొన్న, వేరుశనగ, జొన్న, సూర్యకాంతి, పత్తి, రాగి తదితర పంటలు వేశారు. కానీ వర్షాలు సరిగా కురువక పంటలు ఎండిపోతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మరో వైపు కొందరు రైతులు ఎండిపోయిన మొక్కజొన్న పంటను తొలగించి పశువులకు మేతగా వాడుతున్నారు.

# టమాటా సాగు ఘనం.. ధర పతనం

- ధరలు పెరిగిన ఆశతో పంట సాగు చేసిన వైనం
- గత కొన్ని రోజులుగా ధర లేక రైతన్నల్లో నిరాశ



మార్కెట్‌కు బాక్స్‌ల్లో తరలివచ్చిన టమాటా

నర్సరీల్లో పెంచుతున్న టమాటా నారు

సాక్షి బళ్లారి: జూన్, జూలై నెలల్లో టమాటా ధరలు కిలో రూ.150 నుంచి రూ.200 వరకు పలకడంతో ఆ పంట సాగు చేసిన రైతులు లక్షలు, కోట్లు గడించారు. ఈనేపథ్యంలో సాగునీటి వసతి కలిగిన భూముల్లో రైతన్నలు టమాటా సాగుపై ఆసక్తి కనబరిచారు. చరిత్రల్లో ఎన్నడూ లేని విధంగా ఆపిల్ ధరను మించి టమాటా ధర పెరగడం ఓ వైపు చర్చనీయాంశమైంది. మరో వైపు జిల్లాలో టమాటా సాగుపై రైతులు దృష్టి సారించారు. జూన్ నెల ఆరంభం నుంచి టమాటా ధర క్రమేణా పెరగడంతో సాగు కూడా జిల్లాలో క్రమంగా పెరిగింది. జిల్లాలోని కురుగోడు, సండూరు, బళ్లారి, సిరుగుప్ప తాలూకాల్లో ప్రతి ఏటా 150 హెక్టార్లలో మాత్రమే టమాటా పండించేవారు. ఈఏడాది ధరలు పెరిగిన నేపథ్యంలో 750 ఎకరాలకు టమాటా సాగు పుంజుకుంది. అయితే గత 15 రోజుల నుంచి టమాటా కిలో ధర రూ.150 నుంచి క్రమేణా కిలో రూ.10లకు పడిపోవడంతో కొందరికీ మోదం, మరికొందరికీ ఖేదంగా మారింది. నగరంలోని ఏపీఎంసీ మార్కెట్లో టమాటా బాక్స్ ధర రూ.2 వేల నుంచి ప్రస్తుతం రూ.200లు కూడా పలకకపోవడంతో రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితులు కనబడటం లేదు.

**నర్సరీల్లో అమ్ముడుపోని నారు**

టమాటా సాగుతోపాటు జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ కూడా టమాటా నారును కూడా పెంచడానికి నర్సరీలు కూడా ఏర్పాటు చేసుకొన్నారు. అయితే ధరలు తగ్గిపోవడంతో నర్సరీల్లో టమాటా నారును కొనుగోలు చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో నర్సరీలు వేసుకొన్న రైతులు కూడా నష్టాలకు గురవుతున్నారు. లాటరీ తరహాలో రెండు నెలల పాటు ఊరించిన టమాటా ధరలు ప్రస్తుతం ధరలు తగ్గిపోవడంతో రైతులను ఉసూరుమనిపిస్తోంది. మరో రెండు నెలల పాటు కూడా ధరలు పెరిగే సూచనలు కనిపించడం లేదని వ్యాపారస్తులు పేర్కొంటున్న తరుణంలో రైతులు చేసేదేమీ లేక కన్నీరు పెడుతున్నారు. ధరలు పెరిగినప్పుడు గగ్గోలు పెట్టడంతో సబ్సిడీతో టమాటాను అందించాలని డిమాండ్ చేశారు. అదే ధరలు తగ్గితే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించడంపై దృష్టి సారించాలని రైతన్నలు కోరుతున్నారు.

# మహిళలకు గృహలక్ష్మి ఆసరా

- దేశం మెచ్చేలా కర్ణాటకలో పథకాల అమలు
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బి.నాగేంద్ర



బళ్లారిలో పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి తదితరులు



గంగావతిలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి



హొసపేటెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గవియప్ప



కంప్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

బళ్లారి అర్బన్: మహిళలకు గృహలక్ష్మి పథకం కింద ఇక నుంచి ప్రతి నెల అందించే రూ.2 వేలు వారికి ఆసరాగా నిలుస్తుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బి.నాగేంద్ర పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన గృహలక్ష్మి పథకం అమలు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశం గర్వించేలా కర్ణాటక ప్రభుత్వం ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేసిందన్నారు. రాష్ట్రంలోని 1.28 కోట్ల మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసేందుకు మైసూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే.శివకుమార్‌ల చేతుల మీదుగా ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. బళ్లారి జిల్లాలో 2,67,000 కుటుంబాలకు మొత్తం రూ.50 కోట్లు నెల నెల వారి ఖాతాల్లోకి జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్ త్రివేణి, ఉపమేయర్ జానకీ, కార్పొరేటర్లు, అధికారులు పార్టీ నాయకులు, వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

**గృహలక్ష్మి పథకానికి శ్రీకారం**

గంగావతి: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తాజా పథకాలను ప్రధానంగా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన వడ్డరహట్టి గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్డరహట్టి క్యాంప్‌లో గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. అర్హులైన మహిళలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీపీ అధ్యక్షురాలు మంజుల, టీపీ ఈఓ లక్ష్మీదేవి, తహసీల్దార్ మంజునాథ్ భోగావతి తదితర జీపీ అధికారులు, కేఆర్‌పీపీ మహిళా జిల్లాధ్యక్షురాలు రాజేశ్వరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**2.44 లక్షల మందికి గృహలక్ష్మి: ఎమ్మెల్యే గవియప్ప**

హొసపేటె: రాష్ట్రంలోని పేదలకు మేలు చేసేందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సాహసమైన నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప అన్నారు. ఆయన బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన గృహలక్ష్మి పథకం ప్రారంభోత్సవంలో మాట్లాడారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 2.44 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందన్నారు. జిల్లాధికారి దివాకర్, జెడ్పీ సీఈఓ సదాశివప్రభు, పోలీస్ అధికారి శ్రీ హరిబాబు, నగర సభ అధ్యక్షురాలు లత, మహిళా సంక్షేమ అధికారి శ్వేత పాల్గొన్నారు.

**ఇంటింటికీ గృహలక్ష్మిని అందిస్తాం**

కంప్లి: ఇచ్చిన మాట తప్పకుండా అమలు చేసిన ఘనత తమ కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. పట్టణంలోని మారుతీ నగర్ మున్సిపల్ సముదాయ భవనంలో గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించి తన క్షేత్రంలో ఇప్పటి వరకు 57 వేల మంది లబ్ధిదారులకు ఈ అవకాశం దక్కిందన్నారు. బీజేపీ కేవలం తప్పుడు హామీలతో ప్రజలను మభ్య పెట్టిందే తప్ప ఇలాంటి ప్రజలకు ఉపయోగకరమైన పథకాలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. క్షేత్ర ఎమ్మెల్యేగా రెండో సారి విజయం సాధించడంతో తనపై రెండింతల బాధ్యత పెరిగిందని ప్రతీది నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌసియా బేగం, సీడీపీఓ మోహన్‌కుమార్, టీపీ ఈఓ శివకుమార్, ముఖ్యాధికారి దురుగణ్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజలు, కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు.

**పథకాలు ప్రజల దరికి చేరాలి**

రాయచూరు రూరల్: గ్రామీణ ప్రజల దరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ సూచించారు. ఆయన బుధవారం తాలూకాలోని దేవసూగూరు అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసమే శక్తి, గృహలక్ష్మి పథకాలను అమలు చేసిందన్నారు. ఇకపై నెల నెలా రూ.2 వేలు మహిళల బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయన్నారు. జిల్లాలో 3,64,059 మంది మహిళలు ఈ పథకం కింద పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, జెడ్పీ సీఈఓ రాహుల్ పాండే తుకారాం, మహిళ శిశు సంక్షేమ శాఖాధికారి చేతన్ కుమార్‌లున్నారు.

# 3న టెట్‌కు అన్ని ఏర్పాట్లు

- పరీక్ష రాయనున్న 8767 మంది
- జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: విజయనగర జిల్లాలో సెప్టెంబర్ 3న జరగనున్న కర్ణాటక ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ సూచించారు. ఆయన మంగళవారం సాయంత్రం తమ కార్యాలయ సభాంగణంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో పరీక్షకు కేటాయించిన ఇన్విజిలేటర్లు, పరీక్ష కేంద్రాల అధిపతులు, గదుల పర్యవేక్షకులకు తగిన సలహా సూచనలు అందించారు. పరీక్ష కేంద్రం, గదుల్లో సీసీ కెమెరాలు, తాగునీటి వ్యవస్థ, విద్యుత్ సరఫరాను పర్యవేక్షించాలని సూచించారు. సమావేశం ప్రారంభంలో పాఠశాల విద్యాశాఖ తరపున అధికారులు పరీక్ష ఏర్పాట్ల గురించి వివరించారు. ఆ రోజున హొసపేటెలోని 16 పరీక్ష కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్ష జరుగుతుందని తెలిపారు. మొదటి సెషన్‌లో 12 పరీక్ష కేంద్రాల్లో 3651 మంది, రెండో సెషన్‌లో 16 కేంద్రాల్లో 5116 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ వాహనాలను అరికట్టండి



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: నగరంలో అక్రమంగా మట్టిని తరలించే వాహనాలకు కళ్లెం వేయాలని కర్ణాటక దళిత సంఘర్ష సమితి డిమాండ్ చేసింది. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి సంచాలకులు తిమ్మప్ప స్వామి మాట్లాడారు. నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల నుంచి ఎర్రమట్టిని తవ్వి నగరంలో అక్రమంగా టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తూ అతి వేగంగా నడుతున్నారన్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నందున వాటిని నగరంలో గుండా సంచరించకుండా చూడాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యల్లప్ప, నరసింహులు, ప్రకాష్, కురుమణ్ణ, ఆనంద, గోవిందులున్నారు.

# రూ.3 వేల కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు



మాట్లాడుతున్న అధ్యక్షుడు అజయ్‌సింగ్

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటక గ్రామీణ అభివృద్ధి మండలి(కేకేఆర్‌డీబీ) పరిధిలో రూ.3 వేల కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించినట్లు మండలి అధ్యక్షుడు అజయ్‌సింగ్ వెల్లడించారు. బుధవారం కలబుర్గిలో ప్రభుత్వ అతిథి భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలి పరిధిలోని జిల్లాల్లో గ్రామీణ రోడ్లు, పాఠశాల భవనాలు, తాగు నీటి సరఫరా, నిర్వహణ, విద్యుత్ దీపాల అమరిక, ఇతర మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా వున్న 3,200 ఉపాధ్యాయ నియామకాలకు మండలి నుంచి గౌరవ వేతనంతో అతిథి ఉపాధ్యాయులను నియమిస్తామన్నారు. 9,249 పాఠశాలల్లో 5,348 పాఠశాలలు కారుతున్నాయన్నారు. 5,310 పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవన్నారు. 1,624 పాఠశాలలో తాగు నీటి సౌకర్యం లేదన్నారు. 5,673 పాఠశాలల్లో బెంచీలు లేవన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ సాధనకు అ క్షర పథకం ద్వారా ప్రత్యేక తరగతులు, బోధనా పద్ధతిలో మార్పులు చేస్తామన్నారు. తల్లిబిడ్డల ఆస్పత్రుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గుణాత్మక విద్యా బోధనకు మండలి నుంచి రూ.25 కోట్లు కేటాయించామన్నారు. ఈసందర్భంగా కలబుర్గి ఎమ్మెల్యే అల్లమప్రభు పాటిల్, మండలి కార్యదర్శి అనిరుధ్ శ్రవణ్‌లున్నారు.

# నేడు నారాయణ గురూజీ జయంతి

రాయచూరు రూరల్: నగరంలో గురువారం బ్రహ్మశ్రీ నారాయణ గురూజీ జయంతిని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్య ఈడిగ సంఘం అధ్యక్షుడు రాఘవేంద్ర గౌడ వెల్లడించారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మధ్యాహ్నం మహిళా సమాజ్ నుంచి బ్రహ్మశ్రీ నారాయణ గురూజీ చిత్రపటాన్ని ఊరేగిస్తు కన్నడ భవనం వరకు ఊరేగింపు చేపడతారన్నారు. ఈసందర్భంగా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**కరువు జిల్లాలుగా ప్రకటించాలి**

రాయచూరు, యాదగిరిలను కరువు జిల్లాలుగా ప్రకటించాలని సుప్రీంకోర్టు న్యాయవాది పేర్కొన్నారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలు లేక ప్రజలు వలసలు వెళుతుంటే వ్యవసాయ, రెవిన్యూ శాఖాధికారులు సమీక్షలు జరపకుండా కాలయాపన చేసినందునే రాష్ట్ర ప్రభుత్వం కరువు జిల్లాలుగా ప్రకటించలేదన్నారు.

### బంగారు ఆభరణాలకు మెరుగు పెడతామని చోరీ

హుబ్లీ: బంగారు ఆభరణాలను కడిగి మెరుగు పెట్టిస్తామని నమ్మించి ఇక్కడి కేశ్వాపుర అంబికా నగర్ అపార్ట్‌మెంట్‌లో మహిళను వంచించిన సదరు కేటుగాళ్లు రూ.1.80 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను దోచుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. లక్ష్మి అనే బాధితురాలి వద్దకు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వచ్చిన ఇద్దరు ఆగంతకులు బంగారు ఆభరణాలను కడిగిస్తామని నమ్మించారు. సదరు మహిళ నుంచి 30 గ్రాముల బంగారు చైన్, 10 గ్రాముల రెండు జతల చెవికమ్మలు ఇచ్చారు. ఈక్రమంలో వేడి నీరు ఇస్తే కడిగి ఇస్తామని నాటకం ఆడి మొత్తం ఆభరణాలను దోచుకొని పరారయ్యారని బాధితురాలు కేశ్వాపుర పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### హత్య కేసులో నిందితుడి అరెస్టు

కేజీఎఫ్: వృద్ధుడి తలపై సిమెంట్ ఇటుకతో కొట్టి హత్య చేసిన ఘటనలో నిందితుడిని రాబర్ట్‌సన్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. హత్య కేసు దర్యాప్తునకు ఎస్పీ శాంతరాజు రాబర్ట్‌సన్‌పేట ఇన్‌స్పెక్టర్ కుమారస్వామితో కూడిన బృందాన్ని ఏర్పాటు చేశారు. తనిఖీ చేపట్టిన బృందం అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఆనంద్ అనే వ్యక్తిని అరెస్టు చేసి విచారణ జరుపగా తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. ఈనెల 16న దారిలో నడుచుకుని వెళుతున్న వృద్ధుడిని చిన్న కారణానికి తలపై సిమెంట్ ఇటుకతో మోది హత్య చేశాడు. పోలీసులు నిందితుడు ఆనంద్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

### హెచ్‌ఎల్‌సీకి గండి పడిన ప్రాంత పరిశీలన

సాక్షి,బళ్లారి: తుంగభద్ర డ్యాం నుంచి కర్ణాటకలోని విజయనగర, బళ్లారి, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలకు సాగు, తాగు నీరందించే హెచ్‌ఎల్‌సీ కాలువకు గండి పడిన ప్రాంతాన్ని మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. కొళగల్లు సమీపంలో హెచ్‌ఎల్‌సీ కాలువకు గండి పడిన ప్రాంతంలో మరమ్మతు పనులు పూర్తి చేసి కాలువకు నీరు వదిలిన నేపథ్యంలో వారు పరిశీలించి అధికారులతో చర్చించారు. కాలువకు గండ్లు పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని బోర్డు అధికారులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా, ఆయకట్టు పరిధిలో రైతుల పంటలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎల్‌సీ ఎస్‌డీఓ సంధాని తదితరులు పాల్గొన్నారు.

### యాదగిరి జిల్లా ఎస్పీగా సంగీత

రాయచూరు రూరల్: యాదగిరి జిల్లా ఎస్పీగా సంగీత నియమితులయ్యారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్పీగా ఉన్న వేదమూర్తి బదిలీ కావడంతో ఆయన స్థానంలో సంగీతను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కాగా జిల్లాలో శాంతిభద్రతల సంరక్షణకు పోలీసులతో ప్రజలు సహకరించాలని ఆమె అన్నారు.

# ఇచ్చిన హామీలు నిలుపుకొంటున్నాం

కోలారు: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను నిలుపుకొంటోందని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. బుధవారం నగరంలోని రామాంజనేయ కళ్యాణ మందిరంలో నిర్వహించిన గృహలక్ష్మి పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ మహిళలను ఆర్థికంగా సబలలను చేయాలనే ఉద్దేశంతో గృహలక్ష్మి పథకాన్ని తీసుకు వచ్చిందన్నారు. నిరుద్యోగ యవతకు భృతిని అందించే పథకాన్ని కూడా త్వరలో ప్రారంభిస్తారన్నారు. వచ్చే ఐదేళ్లలో ప్రజాఅభీష్టానికి అనుగుణంగా పాలించి ప్రజల విశ్వాసం పొందుతామన్నారు. జిల్లాధికారి అక్రంపాషా మాట్లాడుతూ జిల్లాలో ఇంతవరకు 2.71 లక్షల మంది మహిళలు గృహలక్ష్మి పథకం కింద పేర్లు నమోదు చేసుకున్నారన్నారు.

### ఇంజెక్షన్ వికటించి బాలుడు మృతి

సాక్షి బళ్లారి: ఇంజెక్షన్ వికటించి ఓ బాలుడు మృతి చెందిన ఘటన చిత్రదుర్గ జిల్లా హొళల్కెరె తాలూకా చిక్కజాజూరులో జరిగింది. బుధవారం గ్రామంలో చిరాగ్(7) అనే బాలుడు ప్రమాదవశాత్తు చేతికి గాయం కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. బాలుడికి ఇంజెక్షన్ ఇవ్వగా వాంతులు, విరోచనాల బారినపడి మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. దీంతో వైద్యుల తీరుపై స్థానికులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### డీసీసీ ఉపాధ్యక్షుడిగా వివేక్

సాక్షి బళ్లారి: జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పేరం వివేక్(విక్కీ) నియమితులయ్యారు. ఈమేరకు కేపీసీసీ అధ్యక్షుడు డీకే.శివకుమార్ ఆయన్ను జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఆదేశ పత్రాలను జారీ చేశారు. నగర కార్పొరేటర్‌గా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి డీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమించడంతో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈసందర్భంగా విక్కీ మాట్లాడుతూ తనపై పార్టీ నేతలు నమ్మకం ఉంచి డీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమించినందున జిల్లాలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

### రూ.3.95 లక్షల ఆభరణాల చోరీ

హుబ్లీ: ఇంటి తలుపులను పగలకొట్టి లోపలకు చొరబడిన దొంగలు ఇంట్లోని రూ.3.95 లక్షల విలువ చేసే ఆభరణాలు, వస్తువులను చోరీ చేసిన ఘటన మంగళవారం రాత్రి తాలూకాలోని హెబసూరులో జరిగింది. ఆ గ్రామానికి చెందిన కిరణ్ కొణ్ణూరు అనే వ్యక్తి ఇంటిలోకి ప్రవేశించిన దుండగులు బీరువాలో భద్రపరిచిన రూ.2 లక్షల విలువ చేసే బంగారు గొలుసు, రూ.50 వేల విలువ చేసే 10 గ్రాముల లాకెట్, ముత్యాలహారం, రూ.25 వేల విలువ చేసే ఉంగరం, రూ.50 వేల విలువ చేసే చెవికమ్మలు, రూ.45 వేల విలువ చేసే వాచీని చోరీ చేసుకొని పరారయ్యారు. ఘటనపై హుబ్లీ రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### రాఘవేంద్రుల ఆరాధనోత్సవాలు షురూ



నవధాన్య పూజ చేస్తున్న సుబుదేంద్ర తీర్థులు

రాయచూరు రూరల్: మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్ర స్వాముల 352వ ఆరాధనోత్సవాలు, సప్తరాత్రి రథోత్సవాలను వైభవంగా మంత్రాలయ పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదంగల్ ప్రారంభించారు. మంగళవారం సాయంత్రం మఠం ప్రాంగణంలో ఆయన ప్రత్యేక పూజలను నెరవేర్చారు. ధ్వజారోహణం, అశ్వ, గోమాత, నవ ధాన్యాల పూజలు జరిపారు. బుధవారం మూలవిరాట్‌కు విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఉపలోకాయుక్త పరిశీలన



పరిశీలిస్తున్న ఉపలోకాయుక్త సూర్యనారాయణ

శ్రీనివాసపురం: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను ఉపలోకాయుక్త సూర్యనారాయణ బుధవారం పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. మార్కుల జాబితా కోసం దరఖాస్తు చేసుకున్న పాత విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కళాశాలలో రికార్డులను పరిశీలించినట్లు ఉపలోకాయుక్త తెలిపారు. మార్కుల జాబితా, రెండోసారి టీసీలు తీసుకోవడానికి వచ్చే వారి నుంచి ఫీజులు వసూలు చేయడంలో లోపాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ ఫీజులు, విధి విధానాల గురించి బీఈఓ నుంచి సమాచారం సేకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ రాధామణి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

### తాగునీటి యూనిట్‌ను ప్రారంభించండి



నిరుపయోగంగా ఉన్న యూనిట్ ఇదే

కోలారు: నగరంలోని కనకనపాళ్యలో నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన రక్షిత తాగునీటి యూనిట్‌ను ప్రారంభించకపోవడం వల్ల నిరుపయోగంగా మిగిలి పోయిందని వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏళ్లు గడిచినా యూనిట్‌ను ఎందుకు ప్రారంభించలేదని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. లక్షలు ఖర్చు చేసి ప్రజలకు అనుకూలం చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసినా ప్రజలకు ఎంతమాత్రం ఉపయోగ పడడం లేదన్నారు. నగరసభ మాజీ సభ్యుడు సోమశేఖర్ అవధిలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌ను ఇంతవరకు ప్రారంభించలేదన్నారు. కనకనపాళ్యలో తాగునీటితో పాటు అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.